డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి
ఎం.ఎ., పిహెచ్.డి.

జననము : 15–2–1953

జన్మస్థలము : ఉప్పులూరు (కృష్ణా జిల్లా)

తల్లిదండ్రులు : వెంకటనరసమ్మ, వెంకట్రామశాస్త్రి

ఉద్యోగము : ఆంధ్రోపన్యాసకులు.
శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాల, పొన్నూరు.

ఇతర రచనలు : "శ్రీరామకథామృతము - సమగ్ర సమీక్ష"
ఆంధ్ర విశ్వవిద్యాలయమువారిచే డాక్టరేట్ పొందిన పరిశోధన నిబంధము.
పావనీ శతకము, సత్యనారాయణ శతకము, భావనారాయణ శతకము.
"ఏషధర్మస్సనాతనః"

వెల : రూ. 8-00

రామాయణం-సమాజదర్పణం

రచయిత :
భాషా ప్రవీణ - విద్యాప్రవీణ
డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి
ఎం.ఎ., పిహెచ్.డి.

రామాయణం - సమాజదర్పణం

ర చ యి త :

భాషా ప్రవీణ - విద్యాప్రవీణ

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి

ఎం.ఎ., పిహెచ్.డి.

సర్వస్వామ్యములు రచయితవి
ప్రతులు : 1000
ప్రభవ మాఘ శుద్ధ చతుర్దశి

ఫిబ్రవరి 1988

"కవినిఁగన్న తల్లి గర్భంబు ధన్యంబు
కృతినిఁ జెందు వాఁడు మృతుఁడు గాఁడు"

జాషువా.

★ ★ ★

ప్రతులు లభించు చోటు :
1 శివ శ్రీ ప్రచురణలు :
కోర్టు వీధి.
పొన్నూరు – 522124
గుంటూరు (జిల్లా)

★ ★ ★

శ్రీ తూములూరు లక్ష్మీనారాయణశాస్త్రి
సిద్ధాంతిగారు
2. ఆదిత్య జ్యోతిషాలయమ్
ఉప్పులూరు [పోస్టు]
[వయా] కంకిపాడు, కృష్ణా [జిల్లా]

శ్రీ నటరాజ ప్రెస్ తోటమ్మగుడి వద్ద, పొన్నూరు. ఫోన్ : 284

అంకితం

సహనశీలి - స్నేహజీవి

A. V. సుబ్బారావు, B.A., L.L.M.

దివ్యస్మృతికి

అశ్రుతర్పణం

A. V. సుబ్బారావుగారు అనే పేరు మనసులో అనుకొంటేనే అనిర్వచనీయమైన అనుభూతి నిన్నటిదాకా, కానీ నేడు ఆ పేరు ఆత్మీయులందరికి బరువైన జ్ఞాపకం, నిండైన నిజం ఈ నాడు స్మృతిగా మిగిలిపోయింది. ఎవరికి ఏ బాధ కలిగినా, ఎవరితో మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా గుప్పున గుర్తుకు వచ్చే ఒక మంచి మనసు, ఒక విజ్ఞానమూర్తి మన మధ్యలో లేక పోవడం మూగ వేదన అయింది. అయినా భగవత్స్వరూపమైన కాలం తన ధర్మాన్ని తాను నెరవేరుస్తుంది. అందుకే మన సంప్రదాయంలో మరణం అంటే కాలధర్మం చెందటమే. మరణం ఒక అవస్థాభేదం మాత్రమే. అది బాధకు కారణం కాదు. కానీ మరణించిన వ్యక్తితో ఉన్న అనుబంధం దుఃఖానికి కారణం అవుతుంది కాబట్టి అనుబంధాన్ని శాశ్వతం చేసుకొంటే దుఃఖం కొంత వరకు ఉపశమిస్తుంది. ఈ ఉద్దేశంతోనే సుబ్బారావుగారికి నాకూ ఉన్న పరిచయాన్ని సాహితీ సూత్రంతో భద్రం చేసికోవాలని సంకల్పించాను. అంతే గాదు సప్త సంతానాల్లో ఒకటియైన ఈ కృతి బాలను ఆ దివ్యాకృతికి సమర్పించుకొంటున్నాను. ఈ రూపంలో ఆ మధురమూర్తి ఆలోచనకు ఈ అక్షరాకృతి కొంత ఊరట కలిగిస్తుందని విశ్వసిస్తున్నాను.

సప్త సంతానములలో౯ ప్రశస్తిఁగాంచి
ఖిలము గాకుండునది ధాత్రి కృతియ కాదె!

డా॥ తూములూరు శ్రీ దక్షిణామూర్తిశాస్త్రి
M.A., Ph.D.

1-2-1988

విషయసూచిక

			పుటలు
1)	నిత్యవసంతం	–	1-6
2)	సత్సాంగత్యము	–	7-13
3)	సాహిత్యం	–	14-24
4)	గురు శిష్యులు	–	25-33
5)	విద్య	–	34-39
6)	లక్ష్యశుద్ధి	–	40-43
7)	వివాహము	–	44-54
8)	ప్రజాస్వామ్యం	–	55-60
9)	చిత్తస్థైర్యము	–	61-64
10)	ప్రత్యక్షదైవాలు	–	65-68
11)	నిస్స్వార్థం	–	69-74
12)	స్నేహం	–	75-82
13)	కృతజ్ఞత	–	83-90
14)	సమయస్ఫూర్తి	–	91-96
15)	మాట - మన్నన	–	97-100

నిత్యవసంతం

ఈ అనంత కాలచక్ర పరిభ్రమణంలో ఏర్పడే ఒక ఏడాదికి 12 మాసాలు. ప్రకృతి ధర్మాన్నిబట్టి ఆ సంవత్సరకాలం 6 ఋతువులుగా విభజింప బడింది. అందులో చైత్ర, వైశాఖ మాసములు వసంత ఋతువుగా పేర్కొనటం జరిగింది. ఋతువులన్నింటిలో ఈ వసంతం అన్ని విధాలా శ్రేష్ఠమైంది. మిక్కిలి ఉత్సాహంతో శుభకార్యక్రమములెన్నో జరుపుకుంటారీ రోజుల్లో. సకల జగతికి ఆనందాన్నిచ్చే ప్రకృతి నిలువెల్లా పులకించి, మధురోహలు తలపించి, మనోహరశోభలు వెలయించటం అనాటి విశేషం. కోకిల మధురాలాపము లప్పటి ప్రత్యేకత జీవితంలో శ్రావ్యమైన ఆ ధ్వను లెన్నిమార్లువిన్నా తనివి తీరదు. హాయి తరుగదు. అంతేకాదు మళ్ళీ, మళ్ళీ అవే వినాలని కుతూహలం కలగటం మనకందరికి అనుభవగమ్యమైన విషయం.

ఇతర ఋతువులలో లభింపని ఆ సౌభాగ్యం ప్రాణులన్నింటికి సర్వేంద్రియ తర్పణాన్ని కల్గిస్తుంది. ఆ ఆనందం అనుభవించాలంటే ఆ కోకిల మధుర స్వరములు వినగలిగిన సహృదయత మాత్రం సంపాదించుకోవాలి. అతి వేగంతో కూడిన ఈ జీవన గమనంలో ఆ తీరిక మనకెక్కడిది. అందువల్ల ఆ మాధుర్యాన్ని అందుకునే అదృష్టం పొందలేకపోతున్నాం. వికృతులకులోనై కలత చెందిన హృదయం ప్రకృతి సౌందర్యాన్ని చూచి, సుమధుర సంగీతాన్ని విని, ఆనందించలేదు సరికదా! విసుగుచెందుతుంది. విజ్ఞత కోల్పోతుంది. ఏకాగ్రత వలన మనస్సు స్థిరపడినప్పుడు ఆ మాలిన్యంపోయి నిర్మలత సిద్ధిస్తుంది. అందులో ప్రకృతి సైజగుణం ప్రతిఫలిస్తుంది.

వాఙ్మయ జగత్తులో కవితాశాఖ నధిరోహించి "కవి కోకిల" యగు వాల్మీకి "రామ, రామ" యని మధురముగా ఆలపించాడు. మధురాక్షరములతో గూడి

అయ్యెది శ్రీరాముని దివ్యచరితమై ప్రసిద్ధి కెక్కింది. అందు అక్షరాగు తత్త్వము సుందరముగా, సునిపుణముగా ప్రకటింప బడింది. అది సార్వకాలికము, సార్వదేశికము, సార్వజనీనము, సమగ్రము అయిన పరమ ధర్మమై విలసిల్లుతోంది. ఆ విధంగా వాల్మీకి ముందుగా అభివందనీయుడయినాడు.

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితాశాఖాం, వందే వాల్మీకి కోకిలమ్॥

ప్రకృతిలో సంవత్సరాని కొకసారి వసంతంలో మాత్రమే వినపడే కోకిల ఆరావములే హృదయాన్ని ఆకర్షించి, అంతగా సంతోష పెడుతూఉంటే, నిత్యం సన్నిహితమై, హితం తెలిపే, వాల్మీకి వినిపించిన రామకథాసుధాగానం మరెంతటి సంతృప్తిని నిస్తుందో, జ్ఞాన, విజ్ఞాన సంపదలు ప్రసాదిస్తుందో, ఉత్తమ ఆదర్శజీవితానికి అవసరమైన స్ఫూర్తిని, దీప్తిని ఎంతగా కలిగిస్తుందో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. దేశ విదేశాలలో దానికిగల ప్రచుర, ప్రచారాలే అందుకు నిదర్శనం. ఆ గ్రంథంపై వెలువడినన్ని వివరణలు కానీ, విమర్శలుకానీ. ప్రపంచ వాఙ్మయంలో మరి ఏ ఇతర గ్రంథంమీద వెలువడలేదనటం సత్యదూరం కాదు.

రామాయణంలో ఏ ఘట్టాన్ని స్పృశించినా అది రసనిర్భరమై అక్షర రమణీయతతోబాటు, సుమధుర భావ పరిమళాలను వెదజల్లి ఆనందానుభూతి నివ్వటానికి సమర్థత కలిగిఉంటుంది. మహితము, మాన్యము అయిన ఆ సచ్చరిత్ర ఆ తర్వాత ఎందరో, ఎన్నోవిధాల వర్ణించారు. అయినా అది మాధుర్యాన్ని పంచియిస్తూనే ఉంది. ఎవ్వరు ఎన్నిమార్లు విన్నా, చదివినా అది ఆలోచనామృతాన్ని అందిస్తూనే ఉంది.

భౌతికానందం కంటే, అలౌకికమైన రసానందం చాలా గొప్పది. అట్టి రసానంద జనకమైన సాహితీ సంపదకు అందులో కొదువ లేదు సరికదా: చదువుటకే గాక పాడుటకుగూడ యోగ్యమైన (గేయే, పాఠ్యేచ మధురమ్) ఆ రచనా

పద్ధతి ఆపాత మధురమై అందర్నీ అలరిస్తోంది. కావుననే గానవిద్యలో ప్రవీణులైన (కుశీలవులు) కుశలవులు తొలిగా గానంచేసి లోకాన్ని సంతృప్తిపరచారు. ఈ విధంగా రామాయణం ఒక రసమయ సంగీత కళారూపకంగా కూడా సంభావింపబడుతోంది.

రావణసంహారం చేసి రాము డయోధ్యలో పట్టాభిషిక్తుడై ప్రజారంజకంగా రాజ్యపరిపాలన సాగించాడు. ఆ కాలంలో త్రిలోకజ్ఞుడైన నారదుడు వివరిస్తే కుతూహలంతో విన్న వాల్మీకి సంయమనపరుడై ఆ విషయాన్ని విపులమయిన రామాయణంగా కీర్తించాడు. అది గుణాభిరాముడైన రాముని చరిత్రగా ప్రసిద్ధి కెక్కింది. అంటే రామాయణం సమకాలీన సమాజంలోని పురుషోత్తముని మహోదార చరిత్రమే కాని కట్టుకథ కాదని తెలుస్తోంది. ఆ సత్యమే ఇట్లా చెప్పబడింది.

ప్రాప్త రాజ్యస్య రామస్య వాల్మీకి ర్భగవాన్ ఋషిః।
చకార చరితం కృత్స్నం విచిత్ర పదమాత్మవాన్॥

బా. కాం. 4 స. 1 శ్లో.

ఈ దృష్టితో ఆలోచించినప్పుడు భారతీయులకు సాహిత్యంలో సామాజిక స్పృహ, చారిత్రక దృక్పథం లేవనే వాద, వివాదాలు, కల్పితాలు, అప్రామాణికాలు అని చెప్పాలి. రామాయణం ఆనాటి దేశ చరిత్రేకాని వేరుకాదు. అందువల్ల చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకున్నట్లు మనం రామాయణం నుండికూడా మంచి చెడులను విశ్లేషించుకొని, మంచి గ్రహించి, మన సంస్కృతిలోని సభ్యతా సంస్కారాలు అలవరుచుకోవాలి. చెడును నిరసించాలి.

లోకంలో ఏదైనా ఒక సత్యం తెలుసుకోవాలంటే, ఎక్కువగా తపన పడాల్సిఉంటుంది. ఆ అన్వేషణారూపమయిన "తపన" యే తపస్సు. అదే యోగం. ఏ రంగంలోనైనా ఆ యోగసాధనే నైపుణ్యాన్ని సిద్ధింపజేస్తుంది. (యోగః కర్మసు కౌశలమ్) తపస్వి వాల్మీకి ఆత్మవంతుడై సత్యపరాక్రమవంతుడైన రామునిచరిత్ర

సమస్తం యోగంలో తత్త్వదృష్టితో దర్శించి ఆ సత్యాన్ని ప్రకటించాడు. అంతర్ముఖుడైన అతనికి జరిగిన చరిత్ర అంతా (కరతలామలకం) అరచేతిలోని ఉసిరికాయలా కళ్ళకు కట్టినట్లు తోచింది.

తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః
పురా యత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా।
తత్సర్వం తత్త్వతో దృష్ట్వా ధర్మేణ స మహాద్యుతిః
అభిరామస్య రామస్య చరితం కర్తుముద్యతః।

బా. కాం. 3 స. 6, 7 శ్లో.

ఆ చరిత్ర కథనంలో రేయింబవళ్ళు, రహస్య ప్రకాశములైన వృత్తాంతములన్నీ అందరి చిత్త వృత్తులతో సహా సర్వం వాల్మీకి మహర్షికి తెలిసేలా బ్రహ్మ వరమిచ్చాడు. కావ్యంలో నీవాక్కులు (అనృతములు) అసత్యములు కావని దీవించి రామాయణ రచనకు ప్రోత్సహించాడు,

.... సర్వం విదితం తే భవిష్యతి।
నతే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి।

బా. కాం. 2స. 34. శ్లో.

ఈ రామాయణం ధర్మ, అర్థ, కామములతోకూడిన ఇక్ష్వాకువంశ చరిత్రను వర్ణించేది కనుక భేద దృష్టి మరచి, అసూయ విడచి సహృదయంతో వినండని మహర్షి స్వయంగా విన్నవించాడు.

ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం।
మహదుత్పన్న మాఖ్యానం రామాయణ మితిశ్రుతమ్ ॥
తదిదం వర్తయిష్యామి సర్వం నిఖిలమాదితః।
ధర్మ కామార్థ సహితం శ్రోతవ్య మనసూయయా ॥

అసూయా గ్రహ గ్రస్తులగు నేటి లఘుబుద్ధుల కిది చక్కని హితబోధ. రామాయణ రహస్యాన్ని అన్వయించుకొనుటకు సూచించిన ఒక ఉత్తమమార్గం. అందులో చెప్పబడిన ధర్మం (త్రికాలాబాధ్యమయి) భూత, భవిష్యత్, వర్తమాన కాలములలో మార్పులేనిదై జగతికి హితము చెప్పేదిగా ఉండి సజ్జనుల ఆమోదాన్ని పొందుతోంది.

ఇట్లా వాల్మీకి గిరిసంభూతమయిన రామాయణ మహాగంగ రామసాగర గామినియై భువనత్రయాన్నీ పునీతం చేస్తుంది. వేద సమ్మితము పవిత్రము అయిన ఈ రామాయణం విశ్వశ్రేయోదాయకమయి జాతీయ జీవన స్రవంతితో కూడి ముందుకు నడుస్తూ మహత్వంతోపాటు, అమరత్వాన్నీ సంపాదించుకొన్నది.

భూమి మీద పర్వతాలు నిలిచి ఉన్నంతవరకు, నదులు ప్రవహిస్తున్నంత వరకు లోకంలో ఈ రామాయణం ప్రచారంలోఉంటుందని బ్రహ్మయే అభివర్ణించాడు.

యావత్స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి ॥

శిశిరఋతువులో ఆకురాలి, మోడువారిన ప్రకృతి వసంతం రాగానే చిగురించి, పుష్పించి, ఫలించటం గమనిస్తూనే ఉంటాం. పారతంత్ర్యం, పాశ్చాత్య నాగరికతా వ్యామోహం, అనైక్యత కారణాలు కాగా భారతీయుల జాతీయతాభావం విస్మృతి చెంది, చైతన్య స్ఫూర్తి కనుమరుగైన ఈ రోజుల్లో రామాయణం నిత్యవసంతాన్ని ప్రసాదించి భవ్యానందాన్ని అందించటంలో సమర్థమవుతోంది. త్యాగభావమున కది నిలయం. శాశ్వత ధర్మప్రబోధాని కది కేంద్రం, సత్యసంపద కది స్థానం. ఏ పని చెయ్యాలో తెలియని ఆయోమయ స్థితిని "జడత" అంటారు. ఆ జడత్వమొక జాడ్యం. దానికిది మహౌషధం.

జాతిని జాగృత పరచి, నైతిక విలువలను పెంపొందించి, అనుశాసన బద్ధమయిన వ్యక్తి జీవితాన్ని నిరూపించి, సమాజ సంక్షేమాన్ని, తద్వారా విశ్వశాంతిని

ఆకాంక్షించేది రామాయణం. ఈ విధంగా సాహిత్యం, సాంఘిక ప్రయోజనాన్ని సమగ్రంగా సిద్ధింపజేస్తుందనటానికి రామాయణాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు.

భారతీయులకు వేదం ప్రామాణ్యం. తక్కిన శాస్త్రాలన్నీ దానికి అంగాలుగా వృద్ధిపొందాయి. వేదవేద్యుడైన పరమపురుషుడు దశరథ తనయుడై అవతరింపగా ప్రాచేతసుడైన వాల్మీకి ముఖమున వేదమే రామాయణంగా వెలువడిందని అగస్త్య సంహిత చెప్తోంది.

> వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే ।
> వేదః ప్రాచేతసా దాసీ స్సాక్షాద్రామాయణాత్మనా ॥

వాల్మీకి కవికోకిలయై రామకథ మధురంగా ఆలపించాడు. మునిసింహమయి అందరి తత్త్వమును వినిపించాడు. ఆ తత్త్వగర్జనలు విన్నవారికి పరలోకగమనం (ముక్తి) తప్పదన్నది అందులోని పరమార్థం.

> వాల్మీకే ర్మునిసింహస్య కవితా వనచారిణః ।
> శ్రుణ్వన్ రామకథా నాదం కో నయాతి పరాంగతిమ్ ॥

ఇట్లా కథ, తత్త్వములను రెండింటిని జోడించి మహోన్నత చరిత్రనందించి మానవ జాతికి మహోపకారం చేసిన మాన్యుడు, మహాత్ముడు అయిన వాల్మీకి ప్రాతస్మరణీయుడు. లోకాని కతని కావ్యం నిత్యవసంతాన్ని ప్రసాదిస్తోంది.

> పుట్టంబుట్టిన దట్ట, కావ్యరమకున్ బుట్టిల్లు పాపౌఘముం
> మట్టం జాలినమేటి, పున్నెముల విన్నాణంపుఁ బల్పెట్టె మే
> లుప్పట్టం బాగమరాశి, కంచిత తపస్స్తోమాత్మ దృక్కన్య కే
> ల్పెట్టంబట్టిన సామి నాఁ జెలగు వాల్మీకిన్ మదిం గొల్చెదన్.
>
> — శ్రీరామ కథామృతము
> శ్రీ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి.

సత్సాంగత్యము

"సాంగత్యం" అంటే కూడిక, చేరిక అని అర్థం. దాన్నే సహవాసం అని చెప్పవచ్చు. "సంసర్గం" అనేది కూడా దానికి పర్యాయపదం. లోకంలో అట్టి సంసర్గం వల్ల కలిగే గుణదోషాల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు చూస్తూనే ఉన్నాం. "సంసర్గజా దోష గుణా భవంతి" అన్నది పెద్దలమాట. పూవులతోకూడిన దారం అల్పమయినదైనా ఆ పూవులతోబాటే శిరోధార్యమౌతోంది. ఏ దోషం లేక కేవలం పవిత్రతకు చిహ్నమయిన నిప్పు ఇనుముతో కూడినందువల్లనే సమ్మెట దెబ్బలు తింటోంది. అదే విధంగా పరిసరాలు కూడ తమ చుట్టూ ఉన్నవారిపై ప్రభావం చూపటం కద్దు. ఉదాహరణకు వేయి హంసల మధ్యలో ఉన్న కాకిని ప్రత్యేకించి "కాకి" అని గుర్తించటం కష్టం. అట్లే వేయికాకుల మధ్యలో ఉన్న "హంస" కూడా కాకిగానే తప్ప హంసగా పరిగణింపబడటం సాధ్యంకాదు. తెల్లనివన్నీ పాలు నల్లనివన్నీ నీళ్ళు" ని అనుకోవటంకూడ ఇట్టిదే.

సమకాలీన సమాజంలోకూడా మంచివారిలో కొందరు చెడ్డవారు చేరి మంచి (పెద్ద) మనుషులుగా చెలామణి అవటం, చెడ్డవారినడుమ కొందరు మంచివారు ఉన్నా వారి మంచితనం లోకంలో గుర్తింపు పొందలేక పోవటం మనం నిత్యం గమనిస్తూనే ఉన్న సత్యం. అందుకే స్థానమెరిగి నిలవటం, మనసెరిగి మెలగటం ముఖ్యమని అనుభవజ్ఞులైన పెద్ద లనటం కద్దు.

మరోమాటలో వివరించాలంటే తాటిచెట్టు క్రింద పాలుత్రాగినా కల్లే త్రాగా రనుకోవడం, అనడం, నిజం తెలియని లోకుల నైజమయినా సాంగత్యఫలితమెంతటి ప్రబలమయిందో వేరే చెప్పకుండానే తెలుస్తుంది కదా! అయితే లోకంలో ఎక్కడో కొందరు ఈ సాంగత్య దోషాని కతీతంగా మెలగుతూ తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకో గల్గుతారు. సమాజంలో వారికి ప్రత్యేక స్థానంకూడా ఉంటుంది. చందన వృక్షం

విష సర్పములచే చుట్టుకొనబడి నప్పటికినీ తన చల్లదనమును, పరిమళమును విడిచిపెట్టదు కదా।

"ఆవేష్టితం మహా సర్పైః చందనం న విషాయతే"

అందుకు ప్రధానమయినది శీలం. "శీలం" అంటే స్వభావమని అర్థం. సమాజంలో సమానమయిన శీలం కలవారు ఒకచోట చేరటం సహజం. జీవితంలో అనేక రంగాలు. అందులో అనేక రకాల మనస్తత్వాలు. గుళ్ళోను, బళ్ళోను, క్లబ్‌లోను కాఫీహోటల్‌లోను, బడ్డీకొట్లోను, బార్‌షాపుల్లోను ఆ యా ప్రవృత్తులతో ఉండే జనం సమావేశమవటం జగమెరిగిన సత్యమే. వారి మధ్యలోసాగే సంభాషణ దాని కనుగుణంగానే ఉంటుంది. సరే ఎవరి అభిరుచి వారిది. "భిన్న రుచిర్హి లోకః" అన్నది మహాకవి కాళిదాసు లోకాన్ని గురించి చెప్పిన నిర్వచనం.

మనసు, మాట, మనుగడ ఒకటిగా ఉన్నవారు సజ్జనులవుతారు. అందువల్ల లోకంలో "సత్సాంగత్యమ"న్నది వివేకవంతులకు ఒక విశిష్ట లక్షణంగాకొనియాడబడుతోంది. కొందరి జీవితాలలో ఒక్కొక్క సంఘటనద్వారా ఊహింపలేని పరిణామాలు జరగటం. ఆశింపని ఫలితాలు లభించటం అనుభవ సిద్ధమే. ఇందులో అతిశయోక్తి ఏమాత్రంలేదు. "అతిశయముగ బుద్ధి మంతుడగు బుధసేవన్" అనేది ఈ విషయంలో భారతమిచ్చే సందేశం. ఈ విధమయిన ప్రభావం ప్రాణులన్నింటిపైనా ఉంటుంది. అంతఃపురాలలోని శుక, శారికలు మాటలునేర్చి మానవ మనోభావాలను గుర్తించి, ఆంతరంగిక వ్యవహారాలు చక్కబెడుతుంటే, ఆశ్రమాలలోఉండేవి శ్రవణ సుభగంగా సామగానం వినిపిస్తూ గురువులు లేనప్పుడు శిష్యులుచేసే చింతనలో వచ్చే అపపాఠాలను సరిదిద్దేవని వర్ణించటం వింటున్నాం. ఇక మన సుఖదుఃఖాలలో పాలుపంచుకొనే పశుకోటి చరిత్ర ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. పశు పక్ష్యాదుల సంగతే ఇలా ఉంటే బుద్ధి జీవులైన మానవుల విషయంలో సాంగత్య ప్రభావాన్ని గూర్చి మరోలా ప్రత్యేకించి చెప్పే దేముంటుంది? దీన్ని బట్టి చూస్తే "సత్సాంగత్యం"ఏ విధంగానూ త్రోసిరాజనటం అవివేకమే అవుతుంది. చెడు

స్నేహాలు, చెడు అలవాట్లు మాన్పించి మన పిల్లల్ని మనం మంచి వాతావరణంలో పెంచాలని, ఉన్నత ఆదర్శంతో ఉత్తమ పాఠశాలలో విద్య చెప్పించాలని ఆరాట పడటంలోనూ నిజంగా ఇదేవిషయం వ్యక్తమౌతోంది.

పౌరాణికంగా చెప్పాలంటే దారిదోపిడీలుచేసి బ్రతుకు వెళ్ళబుచ్చుకుంటున్న పుళిందుడనే బోయవాడు తపోమహనీయులైన సప్తర్షుల సందర్శనంతో ప్రభావితుడై వారినాశ్రయించి, అనుగ్రహానికి పాత్రుడై కృతార్థతనొంది "వాల్మీకి మహర్షి"గా కీర్తింపబడటం ఇందుకు నిదర్శనం.

సమర్థ రామదాసువంటి ఉత్తమ గురువుల సంసేవనం వల్లనే శివాజీవంటి ధర్మవీరులు, జాతినేతలై నిలిచారన్నసత్యం చరిత్ర నిరూపిస్తుంది. అంతదాకా ఎందుకు? గత శతాబ్దంలో "శ్రీ రామకృష్ణ పరమహంస"ను విమర్శనా దృష్టితోనే సందర్శించినప్పటికీ ఫలితంగా నరేంద్రుడు ఆతని మహిమానుభావమున శక్తిసంపూర్ణుడైన వివేకానందుడై భారతీయతత్త్వ శాస్త్రమును, హైందవ సంస్కృతీ వైభవమును దేశ, విదేశములలో చాటుమా ధర్మశంఖమును పూరించి విజయఢంకా మ్రోయించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచి వాడను విషయం మరియొక చారిత్రక సత్యం.

ఈ 20వ శతాబ్ది ఉత్తరార్థంలోకూడా శ్రీ రమణ మహర్షిని చూచిన సుప్రసిద్ధ సాంఘిక విప్లవ రచయిత, శ్రీ గుడిపాటి చలం పొందిన అనుభవం ఆయనలో కల్గిన మార్పు ఆయన ప్రకటించిన ఆధ్యాత్మిక భావాలు ముఖ్యంగా పరిగణించి తీరవలసిందేకదా! దీనివలన ఒకప్పుడు "వ్యక్తి మారుతాడు. ఆతనిచే ప్రతిపాదింపబడిన సిద్ధాంతం మారుతుంది". అని తెలుస్తోంది. ప్రపంచ చరిత్రే అందుకు ప్రమాణం. "కల్పికా మానుషీబుద్ధిః సహి సా వ్యవతిష్ఠతే" అన్నది అందుకుతగిన అభియుక్తోక్తి. సమాజానికి మేలుకూర్చే శాశ్వతమైన ధార్మిక సిద్ధాంతాలుమాత్రం మారవు. ఇలాంటి సత్సంగ ఉదాహరణలెన్నో ఎందరో మహానుభావుల జీవిత చరిత్రలలో గోచరమవుతూనే వుంటాయి. వేమన "నీచగుణములెల్ల నిర్మూలమొనరించు కొదువలేదు సుజనగోష్ఠి వలన" అని వక్కాణించాడు.

"ఈ సత్సాంగత్యం" ముక్తి సోపానములలో ఒకటిగాకూడా పెద్దలచేత పేర్కొన బడటం జరిగింది. "సత్సాంగత్యం వలన తొలుతగా అశాశ్వతములైన ప్రాపంచిక విషయములయెడ వైరాగ్య భావమేర్పడుతుంది. దానివలన మోహం నశిస్తుంది. నిర్మోహత్త్వం వలన నిశ్చలతత్త్వం సిద్ధిస్తుంది అట్టి నిశ్చలభావమే జీవన్ముక్తికిహేతువు" అని శంకరులు వివరించారు.

"సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం !
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః" !

అంతేకాక లోకంలో సుఖప్రదమైనదేది? అను ప్రశ్నకు "సాధుజన మైత్రియే అందుకు సాధనమ"ని శ్రీ శంకరులు తమ ప్రశ్నోత్తర మాలికలో సమాధానం చెప్పారు.

"కా సుఖదా? సాధుజనమైత్రీ"

ఇంక అందులోనే చంద్రకిరణములవలె ఆహ్లాదమును గూర్చునదెవ్వరనిన సజ్జనులే అందుకు సమర్థులని వివరించి, శ్రేయఃప్రేయములకు సజ్జనమైత్రియే ఉపాదేయమని వక్కాణించారు.

గంగ పాపమును, చంద్రుడు తాపమును, కల్పవృక్షము దైన్యమును పోగొట్టుటకు సమర్థములగుచున్నవి. మహాశయులైన సజ్జనులు పాపమును, తాపమును, దైన్యమునుగూడ పోగొట్టుటలో యోగ్యులగుచున్నారు. కావున సత్సాంగత్యం అవశ్య కర్తవ్యం అని తెలుస్తోంది.

"గంగాపాపం, శశీతాపం- దైన్యంకల్పతరు స్తథా !
పాపం, తాపంచ, దైన్యంచ ఘ్నన్తి సన్తో మహాశయాః" ;

అన్నివిధాలా దుఃఖహేతువైన దుర్జన సాంగత్యం ప్రయత్న పూర్వకంగానైనా సరే విడిచిపెట్టాలన్నది పెద్దల మాటలలోని తాత్పర్యం.

"ఈ సంసారమనే విషవృక్షానికి రెండే రెండు అమృతంతో సమానములైన ఫలము లుంటాయని అందులో ఒకటి కావ్యామృతరసాస్వాదనము రెండవది సజ్జనులతో చేసే సంభాషణ" అని పెద్దలు చెప్తారు. రాగద్వేషాదులైన స్వార్థ ప్రయోజనములకు తావులేనివి, అలౌకికానందం అందజేసేవి అవటంవలన అవి ప్రశస్తములవుచున్నవి.

"సంసార విషవృక్షస్య ద్వేఫలే అమృతోపమే !
కావ్యామృత రసాస్వాదః సల్లాప స్సజ్జనైః సహ" !

ఆంధ్ర భారతావతరణమునకు సంకల్పంచేసి, విద్యాదయితుడైన నన్నయ్యను ప్రోత్సహించిన చాళుక్య వంశోద్భవుడు శ్రీ రాజరాజ నరేంద్రుడుకూడా ఈ సాధు సాంగత్యాన్ని అభిలషించాడు, అభిమానించాడు.

"ఇవియేమన్ సతతంబు నామది కరంబిష్టంబులై యుండు పా
యవు భూదేవకులాభి తర్పణమహీయః ప్రీతియున్ భారత
శ్రవణా సక్తియుఁ బార్వతీపతి పదాబ్జధ్యాన పూజామహో
త్సవమున్ సంతతదాన శీలతయు శశ్వత్సాధు సాంగత్యమున్"
(ఆం, మ. భా. 1 ఆ. 12 ప)

కావుననే అతడు విద్వత్పరిషత్తులను సహృదయతతో నెలకొల్పి పోషించాడు. అందులో ఆనందాన్ని పొందగలిగాడు.

"పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణపుంజవారి జో
త్కర రుచిరంబులై సకలగమ్య సుతీర్థములై మహామనో
హరసుచరిత్ర పావనపయః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి వేడుకన్."
(ఆం. మ భా. 1 ఆ. 23 ప.)

ఆ విధంగా రాజరాజ నరేంద్రుడు నన్నయభట్టారకుడు కలసి ఆంధ్రజాతికి అక్షరతత్త్వాన్ని ఆవిష్కరించి తెనుగున భారతార్థాన్ని అందింపగలిగారు. సత్సంగ ఫలాన్ని చవిచూపించి తద్వారా సాధుత్వాన్ని, సాహితీ సంపదయొక్క శాశ్వత తత్వాన్ని నిరూపించారు

శ్రీమద్రామాయణ కావ్యావతరణ ఘట్టంలోనూ ఈ విధమైన మహత్తర సన్నివేశం దర్శనమివ్వటం పరిశీలింపదగిన విశేషం.

లోకానుగ్రహ కాంక్షతో త్రిలోకజ్ఞుడైన దేవర్షి నారదుడు ఒకనాడు వాల్మీకి మహర్షి ఆశ్రమమునకు విచ్చేసినాడు. అంత వాల్మీకి నారదునకు గౌరవపురస్సరంగా స్వాగతంపలికి, అర్ఘ్యపాద్యాది అతిథి సత్కారములు జరిపి, భక్తితో సన్నిధికిచేరి వినయ వినమితోత్తమాంగుడై నమస్కరించి ఆసక్తితో లోకవిశేషమైన ఒకవిషయాన్నిగూర్చి ప్రశ్నించాడు. వారి కలయికే ఒక సత్సంగం. ఆ సత్సంగంలో ఇంత కంటే భిన్నంగా వ్యర్థప్రలాపాలు ఎందుకుంటాయి.

''గుణవంతుడు, వీర్యవంతుడు మొదలగు విశిష్ట గుణములచేత గరిష్ఠుడైన మానవు నొక్కనిగూర్చి తెలుపుము'' న్నది అతని అభ్యర్థన. అందుకు సమాధానంగా నారదుడు ''నీవడిగినట్టి అన్యదుర్లభమైన గుణసంపదగలవాడు ఇక్ష్వాకువంశ ప్రభువుడైన రాముడొక్కడే'' అని వక్కాణించాడు. కారణం? లోకంలో ఒక్కొక్కరిలో

ఒక్కొక్క మంచిగుణం ఉంటుంది. కానీ ఆ మంచిగుణాలన్నీ ఒక్కనిలో ఉండటం అరుదు. కావుననే అన్నీ ఉన్న రాముడు లోకోత్తర గుణోత్తరుడు. ఆ పురుషోత్తముని విపులమగు గుణకీర్తనమే శ్రీమద్రామాయణం.

వాల్మీకి తపస్వి. తపస్స్వాధ్యాయ నిరతుడు నారదుడు. వారిరువురి నడుమ జరిగిన సంభాషణలో తపస్విజన సంసేవ్యుడైన శ్రీరాముని చరిత్ర వర్ణితమైంది.

రామాయణంలో విశ్వామిత్రముని తనయాగ సంరక్షణకై రాముని బంపుమని దశరథునివేడిన సందర్భంలో దశరథుడు పుత్రభావంతో ఉండటం వలన రాముని సామర్థ్యంతెలియక అతనిని రాక్షసులతోడి యుద్ధానికి పంపటానికి నిరాకరించాడు. అట్టియెడ విశ్వామిత్రుడు "తపోమహిమచే బ్రహ్మర్షిత్వమును సాధించిన తనకును మహర్షిసత్తముడైన వశిష్ఠునకును ఇంక తక్కిన తపోనిష్ఠులగు మహాత్ముల కందరికిని రాముని సత్యపరాక్రమం విదితమే" అనటంవలన రాముని తపస్విజన సంసేవ్యత తెలుస్తోంది.

"అహంవేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమమ్ !
వశిష్ఠోఽపి మహాతేజా యే చాన్యే తపసి స్థితాః" !

పైశ్లోకంలో "మహాత్మానం" అన్న పదము "వేదహ మేతం పురుషం మహాంతమ్" అను శ్రుతి వచనమును స్ఫురింపజేస్తూ వేదంలో చెప్పబడు పరమపురుషుడితడే అనుఅర్థం వివరిస్తోంది. మునిజనులకు సహితం ఉపాస్యమైన రాముని పరబ్రహ్మత్వం ఇలా నిరూపింపబడింది. "తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ" అను మహావాక్యార్థము (తపస్సుచేతనే బ్రహ్మము తెలియదగియున్నది) ఇట అనుసంధించుకొన వలసిఉన్నది.

అట్టి సత్సాంగత్యంలో రామాదుల సద్వృత్త కథనం రావణాదుల అసద్వృత్త నిరసనం జరిగింది. అంటే మంచిని ప్రశంసించటం చెడును ఖండించటం, సంభవించింది. తర్వాత ఆ చరిత్రే "రామాదివ ద్వర్తితవ్యం నరావణాదివత్" రామాదుల వలె ప్రవర్తించండి. రావణాదులవలెవద్దు: అని విధి నిషేధపూర్వకంగా సమాజాన్ని శాసించటానికి ఆధారమైన సాంఘికశాస్త్రంగా ఆదర్శమానవ జీవనవిధానానికి మార్గదర్శకమైన సూత్రంగా, రమణీయార్థ ప్రతిపాదకమైన మహాకావ్యంగా, ప్రసిద్ధిగాంచి సనాతన ధర్మపరాయణులకు ప్రబోధసాధనంగా, విశ్వాసంకలవారికి సకలార్తి నివారణకై వినియోగపడే నిత్య పారాయణ గ్రంథంగా, నాగరికతా ప్రపంచానికి వెలుగునిచ్చే విజ్ఞానజ్యోతిగా ప్రకాశిస్తోంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శింపగల భారతీయులకు వేషభాషలకు అతీతంగా, అఖండ భావసంపదలతో సమైక్యతా సమగ్రతలకు

దోహదంచేసే రసరమ్య భారతిగా ప్రసిద్ధికెక్కి, అన్ని సాంప్రదాయాలకు చెందిన వారందరిచేతా అనుసరింపబడి ఆరాధింపబడే జాతీయ గ్రంథంగా కూడా కీర్తింపబడటం ముదావహం. ఇందులో రామునిసత్య పరాక్రమము, లోకహితనిష్ఠ, ధార్మిక ప్రవృత్తి మొదలగు విశేషాలు బహుధా సంభావింప బడ్డాయి

ఇద్దరు మంచివారు ఒకచోటకలిసి పలుకరించుకుంటే మంచివిషయాలను గురించే ముచ్చటించుకోవడం జరుగుతుంది. అక్షరాలా ఇక్కడ ఈ నారద, వాల్మీకుల సమావేశంలో అదే జరిగింది. ఆ ఫలితమే వాఙ్మయ ప్రపంచానికి స్వాదువైన ఆదికావ్యాన్ని అందించింది. ప్రపంచానికి భారతీయ సంస్కృతీ భాండాగారాన్ని ప్రసాదించింది.

నేడు తిరుమల తిరుపతి దేవస్థానంవారు, (ధర్మరక్షణ సంస్థద్వారా) విశ్వహిందూపరిషత్‌వారు, భగవాన్ సత్యసాయి, షిర్డీసాయి, భక్తసమాజంవారు, ఇంకా మరెందరో ఎన్నో ధార్మిక సంస్థలద్వారా ఈసత్సంగములను ఊరూరా నిర్వహిస్తూ ధర్మప్రచారానికి తోడ్పటం ఎంతోసంతోషం

పాశ్చాత్యులు సహితమీనాడు మనదేశమునకువచ్చి 'హరేరామ హరేకృష్ణ' భజన బృందములుగా ఏర్పడి ఈ సత్సంగ, సత్సంప్రదాయముల పాటించుట ద్వారా శాంతిని అనుభవించటానికి ప్రయత్నిస్తున్నారు.

పూర్వులిచ్చిన ఆస్తులకు వారసులమైనట్లే వారేర్పరచి అనుసరించిన మంచి సంస్కృతి సంప్రదాయములకుకూడా వారసులమని గుర్తెరిగి ఔచిత్యంతో ప్రవర్తింపటం మన అవశ్య కర్తవ్యంగా భావించుదాం. !

సత్యసూక్తి ఘటించు, ధీజడిమమాన్చు
గౌరవ మొసంగు జనులకుఁ గలుషమడఁచు
గీర్తిఁబ్రకటించు చిత్తవిస్ఫూర్తిఁజేయు
సాధుసంగంబు సకలార్థ సాధనంబు

మూలం భర్తృహరి ; అనువాదం - ఏనుగు లక్ష్మణకవి.

దిగా ఉండాలన్నది ముఖ్యలక్షణం. అందుకే దాన్ని "సాహిత్యం" అన్నారు. పద్యమా? గద్యమా? గేయమా? చంపువా? అది ఏవిధంగా ఉండాలన్నది రచయిత అభిరుచి. అభినివేశాలనుబట్టి ఆ పద్ధతి ఏర్పడుతుంది.

ఆ సాహిత్యం ఏ రూపంలోఉన్నా అది నిప్పులాంటిదే. నిప్పుతో శరీరానికి, మనస్సుకు ఉపయోగపడుతూ పుష్టినీ, తుష్టినీ ఇచ్చే ఆహారాన్ని పక్వం చేసుకోవటానికీ ప్రయత్నించవచ్చు విద్వేషంతో ఇళ్ళూ, ఊళ్ళూ తగులబెట్టే విధ్వంసక చర్యకూ పూనుకోవచ్చు. అందువల్ల దాన్ని ఎంతవరకు వాడుకోవాలో అంతవరకే జాగరూకులై వాడుకోవాలి. అందుకు ఎంతో సంయమనం కావాలి. నిప్పు మనదేకదా అని ముట్టుకుంటే కాలక మానదు తెలియక పిల్లవాడు తాకినా తనపని తాను చేయకుండా విడువదు. అట్లే సాహిత్యం చాలా మెలుకువతో దానిని వినియోగించుకోవాలి.

భారత కథలో పాశుపతాస్త్రాన్ని సంపాదించటంలో అర్హత మిక్కిలి ఆవేశపరుడైన భీమసేనునికికాక ఆత్మ నిగ్రహం కలిగిన అర్జునునికే దక్కిందన్నది ఈ సందర్భంలో గుర్తు చేసుకోవలసిన విషయం.

అందుకనే కావ్యతత్వాన్ని గూర్చి బాగాతెలిసిన పెద్దలు (నానృషిః కురుతే కావ్యమ్) కవికి ఋషివలె సంయమనం ఉండాలి. లేకపోతే కావ్యం వ్రాయలేడు. అని వక్కాణించారు కవి కావ్యంలోని పాత్రలన్నింటినీ సమానంగా చూస్తూ. రాగద్వేషాల కతీతంగా కవితా తత్వాన్ని ఆవిష్కరించాలన్నది ఆ సూక్తిలోని పరమార్థం. ప్రభువును. పరిచారకుని. ధనవంతుని దరిద్రుని, స్త్రీని. పురుషుని శత్రువును, మిత్రువుని. భక్తుని భగవంతుని ఈ విధంగా ఏపాత్ర చిత్రించేటప్పుడు కవి ఆపాత్రతో తాదాత్మ్యంచెంది, ఆ స్వరూపస్వభావాల్ని వెల్లడించి అది పాఠకుల కళ్ళ ముందు సజీవంగా కదలాడేలా చేస్తాడు.

ప్రకృతిలో గాలికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అసలు గాలి లేకపోతే ఉండలేం ఊపిరాడదు. ఎక్కువైతే భరించలేం. ఎండా. వాన, చలి వీని ప్రభావం దానిపై ఉంటుంది. ఆ గాలికి తరంగరూపమైన వ్యాపనశీలం ఉంటుంది. అత్తరు, పన్నీరు మొదలైన పరిమళద్రవ్యాలు ఉన్నచోట సుగంధం. అపరిశుభ్రంగా, మురుగు పేరుకుపోయినచోట దుర్గంధం, గాలి పరిసరాలలో వ్యాపింపజేయటం కద్దు. దుర్వాసన వల్ల అనారోగ్యం ఏర్పడుతుంది. ప్రాణశక్తి పెంపొందించు కొనేందుకు కాలుష్యంలేని సహజ వాయువులను మనం కోరుకుంటాం. అదే విధంగా సాహిత్యంకూడా సమాజంలోకి అతివేగంగా చొచ్చుకుపోయి ప్రజాహృదయ తంత్రులను కదిలిస్తుంది. ప్రణయాన్నీ, ప్రళయాన్నీ తేలికగా సృష్టిస్తుంది. కదిలేది, కదిలించేది కవిత్వమనటంలో ఉన్న అక్షరసత్యమిదే.

(మనిషి కాహారం ఎంత అవసరమో, మెదడుకు ఆలోచన అంత ముఖ్యం) అందువల్ల సాహిత్యం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదించే మంచి వాతావరణాన్ని మనం ఏర్పాటు చేసుకోవాలి. అది రచయిత యొక్క వ్యక్తిత్వ, వికాసాలను బట్టి సిద్ధిస్తుంది.

అడవులలో ఆకు అలములు తిని, రాగద్వేషాలకు అతీతంగా ఉండి, నిస్వార్థ బుద్ధితో మానసీయులైన మహర్షులీజాతి కట్టి వాఙ్మయ సంపద నందించారు. సత్యము. అహింస. త్యాగము. దయ మొదలగునవి అందలి ముఖ్య లక్షణములు.

అట్టి వానిలో ఉత్తములైన ఇక్ష్వాకుల యొక్క వంశ చరిత్రకు రమణీయత సంతరించి పెట్టిన కావ్యం రామాయణం. (ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన శివ పురాణం, ఆంధ్ర పురాణం మొదలైన కావ్యాలు ఈ కోవకే చెందుతాయి) ఆ వాల్మీకి రామాయణాన్ని బట్టి చూస్తే ఒక విధంగా కావ్యానికి తీసుకోదగిన కథా వస్తువు యొక్క స్వరూపం మనకు బోధపడ్తుంది. అందులో మహాపురుష లక్షణములుగల రాముడు నాయకుడు.

అతడు జీవలోకాన్ని, ధర్మాన్ని రక్షించగల సమర్థుడు.

"రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా"

స్వపర భేదములు లేక తన ధర్మాన్ని తాను ఆచరిస్తూ, తనవారిచేత ధర్మాన్ని ఆచరింపజేసిన కర్మయోగి

"మర్యాద" అంటే హద్దు. తన మర్యాద తాను తెలిసి మెలుగుతూ, ఇతరులకు తెలియజెప్పినవాడు రాముడు అందుకే అతడు 'మర్యాదా పురుషోత్తముడ' నిపించుకున్నాడు.

"మర్యాదానాంచ కర్తా కారయితా చ సః

ఇన్ని మాటలెందుకు రాముడు రూపుదాల్చిన ధర్మము. సాధువు. సత్య పరాక్రముడు.

"రామో విగ్రహవాన్ ధర్మః సాధు స్సత్య పరాక్రమః

అట్టివాని సుచరిత్రము లోకానికి ఆదర్శమవుతుంది. ఉదాహరణ యోగ్య

మైన ఆ చరిత్ర వలన ప్రధానంగా మానవజాతి జీవిత విధానాన్ని నిర్దేశించేందుకు సాధ్యమవుతుంది.

ఆ విధంగా కాకుండా లోకాన్ని పీడించి, ఏడిపించే రావణాదుల వంటివారి విధ్వంసక చర్యలను కొనియాడటం వల్లకాని, పిచ్చి కుక్కల మీదో, గుంట నక్కలపైనో కవిత్వం చెప్పటానికి పూనుకోటం వల్లకానీ ఏమిటి ప్రయోజనం? అందులో మనం స్వీకరింపగల నైతిక విలువ లేమిటి? ఆ తర్వాత వారికి అందులో అనుసరింపదగిన ధర్మ మేముంటుంది? ఆ ఇతి వృత్తం కేవలంకవితా వ్యాపారానికి ఉపకరిస్తుంది తప్పితే, సమాజానికి మార్గ దర్శక సూత్రం మాత్రం కాదు. కాబోదు.

ఏ భాషలో నైనా శాశ్వతమైన సత్యం (Everlast truth) సార్వ జనీనమైన ధర్మం, (సత్య ధర్మములు రెండూ మౌలిక సిద్ధాంతాలు) వివరించే మంచి ఇతివృత్తమే పది కాలాల పాటు సమాజం చేత ఆదరింపబడుతుంది. తక్కినవి కేవలం తాత్కాలికములే అవుతున్నాయి. ఇది ప్రపంచ వాఙ్మయ చరిత్రలో అనేక విధాల నిరూపింపబడిన సత్యం.

ఆ విధంగా వివరింపబడిన ధర్మమే సకల మానవ కళ్యాణ కారకమై, విశ్వ శాంతికి దోహదం చేస్తుంది. ప్రజలందరినీ ఒకే త్రాటిపై నడపగల జీవనపద్ధతిని ధర్మ మంటారు. (ధర్మోధారయతి ప్రజాః) అంతే కానీ విభేదాన్ని సృష్టించేది విచ్ఛేదానికి ప్రేరణ కల్పించేది ధర్మం కానే కాదు.

రచయితకు కావల్సింది కవితావేశం. ఆ ఆవేశమే అదుపు తప్పితే అనర్థానికి దారితీస్తుంది ఆ రకమైన ప్రమాదం జరగకుండా మనస్సును నిగ్రహించే శక్తిని "సంయమనం" అంటారు ఆ రెండు ఉన్నచోట వివేకం కూడా జతపడి ఉంటుంది. అటువంటి రచన వల్ల విజ్ఞానం లభిస్తుంది. జీవకోటి సుఖ దుఃఖముల యెడ సానుభూతి కలిగిన సహృదయుని హృదయం కవితా సంపదకు నిలయం అవుతుంది.

క్రౌంచ పక్షి బాధ గన్న వాల్మీకి లో
కరుణ రసము పొంగి పొరలి పోయె
రసము పొంగి పొంగి రామాయణ బయ్యె
లలిత సుగుణాల తెలుగుబాల !

కరుణశ్రీ

నారదుని సాగనంపి, వాల్మీకి స్నానానికని తమసానదీ తీరానికి చేరాడు. అక్కడ కిరాతకు డొకడు సుఖంగా విహరిస్తున్న క్రౌంచ పక్షుల జంటలో ఒకదానిని కొట్టి నేల కూల్చటం, అది బాధపడటం చూచి ఆవేదన పడ్డాడు. ఆ ఆవేదనే వాల్మీకిలో కవితావేశానికి కారణమైంది. ఆ కిరాతుని గూర్చి ఆవేశంతో పలికిన పలుకులే శ్రీమద్రామాయణ కావ్యావిర్భావానికి మూలములైనాయి.

సుఖంగా క్రీడిస్తున్న పక్షిజంటను వేటాడి పడగొట్టి, వేరుచేయరా దనేది ఆటవికులకు ఉన్న నియమం. ఆ నియమం పాటించకుండా ప్రవర్తించటం అతడు చేసిన అకృత్యం. అధర్మాన్ని సహింపలేని ఆ ఋషి హృదయం జాలితో కదిలి వెన్నలా కరిగిపోయింది. కరుణతో నిండి పొంగి పొరలింది. నిషాదుని దుర్వృత్తాన్ని నిరసించింది. అట్టి కఠిన హృదృదయుడు ఈ భూమి మీద ఇంక ఎక్కువ కాలం నిలువరాదని శాసించింది.

మానిషాద ప్రతిష్ఠాంత్వ మగమత్ శాశ్వతీ స్సమాః ।
యత్క్రౌంచ మిథునాదేక మవధీః కామ మోహితమ్॥

ఇందులో రెండవ అర్ధంగా కామమోహితులై అధర్మ మాచరించిన వాలిని, రావణుని సంహరించి ధర్మాన్ని ప్రతిష్ఠ చేసిన (మా : లక్ష్మికి, నిషాద ; నిలయుడయిన ఓ విష్ణువా) రామావతారాన్ని కీర్తించిన వైఖరి కూడా వెల్లడి అవుతోంది. అంటే కవిత్వం అధర్మాన్ని నిరసించి, ధర్మాన్ని ప్రశంసించేదిగా ఉండాలన్నది సిద్ధాంతంగా చెప్పుకోవచ్చు.

ఆ పక్షి విషయంలోనే ఋషి హృదయం అంతగా వ్యథ చెందితే ఈ నాటి సమాజంలో ప్రబలిపోయిన అమానుషత్వానికి, అమాయక ప్రజలకు జరిగే అన్యాయాలకు, మతం పేరుతో జరిగే దారుణ మారణ కాండకు. రాజకీయ దళారీల దోపిడీ విధానానికి మరెంతగా విలపించేదో, ఆ ఆర్ద్ర హృదయమే ఈనాడు లోకంలో కరువై పోయింది. పక్షపాత రహితమే దానికి ముఖ్య లక్షణం.

ప్రతి జీవికి ఒక స్వభావం ఉంటుంది. ఆ స్వభావం నుండి ఏదో ఒక పని చేయాలని ఆలోచన పుడుతుంది. కొందరు సైన్యంలో చేరి దేశాన్ని రక్షించాలని కోరుకుంటారు. కొందరు ఉపాధ్యాయ వృత్తి స్వీకరించి విద్య నేర్పుదామని కలలు కంటారు. మరి కొందరు పరిపాలనా యంత్రాంగంలో పెత్తనం చెలా

యించాలని అభిలాష పడతారు. ఇంకొందరు వ్యాపారం, వ్యవసాయం పశుపోషణ చేసి దేశ సౌభాగ్యాన్ని పెంపొందించాలని, అధిక లాభాలను ఆర్జించాలని కుతూహల పడతారు ఇటా ఎందరికో రకరకాల ఆలోచనలు. అట్లాంటి వారికి ఒక్కొక్కరికి ఒక ధర్మం ఉంటుంది. అదే వారి స్వధర్మంగా చెప్పబడుతుంది. దాన్ని చక్కగా నిర్వహించటం వలన వారు ఆవృత్తిలో ప్రతిభావంతులుగా గుర్తింప బడుతారు.

ఆ ధర్మాన్ని సక్రమంగా ఆచరించటం వలన అర్థ, కామము లేకాక, సర్వమూ సిద్ధిస్తుందని రామాయణం సందేశం ఇస్తోంది.

ధర్మా దర్థః ప్రభవతి. ధర్మా త్ప్రభవతే సుఖమ్ ।
ధర్మేణ లభతే సర్వం, ధర్మసార మిదం జగత్ ॥

అయోధ్యా కాండ.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో ముఖ్యంగా ఇంద్రియ నిగ్రహం ద్వారా వ్యక్తిత్వ వికాసానికి దోహదంచేసే విషయాలే అంతటా వర్ణింపబడ్డాయి. ధర్మ మార్గానికదే (ఇంద్రియ నిగ్రహం) ప్రధాన సాధనమని కూడా చెప్పారు. అంతే కాని. సుఖాభిలాష. విషయలోలుపత (దుర్వసనాలు) పరమార్థాలని ఎక్కడా చెప్ప లేదు. సుఖంవల్ల సుఖం లభిస్తుందని అనుకోవటం అజ్ఞానం.

ఆత్మానం నియమై స్తైస్తైః కర్మ యిత్వా ప్రయత్నతః ।
ప్రాప్యతే నిపుణైర్ధర్మో; న సుఖా ల్లభ్యతే సుఖమ్ ॥

[అర. కాం.]

అగ్నికి ఆజ్యం [నెయ్యి] పోస్తే ఆ మంట పెరుగుతుందే తప్ప ఆరిపోదు కదా !

ఒకప్పుడు అధర్మాన్నిధర్మాన్ని రెండింటిని నిరూపించి అందులో ధర్మానికే జయమని సూచించటం ఆ సాహిత్యంలో చూస్తాం. "యతో ధర్మ స్తతో జయః". వరూధినీ ప్రవరుల వృత్తాంతం మొదలైనవి కూడా ఇందుకు నిదర్శనం.

ఈ నాడు ఎక్కడ చూచినా, అరిషడ్వర్గాలైన కామ క్రోధాదులే కవితా వస్తువులుగా స్వీకరింపబడి. పగను. ద్వేషాన్ని అమానుషత్వమైన హింసా ప్రవృ

త్తిని [శాడిజమ్] ప్రోత్సహించి, ప్రచారం చేసే రచనలు దృశ్య. శ్రవ్యరీతులలో [చెత్త సినిమాలు, చౌకబారు నవలలు] కుప్పలు తెప్పలుగా వెలువడు తున్నాయి.

అనుచితమైన ఆ రచనలు జాతిని. ప్రత్యేకించి యువతరాన్ని పెడదారిని పట్టి స్తున్న విషయంలో సందేహంలేదు. కళ్ళెం చేతిలో ఉంచుకొని గుర్రపుస్వారీ చెయ్యాలి లేకపోతే అది గోతిలో తోసేస్తుంది. అట్లాగే మనస్సును అదుపులో ఉంచుకొని మెలిగే ధైర్యం. స్థైర్యం ఇచ్చే సాహిత్యమే జాతికి జవాన్ని, జీవాన్ని ప్రసాదిస్తుంది. అందులో హక్కులతో బాటు బాధ్యతలను గుర్తించగల క్రమశిక్షణ నేర్పే పద్ధతి కావాలి విశృంఖల వీర విహారానికి. విపరీతమైన మత్తు పదార్థములకు అలవాటు పడిన పాశ్చాత్య సంస్కృతి వలన ప్రపంచానికి మిగిలింది అసంతృప్తి. వచ్చింది దుర్వారమైన 'ఎయిడ్స్' వ్యాధి.

ఇంద్రియ నిగ్రహం (సెల్ఫ్ కంట్రోలింగ్ పవర్) లేనప్పుడు ఆ ఇంద్రియాలు మనపై పగసాధించే ప్రయత్నం చేస్తాయి (చర్మము. కండ్లు. చెవులు. నాలుక. ముక్కు. ఇవి ఐదు జ్ఞానేంద్రియాలు. ఆరవది మనస్సు ఆ మనస్సే వీటన్నింటిపైనా అధికారం చెలాయిస్తుంది)

రావణుని భార్య మండోదరి. ఆమె సీతాపహరణ రూపమైన అతని దుశ్చర్యను నిరసిస్తూ పూర్వం నీవు ఇంద్రియాలను జయించి త్రిభువనాలను జయించావు. (తపస్సుచేసి వరాలు సంపాదించి, ఆ వరబల గర్వంతో లోకాలను తికమకపెట్టావు) ఆ వైరాన్ని మనసులో ఉంచుకొని ప్రతీకారం తీర్చుకొంటున్నాయేమో అన్నట్లు నీవు ఈనాడు ఆ ఇంద్రియములచేతనే జయింపబడి (కామపరవశుడవై) వినాశనం కొని తెచ్చుకున్నావంటుంది.

ఇంద్రియాణి పురాజిత్వా, జితం త్రిభువనం త్వయా;
స్మర ద్భిరివ తద్వైరం ఇంద్రియై రేవ నిర్జితః ;; (యు. కాం.)

ఇక నేడు జాతిని పట్టి పీడిస్తున్న వాటిల్లో "నిరాశావాదం" ఒకటి. ఈనాటి సాహిత్యంలో ప్రముఖంగా కనపడే విషయంగా చెప్పక తప్పదు. (తిరోగమన సిద్ధాంతం) సమస్యా పరిష్కారానికి ఇది ఎంత మాత్రం మార్గం కానే కాదు. నిరాశా, నిస్పృహలు జాతిని నిర్వీర్యం చేస్తాయి. శోకాన్ని పెంపొందిస్తాయి. ఈ శోకమే ధైర్యాన్ని. చదివిన చదువును. తనకున్న తక్కిన సర్వ శక్తులను నాశనంచేసి కర్తవ్య విమూఢులను చేస్తుంది. శోకంతో సమానమైన శత్రువే లేదని రామాయణం హెచ్చరిస్తోంది.

శోకో నాశయతే ధైర్యం, శోకో నాశయతే శ్రుతమ్ !
శోకో నాశయతే సర్వం, నాస్తి శోక సమో రిపుః ॥
(అయో. కాం.)

వినాశనం వలన అనేక దోషాలు సంభవిస్తాయి అందువల్ల ఈ నిరాశా వాదం లోకానికి అభ్యుదయ హేతువేమీ కాదు.

"బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు" అనే ఆశావాదం విశ్వాసంతో కూడి నదై మోడువారిన జీవితాన్ని కూడా చిగురింప జేసి చైతన్యవంతంగా నిలిపి మూడు పూవు లారు కాయలుగా విలసిల్లేందుకు దోహదం చేస్తుంది.

"వినాశే బహవో దోషాః జీవన్ ప్రాప్నోతి భద్రకమ్"
(సుం - కాం.)

అనేది ఈ విషయంలో రామాయణ మందించే సందేశం. ఈ విధమైన ఆలోచన కలిగినప్పుడు క్షణి కోద్రేకంలో చేసే అఘాయిత్యములకు, జరిగే ఆత్మ హత్యలకు అవకాశం ఉండదు.

భారతీయ సంస్కృతిని బట్టి మానవులు తప్పక సాధింపదగిన పురుషార్థములు నాలుగు. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షములు. అందులో అర్థం అంటే డబ్బు-కామం అంటే కోరిక. ఈ రెండూ ప్రపంచంలో అందరికి ముఖ్యావసరములే అయితే తన ప్రయోజనం ఎదుటివారి స్వేచ్ఛకు, ఆనందానికి భంగకరములు కాకూడదు. అంటే అవి నియమ (ధర్మ) బద్ధములు కావాలన్నమాట. ధర్మంగా తనకు సంక్రమించిన అర్థ,కామములను అనుభవించటం మానవత్వాన్ని సూచిస్తుంది, అట్లాకాకుండా కేవలం అర్థ కామములే కావాలను కోవటం, ఆ సంపాదనలో నియమాన్ని [ధర్మాన్ని] కూడా అతిక్రమింటం హింసా ప్రధానమైన రాక్షసత్వాన్ని నిరూపిస్తుంది. ఒక్కొక్కరు ధర్మాన్ని ఉపాసించటంకోసం అర్థాన్నీ, కామాన్నీ కూడా లెక్కచేయకుండా ప్రవర్తించటం చూస్తాం. అది వారి ఉత్తమ మానవత్వానికి నిదర్శనం. అది వారిలోని దైవీగుణ సంపదకు కూడా తార్కాణం అవుతుంది. అందువల్ల ఏవిధంగా చూచినా పరిపూర్ణ మానవత్వాన్ని వికసింప జేసే సాహిత్యమే కవి సృష్టి చెయ్యాలన్న అంశం నిర్వివాదం.

రామాయణంలో కైక వరములు కారణంగా రాముడు వనవాసానికి వెళ్ళవలసి వస్తుంది. అది విన్న లక్ష్మణుడు అందుకు కారకులైనవారిని, వారిని సమర్థించేవారిని

కత్తి పట్టి ఖండించి తీరుతానని క్రోధంతో ఊగిపోతూ రాముని రాజ్య పట్టాభిషేకం జేసుకోమని ప్రేరేపిస్తాడు. సమాధానంగా రాముడు లక్ష్మణుని ఉద్దేశించి మన మిప్పుడు విక్రమంతో విజృంభించి తల్లి దండ్రులను, అన్న దమ్ములను, బంధు మిత్రులను బంధించి, హింసించటంద్వారా రక్తపాతం సృష్టించి సింహాసనాధికారాన్ని చేజిక్కించుకోవటం జరిగితే కలిగే ప్రయోజనమేమిటి? శత్రువులపై ప్రదర్శింప వలసిన శౌర్య పరాక్రమములు ఆత్మీయులైన వారిపై ప్రకటించటం తగినపనా? కాదే! కావున ఇప్పుడు నేను తండ్రిమాట పాటించి, అతనికి అసత్యదోషం కలుగకుండా అరణ్య వాసానికి పోవటమే ఉచితం అని పలికిన పలుకులలో సాహిత్య పరమార్థం కూడా వివరించి, మహర్షి చక్కగా నిరూపించిన తీరు మనం గమనించి తీరాలి.

ధర్మో యత్ర స్యాత్ర దుపక్రమేత
ద్వేష్యో భవత్యర్థ పరోహి లోకే
కామాత్మతా ఖల్వపి నప్రశస్తా ! [అయో. కాం.]

"కేవలం డబ్బుకోసం తపనపడి, పరుల ధనం మూటలుకట్టే ప్రయత్నం చేసే వాడుకానీ, కామప్రవృత్తితో కళ్ళు మూసుకు పోగా, మంచి, చెడు విడిచి, తల్లి, చెల్లి అనే విమర్శ మరచి పశువులా ప్రవర్తించేవాడు కానీ, లోకంలో అభినందింపబడడు. సరి కదా! మిక్కిలిగా నిందింపబడి సజ్జనులచే ద్వేషింపబడతాడు అందువల్ల ధర్మ యుక్తములైన పనులే సంకల్పించి చేయ్యాలి (అట్టివానికి మోక్షం కరతలామలక మవుతుంది.) కావుననే విచక్షణులైన వారికి లోక పీడాకరములైన పనులు, కర్తవ్యములు కావని రామాయణం సూటిగా ప్రకటించింది.

"లోకా పీడా కరం కర్మ న కర్తవ్యం విచక్షణైః !

కవిత్వం వ్రాయటం ఒక కళే అయినా, అది వ్రాయక పోవటం అధర్మం, మృతి హేతువు కానేకాదు. అందుకు శిక్ష లేనేలేదు. సమాజాన్ని మాటల గారడీతో మభ్యపెట్టి, ఊరికే రెచ్చగొట్టి పెడద్రోవలు పట్టించే కుకవిత్వం మాత్రం జాతి వినాశ కారకమే కాకుండా కవికి నరకహేతువు కూడా అవుతుందని సాహిత్య ప్రయోజనం తెలిసిన పెద్దలు వివరించారు.

"నా కవిత్వ మధర్మాయ మృతయే దండనాయతే !
కుకవిత్వం పునస్సాక్షాత్ నరకాయ విధీయతే॥"

ఇంతకూ జగన్మంగళ కరములై. శాశ్వతములైన సత్యధర్మములను ప్రబోధించేది నిజమైన "సాహిత్యం" అనబడుతుంది. అట్టి దివ్య సందేశాన్ని అందుకోగలిగిన జాతి అమమై అజేయమై పరమవైభవ స్థితికి జేరి ప్రపంచంలో గురు పీఠాన్ని అధిరోహిస్తుంది. అట్టి వారికి ... భయం లేదు. అదే మన సంస్కృతి మనకు బహుధా బోధిస్తోంది.

"సత్య ధర్మాభిరక్తానాం, నాస్తి మృత్యుకృతం భయం"
(యు. కాం)

సాహిత్యం ఆలోచనామృతం

అమృతాన్ని సేవించిన వారికి జరామృత్యువు లంటబోవని వర్ణించినట్లే సాహిత్యమనే అమృతాన్ని ఆస్వాదించి అమరులైన వారికి లోకంలో శాశ్వతత్వం లభిస్తుంది మోహాపు చీకట్లను పారద్రోలి, జ్ఞాన జ్యోతులను ప్రసాదించు సారస్వతమునే సేవించి ధన్యుల మగుదుము గాక!

తద్దివ్య మవ్యయం ధామ. సారస్వత ముపాస్మహే।
యత్ప్రసాదా త్ప్రలీయన్తే. మోహాంధ తమస శ్ఛటాః ॥

మీకు రుచించు మార్గమున మీరు ప్రయాణము సేయవచ్చుగా
నీ! కల్లనైన సత్యము సహింపయు లేబరమైన త్రోవకున్
బోకుఁడు, నిల్వ నేర దవిపోయిన సంఘము. గెల్వనేరదా
రేకలు లేని సంస్కృతి, చరిత్ర వెలార్చిన సత్యమీ నుడుల్.

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

గురు శిష్యులు

ప్రకృతిలో ప్రాణులనేకం వాటన్నింటికి అనుకరణం సహజగుణం. అవ్వ చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? అనే సామెత అందుకు మంచి ఉదాహరణం. పెద్దవారిలా చిన్నవారు చేయటానికి ప్రయత్నిస్తారనేది దాని ఉద్దేశం. భావ వినిమయానికి ఇచ్చి పుచ్చుకోటాని కుపయోగ పడేది భాష. అది మానవుల కొక ప్రత్యేక రంగా భావింప బడుతోంది. ఆ విశేషమైన లక్షణమే మానవులను ప్రాణి కోటి నుండి వేరుచేసి, వారికొక విశిష్టస్థానాన్ని కల్పించి, విలువ గలిగేలా చేస్తోంది

"కిం సంపాద్యం మనుజైః"? అట్టి మనుజులచేత సంపాదింపదగినదేది? అని ప్రశ్నించి "విద్యా. విత్తం. బలం, యశః, పుణ్యమ్" అని శంకరులు సమాధానం చెప్పారు అందులో విద్యను మొదటిగా పేర్కొనటం గమనింపదగిన విషయం. ఆ విద్యవలన తక్కిన వన్నీ క్రమంగా పొందటానికి అవకాశం ఉంటుందని దీనివల్ల తెలుస్తోంది.

మనం పరిసరాల నుండే విజ్ఞానాన్ని సంపాదించు కోగల్గటం పుట్టకతో వచ్చే విద్య. ఈ ప్రకృతే మనకు పరమ గురువు. తల్లి. తండ్రి, సోదరులు తక్కిన కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగువారు, సహచరులు, స్నేహితులు అందుకు దోహదం జేస్తారు. గురువు అతనిలో ఉన్న శక్తి సామర్థ్యాలు వెలికి తీసి, ప్రకాశింప జేయటానికి సాధన మవుతాడు.

విద్యను అర్థించే (కోరే) వాడు విద్యార్థి. తమ అభిరుచిని బట్టి ఆయా విద్యలలో దిట్టలైన గురువుల వద్ద చేరి ఆ విజ్ఞానాన్ని సంపాదించటం కోసం ప్రయత్నం చేస్తారు. విద్యాభ్యాస సందర్భంలో ఆ గురువులు చెప్పింది శ్రద్ధగా విని, పాటిస్తే సుశిక్షితులవు తారు సమాజంలో వారికి మిక్కిలి గౌరవం లభిస్తుంది.

'గు' అంటే అంధకారమనీ, 'రు' అంటే దాన్ని నిరోధించేవాడనీ అర్థం చెప్పి అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి విజ్ఞాన జ్యోతిని ప్రకాశింప జేసే వాడని 'గురు' శబ్దానికి చక్కని నిర్వచనం చేశారు.

"గుకార స్త్వంధ కారస్య, రుకార స్తన్నిరోధకః ।
అంధకార నిరోధి త్వా ద్గురు రిత్య భిధీయతే॥

ఈ విధంగా సమాజంలో గురువుకు అత్యున్నత స్థానం కల్పింప బడింది.

పూర్వం గురుకులాలుండేవి రాజులే వాటిని పోషించేవారు. అచట గురువులకు కులపతులని పేరు. ఎక్కువగా శిష్యులక్కడికేవెళ్ళి విద్య నభ్యసించేవారు. తల్లి దండ్రులను మరపించే టంతటి వాత్సల్యంతో గురుపత్ని, గురువుగారు కలసి ఆ విద్యార్థులను ఆదరించే వారు. అభిమానంతో విజ్ఞానాన్ని అందించేవారు. ఈ గురు శిష్యుల మధ్య జరిగే సంప్రదాయ విద్యాభ్యాసాన్ని 'శైక్షికోపాధ్యాయ వృత్తి' అంటారు.

అట్టి గురు శబ్దమీనాడు వ్యవహారంలో అధికంగా ప్రయోగింపబడు చున్నప్పటికి (హోటల్ సర్వర్, రిక్షా కార్మికుడు మొ॥) దాని అర్థమే పూర్తిగా మారిపోయింది. అయినా అతడు (గురువు) తన విధి నిర్వహణ సక్రమంగా చేస్తున్నంత కాలం అతని విశిష్టత కెన్నడూ భంగం రాదు. 'గురు' శబ్దానికి గల పవిత్రత ఎన్నడు తరుగదు సరికదా! అతడెప్పుడూ పూజ్యుడే అవుతాడు. అంతే కాదు అతడొక సంచార గ్రంథాలయంగా పేరు ప్రఖ్యాతులు పొందుతాడు. నీతికి, నియమానికి నిలయుడై, మంచికి మానవతకూ మారుపేరుగా మసలుతాడు. ఆధునిక యుగంలో 'బ్రతుకలేక బడిపంతులు' వి అతణ్ణి వృత్తిరీత్యా కొందరు నిందించినా, బ్రతుకు తెరువు చూపించే వాడు బడిపంతులని అర్థం చేసుకొన్న సహృదయులు లేకపోలేదు

మనస్సు, వాక్కు, కర్మ ఈ మూడింటిని త్రికరణములు అంటారు. ఆ త్రికరణ శుద్ధితో తమను అర్థించే విద్యార్థులకు తమ విజ్ఞాన సర్వస్వాన్ని పంచిపెట్ట గల ఉదార చరితులు గురువులు. జాతిని (భావిపౌరులను) నీతి పరులుగా తీర్చి దిద్ది ప్రగతి పథంలో నడపగల నేతలని కూడా వారు కీర్తింప బడ్డారు. వ్యాసుడు పరమ గురువు. అతని పేరుతో విద్యాపీఠము లెన్నో వెలసినవి. సమర్థ రామదాసు వంటి నిస్వార్థపరులైన గురువులు లభించినప్పుడు శివాజీ వంటి ధీరులు, వీరులు అయిన శిష్యులు తయారై దేశ సౌభాగ్యాన్ని సుసంపన్నం చేయ గలుగుతారు. కన్నతల్లి (జిజియా) కనిన కలలు సఫలం చేసి ధన్యతములై జన్మ సార్థకం చేసుకుంటారు.

గురువులకు వీరిని అమాస్తే అదొక తృప్తి. అందుకే ఇంతకు ముందు మనదేశ రాష్ట్రపతిగా బాధ్యత నిర్వహించిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఉపాధ్యాయునిగా ఉండటంలో తమ కెంతో సంతృప్తి ఉందని ప్రకటించారు. ఆ వృత్తి యెడ వారికి గల గౌరవ మట్టిది. మొదట్లో వారు ఉపాధ్యాయులు గానే ఉండి, విధి నిర్వహణలో ఎంతో గొప్ప పేరు ప్రతిష్ఠలు, సంపాదించుకొని ఆ వృత్తికే గౌరవం కల్పించారు. విద్యార్థి సద్గురువుకోసం యత్నించినట్లే, గురువు కూడా మంచి శిష్యుని కోసం అన్వేషిస్తూ ఉంటాడు.

స్వాతి చినుకు ముత్యపు చిప్పలో పడి మంచి ముత్యమయినట్లు, మంచి శిష్యునకు ప్రసాదించిన విద్య కోరిన కోరికలిచ్చే కల్పలత వలె అభివృద్ధి చెందుతుందని "శాంకర ప్రశ్నోత్తర మాలిక" చెప్తోంది.

కా కల్పలతా లోకే? సచ్ఛిష్యాయార్పితా విద్యా"

ఈ విద్యాభ్యాసం మూడు విధాలుగా కొనసాగుతుందని పెద్దలు చెప్పారు. 1] గురు శుశ్రూష చేసి విద్య నభ్యసించటం. గురువులను సేవించి వారి అనుగ్రహానికి పాత్రులై విద్యను పొందటం [లోకంలో శిల్పము చిత్రము, నాట్యము, సాహిత్యము సంగీతము, గృహనిర్మాణము, క్రీడలు, బంగారపుపని, మోటారు వాహనములు, విద్యుత్పరికరములు ఈ విధంగా అనేక రకాలైన విద్యలలో అనుక్షణం గురువులను అనుసరించి మెలకువలను తెలుసుకోవలసిన అవసరం ఉంది.] ఆ విధంగా చేస్తే శిష్యులు ఆయా విద్యలలో పరిపూర్ణు లవుతారు. 2] పుష్కలమైన ధనాన్ని సమర్పించి విద్య నేర్చుకోవటం, రాజులు, జమీందారులు, సంపన్నులు అయిన వారి వ్యవస్థలో గురువులకు కావలసినంత ధనమిచ్చి, పోషించి వారిచే తము కోరుకున్న విద్యను చెప్పించుకోవటం. అప్పుడు గురు శిష్యులిద్దరికి శ్రద్ధ ఉంటుంది 3] తనకు వచ్చిన విద్య నిచ్చి ఇతరులవద్ద తనకు కావల్సిన విద్యను గ్రహించటం. భారతంలో ఋతుపర్ణ మహారాజు తనకు తెలిసిన అక్షహృదయ మనే విద్య నలమహారాజు కిచ్చి ఆతనికి తెలిసిన 'అశ్వహృదయము'ను గ్రహించటం ఇందుకు ఉదాహరణం. నిత్య వ్యవహారంలో (స్త్రీ, పురుషులు సాంకేతిక విజ్ఞానం. పిండివంటలు చేయటం, చేతిపనులు, కుట్టుపనులు, అల్లికలు, ముగ్గులు మొదలైనవి నేర్చుకోవటం) అనేక విషయాలలో ఈ సంప్రదాయం పాటించటం గమనించగలం. అటువంటిచోట అరమరికలకు అవకాశమే ఉండదు. పైన చెప్పిన మూడు పద్ధతులు కాక మఱియొక రకంగా విద్య నభ్యసించే విధానం లేనే లేదు.

ఈ నాటి విద్యావిధానం పై మూడు పద్ధతులలో దేనికీ చెందింది కాక పోవటం చేత గురుశిష్యుల చిత్త శుద్ధికి లోపం ఏర్పడి, రోత పుట్టించి, అది పనికిమాలింది, విలువ లేందిగా సమాజంలోని అన్ని వర్గాలవారిచేత నిందింప బడుతోంది. విద్యా గంధంలేని కొందరి పెత్తనం, రాజకీయంగా కొందరి ప్రమేయం, ధన మదాంధులైన మఱి కొందరి వినోదం. విలాసం కారణంగా నేటి విద్యారంగం పూర్తిగా దెబ్బ తింటోంది. దాని దుష్ఫలితాలను సర్వత్రా మనం చవి చూస్తూనే ఉన్నాం.

ఈ ఊరికి ఆ ఊరెంత దూరమో, ఆ ఊరికి ఈ ఊరూ అంతే దూరం. కాబట్టే గురువులను అనుసరించి శిష్యులు, శిష్యుల ననుసరించి గురువులు తమ తమ

నడవడిలో అవిధేయత, వంచనా విధానాలకు అలవాటు పడ్డారు. ఆ కారణంగా విద్య నిర్లక్ష్యం చేయబడి ఇప్పుడొక కృత్రిమ వాతావరణం అంతటా, అన్నిటా ప్రత్యక్ష మవుతోంది. వినయ సంపన్నులైన విద్యార్థులు కరువైనట్లే, హృదయం విప్పి విద్య చెప్పే గురువులూ అరుదయ్యారు. అందుకే ఒక కవి "లోకంలో (విత్తాపహారకులైన) డబ్బు తీసు కొనే వారెందరో ఉన్నా, శిష్యుని (హృత్తాపహారియైన) హృదయంలోని సందేహాలను తొలగించే గురువు మాత్రం దొరకటం దుర్లభం అంటాడు.

"గురవో బహవ స్సంతి. శిష్య విత్తాప హారకః !
దుర్లభోఽయం సముద్రోహి, శిష్య హృత్తాపహారకః !!
ఎందరెందరు గురువు లీయిలను లేరు?
శిష్య విత్తాప హారులై వెలుగువారు
అర్య గృహ్యాడాబార్యు(డయ్యత డొకండె
శిష్య హృత్తాప హారియై వెలుగు వాడు.

గురుశిష్యుల కర్తవ్య నిర్వహణములలో ఏ విధమైన తప్పు ఏ ఒక్కరు చేసినా ఆ (జాతి) సమూహానికి మొత్తానికి ఆ మచ్చరావటం అనుభవంలో ఉన్నదే కదా! బుద్ధి గడ్డి తిని ఎక్కడో ఒక ఉపాధ్యాయుడు డబ్బుకు, కక్కుర్తి పడి అదనపు మార్కులు వేసి ఒక విద్యార్థిని పరీక్షలో నెగ్గిస్తే అది ఉపాధ్యాయ వర్గాని కంతకి వర్తించేలా లోకం నిందిస్తుంది "ప్రల్లదుడైన యొక్క కులపాంసను చేసిన దాన తత్కులం బెల్లను దూషితం బగుట" అపూర్వం ఏమీకాదని భారతం చెప్పే పరమార్థం. సజాతీయమైన సముదాయాన్ని కులమని లోకంలో వ్యవహరించటం కద్దు. గోకులం, అలికులం ఇందుకు ఉదాహరణం. ఒక్కరి దుశ్శీలం కారణంగా దుర్యోధనశతం. కీచక శతకం వినాశనం చెందిన విధం తెలిసిందే కదా!

ఒక కారు, రైలు, విమానం మొదలైన వాహనాలు పడిపోతే, లేక ప్రకృతి ఉపద్రవాలు సంభవిస్తే కలిగే ప్రమాదం పరిమితమే. మరి ఉపాధ్యాయుడు కాదగని వాడు ఒకడు ఉపాధ్యాయుడైతే మాత్రం జరిగే నష్టం ఇంతింతని చెప్పనలవికాదు. జాతిలో కొన్ని తరముల వరకు ఆ దుష్టుని ప్రభావం ఉంటుంది. స్వభావం తెలియకుండా, అర్హత గుర్తించకుండా వృత్తి, ఉద్యోగాలు కల్పించే ప్రస్తుత ప్రభుత్వ విధానం వల్ల వచ్చే అనర్థాలలో ఇది ఒకటి.

శ్రీమద్రామాయణ కావ్య రచనకు పూర్వరంగగా ఏర్పడిన నారద, వాల్మీకుల సమాగమం కూడా ఈ గురు శిష్య సంప్రదాయాన్ని చక్కగా వాటి చెప్తోంది.

ఆ సందర్భంలో తపస్వి వాల్మీకి. తపస్స్వాధ్యాయ నిరతుడైన నారదుణ్ణి, ఈ లోకంలో పురుషోత్తము డెవ్వరో తెల్పుమని అర్థించాడు

తపస్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాం వరం !
నారదం పరి పప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్ !!

ఇక్కడ అడిగి నాడనుటకు "పరిపప్రచ్ఛ" అను క్రియా పదము ప్రయోగింపబడినది. అ అర్థమున 'పప్రచ్ఛ' అనిన చాలును. మరి అట్లనుటలో అతని శ్రద్ధా సక్తులు విశేషముగా వెల్లడి అవుతున్నాయి. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అట్టి శ్రద్ధ గలవాడే జ్ఞానమును పొందుచున్నాడు. తెలివి ఎంత ఉన్నా, శ్రద్ధాసక్తులు లేనప్పుడు ప్రయోజనం లేదు. ఆ రెండు ఉన్నప్పుడు అందుకు తగిన పరిశ్రమయే కార్య సాధనమును చేకూర్చును. ఇంక నపట విశేషమైన తెలివితో పనిలేదు.

అస్థా స్వాస్థా యదిస్యాతాం. మేధయా కిం ప్రయోజనమ్ !
తావుభౌయది నస్యాతాం. మేధయా కిం ప్రయోజనమ్ !!

విద్యను కోరు కొను వారికిది విశేషించి ఉండవలసిన ముఖ్య లక్షణం.

వాల్మీకి శ్రద్ధతో ఆ విషయం అడిగి సమాధానం వినాలని తాను కుతూహలపడు చున్నట్లు మళ్ళీ ఇట్లా విన్నవించాడు.

"ఏత దిచ్ఛా మ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే"

'పరి పప్రచ్ఛ' అన్న క్రియాపదంలో ఉన్న స్వారస్యం ఇక్కడ వివరింపబడింది. ఈ విధంగా వాల్మీకి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాడు.

సత్యాన్వేషణలో 'తపస్వి' వాల్మీకికి కలిగిన సందేహం నివృత్తి కావటానికి సమాధానం చెప్పిన నారదుడు 'తపస్సంపన్నుడే' కాదు స్వాధ్యాయనిరతుడు' కూడా అవటం విశేషం అంటే అతడు నిరంతర వేదాధ్యయన శీలుడన్నమాట, విద్యా వ్యవసాయంలో అట్టి నిత్య కృషీవలుడు మాత్రమే మంచి ఫలితాలను పొందగలుగుతాడు లోకంలో అతడే సర్వోత్తముడై రాణిస్తాడు. అందుకే 'నిత్యం అధ్యయనం మానవద్దని' (స్వాధ్యాయాన్మా ప్రమదః తవ్యమ్) ఉపనిషద్వాణి శాసించింది. ఈ సందర్భం 'ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి' అన్న సత్యాన్ని నిరూపిస్తోంది.

విషయం (Subject) ఎంత బాగా తెలిసిన వాడైనా ప్రతి నిత్యం పాఠం చూచుకొని (Preparation) ప్రవచనం చెయ్యటం ఉపాధ్యాయుని ధర్మం,

ఆ కృషి మనిషిని ఋషిగా చేస్తుంది. అప్పుడు అతడు వాగ్విదాం వరుడుగా (గొప్ప విద్యావేత్తగా) కీర్తింప బడతాడు. ఆ సామర్థ్యం ఇతరులకు అతనియెడ విశ్వాసం కలిగించేదిగా పరిణమిస్తుంది,

అందువల్లే వాగ్విదాం వరుడైన నారదుని వాల్మీకి "ఓ మహర్షీ! ఈ సుగుణ సంపదగల పురుషోత్తముని గూర్చి తెలుసుకో గల సమర్థుడవు నీవే"

"మహర్షే! త్వం సమర్థో ఒ సి, జ్ఞాతుమేవం విధం నరమ్" అని విశ్వాసంతో అర్థించాడు. ఈ సన్నివేశం గురువుల విషయంలో శిష్యులకు ఉండదగిన నమ్మకాన్ని గూర్చి తెలియ జేస్తోంది. అది ఎప్పుడూ వమ్ము కాకుండా చూసు కోవాల్సిన బాధ్యత గురువులదే. త్రిలోకజ్ఞుడైన నారదు డందుకు అన్ని విధాలా తగినవాడు కాబట్టే గురు పీఠాన్ని అధిష్టించి పరమ స్తుత్యుడైనాడు.

ఎన్నోఏళ్ళ అనుభవం ఉన్నా, నిత్యంచెప్పే విషయమే అయినా పాఠం అసలు చూడక పోవటం వలనకానీ. చూచినా. ఒక్కొక్కప్పుడు ఆ! చిన్నదే కదా! అని నిర్లక్ష్యం చేయటం వలన గానీ. ఎవరైనా, ఏదైనా అడిగితే చెప్పలేక పోతానా? అనే అధికమైన ఆత్మ విశ్వాసం (Over Confidence) ఏర్పరచు కోవటంచేత కానీక్లాసులో సమాధానంచెప్పే నిబ్బరంలేక. నిగ్రహం కోల్పోయి, పుస్తకంచూసి, పెద్దలతో విచారించి. తర్వాత చెప్తానేమాట అంటానికి అభిమానం అడ్డొచ్చి, సమన్వయం చేసుకొనే సహృదయత నశించి చేసేదిలేక "శేషం కోపేన పూరయేత్" అన్నట్లు కోపంతో "వాల్చాలే నీవు. నీ చొప్పదంటు ప్రశ్న"లని మందలించి మరెప్పుడైనా ఇట్లా అడిగావంటే నిన్నేం చేస్తానో? జాగ్రత్త" అని హెచ్చరించి కొందరు తమ అసమర్థ దుర్జనత్వాన్ని ప్రదర్శించటం లోకంలో కద్దు! ఈ విధంగా జరిగినప్పుడు విద్యార్థి నిరుత్సాహపడి నీరు కారిపోతాడు. భయంతో తిరిగి అడగటం మానుకుంటాడు. అంతటితో అతని ఆలోచనా జగతిలో ప్రగతి కుంటుపడుతుంది

గురువులైన నారదులవారు కొంచెం కష్టమైనా శిష్యుడు వాల్మీకి సందేహాన్ని తీర్చే చక్కటి సమాధానం వినమని చెప్పటానికి సంతోషంతో ముందుకు వచ్చారు.

"శ్రుత్వా చైత త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదోవచః !
శ్రూయతా మితి చామంత్ర్యా ప్రహృష్టో వాక్య మబ్రవీత్" !!

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః !
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః" !!

ఆ విధంగా అన్య దుర్లభములైన ఆ సుగుణ సంపద కలిగిన రాముని చరిత్ర చెప్పిన నారదుడు ఒక్క వాల్మీకి కే కాదు వాఙ్మయ జగత్తుకే పరమ గురువుగా ఆరాధ్యుడైనాడు, అసలు నారదుడంటేనే (నారందదాతీతి నారదః) జ్ఞానాన్ని ప్రసాదించేవాడని అర్థం. ఈ విధంగా కూడా నారదుడు అన్వర్థ సంజ్ఞ కలిగిన గురువుగా సంభావింప బడుతున్నాడు. ఆ దివ్య సందేశం లోకానికి కందింప చేయటం కోసం వాల్మీకి తాను సందేహం వెలిబుచ్చి. సమాధానంగా నారదుడు చెప్పినదాన్ని బుద్ధిగా విని, విపులమైన రామాయణంగా రచించి, సాహిత్య ప్రపంచానికే అభివంద నీయుడైనాడు.

ఈ సంఘటన సమీక్షించు కొన్నప్పుడు గురు. శిష్యులు వారి వారి మర్యాద (హద్దు) లెరిగి కర్తవ్య పరాయణు లగుట కెంతగానో ఉపకరిస్తుంది, 'ఉత్తమోత్తమ గురుల శిష్యుండనైతి, గురువు నయ్యెద నచ్ఛివ్య కోటి కెపుడు' అన్నది వారికి ప్రధాన లక్ష్యంగా పరిణమిస్తుంది.

అట్లాగే రామాయణంలో రాముడు బాల్యంలో వశిష్టుని వద్ద విద్యా బుద్ధులు నేర్చుకొని సత్య పరాక్రముడై. తండ్రి అనతి తలదాల్చి విశ్వామిత్ర యాగ సంరక్షణకు ఆ మునితో బయలుదేరుతాడు మార్గ మధ్యంలో తపోనిధి, శిష్యగణములకు పెన్నిధి అయిన ఆ గురు సన్నిధిలో సకల శస్త్రాస్త్రములతో బాటు సర్వ శక్తులు సంపాదించాడు, అవకాశం ఏర్పడి నప్పుడెల్లా గంగావతరణాది పెక్కు చారిత్రక విశేషాలు. ఎందరో మహాత్ముల, తపో, విద్యా, బలవైభవ ప్రాభవాలను, సత్య. ధర్మ దయా, సౌశీల్యాది గుణ గణాలను గూర్చి అడిగి తెలుసు కున్నాడు. వినయంతో గురువు ననుసరించి విజ్ఞాన సముపార్జన చేయటంలోనూ అడుగడుగునా ఆజ్ఞాబద్ధుడై, అతడు ప్రవర్తించుచు గురు కార్యమును నిర్వహించిన తీరులోను శిష్య సంతతికి తమ వడవడిని తీర్చి దిద్దు కొనుటలో ఒరవడిని గూర్చు చున్నది,

హనుమంతుడు సూర్యుని కడ విద్య నభ్యసించి గొప్ప విద్యావేత్తగా పేరు పొందాడు. తొలి పరిచయం లోనే అతని వాక్చాతుర్యాన్ని. విద్యా విశేషాన్ని రాముడే స్వయంగా ప్రశంసించాడు. ఆ గురు శిష్యుల విషయం ఇక్కడ ముచ్చటించు కోవటం సందర్భ సుందరమే అని ఉదహరిస్తున్నాను.

హనుమంతు చిన్న తనంలో సూర్యుని పండుగా భావించి ఆకలితో మ్రింగబోయాడు. రాహువు ప్రేరణ కారణంగా ఇంద్రు డాతనిని వజ్రాయుధంతో కొట్టాడు. దాంతో హనుమంతుడు మూర్ఛిల్లాడు. వాయువు తన తనయునకు కలిగిన ఆపదకు బాధ పడి, కోపంతో లోకములనుండి తనశక్తి ఉప సంహరించుకొని హనుమంతునితో సహా. ఒక కొండ గుహలో చేరాడు. వాయువు లేకపోవటంతో లోకములన్నీ

నిశ్చేష్టితము లైనాయి ప్రాణులెల్ల గగ్గోలు పడ్డాయి ఋషులు మునులు, దేవతలు కూడ బలుక్కుని. బ్రహ్మతో గూడి వాయువు కడకు పోయి ప్రార్థించారు.

బ్రహ్మ మారుతికి చిరంజీవిగా వరం ప్రసాదించి వాయువునకు సంతోషం చేకూర్చాడు. తక్కిన దేవతలు కూడా వారి వారి శక్తులను హనుమంతునికి వరాలుగా ఇచ్చారు. అందులో సూర్యుడు హనుమంతునకు కావాలన్నప్పుడు విద్యలభ్యసింప జేస్తానన్నాడు. ఊహ తెల్సిన తర్వాత చదువుకోవాలన్న కోరిక కలిగి హనుమంతుడు గమన వేగంతో ముందుకు పోతున్న సూర్యునికి అభిముఖంగా ఉండి (ఎదురుగా ఉండి) వెనక్కి వెనక్కి వెళ్తూ విద్య అభ్యసించి అతని ప్రియశిష్యుడైనాడు చెప్పింది శ్రద్ధగా విని. చక్కగా చదువుకొనే బుద్ధిమంతులైన శిష్యులంటే గురువు లభిమానించటం లోకంలో సహజం కదా!

ఈ ఘట్టం "శ్రీరామకథామృతం"లో పరమ రమణీయంగా వర్ణింప బడింది.

"దేవ! యనుగ్రహింపవలె దేవర మున్ సెలవిచ్చినట్టు లా
యా వివిధా గమంబు లితిహాస పురాణ ముఖాళి ళాంగముల్
కావలెనంచు వచ్చితి నికామదయా! జననంబు సార్థకం
బై వెలుగొంద జేయు మనయంబున యజ్ఞుని నన్ను విజ్ఞుగాన్."

బాహ్యా మాంతరమైన సర్వంబు తమము
నాహ రించెడు దొరవంచు నాశ్రయించి
నాడ సత్య ప్రతిష్ఠితా! నాటి మాట
సూటి మది నెంచి నన్నేల జూడ మయ్య!"

అని శ్రేయోర్థి యగు విద్యార్థి తన్నర్థిమెయి నర్థించిన కారణంగా భాస్కరుడనుగ్రహించి అతనిని అన్ని విద్యల్లోను ప్రవీణునిగా చేశాడు.

'తమ' మనగా చీకటి, అంతర తమమనగా అజ్ఞానము. సూర్యుడు 'బాహ్యామాంతరమైన తమము నాహరించెడు దొర.' అంతే కాదు యోగులాతడు శారీరక దోషముల హరింపటంతో బాటు విశుద్ధి చక్రమును శుద్ధి చేయునని వివరించు చున్నారు అతడు సత్య ప్రతిష్ఠితుడు. (సత్యే ప్రతిష్ఠితమ్) అని శ్రుతి అతనినిగూర్చి చెప్పుచున్నది కావుననే హనుమంతుడు 'ఉత్కృష్ట మగు భక్తి యోగమున' ఆ గురువు నాశ్రయించాడు. 'నికామ దయతో' అతడు బోధింపగా అనయజ్ఞుడైన (నీతి తెలియని) ఆశిష్యుడు విజ్ఞుడైనాడు. ఆ విధంగా అతడు తన జననం సార్థకం చేసుకొన్నాడు

అంటే విద్యవలన అజ్ఞానం నశించి, విజ్ఞానం లభించటం ద్వారా జన్మ సార్థకమవుతుందని తెలుస్తోంది. ఆగమములు, ఇతిహాసములు, పురాణములు మొదలైనవి భారతీయ సంస్కృతికి మూలము లైన వేద వేదాంగముల లోని జ్ఞాన, విజ్ఞాన సంపదలను వివరించి ప్రపంచానికి పంచిపెట్ట గలవన్న సత్యం ఇక్కడ చెప్పబడింది. ఎటువంటి విద్య 'విద్య' అవుతుందో కూడా నిర్వచింప బడుతోంది. ['సావిద్యాయా విముక్తయే, పరమార్థ సాధనీ విద్యా' అను వానివలన పరమార్థమైన ముక్తి సాధన మగు విద్యయే విద్య అన్నది భారతీయుల దృష్టిగా అర్థమవుతుంది. తక్కినవి లౌకిక విద్యలు మాత్రమే అవుతాయి]

ఇన్ని కష్టములకు ఓర్చికొని కూడా విద్య నభ్యసించిన హనుమంతుడు విద్యార్థితతి కగ్ర గణ్యుడు. శిష్య వత్సలుడై, కర్తవ్య నిష్ఠుడైన సూర్యు డుత్త మోపాధ్యాయ వర్గ ప్రతినిధి. ఇట్టి సంప్రదాయములను ఎన్నింటినో రామాయణం వివరిస్తోంది

ఓం సహనా వవతు, సహనౌభున క్తు, సహ వీర్యం కర వావహై తేజస్వి నావధీతమస్తు, మా విద్విషావహై॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

విద్య

"విదంతి అనయా విద్యా" అన్న వ్యుత్పత్తిని బట్టి (జ్ఞానం) తెలుసుకోవటానికి సాధనమైంది 'విద్య' అని తెలుస్తోంది. లోకంలో ఏదైనా ఒక విషయాన్ని గూర్చి తగిన పరిజ్ఞానం ఏర్పరచుకోవటాన్ని విద్యాభ్యాస మంటారు. భాష అందుకు ఉపకరిస్తుంది. దానివల్ల సదవగాహన ఏర్పడుతుంది.

ఈ విద్య ప్రధానంగా రెండు రకాలు. 1. లౌకికము, 2. అలౌకికము. ఇందులో లౌకిక విద్యలనేకం. అవి ప్రకృతిగుణ ధర్మాల్ని వివరించి, వివరించి భౌతికంగా మానవుని సుఖ జీవనానికి ఆధారమై ప్రాణికోటి మనుగడకు దోహదం చేసేవిగా ఉంటాయి, ఈ విధమైన విద్యలకు వినోదం, విలాసం ప్రయోజనాలుగా కనబడుతున్నాయి. పరస్పర సహకారంతో సాంఘిక జీవనానికి తోడ్పడుతూ జనం జాతిగా బ్రతకటానికి ఈ విద్యలు తగిన అవకాశం కల్పిస్తున్నాయి. మనం తినే తిండి కట్టే బట్ట మొదలైన వాని వెనుక ఎంతో కృషి. ఎందరో శ్రమజీవుల శక్తి దర్శనమిస్తుంది. వీనినే మానవుడు సాధించిన ప్రకృతి విజయాలుగా (సైన్సు) అభివర్ణించటం కద్దు. విద్యుచ్ఛక్తి, దూరదర్శిని, దూరశ్రవణ యంత్రాలు వంటివి అందుకు విశేష నిదర్శనాలుగా పరిగణింపవచ్చు పరిశీలించిన కొలది అద్భుతం కలిగించే విషయాలెన్నో ప్రకృతిలో కనుగొన గల్గటం విశేషం, అనంతమైన ఆ విజ్ఞాన శాస్త్రంలో నిత్య నూతన సత్యాలు నిరూపించ బడటం ఆ శాస్త్రజ్ఞులకు అనుభవం,

ఈ పంచభూతాలకు ఆధారమైన చైతన్యాన్ని అన్వేషిస్తూ తానెవరో? తన గమ్యమేమిటో? సృష్టి యొక్క పరమార్థం ఏమిటో? అందుకు మూలం ఏదో? తెలియటానికి ఉపకరించే విద్య అలౌకిక విద్య. అదే బ్రహ్మ విద్య అంటారు. విజ్ఞానం వికాసం దాని ప్రయోజనాలుగా భావింపబడుతున్నాయి. ఖండ ఖండంగా జగత్తంతా నిండిఉన్న చైతన్యం తన భిన్నత్వాన్ని (ఉపాధిభేదాన్ని) విడవి అఖండంగా రూపొందటమే పరమాశయంగా కలది ముక్తి. అంటే జీవశక్తి విశ్వశక్తితో మేళవించి, వ్యష్టి నుండి సమిష్టికి పయనిస్తూ ఆధ్యాత్మిక భావాన్ని వృద్ధి పొందించట మన్నమాట. ఆ పరమ పద సోపాన పథం సూచించేది అలౌకిక విద్య. ప్రపంచంలో లౌకిక విద్య అందరికి అవసరం, అలౌకిక విద్యల మీద (తత్త్వ, తపో. యోగములు) అభిమానం కొందరికి మాత్రం మెండు. అది వారి వారి సంస్కారాన్ని బట్టి ఏర్పడుతుంది. అందులోను కొందరే యోగసిద్ధి పొంద గలుగుతారు.

విద్యకు సారం వివేకం. దీన్నేజ్ఞాన మంటారు, ఇది చేయవచ్చు, ఇది చేయరాదు అనే విషయం ఆలోచించి నిర్ణయించు కొనే శక్తి (విచక్షణ) కలగడం దానికి ఫలం. భాగవతంలో ప్రహ్లాదుని విద్యాభ్యాస ఘట్టంలో విద్యకు ప్రయోజనం సదసద్వివేక చతురత అనే చెప్పబడింది.

> చదువని వాడజ్ఞుం డగు
> చదివిన సదసద్వివేక చతురత కలుగున్
> చదువంగ వలయును జనులకు
> జది వించెద నార్యులొద్ద జదువుము తండ్రీ.

భా. 7 వస్కం, 130 ప.

భాస్కర శతక కర్త కూడా వివేకం (రసజ్ఞత) లేనప్పుడు ఎంత చదువు చదివినా నిరర్థకమని నిరూపించారు,

> చదువది ఎంత కల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
> చదువు నిరర్థకంబు; గుణ సంయుతు లెవ్వరు మెచ్చరెచ్చటన్,
> పదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం
> పొదవెడు నుప్పులేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా !

తినటం. కనటం మొదలైనవి ప్రాణులన్నింటికీ సమానమే అయినా మానవులకు జ్ఞానమొక్కటే అధికమని, ఆ జ్ఞానం లేనినాడు మానవుడు పశుతుల్యుడవుతాడని పెద్దలు చెప్పారు. 1, భర్తృహరి కూడా (విద్యా విహీనః పశుః) 'విద్యలేని వాడు వింత పశువు' అనడంలో ఈ పరమార్థమే ఇమిడి ఉంది

విద్య వలన వినయం, వినయం వలన యోగ్యత, (పాత్రత) యోగ్యత వలన ధనం, ధనం వలన ధర్మం, ధర్మం వలన సుఖం క్రమంగా సిద్ధిస్తాయని విద్యయొక్క పరమ ప్రయోజనాన్ని వివరించారు.

> విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం !
> పాత్రత్వాద్ధన మాప్నోతి, ధనాద్ధర్మం తత స్సుఖమ్ !!

ఇట్టి విద్య లోకహితాన్ని కోరేదిగా ఉండాలి. లేకపోతే సామాజిక ఉపద్రవాలు తప్పవు. సమాజంలో నేడు కొందరు విద్యా, ధన, యౌవన, అభిజాత్య [కుల] బలగర్వములతో క్రొవ్వి, జాతికి, సంస్కృతికి దేశానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా

---

1) ఆహార నిద్రా భయమైథునాని, సమానమే తత్పశుభి ర్నరాణాం !
జ్ఞానం హితేషా మధికో విశేషః జ్ఞానేన హీనాః పశుభిస్సమానాః !!

విద్రోహక చర్యలనేకం తలపెట్టి నానా బీభత్సాన్ని సృష్టించటం చూస్తున్నాం. వివిధ వార్తాపత్రికల ద్వారా అనేకం వింటున్నాం. పైన చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటైనా మద, మాత్సర్యాలను పుట్టించేవై వ్యక్తిగతంగానే కాకుండా సామూహికంగా కూడా పతనానికి దారితీసేవిగా పరిణమించటం చూస్తూనే ఉన్నాం. ఇక అన్నీ ఒక చోట చేరితే కలిగే అనర్థాన్ని గూర్చి వేరే చెప్పవలసింది ఏముంటుంది. అందునా ప్రత్యేకించి కొందరు స్వార్థంతో 'తా చెడ్డకోతి వనమెల్లా చెరిచినట్లు' సమాజ వాతావరణాన్ని కలుషితం చేయటం కద్దు. తాను ఊబిలో కూరుకు పోతూ ప్రక్కవాడు ఒడ్డున ఉండడం చూచి సహించలేనిది ఆ మనస్తత్వం. ఎదుటి వారిని పూర్తిగా ముంచితే కాని సంతోషం లేదా దుష్టిబుద్ధికి. విజ్ఞానం వెర్రితలలు వేస్తే ప్రాణికోటికే ముప్పు తప్పదు. లోకహిత నిష్ఠతో దాన్ని సమాజ అభ్యుదయానికి వినియోగించడం విజ్ఞుల కర్తవ్యం. సౌజన్యం అందుకు మూలం.

లోకానుగ్రహ కాంక్షతో రామ చరిత్రను వివరించిన వాల్మీకి మహర్షి రామాదుల విద్యాభ్యాస సందర్భాన్ని గూర్చి వర్ణిస్తూ దశరథ తనయులు వేదవేత్తలు, శూరులే కాక లోకహితము నందాసక్తి కలవారనీ, విశేషించి వారు జ్ఞాన సంపన్నులనీ సౌశీల్యాది గుణగరిష్ఠులనీ తెలియజేశాడు,

సర్వే వేదవిదశ్శూరాః సర్వే లోక హితేరతాః !
సర్వే జ్ఞానోప పన్నాస్తే, సర్వే సముదితా గుణాః !!

విద్యా వివేక సంపన్నులైన రామాదులు లోకహిత నిష్ఠులై ప్రవర్తించారనడం ఇక్కడ మనం గమనింప దగిన ముఖ్య విషయం, అదే ఈ ఘట్టంలో మహర్షి చెప్పదలచుకొన్న ప్రధానాంశం.

శౌర్యధనులైన రామాదులు విద్య వలన కలిగిన వివేకంతో ఉచితం, అనుచితం తెలుసుకొని ప్రవర్తిస్తూ తల్లి, తండ్రి, గురువు వంటి పెద్దల మాట మన్నిస్తూ, సాధులను, దీనులను పరిరక్షిస్తూ, దుష్టులను శిక్షిస్తూ, పతిత జన పావనత్వం కోసం పాటుపడూ, అసహాయులకు సహాయం చేసి, బలహీనులకు బలంచేకూర్చి, దిక్కులేని వారికి తామే దిక్కై వికృతులను పోగొట్టి, ప్రకృతిని కాపాడి ప్రజలను ధర్మంగా పరిపాలించి, ఆచరణం ద్వారా ఆదర్శం ప్రకటించి పుణ్య తమమైన పరోపకారం చేశారు. పరోపకారమే పుణ్యము పర పీడనమే పాపమని ప్రపంచ వాఙ్మయమందంతటా వివరింప బడుతోంది. దానినే ఒకకవి శ్లోకార్థంలో ఇలా తెలియ జేశాడు.

శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిభిః ।
పరోపకారః పుణ్యాయ. పాపాయ పరపీడనమ్ ।।

ధర్మమే జయిస్తుందనటానికి గుర్తుగా రాముడు దుష్ట రాక్షస సంహారం చేసి అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు, అతనిని అభినందించటానికి అగస్త్యుడు మొదలైన ఋషులు, సాధుజనులు, మునులు ఎందరో వచ్చి ఆ అభ్యుదయాన్ని మెచ్చుకొన్నారు.

"ఓ రామా! నీవుచేసిన రావణ సంహారం ఒక మహా యజ్ఞం. ఎదురులేని నీ బాణాలే అగ్ని అసురులే పశువులు, లోకాలన్నింటికి నీవు ప్రసాదించిన అభయమే దక్షిణ. త్యాగమగమయమైన ఈ యజ్ఞ భావనను పైశాచికత్వం పని కట్టుకొని పాడు చేసింది. ఇప్పుడు మళ్ళీ లోకంలో విరివిగా అభివృద్ధి చెందడానికి నీవే ఈ విధంగా మార్గదర్శకుడ వయ్యావు.

ఇమ్మహాక్రతు వొనరించి తెడరువాపి
తసుర పశువుల బాణాగ్ని యందువ్రేల్చి
తభయ దక్షిణ నొసగితి వందఱకును
వెలయుగాకింక జన్నముల్ వేనవేలు. శ్రీ.రా.క.,ఉ.కాం.

యజ్ఞం దేవతా ప్రీతికై చేయటం జరుగుతుంది. రాముడు చేసిన ఈ యజ్ఞ కర్మ వలన ఇంద్రాది దేవతలు సంతృప్తి చెందారు. రావణుని క్రౌర్యం వలన అట్టుడికి పోయిన లోకాలన్నింటికి సుఖ శాంతులు లభించాయి. ప్రాణులు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొన్నాయి. ప్రకృతి అంతటా చైతన్యం వెల్లివిరిసింది.

సత్య పరాక్రముడగు రాముడు తండ్రిమాట పాటించి విశ్వామిత్ర యాగం రక్షించే నిమిత్తం బయలుదేరి మార్గ మధ్యంలో దుర్జన స్వభావంతో పెచ్చు పెరిగి విచ్చల విడిగా తిరుగుతూ, సాధు జనులను బాధిస్తున్న అధర్మ స్వరూపిణి తాటకను

[వేదం సర్వ విద్యల సమాహారం. సకల కళల కది కాణాచి. అందలి విషయము లొక్కొక్కటి ప్రత్యేక విభాగమై అదియు శాఖోప శాఖితమై నేడు వివరింపబడూ వైజ్ఞానికంగా [సైన్సు] ప్రపంచంలో విస్తరిస్తూ విశేష ఖ్యాతి గడించటం పరిశోధనా పరంపరల వలన నిరూపితమైన సత్యం. అందులో భూగోళ, ఖగోళ, విషయాలే కాక స్థల. జల. జంతు వృక్ష. పక్షి. సంఘము లాదిగాగల సమస్త భూత జాతమును గూర్చిన అపారమైన విజ్ఞానం చెప్పబడింది. నేటి సైన్సు వేదప్రతిపాద్యములైన అనేక విశేషములను ప్రమాణీక రిస్తోందనటంలో అతిశయోక్తి లేదు]

సంహరించాడు. సిద్ధా శ్రమంలో మారీచ సుబాహుల మద మణిచాడు. అహల్యకు శాపవిమోచనం ప్రసాదించి పతితజన పావను డయ్యాడు. శివుని విల్లు విఱిచి వీర్య శుల్క యైన సీతను పరిగ్రహించాడు. పరశురాముని గర్వభంగం చేసి లోకైక వీరుడుగా పేరు పొందాడు. అయోధ్యలో పట్టాభిషేకం జరుగుతుం దన్నప్పుడు పొంగిపోలేదు. భగం ఏర్పడి నప్పుడు క్రుంగిపోనూలేదు. ఏరకమైన మనో వికారం లేకుండా, తండ్రికి అసత్య దోషం రాకుండా ఉండేందుకు, ధర్మబద్ధుడై వనవాసానికి వెళ్ళాడు. ఆ విధంగా అతడు ఋషివలె అర్థకాంక్ష జయించాడు. లోక రక్షణ అతని లక్ష్యంగా, అది తన ముఖ్య బాధ్యతగా స్వీకరించాడు.

నా ఽ హ మర్థ పరో దేవి। లోక మావస్తు ముత్సహే।
విద్ధిమాం ఋషిభి స్తుల్యం, కేవలం ధర్మ మాస్థితమ్ ।।

[20 - 19 - 2]

సాధు, ముని, జన పీడా పరాయణులైన రాక్షస సమూహాల్ని సంహరించి జగము నిష్కంటకము చేసాడు. అయోధ్యజేరి పట్టాభిషిక్తుడై ప్రజారంజకంగా పరిపాలన చేస్తూ క్రతు వ్రతములు నిర్వహించి ధర్మాచరణ కావించాడు. ఇది విద్యా వివేక సంపన్నుడైన అతని లోకహిత నిష్ఠకు నిదర్శనం.

ఈ నాడు ఆ విధమైన వివేకాన్ని ఇచ్చి ధర్మ వర్తనాన్ని ప్రోత్సహించే విద్య ఎంతైనా అవసరం. అట్టివారి విజ్ఞానం మాత్రమే దేశాభ్యున్నతికి ఎంతగానో దోహదం చేస్తుంది. శీల రహితుడు గుణ హీనుడు అయిన విద్యావంతుడు (అంటే కేవలం డిగ్రీలు మాత్రమే సంపాదించినవాడు) మణిచేత అలంకరింప బడిన సర్పం వలె భయంకరుడై దూరంగా త్యజింప దగినవాడే అవుతున్నాడు.

విద్యారంగంలోనే కాకుండా, వ్యావసాయక, పారిశ్రామిక, వ్యాపార, సైనిక, ప్రభుత్వ రంగాలలో కూడా సాధకులు ఔచిత్యంతో ప్రవర్తించే విద్యావంతులుగా ఉన్నప్పుడే ఆయా రంగాలు విజ్ఞాన వికాసాలతో అభివృద్ధి చెంది, దేశ స్వాతంత్ర సౌభాగ్యాలకు ఆలవాలమై విలసిల్లుతాయి.

నిరక్షరాస్యత నశించి ప్రజలు విద్యావంతు లవటం చేత కలిగే ప్రయోజనాన్ని (హక్కులు, బాధ్యతలు తెలుసుకొని మెలగటం వంటివి) వివరిస్తూ నేడు ప్రభుత్వం ప్రవేశ పెట్టి ప్రచారం చేస్తున్న నిర్బంధ, వయోజన విద్యా విధానాలు ప్రగతి సాధనకు ఉపయోగ పడతాయని అరించ టానికి అవకాశం ఉంది, ఆ ప్రణాళికలు అమలు చేయటానికి మనమంతా గట్టిగా తోడు పడాలి. దానివల్ల అంధ విశ్వాసంతో కూడిన

అస్పృశ్యత, అసమానత వంటి ఎన్నో సాంఘిక దురాచారాలు దూరమవుతాయి. పాశవికత, అమానుషత్వం నశిస్తాయి. నిజానికి మర్త్యునకు దివ్యత్వమే సిద్ధిస్తుంది, దివియే భువికి దిగి వస్తుంది.

విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము విద్య నెఱుంగని వాడు మర్త్యుడే.

[మూలం భర్తృహరి, ఆంధ్రానువాదం, ఏనుగు లక్ష్మణకవి.)

అట్టి విద్య లభించటానికి వేమన చక్కని మార్గం చెప్పాడు

ధాత్రధర్మ మెరిగి, చక్కని భక్తితో
గురుని సేవజేయ గుదిరినపుడె,
సర్వమర్మములును చక్కగా విడిపోవు
విశ్వదాభిరామ వినుర వేమ !

లక్ష్యశుద్ధి

'లక్ష్యము' అంటే గుర్తింప దగినది చూడదగినది అని అర్థం.

ప్రతి ప్రాణికి ఒక పరమార్థం సాధించాలని, ఒక ప్రయోజనం పొందాలని ఉంటుంది. బుద్ధిమంతుడు అందుకొక మంచి ప్రణాళిక నిర్ణయించు కొని అనుసరిస్తాడు. ఇటువంటి ఆలోచన గట్టిగా కలిగిన కొందరితో ఏ కొద్దిమందికో అనుకొన్నది సాధించే అవకాశం వస్తుంది. అట్టి అదృష్టవంతులు లోకంలో చాలా అరుదుగా ఉంటారు. జీవితంలో ప్రతిది ఒక కళ. ఉదాహరణకు వండటం కళ. వడ్డించటం మరొక కళ. ఇట్లాంటివి 64 కళలు.

అందులో చిత్రము, శిల్పము, నాట్యము' సంగీతము. సాహిత్యము అనేవి లలిత కళలుగా ప్రసిద్ధి కెక్కాయి. మిక్కిలి నేర్పుతో నిర్వహింప వలసినవి కనుక అవి లలితకళలన్నారు, వీటిల్లో ఒకదానికంటె ఒకటి విశిష్టంగా గౌరవింప బడుతున్నాయి. కళకు అంతం లేదు. కళారాధకులకు సర్వజ్ఞత్వము లేదు. అయితే సాధకునకు ఏదైనా ఒక లక్ష్యం లేనప్పుడు అవి సాధ్యపడవు.

అట్లాగే భారతీయ సంస్కృతికి మూలములన దగిన వేద వేదాంగాలైన విద్యలు 18. అందులో ధనుర్వేదం (విలువిద్య) కూడా ఒకటి. సమాజ రక్షణా బాధ్యత స్వీకరించిన కొందరు (రాజులు) పూర్వం ఈ విద్య నభ్యసించి ప్రజాక్షేమం కోసం పాటుపడేవారు. తమ పాలనలో ఎక్కడా ఆర్తి శబ్దము వినబడకుండా లోకాన్ని కాపాడేవారు. "క్షత్రియైర్ధార్యతే చాపః నార్త శబ్దో భవేదితి" అని రామాయణం చెబుతోంది. ఆ క్షత్రియ ధర్మాన్ని గూర్చి వివరిస్తోంది, రాముడు స్వధర్మ నిరతుడై, దుష్ట రాక్షస సంహారం చేసి రాజ శబ్దాన్ని అన్వర్థం చేసుకున్నాడు. స్వార్థాన్ని విడిచిపెట్టి బహుజన హితం, బహుజన సుఖం కోరుకున్నాడు. జీవితాంతం అందుకే పాటుపడ్డాడు.

విద్యాభ్యాస విషయంలో ఉండవలసిన లక్ష్యసిద్ధిని గూర్చి భారతేతిహాసం లోని ఒక సన్నివేశం ఈ సందర్భంగా ప్రస్తావించుకోవటం ఎంతైనా అవసరం,

అది హస్తినాపురం. అవి కురు పాండవులంతా కలసి ద్రోణుని వద్ద అస్త్ర విద్యాభ్యాసం చేసే రోజులు. ఒకనాడు పెద్దల సమక్షంలో కుమారులను పరీక్షించటంకోసం వారి విద్యాప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఆ బహిరంగ సభా ప్రాంగణంలో ఒక ప్రక్కన పెద్ద చెట్టొకటుంది. దానికి పెద్ద పెద్ద కొమ్మలు చాలా ఉన్నాయి, అందులో ఒక కొమ్మకు పక్షి బొమ్మ ఒకటి కట్టబడి వ్రేలాడుతోంది. ధర్మరాజాది పాండవులు దుర్యోధనాది కౌరవులు ఇంకా తక్కిన రాజకుమారు లెందరో ఆ ప్రదర్శనలో అభ్యర్థులుగా పాల్గొన్నారు. అప్పుడు ఆ పోటీలో ఉన్నవారందరి మనస్సులో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. తమ తమ ఆయుధాలతో వారంతా అక్కడ సిద్ధమయ్యారు.

గురువు ముందుగా ధర్మరాజుని పిలిచి ఇప్పుడు నీకేం కనబడుతోందని ప్రశ్నించారు. అందు కతడు సమాధానంగా చెట్టు. చెట్టు కొమ్మ, పక్షి. పక్షి శిరము వీటితో బాటు ఈ రాజలోకము, ఇందలి బంధు మిత్రులు ఇంకా మీరందరూ కనబడుతున్నారని చెప్పాడు.

అది విన్న ద్రోణాచార్యులవారు నీ దృష్టి చెదిరింది. నీవు ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీల్లే దన్నారు, తక్కిన వారంతా అదే విధమైన సమాధానం చెప్పి తమ అవకాశాల్ని కోల్పోయారు, లక్ష్యం పై మనస్సు నిలుపలేని వారికి ఎవరికైనా ఏవరికిదే గతి పడుతుంది.

ఇంతలో అర్జునుని వంతు వచ్చింది, ఆచార్యులవారు పిలిచి అతన్నీ అదే ప్రశ్న వేశారు. అతడు నాకు ఆ పక్షిశిరం ఒక్కటే తప్ప మరేమీ కనబడటం లేదన్నాడు. (1) తదేక భావనతో పలికిన అతని పలుకులకు మెచ్చుకొన్న ఆ గురువు (గుర్తు చెప్పినవాడు గురువు) శిష్యుని నిశిత నిశ్చల దృష్టికి సంతోషించి బాణ ప్రయోగానికి అనుమతించి ప్రోత్సహించాడు. అర్జునుడు అనాయసంగా దాన్ని ఖండించి, లోకానికి తన అస్త్ర విద్యా ప్రవీణత ప్రకటించాడు. సభ్యులంతా కృతార్థుడైన అతనిని కృతి, సుకృతి అని అభినందించారు. అది అర్జునుని సూక్ష్మేక్షణ కతకు నిదర్శనం. అందువల్లే అతడు ఆనాటి భారతంలో ఏకైక వీరుడయ్యాడు. ధనుర్విద్యలో తాను చేరదలచుకున్న ఉన్నత లక్ష్యానికి చేరువయ్యాడు. అతని జీవితం విద్యాభ్యాస విషయంలో మనకు ఆదర్శం కావాలి.

---

1. పక్షి శిరంబు దిరంబుగ. వీక్షించితి నొండుగాన నెద్దియు ననినన్
లక్షించియేయుమని సూక్ష్మేక్షణు ద్రోణుండు పనిచె నింద్రతనూజున్

[ఆది. ప. 5 ఆ. 252 ప.]

విద్యార్థులకు లోకంలో ఈనాడు అనేక రకాలైన ప్రలోభాలు ఎదురవు తున్నాయి. పంచేంద్రియ తర్పణానికి కావలసిన సుఖం, నీతి, నియమాలు లేని నల్లబజారుల్లో బోలెడు లభ్యమవుతోంది. పిచ్చెక్కించే (శృంగారంతో నిండిన) సినిమాలు, నిరంతరం చెవుల్లో హోరెత్తించే సంగీతంలోని విపరీత ధోరణులు, నేరంతో గూడిన హింసా ప్రవృత్తిని రెచ్చగొట్టే రచనలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. మత్తులో జోగాడేలా గమ్మత్తులు చేస్తున్నాయి. మనసును తప్పుదోవ పట్టిస్తున్నాయి.

రాజకీయ చదరంగంలో నాయకులు విద్యార్థులకు రంగు పులిమి పావులుగా జేసి తమ స్వార్థ ప్రయోజనాలకు వాడు కుంటున్నారు. వారి జీవితాలతో ఆడుకుంటు న్నారు.

కొందరు తమ మత వ్యాప్తికై వీరిని ఎరలుగా విని యోగించు కుంటున్నారు. తమ వలలో ఇరికించు కుంటున్నారు. వీటన్నింటినీ అధిగమించి విద్యార్థులు గమ్యం వైపు (Gole) పయనించాలి. లక్ష్యం సాధించాలి.

ఇటువంటప్పుడు లక్ష్య శుద్ధికోసం ప్రయత్నించిన ఎందరో మహానుభావుల చరిత్రలు మన మనోవీధిలో కదలాడి తీరుతాయి. అవి అన్నీ మనకు మార్గదర్శకం కాగలుగుతాయి. ఉత్తమాదర్శం కల మానవుడే ఉన్నతుడుగా సమాజంలో గౌరవం పొంద గలుగుతాడు.

స్థిరబుద్ధి, నిశిత దృష్టి రెండూ లక్ష్యసాధకము లవుతాయి. అవి సమృద్ధిగా ఉన్నప్పుడే ఎవరైనా వారు ఏరంగంలోని వారైనా రాణించటానికి వీలుంటుంది.

శ్రీమద్రామాయణంలో విశ్వామిత్ర చరిత్ర ఇందుకు మరొక ప్రబల ప్రమాణం. అయోధ్యాధిపతి విశ్వామిత్రుడు ఒక సందర్భంలో నందినీ ధేనువు విషయంలో తన గురువు వశిష్ఠునితో తలపడి తనకున్న సర్వశక్తులు ఉపయోగించి తపస్సంప న్నుడైన అతని మనస్సును ఏవిధంగానూ చలింపజేయలేక "ధిక్ క్షత్రబలం, బ్రహ్మ తేజో బలం బలమ్" పౌరుష ప్రధానమైన క్షత్ర బలంకన్నా, శాంత స్వభావ పూరిత మగు బ్రహ్మ తేజో బలమే మిన్నయని విశ్వసించి తపస్సుద్వారా తానును అబ్రహ్మర్షిత్వమును సంపాదింపగోరి ఆ గుర్తింపు పొందేవరకు అతడు చేసిన ప్రయత్నంతో

కలిగిన కష్ట, నష్టములను, ఏర్పడిన ఒడి దుడుకులను తట్టుకొని స్థిరంగా నిలబడి లక్ష్య సాధనలో కృత కృత్యుడై తుదకు సంకల్పసిద్ధి నందినాడు.

మఱియు, సీతాన్వేషణ పరుడైన హనుమంతుడు శత్రుదుర్గమైన లంకలో ప్రవేశించి ఎంతో మెలుకువతో ప్రతి నాలుగంగుళాలు పరిశీలించి, పరీక్షించి సీత జాడ తెలియక అట్టియెడ తన రాకయు, తుదకు తన జీవితమును వ్యర్థముగా భావించి, దుఃఖించుచూ, అంతలో దైవ యోగమున మనమున స్ఫురించిన అశోక వనము జేరి శ్రీరాముని ధర్మపత్ని, పతివ్రత, మహాసాధ్వియైన సీతాదేవినిగాంచి, రామముద్రిక నిచ్చి, ఆమె శోకమును బోకార్చి, ప్రాణములు కాపాడి, జీవితముపై ఆశను చిగురింప జేసి, కర్తవ్య నిష్ఠుడైనాడు. ఆ లక్ష్య సాధనమున హనుమంతుని నిర్విరామ కృషి అభినందింపదగి యున్నది.

ద్రోణుని ప్రతిమ పెట్టుకొని విద్యాభ్యాస సమయంలో ఏకలవ్యుడు పాటించిన ఏకాగ్రత, శుక్రాచార్యునివద్ద మృతసంజీవనీ విద్య నభ్యసించిన బృహస్పతి కుమారుడు కచుని సహనశీలం, వారి వారి లక్ష్య సాధనలలో దోహదం చేశాయి. మంచి నేర్చుకోవటంలో మన మివ్వన్నీ అలవర్చుకో వలసిన అవసరం ఎంతైనా ఉన్న దనేది పరమ సత్యం.

ఒకచో నేలను బవ్వళించు నొకచో నొప్పారు బూ సెజ్జపై
నొకచో శాకము లారగించు నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంత ధరించు నొక్కొకతఱిన్ యోగ్యాంబరశ్రేణి లె
క్కకు రానీయడు కార్య సాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్.

ఏనుగు లక్ష్మణ కవి.

వి వా హ ము

సృష్టిలో స్త్రీ పురుషుల కలయిక వలన ఏర్పడే బంధమే సంబంధం, ఇది ప్రకృతి సహజం. ప్రాణుల న్నింటిలో ఇట్టి అనుబంధం గమనిస్తూనే ఉంటాం. సృష్టి కిదే మూలం. పరిశీలిస్తే లోకంలో ప్రతి జీవి చరిత్ర ఒక ప్రబంధమే అవుతుంది.

ప్రపంచంలో పుట్టిన ప్రతి ప్రాణికి బాల్య, యౌవన, కౌమార, వార్థక్యము లనేవి నాలుగు దశలు. మరణం అనేది అంత్యదశ. అన్నింటికి అది అనివార్యం. బుద్ధి జీవులైన మానవులు జీవితము యొక్క విలువను గుర్తించి ఆయువును సరిగా వినియోగించు కొనగలుగుతారు. ప్రత్యేకించి భారతీయ సంస్కృతిని నిర్దేశించిన పెద్దలు జీవి సంస్కరింప బడటం కోసం ఆయా సందర్భాలలో షోడశ [16] సంస్కారాలు ఏర్పాటు చేశారు. గృహ్య సూత్రములు విషయములను వివరిస్తున్నాయి. అందులో 'వివాహం' అందరికి ముఖ్యమైన అంశం. ఆ విధంగా భార్యాభర్తలై ఒకటిగా జీవించే స్త్రీ పురుషులను దంపతు లంటారు.

క్రమ శిక్షణ తో కూడిన జీవితం గడపటానికి ప్రయత్నించిన మన సంస్కృతి ఒక వ్యక్తి జీవితాన్ని బ్రహ్మచర్య. గృహస్థ, వానప్రస్థ, సన్యాసములను నాలుగు ఆశ్రమాలుగా విభజించి ఆయా ఆశ్రమాలలో చేయవలసిన విధులను కూడా సూచించింది. మహాకవి కాళిదాసు రఘువంశరాజుల చరిత్ర రూపంలో ఆ విషయమే వర్ణించాడు.

"శైశవే౽ భ్యస్త విద్యానాం, యౌవనే విషయైషిణాం!
వార్ధకే ముని వృత్తీనాం, యోగే నాంతే తనుత్యజాం" !!

ఇందులో "చిన్న తనాన బ్రహ్మచర్యంతో విద్యాభ్యాసం చేయటం. యౌవనంలో యోగ్యురాలైన స్త్రీని వివాహం చేసుకొని, సంతానాన్ని పొంది సకల సుఖాలను అనుభవించటం, వయస్సు మళ్ళి, మనస్సు వెనుకాడే స్థితిలో బాధ్యతలు, అర్హతలు కలిగిన పిల్లల కప్పగించి ఏ కోరికలు లేని ముని వృత్తితో కాలం గడుపుతూ, చివరకు యోగ మార్గం ద్వారా ఈ తనువు చాలించ టానికి ప్రయత్నించటం ధర్మ"

మని చెప్పబడింది. మన దేశంలో మొన్న మొన్నటిదాకా మన పూర్వులందరూ అదే చేశారు కొందరిప్పటికీ ఆ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు.

ఈ ఆశ్రమా లన్నింలోనికి గృహస్థాశ్రమం గొప్పదని పెక్కు విధాల అభివర్ణించారు అనుభజ్ఞులైన మన పెద్దలు. ఇతర ఆశ్రమాలలో ఉండే వారికి, కుంటి, గుడ్డి. మూగ చెవుడు ఇంకా అనేక రూపములలో నున్న అనాథలకు గృహస్థ అధారమై ఉంటాడు [మ. ప. 1 ఆ. 66 ప.]

కలయాశ్రమములోలింగాచు మే ల్పంటకాంపర్థుల పాలి కల్పాగ మంబు
నెజీవన్నె గన్న పున్నెపు ముత్తియముల ప్రోవ ఖిలసత్కారార్థ యంత్రకాం
యురు రుచి సురలనోరూరించువంటయి, ల్గిరులొడ్లకిడు పసరాకుమందు
సకల కలాయోగ సామ్రాజ్య వైభవం, బానంద లక్ష్మి విహారభూమి
వితత పంక విశిష్కాసి కతక బీజ, మాప్సిత పదంబు. పితృముక్తి హేతువాత్మ
సిద్ధి తీర్థంబు నా దగి సిరు లవెలయు నవని గార్హస్థ్య మొక్కండె యనఘ చరిత॥

శ్రీ. రా. క., బా. కాం. 1. ఆ. 488 ప.

"విశేషేణ ఉహ్యత ఇతి వివాహః" అను వ్యుత్పత్తిని బట్టి వివాహమంటే మిక్కిలి బాధ్యతతో వహించునది. స్వీకరించునది అనే అర్థం బోధపడు తుంది.

వివాహం కేవలం ఆ స్త్రీ పురుషుల జీవితాలతోనే పరిమితం కాక ముందు, వెనుక తరాలకు సంబంధించిన వారికి కూడా అన్వయిస్తూ ఆచోక రకమైన సాంఘిక బాధ్యత. భద్రతగా కూడా పరిగణింప బడుతోంది.

ఈ వివాహ సంస్కారం ద్వారా ఏర్పడిన అనుబంధం జీవితాంతం అవిచ్ఛిన్నంగా సాగాలని పెద్దల ఆకాంక్ష. అందుకు ఆ దంపతుల మధ్య ఏర్పడే సదవగాహన, వారి ఉత్తమ సంస్కారం కూడా కారణాలుగా చెప్పవచ్చు ఈ వివాహ ప్రక్రియలో భాగంగా 'సప్తపది' అనే ఒక కార్యక్రమం నిర్వహింప బడుతుంది ఈ ఏడడుగుల బంధమే ఏడేడు జన్మల సంబంధమై పరిఢవిల్లు తుందని చెప్పటం కద్దు. అందుకే "స్త్రీ, విద్యా. ధనములు పూర్వ జన్మ సంప్రాప్తములు"గా పెద్దలు అభివర్ణించారు. అవే మరు జన్మకు కూడా సాగివస్తాయని చెప్పటం కూడా వింటాం.

"పూర్వ జన్మని యా నారీ, పూర్వ జన్మని యద్ధనం, !
పూర్వ జన్మని యా విద్యా అగ్రేధావతి ధావతి !!

పవిత్రమైన ఈ వివాహ వ్యవస్థ నేడు కన్యాశుల్కం. వరకట్నం మొదలైన అనేక సాంఘిక దురాచారాల వల్ల లాభ నష్టాల బేరీజు వేసుకొనే ఒక వ్యాపారసంస్థ గా మారిపోయింది. [సామాన్యుల కిది మోయలేని గుదిబండగా, భరింపలేని గుండెల బరువుగా తయారయింది.]

"విశేషేణవహతీతి వివాహః" అను వ్యుత్పత్తిని బట్టి వివాహ మంటే విశేషించి స్త్రీ తన పతి గృహమునకు తీసుకొని పోబడుట అనే అర్థం కూడా వస్తుంది, స్త్రీ యే వంశవృద్ధికి మూలము, కావున ఆమె కట్టి ప్రాధాన్యము ఇవ్వబడినది. ఉభయ వంశ ములవారి పరువు ప్రతిష్ఠలకు, అభ్యుదయానికి. ఔన్నత్యానికి కారణము స్త్రీ నడవడి యే యనుట సత్యము. పురుషుడు వెడిపోతే వాడు ఫలానావారి అబ్బాయి అని మాత్రమే అంటారు, అదే స్త్రీ విషయంలో అయితే ఫలానావారి అమ్మాయి, ఫలానా వారి కోడలు అని వ్రేలెత్తి చూపిస్తారు. అందువల్ల యోగ్యురాలైన స్త్రీని, తమ ఇంటి కోడలుగా తెచ్చుకోవాలని పెద్దలు, మానవతి, అనుకూలవతి యైన స్త్రీని భార్యగా పొందాలని పురుషుడు భావించటం జరుగుతుంది. యోగ్యులైన స్త్రీ పురుషుల సంబంధం అటు పది తరాలు, ఇటు పది తరాలు వారి నుద్ధరించేదిగా ఉంటుందని వివాహ సంస్కార విధిలో చెప్పబడింది. కానీ ఈనాడు ఆ పరమార్థమే పూర్తిగా మరుగున పడిపోయి భార్య, భర్త యింటికి వెళ్తోందంటే బలిపశువు వధ్యశిలా ప్రవేశానికి కొని పోబడుతుందనే అర్థం స్ఫురించేలాగా సాంఘిక వ్యవస్థ పరిణమించటం దురదృష్టం. కుళ్ళిపోయిన ఈ సమాజ వాతావరణాన్ని అది ప్రతిబింబించేదిగా కనబడుతోంది.

భౌతికంగా స్త్రీకి వివాహ మెంత అవసరమో, పురుషుడికీ అంతే అవసరం. ఆమెకు తోడు కావల్సిందే. అతనికి నీడా కావల్సిందే. ఒకరి నొకరు అర్థం చేసుకొని ఒకరి కష్ట సుఖములలో ఇంకొకరు పాలు పంచు కుంటూ, ఒకరి యోగ క్షేమములు మరి యొకరు కోరుకుంటూ ఉండాలి. ఆ విధమైన వారి ప్రవర్తన అను రూప దాంపత్యంగా చెప్పబడుతుంది.

ఆ సంసారం-అనురాగపు పాల కడలిగా వృద్ధి పొందుతుంది. రసమయ మైన జీవితంలో స్త్రీ పురుషు లిరువురు మధు మయ హృదయులై మెలగాలన్నది సృష్టి

యొక్క పరమార్థం-అందుకే భగవంతుడు గీతలో ధర్మ విరుద్ధం కాని 'కామమే' నేను అని ప్రబోధించాడు. ఇక లాభ-లోభాలకు అందులో తావే లేదు-కానీ నేడవి ప్రతి రంగం లోన్నూ ప్లేట్లు చేస్తుకొని, చేటుచేస్తూ ఇందులోను ప్రవేశించాయి. అవి అన్ని విధాలా మానవుని ప్రగతి శీలానికి ప్రతి బంధకంగా ఉండటం గమనిస్తూనే ఉన్నాం.

సాంఘికంగా అనేక పరిణామాలకు గురియైన ఈ హిందూ జాతిలో ఆయా కాలాలలో సమాజ సంక్షేమం కోసం, సచ్ఛీల సంరక్షణకోసం అనేక సంప్రదాయాలు ఏర్పరుప బడి అనుసరింప బడ్డాయి. అందులో 'బాల్య వివాహం' ఒకటి. విధర్మీయుల దాడులకు తట్టుకొని, విజాయితీయుల దౌర్జన్యాలను తప్పించు కోటానికి ఈ ఆచారాలు, కట్టుబాట్లు ఏర్పడి ఉండవచ్చు. దీనివల్ల చిన్నతనం నుండే స్త్రీ పురుషుల హృదయాలలో తమ తమ జీవిత భాగస్వాములను గూర్చిన ఆలోచనలు నిండి ఉండటం వలన మనసులో ఆ రూపు రేఖల యెడ అభిమానం. అనురాగం కలిగి, స్థిరపడి మరి ఏ రకమైన వికారాలకు తావు కలగకుండా ఉండటంతో బాటు పరస్పర అవగాహనకు దోహదం చేసేవిగా ఆశింప బడినట్లు ఊహింపవచ్చు. నేడు మనుష్యుల మధ్య ఏర్పడిన దూరం, జీవన గమనంలో పెరిగిన వేగం, కారణంగా ఆ వివాహ పద్ధతికి ఆదరణ తగ్గింది. ఆ మధ్య కాలంలో చిన్న పిల్లలకు పెళ్ళి చేయలేని తల్లి దండ్రులను సంఘం వెలివేసేది. ఆ ఆచారాన్ని నిలుపుదల చేయాలని ప్రభుత్వం 'శారదా బిల్లు' ప్రవేశ పెట్టింది. ఆ పద్ధతిలో ప్రయోజనాలకన్నా, నష్టాలే ఎక్కువ.

స్త్రీకి, పురుషుడితో సమానంగా విద్య, ఉద్యోగం అవసరమైన ఈనాటి సమాజంలో అసలు 'వివాహం' యొక్క ప్రాముఖ్యత కొంత సడలింది. స్త్రీ అన్ని రంగాలలోను ముందుకు వచ్చి స్వతంత్రంగా జీవించ గలననే విశ్వాసాన్ని పెంపొందింపు కుంటోంది. ఆర్థిక ఇబ్బందులు కూడా అందుకు ప్రోత్సహిస్తున్నాయి.

వివాహ ప్రసక్తి వచ్చేటప్పటికి విద్యాధికులైన ఉద్యోగస్థులైన స్త్రీలకు సహితం ఈనాడు వరాన్వేషణ కష్ట సాధ్యమే అవుతోంది. తన కంటే ఎక్కువగానో, లేక తనతో సమానంగానో విద్యావంతుడై, సాటి ఉద్యోగిగా తన అభిరుచులను అర్థం చేసుకొని అనుగుణంగా మెలిగే యోగ్యుడైన వరుడు తటస్థ పడటం అరుదైపోయింది.

జీవనమే ఒక పోరాటంగా మారిపోయింది. అందుతో కొందరికి కొన్ని సందర్భాలలో ఓటమి తప్పటంలేదు, బాధ్యతలు కొందరిని బందీలను చేస్తున్నాయి.

పురుషుడికీ అదే సమస్య. ఆర్థికంగా తోడుపడే స్త్రీ సహచరిగా కావాలని కోరుకునే పురుషుడు కుటుంబంలోని భద్రత కోల్పోయి కొన్ని చిక్కులను ఎదుర్కొనవలసి వస్తోంది. స్త్రీ పురుషులిరువురు సంపాదిస్తే కాని ఇల్లు గడవని కుటుంబాలలో పిల్లలకు తగిన ఆదరణ లభింపక పోవటంతో వారి మధ్యలో దూరం ఏర్పడుతోంది. తల్లి దండ్రుల ప్రేమకు ప్రతి రూపాలైన పిల్లలకు ఆత్మీయతా, అనురాగాలు కరువై పోతున్నాయి. మానసికంగా వారు నలిగి పోతున్నారు. అందువల్లవారి క్రమశిక్షణ దెబ్బతింటోంది. జీవితంలో గృహిణిగా స్థిరపడిపోయి మాతృత్వాన్ని కాపాడు కోవాలన్న తపన కొందరిలో ఎక్కువ అవుతోంది. భావి తరాలకు చక్కని బాటవేసి, వారి జీవితాలను తీర్చి దిద్దు కోవాలన్న బాధ్యతవారు గుర్తు చేసు కుంటున్నారు. అయితే ఎక్కువ చదువుకోని, ఏ ఉద్యోగానికి అర్హతలేని వారు కొందరు తమకు ఏ అవకాశం లేక పోయిందే అని వాపోతున్నారు. గృహిణీత్వం వారి అభ్యుదయానికి ప్రతిబంధకంగా ఉంటోందని బాధ పడుతున్నారు. లోకంలో అందనిదాని కర్రులు చాచటం, దక్కిన దాంతో తృప్తి పొందలేక పోవటం ప్రాణుల అజ్ఞానానికి ప్రతీకగా గుర్తింప గలుగుతాం.

ఏది ఏమైనా తల్లి దండ్రులు విద్యావంతులై వారు ఏ మాత్రం శ్రద్ధ వహించినా ముఖ్యంగా పిల్లల జీవితాలు బాగు పడతాయన్నది నిజం. ఎవరెంత చదువుకున్నా, ఎవరేమి పని చేసినా వివాహం ద్వారా తాము జీవితం గుర్చి కన్న కలలు నిజం చేసుకోవాలని, బ్రతుకు పంట పండించు కోవాలని కోరుకోవటం, అందులో మాధుర్యం అనుభ వించాలని ఆశించటంలో వింత లేదు. అది విడ్డూరమేమీ కాదు. అందుకు ధర్మ బద్ధమైన దాంపత్య జీవితం అవసరం. అట్టి స్త్రీ. పురుషులకు సీతా రాముల చరిత్ర ఆదర్శం అవుతుంది.

దశరథ తనయుడు రాముడు. జనకత సీత. పరాక్రమ సంపన్నుడైన రాముడు శివుని విల్లు విఱిచి, స్వయంవరంలో వీర్యశుల్కయైన సీతను పొందగలిగాడు. ఆనందంతో జనకుడీ వర్తమానం దశరధునికి తెలియబంపి వివాహానికి సపరివారంగా తరలిరావలసిందని ఆహ్వానించాడు. ఆ పెద్దల సమక్షంలో రామాదులకు వివాహం వైభవంగా జరిగింది. ఉభయపక్షములలోని వారు మిక్కిలి సౌజన్యంతో

వ్యవహరించి ఆ ఉత్సవంలో ఆనందాన్ని సమంగా పాలుపంచుకున్నారు. ఈనాడు వివాహ వేదికలే యుద్ధ రంగాలుగా చిత్రింపబడి విషాద బీజాలు నాటబడుతున్నాయని, చెప్పటానికి విచారించ వలసి వస్తోంది.

ఆ సందర్భంలో ఉభయ వంశముల చరిత్ర కీర్తింపబడింది. అన్యోన్యం, వియ్యముందటంలో గల యోగ్యతకు సంతృప్తి ప్రకటించారు. అప్పుడు సీత తండ్రి జనకుడు రాముని చేత ధర్మ, అర్థ, కామములైన విషయాలన్నింటి లోనూ నేనెన్నడూ ఈమెను విడవి ప్రవర్తింపనని (ధర్మేచార్థేచ కామేచ నాతి చరితవ్యా, నాతి చరామి) ప్రతిజ్ఞ చేయించి కన్యధార పోశాడు.

"అనుచు ధారవోసె నగ్ని సాక్షికముగ, సీత కరము రాము చేతనునిచి
ధరణినాథుడు సహధర్మాచరణ సత్ప్రతిజ్ఞ రాముడెలమి చేటపఅప"

శ్రీ.రా.క.,బా.కాం. 10 ఆ. 366 ప.

పురుషుడి కొక న్యాయం, స్త్రీ కొక న్యాయం అంటూ లేకుండా అందరికీ ఒకే నియమం ఉండటం ధర్మం కదా ! స్త్రీ సౌశీల్యాన్ని, పవిత్రతను కోరుకునే పురుషుడు తానూ అంత గొప్పగా ఉండటానికి సిద్ధపడాలి. పురుషాధిక్య సమాజంగా రూపుదిద్దు కొన్న ఈ సాంఘిక వ్యవస్థ స్త్రీని 'అబల' అంటూ అన్ని విధాలా అన్యాయం చేయటం ఎంత మాత్రం తగదు. సంసార రథానికి స్త్రీ పురుషులిద్దరు రెండు చక్రాలు. అవి సక్రమంగా సమానంగా ఉన్నప్పుడే సాఫీగా సాగిపోయి, గమ్యం చేరుకుంటుంది ఆ రథం. అప్పుడే వారి సంతానం చక్కని ఆరోగ్యం. ఆనందం కలిగిందిగా వృద్ధి పొందుతుంది. ఆ బిడ్డలే దేశ సౌభాగ్యాన్ని కాపాడగల సత్పౌరులుగా తీర్చిదిద్ద బడతారు.

అప్పుడు జనకుడు అగ్ని కభిముఖంగా నిలిపి సీత చేతిని, రామునిచేతిలో ఉంచి ఈమెను నీ సహధర్మచారిణిగా గైకొనుమని చెప్పినాడు. పతివ్రతయైన సీత నీడవలె నిన్ననుసరిస్తుందని తెల్పినాడు. ఈ వివాహ సంస్కారం (అందులో పాణిగ్రహణ మొక ఘట్టం) మీకు భద్రత కల్పిస్తుందని ఆశీర్వదించినాడు.

"ఇయం సీతా మమసుతా, సహధర్మ చరీతవ !
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే, పాణిం గృహ్ణీష్వ పాణినా !!
పతివ్రతా, మహాభాగా, ఛాయేవానుగతా సదా ! (27, 28/1-73-1)

భారతీయ సంస్కృతి ఈ కన్యాదాన మనేది ఒక సుకృతంగా భావించింది. మన పెద్దలు కన్యాదానం ఉత్తమలోక ప్రాప్తికి చేసే విశిష్ట క్రతువుగా సంకల్పించారు.

"కన్యాం కనక సంపన్నాం, కనకాభరణైర్యుతాం !
దాస్యామి విష్ణవే తుభ్యం, బ్రహ్మలోక జిగీషయా!!"

అందుకే వధువు లక్ష్మి. వరుడు నారాయణ స్వరూపుడు. ఈ విధంగా గృహస్థు లక్ష్మీ నారాయణుల వివాహం నిర్వహించామన్న తృప్తి అందువల్ల వచ్చే పుణ్యఫలం పొందగలుగుతున్నాడు. లోకంలో వధూవరులైన ఏ స్త్రీ పురుషులైనా ఈ రకంగా సంభావించటం మన సంస్కృతి గొప్పతనం కాగా, ఇక్కడ జనకుడు మాత్రం సాక్షాత్తు లక్ష్మిని (సీతను) సాక్షాన్నారాయణున కిచ్చి (రామునకు) వివాహం చేసే అదృష్టానికి నోచుకున్నాడు, ఆ విధంగా అతడు మిక్కలి కీర్తి నీయుడయ్యాడు.

"బహు జన్మార్జిత కర్మబంధ నివహాప క్రాంతి నర్థించి ల
క్ష్మీ హరిం గూర్చుట గాఁదలంతు రిల సక్ఛ్రీకుల్ గృహుల్ కన్నెలన్
సహ ధర్మం చరయంచు వోఢకిడి సత్యం పత్ని గైకొందు రా
సుహి తత్వం బిటు గన్న యాన్నృపతి సుశ్లోకత్వ మింతింతయే

శ్రీ. రా. క. బా. కాం., 10 అ. 368 ప.

జనకుడన్న శబ్దం అతని యెడ నిజంగా సార్థకమయింది. అతడు సముద్రుని వలె జడ బుద్ధి (జల బుద్ధి) గాక తన తనయను తగిన వరునకిచ్చి కృతార్థుడయ్యాడు.

"తను నొప్పింప సురాసురుల్ గడగి మోదంబేద ఘోషింపుచున్
గని లక్ష్మిన్ జడబుద్ధి శౌరి కొసగం గాఢబ్ధి చేజేతులన్ ;
తన యజ్ఞక్షితిఁ బండె నా దవరు సీతా లక్ష్మి శ్రీరాముఁ బె
ర్మొఁని యర్పించెఁ బ్రహ్మర్షియై జనకుఁ డొక్కండే కృతార్థుండిలన్,

శ్రీ. రా. క.. బా. కాం., 10 అ. 369 ప.

తమ కన్నులున్నందుకు ఫలము ఆ సీతారాముల వివాహ మహోత్సవము సందర్శింపజేయని తలంచి, ఆ విధముగా నవటివారు జన్మధన్యతగాంచిరని కావ్య

ముల వర్ణింపబడినది. దేశము, కాలము ఒక్కటియై పూర్వ పుణ్యము ననుభవమునకు తెచ్చుటవలన నిట్టివి సంభవించుననుట పరమసత్యము.

కన్నులు గల్గిన ఫలము గల్గదు, దేశము కాలమొక్కటై
మున్నొడఁ గూడ నా సుకృతము స్ఫలవంతముఁ జేయ మేలి మే
ల్గన్నదె కాన్పుగాక యెది గన్నను గానుపె. యమ్మహోత్సవం
బున్నటు గన్న వారలదె యుత్తమజన్మ మనుత్తమక్రమా ।

శ్రీ.రా.క.,బా.కాం. 10 అ. 390 ప.

కావుననే లోక కళ్యాణము నుద్దేశించి సహృదయులు ప్రతి సంవత్సరము పవిత్ర చరిత్రులైన ఆ సీతారాముల వివాహ మహోత్సవము ఊరూరా, వాడ వాడలా ఆనందోత్సాహములతో నిర్వహించుచుండుట చూచుచున్నాము. ఆ శుభ సందర్భము మన జీవితములకు (స్త్రీ, పురుషులకు) చక్కని సామరస్య, సంస్కారములను ప్రసాదించునని ఆశించుచున్నాము.

ఈ నాడు ఆడపిల్ల పుట్టిందంటేనే భయపడవలసిన పరిస్థితులు వచ్చాయి. అది ఒక నేరంగా తలపోసేవారు కూడా లేకపోలేదు. ఈ పోటీ ప్రపంచంలో పిల్లల్ని పెంచి, విద్యాబుద్ధులు నేర్పి, జీవన భృతికి తగిన ఉపాధి కల్పన చేయటంతో బాటు ఒక ఇంటి వారిని కూడా చేయడం దుస్సాధ్యంగా ఉంది. అందునా ఆడపిల్ల అంటే చులకన భావం మెండు. ఒక స్థితిలో స్త్రీ ఔన్నత్యాన్ని చూచి, స్త్రీయే (అత్తగారు, ఆడబిడలు, తోడు కోడళ్ళు, ఇరుగు పొరుగు అమ్మలక్కలు మొ॥) సహించలేని విపరీత వాతావరణం ఈ సమాజంలో ఎక్కువై పోయింది. అటువంటప్పుడు సామాన్య కుటుంబాలలో ఎక్కువ కట్న కానుకలతో గూడిన ఆడపిల్ల పెళ్ళంటే కూతురు కన్నెచెఱ విడిపించటం కోసం ఎవరో ఒక అయ్యచేతిలో పెట్టి. గుండెల బరువు దించుకోవటంగా భావించే రోజులొచ్చాయి. ఆ జనారణ్యంలో ఈ పిల్ల సుఖపడే యోగ్యత కూడా ప్రశ్నార్థకమే అవుతోంది. వ్యాపార సరళిలో సాగిన ఆ తంతు వివాహితులైన స్త్రీ పురుషులలో సన్నిహితత్వాని సమకూర్చటంలో పూర్తిగా విఫలమవుతోంది. మనుషుల మనసులు మారితేగాని ఈ వ్యవస్థ మారదు. అందుకు వివాహం యొక్క ప్రయోజనం కేవలం అర్థమో, కామమో కాక ధార్మిక బుద్ధికి, తత్త్వచింత

నకు, సాంఘిక బాధ్యతకు, పరమార్థసాధనకు అది ముఖ్య కారణమైనదిగా పరిగణింప గలగాలి. అటువంటప్పుడు 'వివాహం' సమాజంలో నీతి, నియమాలకు పెట్టని కోటగా పరిణమిస్తుంది శీలరక్షణ కల్పిస్తుంది. నాగరికతా ప్రపంచంలో వివాహానికి ఒక విశిష్ట స్థానం ఉన్నది. ఇతర దేశాలలో ప్రజలు కొందరు, ఈ వ్యవస్థ యెడ ఆకర్షితులై అభిమానంతో అనుసరిస్తున్నారు. ఇందులో ఉన్న భద్రత, గౌరవం పొందగలుగుతున్నారు. ఇది భారతీయ సంస్కృతిలోని గొప్పతనం. అయితే వివాహాన్ని అడ్డుపెట్టుకొని మర్యాదమీఱి ప్రవర్తించే స్త్రీ పురుషులు కొందరు ఈ సాంఘిక నియమాన్ని ఉల్లంఘించటంతో పాటు మానవత్వానికి భంగం కలిగేలా ప్రవర్తించి సభ్య సమాజంలో అప్రతిష్టపాలై తలవంపులు తెచ్చుకుంటున్నారు. అది వ్యక్తిగత కుసంస్కారమే కాని వ్యవస్థలోని దోషం మాత్రం కాదు.

ఆదర్శ దంపతులైన సీతారాములిద్దరు అయోధ్యలో ఉన్నప్పుడు అంతఃపుర సౌఖ్యాలలోనూ, అరణ్యాలలో ఉన్నప్పుడు అడుగడుగునా ఎదురైన కష్ట పరంపరలలోనూ, ఒకటిగా మెలిగారని రామాయణం అభివర్ణించింది.

వైవాహిక బంధానికి కట్టుబడిన వారి జీవితం ఒక మధుర ప్రణయ ప్రబంధంగా కీర్తింపబడింది. త్యాగమయమైన వారి ప్రణయం ఎంతో గాఢమై, పవిత్రతను సంపాదించుకొన్నది.

అరణ్యాలకు వెళ్తూ, సీతను అయోధ్యలోనే ఉండమని రాముడంటే సీత "నీతో కలిసి ఉంటే అదే స్వర్గం. నీవు లేనిపోతే నాకు నరకం."

"యస్త్వయా సహ స స్వర్గో, నిరయో యస్త్వయా వినా" అని

(21-27-2)

ప్రకటించింది. రామునితో బయలుదేరి అరణ్యాలకు వెళ్ళటానికే తన సంసిద్ధత వ్యక్తం చేసింది. నిజానికి రాముడూ "సీతలేని స్వర్గ సుఖమైనా తానొల్లనని" వక్కాణించివాడు.

"న దేవి తవ దుఃఖేన స్వర్గ మప్య భిరోచయే"

(27-30-2)

అరణ్యవాసంలో రామలక్ష్మణులు లేని సమయమున కపటియై రావణుడు సీతనపహరించుకొనిపోయి, అశోక వనమున రాక్షసీ జనమధ్యంలో బందీగా ఉంచి,

పదేపదే రాముని అసహాయునిగా వర్ణించి, సమస్త-ఐశ్వర్య సంపన్నుని తన్ను వరింపుమని ఎన్నోవిధాల వత్తిడి చేసినా సీత ఆ దుష్టుని మాటలు ఏమాత్రం లెక్కనేయక ఎప్పటికీ త్రికరణముల రాముడే తన పతి యని ఉగ్గడించింది. రావణుని దుశ్చర్యను నిరసించింది.

"శక్యా లోభయితుం నాహ, మైశ్వర్యేణ ధనేనవా ।
అనన్యా రాఘువేణాహం, భాస్కరేణ యథాప్రభా" ॥

(16 – 121 – 5)

"దీనోవా రాజ్యహీనోవా యో మే భర్తా స మేగురుః ।
తం నిత్య మను రక్తాఽస్మియథా సూర్యం సువర్చలా" ॥

(9 – 24 – 5)

సతి జాడ తెలియక సీతా విరహమును భరింప జాలక, రాముడు నిద్రాహారములు విడిచి అమెకై పరితపించు చున్నట్లు వాల్మీకి హనుమంతుని ముఖమున పలికించిన తీరు హృదయంగమము. [43, 44/36/5] తన సర్వశక్తులు వినియోగించి, లోక కంటకుడైన రావణుని సపరివారంగా సంహరించి, సీతను పరిగ్రహించటంలో రాముని పురుషోత్తమత్వం ప్రకటిత మవుతోంది. అగ్నిపరీక్ష లోకుల అనుమానాలకు సమాధానమే తప్పితే రాముని అంతరంగానికి గాని, సీత పాతివ్రత్యానికి గాని కళంకాన్ని ఆపాదించటం కోసం కానేకాదు అందుకు అరమరికలులేని వారి ఆత్మీయత, అనురాగములే సాక్షి.

సీతా పరిత్యాగం రామ రాజు ప్రజాభిప్రాయాన్ని మన్నించటమే అంటానికి సందేహం లేదు. భృగుని శాపాను భవమే ఈ వియోగమని పౌరాణికగాథ వివరిస్తోంది, రాజ్య పరిపాలనా బాధ్యత స్వీకరించిన వానికి వ్యక్తిగత సౌఖ్యం, బంధు ప్రీతి మొదలైన స్వార్థ ప్రయోజనాల కంటే లోకారాధనయే ముఖ్యమని అందులో వ్యక్తికంటే వ్యవస్థ గొప్పదని రాముని చరిత్ర నిరూపిస్తోంది. ఏ పరిస్థితు లేవిధముగా దారితీసినా సీతారాములు అన్యోన్య దంపతులే. లోకానికి వారి అనురాగమే ఆదర్శం అవుతుంది. కావుననే

వంకాయవంటి కూరయు
పంకజముఖి సీతవంటి భార్యామణియున్
శంకరుని వంటి దైవము
లంకాపతి వైరివంటి రాజును గలఁడే ! అను ప్రశస్తి లభించింది.

మన దేశంలో ఏ స్త్రీ పురుషులు వధూవరులైనా, 'సీతమ్మ పెండ్లి కూతురాయేనే, రామయ్య పెండ్లి కొడుకాయెనే' అని సంభావింప బడటం కద్దు. తలంబ్రాలు సీతారాముల వైవాహిక ముక్తాక్షతలుగా సంకల్పింప బడి అవి శుభ దాయకములుగా కీర్తింప బడటం అందుకు నిదర్శనం.

జానక్యాః కమలా మలాంజలి పుటేయాః పద్మరాగాయితాః
న్యస్తా రాఘవమస్తకేచవిలసత్కుంద ప్రసూనాయితాః
స్రస్తా శ్యామలకాయకాంతి కలితా యా ఇంద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదాభవంతు భవతాం శ్రీరామవైవాహికాః !

ఏ ఆడపిల్ల నప్పగించి అత్తవారింటికి పంపే ఉప్పుడైనా "పోయిరాగదమ్మ జానకీ!" అని ఆలపించటం మనసును కదిలించే మరువలేని మధురానుభవం. భారతీయ జీవన స్రవంతిలో రామ చరిత్ర అంతగా ప్రాధాన్యాన్ని సంతరించు కొన్నది. ఆ శ్రీరాముడు సీతాసమేతుడై భద్రాద్రిపై కొలువుదీరి ఉండటం మన ఆంధ్రుల అదృష్టం. అది ధార్మికస్ఫూర్తి కేంద్రంగా విలసిల్లు గలుగుతుందని ఆశిద్దాం.

ప్రజాస్వామ్యం

'స్వామ్యం' అంటే సొంతం. 'ప్రజాస్వామ్యం' అంటే ప్రజల సొంతం. ఇప్పుడు మన దేశంలో అమలులో ఉన్నది ప్రజాస్వామ్య ప్రభుత్వం. అంటే ప్రజలు తమ పాలకులను తామే ఎన్నుకోవటం అన్నమాట.

ఐదేండ్ల కొకసారి లేక అవసరాన్ని బట్టి ఆ మధ్య కాలంలో ప్రజలు తమ తీర్పు చెప్పటం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవటం పరిపాటి. ఈ ప్రజాస్వామ్య పద్ధతిలో అత్యధిక సంఖ్యగల ప్రజల అభిప్రాయమే మన్నింప బడటం చూస్తూనే ఉన్నాం. ప్రపంచంలో అధిక దేశాలు ఈనాడు ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను పాటిస్తున్నాయి.

ప్రజలు తామెట్టి ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాలో నిర్ణయించు కోవటం వారి విజ్ఞతకు నిదర్శనంగా భావిస్తాం. ప్రజా ప్రతినిధి కావాలని కోరుకునేవాడు ఆ ప్రజల బాగోగులను పరామర్శించి, వారి సుఖదుఃఖాలలో భాగస్వామియై హితుడుగా, సన్నిహితుడుగా ఉండితీరాలి. పాలకులిట్టి వారైనప్పుడు ఆ దేశం సర్వ విధాలా అభివృద్ధి చెందుతుందనటంలో సందేహ మేముంది? ప్రజా ప్రతినిధియైన వాడు తన ప్రజలు తనకు కట్టబెట్టిన సింహాసనార్హత 'జన్మహక్కు'గా భావింపక, గురుతరమైన బాధ్యతగా గుర్తించి వారి అభిప్రాయాన్ని అనుసరించి మెలగవలసిందే కాని పదవినే గట్టిగా పట్టుకొని కడదాకా ప్రాకులాడటం సమజసం కాదు.

రఘువరుని చరితం రచించిన వాల్మీకి రామాయణం నుండి ఈ సందర్భంలో కొన్ని విషయాలు తెలియ దగి ఉన్నాయి.

దశరథుడు చక్రవర్తి. చిరకాల మతడు రాజ్యపాలన చేసి ప్రజల మన్నన పొందాడు. అతనికి రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు నల్వురు కొడుకులు వారు సుశీలురై, విద్యా బల ప్రాభవ వైభవాలతో విలసిల్లుతూ, ధైర్య పరాక్రమాది గుణ విశేషాలతో లోకహితంకరులై వర్ధిల్లారు. వారికి యుక్త వయస్సు వచ్చింది. వివాహ మయ్యింది. వీరిలో జ్యేష్ఠుడు, గుణ శ్రేష్ఠుడు, అయిన రామునికి తన రాజ్యభారాన్ని అప్పగించి దశరథుడు తాను విశ్రాంతి తీసుకో దలచాడు. ఇదంతా స్వప్రేరణ

(స్వయం నిర్ణయాధికారశక్తి) తోనే చేయ సంకల్పించాడు. ఇది ఔచిత్య మెరిగిన అతని ఔన్నత్యానికి నిదర్శనంగా చెప్పుకోవాలి. ఒకనాడు నిండు సభలో ఈ అభిప్రాయాన్నే ప్రకటించాడు

"జీర్ణస్యాస్య శరీరస్య విశ్రాంతి మభిరోచయే"

అయో, కాం. 2 అధ్యా 8 శ్లో.

"సోzహం విశ్రమ మిచ్ఛామి పుత్రం కృత్వా ప్రజ హితే"

(10 శ్లో).

కుమారునికి తన అధికారాన్ని కట్ట బెట్టటం. పరంపరా గతమైన కుటుంబ హక్కుగా కాకుండా ప్రజా హితం కోసమే ఈ పనిచేశాడు. అందుకా సభవారు హర్షాన్ని ప్రకటిస్తూ, విజ్ఞతతో కూడిన యాతని నిర్ణయాన్ని అభినందిస్తూ, రామ రాజ్యం కావాలనే తమ అభిరుచిని కూడా ఈ విధంగా వ్యక్తం చేశారు

"ఇచ్ఛా మోహి మహా బాహుం. రఘువీరం మహాబలం,
గజేన మహతా యాంతం. రామం ఛత్రానవావృతమ్॥

22 శ్లో॥

దశరథ చక్రవర్తి అంతటితో ఆగక వారి ఆకాంక్షలో గల ఆంతర్యాన్ని, అభినివేశాన్ని తెలుసుకో గలందులకై "నేనుగా (చక్రవర్తి) ప్రతిపాదించానని ఈ విషయాన్ని కాదనలేక మొహమాటానికై ఒప్పుకుంటున్నారా? లేక రామునిలో రాజు కాదగిన లక్షణాలేమైనా ఉన్నాయా?" అని ప్రశ్నించాడు. అది విని, సభవారు గౌరవాదరము లుట్టిపడ, దశరథుని తో "మహారాజా! లోకాభి రాముడగు రాముడు, సర్వ గుణములచే కోరదగిన వాడై వెలలు చున్నాడు, మా కత్యంతము సన్నిహితుడై మహిత చరితమున మాన్యుడై, జగము నందంతట సంభావింప బడు చున్నాడు. మేము నిత్య మాతని సందర్శన సంసేవనములతో సంతుష్టుల మౌతున్నామని చెప్పారు. అతనిని చూడలేనివారు, అతనిచే చూడబడలేనివారు తమ దుర్దృష్టమునకు తమను తామే నిందించుకొను చున్నారని వివరించి నారు అంటే అట్లాంటి దెన్నడూ జరగదని అర్థం,

యశ్చ రామం న పశ్యేత్తు. యంచ రామో న పశ్యతి
నింది త స్సభవేల్లోకే, స్వాత్మాప్యేనం విగర్హతి॥

ఆహా! రాముడెంతటి ధన్యుడు. ప్రజాభి మానమును నెంతగానో చూరగొని ప్రజా ప్రతినిధులకెల్ల అగ్రేసరుడై, ఆదర్శ ప్రాయుడై నాడు. ఈ నాడు ఎందరు ప్రజా ప్రతినిధులు తమ నాలుగు గోడల పరిధి దాటి బయటకు వచ్చి ప్రజలందరికీ అందు బాటులో ఉండ గల్గు తున్నారు.? అందుకే దశరథు డానాడు ప్రజల హితము కోరి, ప్రజల కోరిక మేరకు వారికి ప్రియతము డగు రాముని పట్టాభి షేకమునకై యత్నించినాడు.

ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతి ప్రియ కామ్యయా ।
యౌవ రాజ్యేన సంయోక్తు మైచ్ఛత్ప్రీత్యా మహీపతిః

ఆ సభలోని వారింకా "రాముని గూర్చి దశరథునితో ఇట్లా అన్నారు. అవి నిజంగా ఉత్తమ నాయకుని లక్షణాలని తెలుస్తోంది. "రాముడు సత్పురుషుడు. సత్య ధర్మముల యందాసక్తి కలవాడు, శీలవంతుడు, అసూయారహితుడు, కర్తవ్య నిర్వహణమున ఒర్పు నేర్పులు కలవాడు, చేసిన మేలు మరువని వాడు, విజితేంద్రియుడు."

రామ స్స త్పురుషో లోకే సత్య ధర్మ పరాయణః ।
ధర్మజ్ఞ స్సత్య సంధశ్చ శీల వా ననసూయకః ॥

క్షాంత స్సాంత్వయితో శ్లక్ష్ణః కృతజ్ఞో విజితేంద్రియః

31 శ్లో॥

ముఖ్యంగా అతడు ప్రజల సుఖదుఃఖములలో పాలుపంచుకొంటూ మన, తన భేదములతో రాగద్వేషములకు లోబడకుండా, ప్రజాపాలన తత్పరుడై యొప్పు చున్నాడు.

వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖిత ః।
ఉత్సవేషుచ సర్వేషు పితేవ పరితుష్యతి ॥ 40 శ్లో॥
ప్రజాపాలన తత్వజ్ఞో నరాగోపహతేంద్రియ ః। 44 శ్లో॥

"కాంతములై, సర్వ ప్రజాకాంతములై, ప్రీతి సంజననములైన విశిష్ట లక్షణములతో రాముడు, కాంతికిరణములతో కూడిన సూర్యునివలె ప్రకాశించుచున్నాడు. (సూర్యునితో పోల్చుట వలన రాముడు స్వార్థ కల్మషాది దోష రహితుడై లోకమునకు మేలుగూర్చు చున్నాడనుట సూచింప బడుచున్నది.) అట్టి గుణ సంపన్నుడు, సత్యధర్మ పరాక్రముడు, మహేంద్ర తుల్యుడునైన రాముడు రాజు కావలెనని ఈ భూమి యంతయు కోరుచున్నది. అనగా ప్రకృతిలోని సర్వ ప్రాణులు ఆ వైభవము నభిలషించు చున్నవని భావము.

కాంతైః సర్వ ప్రజాకాంతైః ప్రీతి సంజననై ర్నృణాం
గుణై ర్విరురుచే రామో దీప్త సూర్య ఇవాంశుభిః।
తమేవం గుణ సంపన్నం రామం సత్య పరాక్రమం
లోక పాలోపమం నాథ కామయత మేదినీ॥

అట్టి రామునకు అయురారోగ్య సౌభాగ్య విశేష సంపదలు స్థిరములై ఉండవలెనని ఆ రాష్ట్రంలోని ప్రజలెల్లరు లింగ వయో భేదములు లేక ప్రతి నిత్యం సావధాన చిత్తం తో దేవతలను ప్రార్థించు చున్నారు.

ఆశంసతే జనా స్సర్వో రాష్ట్రే పురవరే తథా
అభ్యంత రశ్చ బాహ్యశ్చ పౌర జానపదో జనః
స్త్రీ యో వృద్ధా స్త రుణ్యశ్చ సాయం ప్రాతస్స మాహితః
సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే యశస్వినః॥

సభ్యులంతా ఏకగ్రీవంగా రాముని గుణగణము లిట్లు కీర్తించి, అట్టి రాముని రాజు చేయ సంకల్పించిన దశరథుని ఔదార్యం అభివర్ణిస్తూ "మహారాజా! మీరు ప్రజల కీ శుభ సమయాన అయాచితంగా రామాభిషేక రూపమైన అభిమతార్థాన్ని సిద్ధింప చేయటం ద్వారా కోర్కెలు సఫలీకృతం చేసారని" విశేషంగా అభినందించారు. ఈ రోజుల్లో నాయకు లెవ్వరు ఈ విధంగా ప్రజలందరి చేతా కోరబడుతున్నారన్నది విశేష ప్రశ్నగానే మిగిలి పోతుంది, ఆ రకంగా రాముడు లోకాభిరాముడై ప్రజల హృదయాలలో నిలిచి పోయాడు.

కారణాంతరాల వల్ల అప్పుడా రామ పట్టాభిషేకం జరుగక పోయినా, రావణ సంహారా నంతరం రాముడు రాజై రాజ్య ముపాసించి నాడు.

'రామోరాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి'

స్నేహ, దయా, సౌఖ్యములకు తావీయక తుదకు జానకిని కూడా విడిచి ప్రజాభిప్రాయమును మన్నించు ప్రజారాముడై లోకారాధన చేసి, ధర్మపాలనమున కృత కృత్యుడై రాముడు అఖండ కీర్తి నార్జించినాడు జగము రామ మయమైనది. ప్రజలా రాముని చూచి పరస్పర వైరములు మాని స్వధర్మ నిరతులై హింసా ప్రవృత్తి మరచి సంసృప్తి తో చిరకాలము సుఖశాంతుల ననుభవించిరి.

రామమేవా ఉ న పశ్యంతో నాభ్యహింసన్ పరస్పరమ్॥
రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః।
రామ భూతం జగ దభూత్ రామేరాజ్యం ప్రశాసతి।

తొలుత నయోధ్యలో రామాభిషేక సందర్భమున సర్వ తంత్ర స్వతంత్రుడైన దశరథుడేమి చేయదలచినను కాదను వారు లేరు. అయినను తన పుత్రుని రాజ్యాభిషిక్తుని గావించుట ప్రజాభిప్రాయమున కెంతటి ప్రాముఖ్యము నొసంగెనో ఇట గమనింప దగిన విషయము. అట్లే ప్రజాపాలనము చేయ బూనినవాడు ప్రజల సుఖ దుఃఖాలలో పాలు పంచు కొని, ప్రజాహిత కార్యక్రమముల ద్వారా ప్రజాభిమానాన్ని ఎలా సంపాదించుకోవాలో రాముని (నడవడి) ప్రవర్తన తెలియ జేస్తోంది. అదేవిధంగా ప్రజలు తమ నాయకుని ఎన్నుకోవటంలో ప్రదర్శింప వలసిన మెలుకువలు కోసల దేశ ప్రజల ఆలోచనా సరళి వివరిస్తోంది.

నేడు మన అభిప్రాయాన్ని ప్రకటించడానికి ఒకే ఒక మార్గం మనకున్న ఓటు హక్కు. అట్టి విలువ గుర్తించి, ఆ హక్కుని కుల, మత, ప్రాంత దురభిమానములకు లొంగిపోయి. తాత్కాలికమైన లాభ, లోభ దృష్టితో వ్యర్థము చేసికొని 'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండ బెట్టి నట్లైతే, తదుపరి మిక్కిలి బాధ లనుభవించటం, విచారిస్తూ కూర్చోటం, చేతులు కాలిన వెనుక ఆకులు పట్టు కున్నట్లే అవుతుంది అందువల్ల వివక్షణా జ్ఞానంతో లభించిన సదవకాశాన్ని సద్వినియోగ పరచుకొని నాయక నిర్ణయంలో సరియైన తీర్పు ఇచ్చే బాధ్యత ప్రతి పౌరునికి ఇప్పుడవశ్య కర్తవ్యం. అది మరువరాని మన ధర్మం.

అట్లా కానప్పుడు తన కన్ను తానే పొడుచు కున్న దురదృష్ట వంతుడు, తన ఇల్లు తానే తగుల బెట్టు కున్ననిర్భాగ్యుడు అవుతాడనటంలో ఏ మాత్రం సందేహం లేదు. పరోక్షంగా అది దేశ ద్రోహమే అవుతుంది.

తస్మాత్ జాగ్రత, జాగ్రత,

ఈ విధంగా రామాయణంలో వర్ణితమైన ప్రజాస్వామ్య పద్ధతి ప్రపంచ దేశాలకే కనువిప్పు కలిగించేదిగా ఉండటం భారతీయ సంస్కృతి యొక్క గొప్ప తనానికి ఒక నిదర్శనం. అది మన కందరికి హర్షదాయకం. ఆ విధంగా రామాయణం సమాజ దర్పణం అంటంలో అతిశయోక్తి లేదు.

ప్రజల బావింపు తత్త్వముకమే కొనుగావి,రా గోపహతి' దీవరంబు గనడు
క్రోధ ప్రాసాదముల్లోని మెలంగును గాని, వెడనాంటి జేకొని వెలితి పడడు
వధ్యుల దండింప వలను గాంచును గాని, యెందు నవధ్యుల యెడకు బోడు
గుణతుష్టిమై మేళ్ళ గురియించునే కాని, యెందు వ్యాజంబిడు నూహ బెరయ
డతని మేలుము లెన్నియో యభిను తింపదరమెసురలకు నాగుణధాము రాము
లోకనాథు నాథునిగాగ లోలయగుచు, గోరుచున్నది మేదిని కువలయేశ!

శ్రీ. రా. క. అయో. కాం. 1 ఆ. 116 ప.

అడుకొనెడు బాలురం దాలకాపరులందు దెసలనుండి యరుగుదెంచు
వారలం దున్నవారలయందును రాముచరిత మేకరసత నొందె

296 ప.

చిత్తస్థైర్యము

లోకంలో ఎవరైనా ఏదైనా ఆశించినప్పుడు అది తమ చేతి కందితే, జీవితంలో తాము కోరిన సుఖం అనుభవానికి వస్తే ఆనందం అర్ణవమై పొంగగా, ఆకాశపుటంచులు చూస్తారు. ఆ అమృతకలశం విందు అందుకుంటారు. పై పెచ్చు అదంతా తమ ప్రయోజకత్వమే అని ప్రచారం చేసుకుంటారు. అవకాశం లేక అనుకున్నట్లు జరగక పోతే ఆశాభంగం వలన ఏర్పడిన దుఃఖంతో క్రుంగి, కృశించి నశించి, పోతారు.

సుఖ దుఃఖాలకు పొంగటం, కృంగటం సామాన్యులకు సహజమే అయినా అట్టిది తగదని తెలిసిన అసామాన్యులు, మాన్యులు అయిన వారుకూడా ఒకప్పుడు ఆ ఆరాటంలోపడి కొట్టు మిట్టాడటం వివిధ రకాలైన ఆకర్షణలకులోను గావటం, తమకు తెలియకుండానే జరిగిపోతూ ఉంటుంది. ఆ విషయం తెలిసిన నాడది తల చుకుంటే తమ అవివేకం వ్యక్తమౌతుంది. సిగ్గేస్తుందికూడా, తాను తలచిందొకటి జరిగింది వేరొకటి అయినపుడు కలిగే వ్యథ అనిర్వచనీయం. అందుకే ఒక కవి "తల చినదే జరిగినదా, దైవం ఎందులకు, జరిగినదే తలచితివా శాంతి లేదు నీకు" అన్నది అక్షరాలా సత్యం.

ప్రపంచంలో కొందరు వీటన్నింటికీ అతీతంగా, ప్రజాసామాన్యం కంటె విలక్షణంగా వ్యవహరించటం కద్దు. వారే పురుషోత్తములుగా పరిగణింప బడతారు. తామున్న భూమి కదిలిపోయినా, పైనున్న మిన్నువిరిగి మీదబడ్డా కొందరితో ఏ వికారం ఏర్పడదు, గాంభీర్యం కొఱవడదు. అట్టివారు సంపదలకు, ఆపదలకు ఒకే రకంగా ఉంటారని చెప్తూ, ఉదాహరణగా ఉదయించేటప్పుడు, అస్తమించేటప్పుడు సూర్యుడు ఉండేతీరు ఒకటేనని పెద్దలు వివరిస్తారు.

''ఉదయే సవితా రక్తః రక్తశ్చాస్తమయే తథా ।
సంపత్తౌ చ విపత్తౌ చ మహతామేక రూపతా''

ఈ విషయంలో శ్రీ మద్రామాయణ మందలి అయోధ్యాకాండలోని శ్రీరామ పట్టాభిషేక ఘట్ట మొక ప్రసిద్ధ ఉదాహరణంగా తీసుకొనదగి ఉంది.

దశరథుడు తన తనయులలో జ్యేష్ఠుడు, గుణ గణములచే శ్రేష్ఠుడు అయిన రాముని అన్ని విధములా అర్హునిగా గుర్తించి, ప్రజాహితంకోరి, ప్రజల కిష్టుడైన రామునికి పట్టాభిషేకం చేయ సంకల్పించాడు. ప్రజలును అతని ఆలోచనను గట్టిగా బలపరచారు. ఏకగ్రీవంగా అంగీకరించారు.

కైక తండ్రి కేకయ మహారాజు. అతడు తన కూతుర్ని దశరథునకిచ్చేటప్పుడు ఆమెకు కలిగే సంతానానికే రాజ్యసింహాసనార్హత కల్పిస్తాననే మాట అల్లునివద్ద తీసుకున్నాడు. ఈ విషయం తక్కిన వాళ్ళకెవరికీ తెలియదు అయితే ఇప్పుడు కౌసల్య తనయుడైనరాముడికి పట్టం కట్టడం యోగ్యంగా దశరథుడు భావించాడు. ప్రజలదే విధంగా కోరారు. అందువల్ల కైక తనయుడు భరతుడు దూరంగా ఉన్న మేనమామల ఇంటినుండి రాకముందే రామాభిషేక కార్యక్రమం తొందరగా ముగించాలని అభిప్రాయపడి ఆ మర్నాడే ముహూర్తం నిర్ణయించాడు

ఆ ఉత్సవ విశేషాన్ని తెలియజేసేవార్త వెంటనే దేశమంతటా ప్రకటింపబడింది. అందుకు ప్రజలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. అయోధ్య అంతా అలంకరింపబడింది. ఆ సంరంభం చూసి కారణం తెలుసుకొన్న కైకదాసి మంథర (విషకంథర) అంతఃపురాని కేగి కైకను ప్రలోభ పరచి, దశరథుడు (దేవాసుర సంగ్రామ సమయంలో) పూర్వమామె కిచ్చిన వరముల నడుగుమని ప్రేరేపించింది. అందులో

1. రాముని వనవాసము
2. భరతుని పట్టాభిషేకము

దశరథుడు సామ, దాన, భేదోపాయములతో ఆమెను ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నించాడు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఆనాటి మాటకు కట్టుబడి, ఈనాటి తన మనోరథం సిద్ధింపక మథనపడ్డాడు. తుదకు నిర్వేదమునుపొంది, నిశ్చేష్టితుడై నేలపైబడి ఉన్నాడు

కైక సుమంత్రుని ద్వారా రాముని పిల్పించి తన అభిమతము తెలిపి, దశరథుని దుస్థితికి ఇదియే కారణమని వివరించింది. అదివిన్న రాముడు వనవాసమున కంగీకరించుచు "తండ్రియే చెప్పనవసరము లేదు. నీవు ఆజ్ఞాపించిన చాలును. మాఱుపలుకక నేను అతని అభిమతము నెరవేర్తు నన్నాడు.

తద్బ్రూహి వచనందేవి రాజ్ఞో యదభికాంక్షితమ్।
కరిష్యే ప్రతి జానామి రామో ద్విర్నాభి భాషతే ॥

నా తండ్రికి అసత్య దోషం రాకుండుటే నాకు ముఖ్యమని విన్నవించాడు, సంతోషంగా భరతునకు రాజ్యమిచ్చి నేనరణ్యములకు వెళతానని ప్రతిజ్ఞ చేశాడు. తన కంత కంటె ధర్మ మింకొకటి లేదని వివరించాడు. ఆ విధంగా రాముడు త్యాగశీలంతో, ఆత్మ నిగ్రహంతో కుటుంబ కలహం రాకుండా సద్దుబాటు చేయటానికి ప్రయత్నించాడు.

"నాహ మర్థ పరోదేవి। లోకమా వస్తు ముత్సహే ।
విద్ధిమా మృషిభి స్తుల్యం కేవలం ధర్మ మాస్థితమ్ ॥"

రాముడు "తాను కేవలం అర్థపరుడై రాజ్యమున నుండుటకు ఇష్టపడక లోకావనము మనమున నిడుకొని ఋషులవలె ధర్మమును మాత్రమే ఆశ్రయించి యున్నా"నని ప్రకటించాడు. ఋషులు రాగద్వేషములకు అతీతులు. రాముడు నట్టివాడే యనుట ఇందలి విశేషము

రాజ్యాభిషేక వనవాసములు రెండునూ ఒకటిగా చూడ కలిగిన ధీరుడు రాముడు. కావుననే అతడు పురుషోత్తముడు. అట్టియెడ రాముని మానసికమైన స్థితిని వర్ణించుచు వాల్మీకి అతని యందెట్టి వికారము తోచుట లేదని చెప్పి రాముడు లోకోత్తర గుణోత్తరుడని నిరూపించాడు.

"నవనం గంతు కామస్య త్యజ తశ్చ వసుంధరామ్ ।
సర్వలోకాతి గస్యేవ లక్ష్యతే చిత్త విక్రియా॥"

సిద్ధి, అసిద్ధి అను వాని వలన కలుగు సుఖ దుఃఖములు రెండునూ సమముగా స్వీకరించుటే యోగము. దానినే "సమత్వం యోగ ఉచ్యతే" [48-2] అను గీతా శాస్త్రవచనము నిర్వచించుచున్నది. శ్రీరాముడు చిత్తస్థైర్యము కలిగిన మహాయోగి "వ్యక్తమేష మహాయోగి". (11-111-6) అతడు కార్యశూరుడు. ధర్మవీరుడు.

కావుననే అతని తల్లి కౌసల్య రాముని ధార్మిక నిష్ఠకు సంతసించి తనయుని వనవాసమున కనుమతించుచూ నీ ధర్మమే నిన్ను రక్షించుననని దీవించి పంపించింది.

"యం పాలయసి ధర్మం త్వం ధృత్యాచ నియమేనచ ।
సవై రాఘవ శార్దూల! ధర్మ స్త్వా మభిరక్షతు॥" (3-25-2)

లోకంలో క్రియాశీలి యై ఒక డొక ధర్మ కార్యమును నిర్వహింప వలె నన్న అతడు ఎంతో ధైర్యమును, ఎన్నో నియమములను పాటింప వలసి ఉంటుంది. ఆ విధంగా చేసిన నాడు ఆ ధర్మమే వానిని రక్షిస్తుంది. ఆ విషయం వాల్మీకి ఈ సందర్భములో కౌసల్య మాటలలో చక్కగా వివరించాడు. ఏ వృత్తిలో నైనా తమ కర్తవ్యాన్ని నిష్ఠతో ఆచరించువారు అందరిలో ఉత్తములుగా పరిగణింప బడి లోకంలో గణన కెక్కటం చూస్తున్నాం. రామాయణేతిహాసం ఈ రీతిగా లోక వృత్తాన్ని నిరూపిస్తోంది. ధర్మ స్వరూపాన్ని ప్రతిపాదిస్తోంది. ఆచరించమని ప్రబోధిస్తోంది.

అట్టి ధర్మా చరణమునకు ఏ రకమైన లాభాలకు, ప్రలోభాలకూ లోబడని, నిర్భయమైన, నిలకడైన మనసు కావాలి దాన్నే 'చిత్త స్థైర్యం' అంటారు. అప్పుడెట్టి కష్ట నష్టాలు వచ్చినా అవి మనసును చలింప వేయ జాలవు. నాడు రామునిలో ఆ స్థితి పరిపూర్ణత చెందింది. కావుననే గుండె నిబ్బరం కలిగిన ఆ రాముని చరిత్ర మనకు నిత్య జీవితంలో మార్గదర్శక మవుతోంది.

ఆ రూపుగను భాగ్యమబ్బుచో(గనులకు. జెప్పలతో వైరముప్పతిల్లు
నాభీరమున కల్మినరయుచో(బగఱకు శస్త్రగ్రహణవాంఛ సడలిపోవు
నా యక్కటికపు(బెంపందుచో సంభ్రంబు, లేదు నొక్కండుగా నెయిద(జూమ
నా యోర్పుతీ ర్వెంచుటలవడునో(గ్రూర, సత్త్వమ్ములకు(జిత్తశాంతివొడము
నతని కుపమాన మున్నదే యతనికతఁడె, సాటియనవచ్చు(గాక ముజ్జగములందు
దశరథుండ(టతానె యీ దశరథునకు(దనయు(డై పుట్టెన(ట సుకృత బకాదె.

శ్రీ.రా క., అయోకాం, 1 ఆ. 33 ప.

పెద్ద సహోదరావళిని(బెద్ద గొనంబుల(బెద్ద విద్దెలన్
బెద్ద విలాసవై ఖరుల(బెద్ద ధనుష్మదుదూధ విక్రమం
బెద్ద త్రిలోకమోహన నవీన కలాంచిత రూపరేఖలం
బెద్దలకెల్ల(బెద్ద పృధివీవర! రాము(డు రాము(డన్నిటన్

శ్రీ. రా. క., బా కాం. 7 ఆ. 200 ప.

ప్రత్యక్ష దైవాలు

ఈ చరాచర జగత్తంతా నిండి, ప్రకాశిస్తున్న చైతన్యమే సకల ప్రకృతికి మూలం. పరిమిత శక్తితో గూడిన ఏ భౌతిక దృష్టికి కనబడని ఆ అనంత శక్తి నే పెద్దలు 'దైవం' అన్నారు. అదిసచ్చిదానంద రూపమనివారిచేవర్ణింప బడింది. ఆకాశం నుండి పడిన [వర్షం] నీరు జాలై వెల్లువై వాగుగా మారి, ఏరుగా పాఠి సముద్రంలో కలిసినట్లు,[ఆకాశా త్పతితం తోయం యథాగచ్ఛతి సాగరమ్]ఎవరే పేరుతో పిలిచినా ఏ విధమైన ఆరాధనా విధానాన్ని అనుసరించినా అది అదృష్టమైన ఆ వ్యక్తి కే చెందు తుంది. ఇంక తక్కిన వివిధ నామ, రూప, లింగ, జాతి, వయో భేదములు మనము కల్పించు కున్నవే కదా! లోకాతీతమైన ఆ దివ్యశక్తి మరో లోకంలో ఉంటుందని, అది ఈ సర్వ సృష్టికి సాక్షిగా నిలబడు తుందని, ఆ విషయమై సాధన చేసి, అతీంద్రియ శక్తితో [యోగ మార్గంద్వారా] పరిశోధన చేసిన సంయ మీంద్రులు కొందరు మాటలకు, మనసులకు అందని ఆ తత్త్వాన్ని ఆవిష్కరించటానికి, అందరికి అందు బాటు లోకి తేవటానికి అనేక విధాల ప్రయత్నించారు.

అట్టి పరలోకం [అస్తి] ఉన్నదన్నవాడు ఆస్తికుడయ్యాడు. [నాస్తి] లేదన్న వాడు నాస్తికుడయ్యాడు. ఈ భావ భౌతిక వాదాలు రెండూ అనాదిగా సాగుతున్న వివాదాలే. ఆయా విషయాలతో 'దర్శనము' లే వెలవడటం అందుకు నిదర్శనం. అందువల్ల ఆ చర్చ ఇక్కడ అనవసరం. ఎవరి అభిమతం వారిది. భారతీయ సంస్కృతికి వేదమే మూలం కాగా రామాయణ, భారత, భాగవతాది ఇతిహాస, పురాణములు ఆయర్థాన్నే వివరిస్తున్నాయి. ఆస్తికత్వాన్నే బలపరుస్తున్నాయి. అందులో భాగవతం భక్తి భావానికి పట్టం కట్టింది.

అంతరంగం లోకి తొంగి చూడలేక, ఈ చర్మ చక్షువుల తోనే అంతటా వెతికి [వైకుంఠానికి కూడా వెళ్ళి] విసిగి వేసారి కడకు శ్రీహరి ఎక్కడా లేడు లేడన్న హిరణ్య కశిపునకు భక్తి భావ నిబద్ధుడైన ఆ భగవంతుడు అన్నిటా ఉన్నాడని నిరూపించాడు ప్రహ్లాదుడు. తొలుత "కలడు కలండనెడు వాడు కలడో? లేడో?" అని సందేహించిన గజేంద్రుని హృదయంలో విష్ణు భక్తి రూపమగు సంస్కారం "లోకంబులు, లోకేశులు, లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల నేకాకృతియై

వెలుంగు నవ్వాని [పరమేశ్వరుని] గూర్చిన మేలి తలపులను స్థిరముగా వెలయింప జేసింది అట్టివి ఆయా జీవుల అర్హతలను బట్టి సిద్ధిస్తుంది. ఈ లోకము యొక్క సృష్టి, స్థితి, లయములా భగవంతుని లీలలుగా అందులో వర్ణితములైనాయి. ఇంక ఇతరములకు అనుభవాలతో కూడిన తమ తమ అంతరం గాలే సాక్షి. శిష్టా చార ములే ప్రమాణములు.

పరలోక, దేవతా విషయము లట్లుండ, ఇహ [ఈ] లోకమున ప్రాణుః కు జన్మ నిచ్చునది తల్లి దండ్రులు. జ్ఞాన జన్మ నిచ్చునది గురువు. కావున వీరు ముగ్గురు భువిపై దైవములుగా సంభావింప బడుచున్నారు. భారతీయ వైదిక వాఙ్మయం ఈ విషయాన్నే ఉపనిషద్వాణి ద్వారా "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" అని శాసించింది. ప్రాచీన లౌకిక వాఙ్మయం అంతా అడు గడుగునా ఆ సత్యాన్నే నిరూపించింది.

ప్రపంచంలో ఒక జాతి యొక్క ఔన్నత్యాన్ని గుర్తించాలంటే అచ్చట వెలసిన సాహిత్యము యొక్క విలువలను బట్టి మాత్రమే సాధ్య మౌతుందని చరిత్ర గతి పరి శీలించిన పెద్దలు నిర్వచించారు.

అయితే నేడు ఇజాల పేరుతో, నిజాన్ని మరుగు పరచి, అదో విధమైన నవ నాగరికతకు వరవడి దిద్దుతున్న ఆ వినూత్న సమాజ నిర్మాతలు కొందరు, తల్లి దండ్రులు, గురువు మొదలైన వారితో గల అను బంధాన్ని వ్యాపార సంబంధంగా ఆలో చించే స్థాయికి ఎదిగారన్నప్పుడు అది మానవత్వానికి తిరోగమనమో, పురోగమనమో తెలియని అయోమయ స్థితిగా ఉంటుందని చెప్పక తప్పదు. ఏవో కొన్ని అవక తవక లున్నాయని ఇప్పు డున్న వ్యవస్థను సద్దుబాటు చేయటం మానేసి, దీన్ని సమూలంగా నాశనం చేసి, అ సమాధుల నుండి నూతనత్వాన్ని ఆశించటంలో ఏ పాటి సమంజసం ఉందో విజ్ఞులు ఆలోచించాలి. బూజు పట్టిందని నివాస గృహాన్ని పాడుపెట్టం, జ్వరం వచ్చిందని ప్రాణం పోవాలని కోరుకోం. బాగు చేసుకోటానికి ప్రయత్నించటం అనుభవ లోకంలో గమనింపగలం ఎలుక లున్నాయని ఇంటికి నిప్పంటించు కునే మూర్ఖుడుండడు కదా!

పవిత్ర మగు రామ చరిత్ర పరిశీలించినప్పుడు తల్లి, తండ్రి, గురువు అను వారి ముగ్గురిని ప్రత్యక్ష దైవాలుగా సంభావించిన తీరు మనం గమనింప గలుగుతాం.

కైక కోరిన వరాలను బట్టి, రాముడు అరణ్య వాసమునకు పోవలసి వచ్చి నప్పుడు "భరతునకు రాజ్యమును విడిచి సంతోషంతో తానడవులకు వెళ్ళగలనని చిన్నవిస్తూ, పుత్రునకు పితృవాక్య పరిపాలనమున కంటె మహత్తరమైన ధర్మం వేరే లేదని" రాముడన్నట్లు రామాయణంలో వర్ణింప బడింది.

> "నహ్యతో ధర్మాచరణం, కించి దస్తి మహత్తరమ్ ।
> యథా పితరి శుశ్రూషా, తస్యవా వచన క్రియా" ॥
>
> అయో. కాం. 22 - 19

ఈ ఘట్టంలో రాముని శీల సంపద, పితృ భక్తిపరాయణత్వంతో బాటు అతని ఆత్మ నిగ్రహం, ధార్మిక శ్రద్ధ ఎంతగానో వెల్లడి అవుతున్నాయి.

అట్లే తన వనవాస గమనమును గూర్చి సీతతో ప్రసంగిస్తూ రాముడు "తాను పితృాజ్ఞా పాలన రూపమగు ధర్మమును విడిచి జీవింప జాల" నని ఉగ్గడించాడు. అంటే ధర్మమే రాముని ఊపిరన్న మాట అందుకే "రామో విగ్రహవాన్ ధర్మః" అని వాల్మీకి అతనిని వర్ణించాడు. "ఏషధర్మస్తు సుశ్రోణి! పితు ర్మాతుశ్చ వశ్యతా ఆజ్ఞావాహం వ్యతిక్రమ్య నహి జీవితు ముత్సహే" ॥ [32 - 30 - 2]

"ప్రత్యక్షమున నున్న దేవతలు తల్లి, తండ్రి, గురువు వీరిని విడిచి, మన యధీ నమున లేని దేవతలను ఏ విధంగా ఆరాధించి సంతోష పెట్టగలం? [అతి శేషప్రశ్నే] దేవతల అగ్రహ–అనుగ్రహములు మన కంటికి కనబడేవి కాదు కదా! అందువల్ల పై ముగ్గురిని సేవించి, వారి అనుగ్రహం పొందటం సులభ తరమని, అదియే సనాతన ధర్మ "మని రాముడు వివరించాడు. ఇదికాని నాడది సాధ్యం కాదనే అర్థం కూడా ఇందులో స్ఫురిస్తోంది. అంతేగాక ఇది అనివార్యమనే విషయం హెచ్చరిస్తోంది భారతం లోని కౌశిక, ధర్మవ్యాధుల చరిత్రలు ఇందుకు వ్యతిరేక అన్వయ ఉదాహరణలుగా పరిగణింప బడ్డాయి. ఇతర సంస్కృతులలో ఇట్టి[స్పృహ] ఆలోచనా పద్ధతి కానరాదు.

"వారు ముగ్గురు ఎక్కడ పూజింప బడతారో అచ్చట ముల్లోకము లేకమె ఉంటాయని, అట్టి పవిత్ర మగు ప్రదేశమునకు సాటి ఈ భూమి మీద మఱియొకటి లేద" ని రాము డభివర్ణించాడు.

"అస్వాధీనం కథం దైవం ప్రకారైరభి రాధ్యతే ॥
స్వాధీనం సమతి క్రమ్య మాతరం, పితరం, గురుమ్" ।।

"యత్ర త్రయం త్రయోలోకా పవిత్రం తత్సమం భువి ।
నాన్య దస్తి శుభాపాంగే! తేనేద మభిరాధ్యతే" ।।

అయో. కాం. 3౦స. 33, 34 శ్లో॥

"మాతా పితా గురవశ్చైవ స్వభావా త్రితయం హితమ్" అనటం బట్టి వారు ముగ్గురు స్వభావంచేత మనహితం కోరుతారన్నది నూటికి నూరు పాళ్ళు నిజం. అందుకే వారికా గౌరవం లభించింది. ఆ ఔచిత్యం గుర్తించి రాముడది ఆచరించాడు.

ఇట్టి ధర్మ సూక్ష్మం వివరించిన భారతీయ సంస్కృతి ఈ భూమండలం లోనే విశిష్టమై, నిజంగా పవిత్రతను కలిగి ఉన్న దనటం సత్యదూరం కాదు. ప్రపంచంలోనే పరమ గురు పీఠా న్నలంకరించునట్టి ఈ సంస్కృతికి మనం వారసులం కావటం మన అదృష్టం. అనన్య చిత్తంతో అట్టి మనధర్మాన్ని ఆచరించి ధన్యుల మగుటకు యత్నించెదము గాక.

దాతృత్వం, ప్రియ వక్తృత్వం, ధీరత్వ ముచితజ్ఞతా ।
అభ్యాసేన నలభ్యంతే, చత్వార స్సహజాగుణాః ॥

తుడు అందులకు అంగీకరింప లేదు. రాముడే రాజ్యార్హుడు. కావున అతనిని అయోధ్యకు రమ్మని. పట్టాభిషిక్తుడవు కమ్మని అర్థించి తీసుకువస్తానని సపరివారంగా తాను రాముడున్న చిత్రకూటానికి పయన మయినాడు. ఎన్నో విడుదులుచేసి, ఎంతో ప్రయాసతో చిత్రకూటం చేరబోయాడు.

ఆ అరణ్యంలో సైన్య కలకలం విన్న లక్ష్మణుడు కలతపడి అక్కడున్న ఒక పెద్ద చెట్టెక్కి చూచి, దూరంగా ఆ వస్తున్నది అయోధ్య సేనావాహినిగా గుర్తించాడు. భరతుడు ద్రోహ బుద్ధితో వస్తున్నాడని భ్రమపడి ఆతడు రామునితో "అన్నా నిన్ను వధించి సింహాసనాన్ని నిష్కంటకం చేసి శాశ్వతంగా రాజ్య సుఖా లనుభవించాలనే దుష్ట బుద్ధితో భరతుడు వస్తున్నట్లున్నాడ"ని విన్నవించాడు.

అది విని రాముడు "లక్ష్మణా ! మొదటి నుండి భరతుని సౌశీల్యం మనకు తెలియంది కాదు. అతడెప్పుడూ ఆ విధంగా ప్రవర్తింపడు. మనలను అయోధ్యకు రమ్మని ఆహ్వానించటానికే వస్తున్నాడని నేననుకుంటున్నాను. ఆ విధంగా భరతుని అంతరంగాన్ని శంకించిన నీకు ఏమైన రాజ్యకాంక్ష ఉంటే చెప్పు. ఆ విషయం అతనికి చెప్పి, ఒప్పించి, రాజ్యం నీకు ఇప్పింప గలను" అన్నాడు. సోదరుడైన భరతుని గూర్చి లేనిపోని (అపోహ) పాప భావన తనకు కలిగినందుకు అప్పుడు లక్ష్మణుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఈ సందర్భంలో రాముడు తన నిస్స్వార్థాన్ని వివరిస్తూ "లక్ష్మణా ! నీకు, భరతునకు, శత్రుఘ్నునకు కానిది, లేనిది అయిన సుఖం ఏదైనా ప్రత్యేకించి కొంచెం నాకంటూ ఉంటే అగ్ని హోత్రుడది దహించును గాక ! అని ప్రతిజ్ఞ చేశాడు.

యద్వినాభరతం త్వాంచ శత్రుఘ్నంవాఽపి మానద !
భవేన్మమ సుఖంకించి ద్భస్మతత్కురుతాంశిఖి !! (8–97–2)

ఇట్టి సంభాషణ రాముని నిస్స్వార్థ బుద్ధికి, త్యాగ భావమునకు, సోదరులయెడ అతనికిగల సమతా మమతలకు పరాకాష్ఠగా ఎన్నబడుతోంది. సామాన్యుల కది అందలేని అలభ్యం.

భరతుడు మరునాడు సభచేసి రామునయోధ్యకు రమ్మని ప్రార్థించాడు. అతడు రాకపోతే నిరాహారదీక్ష చేస్తానని పట్టుబడతాడు. రాముడా సమయంలో,

తానెన్నడూ పితృాజ్ఞను దాటనని చెప్తూ, దాని ప్రకారం తన అరణ్యవాసం ఎంత ముఖ్యమో, భరతుని పట్టాభిషేకం కూడ అంతే ముఖ్యమని వివరిస్తాడు కైక వరాలలో ఈ రెండూ ప్రధానములే. ఇందులో ఏది జరుగకపోయినా తండ్రి మనసు నొచ్చుకుంటుందని. అతడు మాట తప్పినవా డవుతాడని బాధపడతాడు. ఒకవేళ చంద్రుడు తన కాంతిని విడిచినా, హిమవంతుడు తన చల్లదనాన్ని మరచినా, సముద్రుడు తన చెలియలి కట్టదాటినా, తాను మాత్రం తండ్రిమాట జవదాటనని రాముడు ఆ సందర్భంలో తన నిర్ణయం వివరిస్తాడు.

లక్ష్మీశ్చంద్రా దపేయాద్వా, హిమవా న్వా హిమంత్యజేత్ ।
అతీయాత్ సాగరో వేలాం, నప్రతిజ్ఞా మహం పితుః ॥ (1-122-2)

అందువల్ల "నీవు అయోధ్యకు పోయి పట్టాభిషిక్తుడవయి, ప్రజల పాలింపు" మని రాముడు భరతునితో అంటాడు. అందుకు అర్హుడవు నీవే నంటాడు భరతుడు. ఎట్టకేలకు రామునితో "నీవు రాకున్న నీ పాదుక లయిన ప్రసాదింపుమని అర్థించాడు భరతుడు." తాను కేవలం రాముని ప్రతినిధిగానే ఉండి ప్రజాపాలన సాగిస్తానని విన్నవించాడు. ఈ వనవాస కాలం (14సం॥) ముగియగానే రాము డయోధ్యకు వచ్చి, రాజ్యభారాన్ని స్వీకరించక పోయినట్లైతే తానగ్ని ప్రవేశం చేస్తానని తన నిర్ణయం ప్రకటించాడు.

భరతుడు భక్తి భావంతో రామపాదుకలు గ్రహించి, నంది గ్రామానికి చేరి, పాదుకలకు పట్టాభిషేకం చేసి రాముడు వనవాసం చేస్తున్నప్పుడు ఏ విధంగా నార చీరలు ధరించి, కంద మూలములు భుజించి, నియమంగా జీవితం గడుపుతున్నాడో తాను గూడ అట్లే నియమంగా జీవిస్తూ, రాముని ఆగమనాన్ని ఎదురు చూస్తూ ప్రజాపాలన స్వామి కార్యంగా భావించి, కడు భక్తితో నిర్వర్తించాడు.

పదునాలుగేండ్లు ముగిసినంత రాముడు అయోధ్యకు రావటం ఆలస్యమౌతోందని, భరతుడు చితి పేర్చుకుని అందులో ప్రవేశించటానికి ఉద్యమించాడు.

లోక కంటకుడైన రావణుని సంహరించి రాముడు సుగ్రీవ, విభీషణులతో గూడి సపరివారుడై అయోధ్యకు వస్తూ మార్గమధ్యంలో భరద్వాజ మహర్షిని సంద

నిస్స్వార్థం

"అర్థం" అంటే ప్రయోజనం. "స్వార్థం" అంటే సొంత ప్రయోజనం లోక వ్యవహారాలన్నీ సామాన్యంగా స్వార్థంతోనే ముడిపడి ఉంటాయి. "సర్వం స్వార్థం సమీహతే" అన్నది ఈ విషయంలో మాఘ కవి వచనం. ఎంతటి మందబుద్ధి అయిన ఏదో ఒక ప్రయోజనం లేకుండా ఏ పనీ చేయక పోవడం అనుభవంలో ఉన్న విషయం. "ప్రయోజన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే" అన్నది అభిజ్ఞుల అభిభాషణం. అటువంటప్పుడు వ్యవహార చతురులైన వారిని గూర్చి వేరే చెప్ప నవసరం లేదు కదా. ఇది ప్రాణులన్నింటికి సహజ ధర్మం.

భౌతిక దృష్టితో అన్నోదకములు సంపాదించుకోనటం ప్రయోజకత్వంగా చెప్పబడుతోంది. పశుపక్ష్యాదులు అంతటితో సంతృప్తి చెందుతున్నాయి. బుద్ధి జీవియగు మానవుడు అట్లా కాక తరతరముల వరకు సంపాదించి పెట్టాలనే లక్ష్యంతో అతిగా ప్రవర్తించటం వలన అనేక సమస్య లెదురౌతున్నాయి. అందుకే స్వార్థం పెచ్చు పెరుగుతోంది. ఇతరుల ప్రయోజనం భంగపరచి అయినా తన సంకల్పం నెరవేర్చుకోవటం కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. ఒకప్పుడు తన కెట్టి లాభం లేకున్నా ఈర్ష్యా-అసూయలతో ఎదుటివారి పనులు భంగపరచటమే కర్తవ్యంగా ఎంచే వారు లోకంలో లేక పోలేదు. అది అధముల పద్ధతి.

ఈ స్వార్థం తల్లి, తండ్రి, తోడూనీడా, ఇరుగూ పొరుగూ, అను విచక్షణా జ్ఞానం నశించేలా చేస్తుంది. ముఖ్యంగా స్వార్థపూరితమైన ఈ స్పర్ధ దాయాదులలో ఏర్పడటం లోక ప్రసిద్ధం. అట్టి జ్ఞాతి ఉండగా నిప్పుతో పనిలేదని "జ్ఞాతిశ్చే దనలేన కిమ్" అని భర్తృహరి వివరించాడు ఈ సూక్తిని భట్టుమూర్తి తన వసు చరిత్ర ప్రబంధంలో గిరికా విరహవర్ణన ఘట్టంలో సందర్భ సుందరంగా నిబంధించాడు.

తొలుత దాయాదుల మధ్య అభిప్రాయభేదం వలన ఏర్పడిన సంఘర్షణ "ధర్మాధర్మ పరమై" దేవాసుర సంగ్రామంగా పరిణమించింది. అనాడు ప్రారంభమైన ఈ దాయాదుల పోరాటంతో లోకంలో రాచరికములు అంతరించాయి.

రాజ్యాలే పూర్తిగా నశించాయి. ఎన్నో కుటుంబాలు కూలిపోయాయి. అధికార కాంక్షతో, ధన వాంఛతో తండ్రిని, సోదరులను చెఱసాలలో బంధించికాని, చేజేతులా వధించి కాని పదవిలోకి వచ్చిన చరిత్ర పురుషులు ఎందరో ఉన్నారు. దాయాదుల నడుమ కలిగే అసూయా జనితమైన ఈ పాపభావన అగర్భ శత్రుత్వంగా వర్ణించటం జరిగింది.

పితృ సత్యవాక్య పరిపాలనముకై అడవులకుపోవ నిశ్చయించిన రామునితో లక్ష్మణుడు క్రోధోద్రేకములు ఉట్టిపడ "అన్నా ! కామవశం వదుడైన ఈ ముదుసలి తండ్రి మాట పట్టుకుని నీవు వనవాసమునకు పోవలదు. నే కత్తిపట్టి నిలుచుండ, తండ్రి నుండి రాజ్యాధికారము బలవంతముగా తీసుకొని సింహాసనం అధిరోహింపుము, ఈ కోసల దేశమున అందుకు సమ్మతింపక ఎదురుతిరిగిన వారినెల్ల నిరోధించి తెగవేయుదు" నన్నాడు. అది విన్న రాముడు లక్ష్మణుని శాంతవచనముల సమాధానపరచి ఏది ధర్మయుక్తమో అది మాత్రమే ఆచరింప మనకు తగి ఉన్నది. కేవలము అర్థమును (ధనము) కాని, కేవలకామమును (కోరిక) కాని ఆశ్రయించినవారు లోకమున నింద్యార్హులగు మన్నారని వివరించాడు. అంతే కాక మనం ఇప్పుడు పరాక్రమంతో రక్తపాతం జరిపి, అధికారాన్ని చేజిక్కించుకొన దలచుకుంటే తండ్రిని, తక్కిన బంధువులను, మిత్రులను సంహరింప వలసి వస్తుంది. అట్లా సంపాదించిన అధికార సంపదలు మనకు తృప్తినీయ జాలవు. "ఆరునెలలు సాముచేసి మూలనున్న ముసలమ్మను చావమోదాడ"న్నట్లు, మన పరాక్రమం అస్థాన పతితమై అపహాస్యంపాలు కారాదని ధర్మాన్ని వివరించి రాముడు వనవాసము చేయడానికే నిశ్చయించుకొని సీతా, లక్ష్మణులు వెంటరాగా అయోధ్యవిడచి, వెళతాడు.

తండ్రి ప్రతిష్ఠ నిలబెట్టేవాడు కొడుకు. కొఱగాని వాడు కొడుకు కానేకాదు. యోగ్యుడైన తనయు డొక్కడుంటే చాలదా ! మంచి గంధం చెట్టు వనానికంతా పరిమళాన్ని వెదజల్లినట్లు, రాముడిట్లు ధర్మ నిష్ఠతో పదిమంది పొగిడే రీతిలో ప్రవర్తించాడు. అట్టి సుగుణ సంపన్నుడైన పుత్రుడు రాముని వియోగమును భరింపజాలక దశరథుడు ఇహ లోకాన్నే విడచి వెళతాడు. వశిష్ఠాదులు (మంత్రి వర్గం) భరతుని పిలిపించి దశరథుని భౌతికకాయానికి దహనసంస్కారాదులు నిర్వర్తింపజేసి. భరతుని పట్టాభిషిక్తుడవై ప్రజల సుఖముగా పాలింపుమని పభాముఖంగా కోరారు. భర

ర్శింప ఆముని ఆశ్రమముజేరి ముందుగా హనుమంతుని ద్వారా భరతునికి తన రాక తెలియ జేస్తాడు.

రామాగమన వార్త విని భరతుడు ఎదురేగి ఆనందోత్సాహములతో రామునికి స్వాగతం పలుకుతాడు. ఇంతకాలం తన వద్ద న్యాస భూతంగా ఉన్న రాజ్యభారం రామునికి కప్పగించి నిశ్చింతతో రామసేవాపరాయణుడై శుభచరితుడు భరతుడు కాలం గడుపుతాడు. పట్టాభిరాముడు ప్రజారంజకంగా రాజ్యం పరిపాలిస్తాడు.

ఈ అన్నదమ్ములలో ఎవ్వరే కొంచెం స్వార్థభావంతో ప్రవర్తించినా అక్కడ రక్తపాతమే సంభవించేది. వీరి ఇరువురిలోని పరస్పర త్యాగ భావన అదర్శ సౌభ్రాతృత్వాన్ని నిరూపిస్తోంది.

అన్న దమ్ములు చేనుగట్టు దగ్గరో, సరిహద్దు గోడ దగ్గరో, తగాదాపడి తలలు పగుల గొట్టుకొని, వీధుల కెక్కి, కోర్టుల పాలై, ధనం కోల్పోయి, హీనంగా జీవనం గడుపుతున్న కుటుంబాలు ఈ నాడెన్నో లోకంలో ఉన్నాయి. తనకున్నది ఒక్క కన్ను అయినా పరవాలేదు ఎదుటి వాడికి అసలు చూపు ఉండటానికి వీలు లేదన్నది ఆతత్త్వం. రామ చరిత్ర ఇటువంటి వారికి ఏమైనా ఉపకరిస్తుందేమో ఆలోచించాలి. సామాజిక స్పృహతో సోదరుల సహజీవనాన్ని ప్రోత్సహించి ఈ విధంగా ధర్మాన్ని చాటి చెప్పేది రామాయణం. ఒక రకంగా అది మానవాభ్యున్నతికి తోడ్పడే సాంఘిక శాస్త్రం.

విశ్రవో బ్రహ్మకు భరద్వాజ తనయయైన దేవలిని యందు పుట్టినవాడు కుబేరుడు. తండ్రి అతనికి విశ్వ కర్మ నిర్మితమైన లంకాపట్టణాన్ని, పుష్పక విమానాన్ని ఇచ్చాడు. కుబేరుడు తపస్సు చేసి. బ్రహ్మ అనుగ్రహం వలన 'ధన పతిత్వం' కూడా పొందాడు.

తర్వాత విశ్రవో బ్రహ్మకు 'కైకసి' యందు పుట్టినవారు రావణుడు, అతని సహోదరులు. అందు వల్ల కుబేర రావణు లిద్దరు అన్న దమ్ములు, దాయాదులు. రావణుడు తపో బల గర్వితుడై జ్ఞాతి వైరమును పురస్కరించు కొని 'అన్న' అని అయినా ఆలోచింపక కుబేరుని తన్ని తరిమి అతని లంక నాక్రమించి, పుష్పకమును స్వాధీన పరచు కున్నాడు.

అంతే కాకుండా సీతాపహరణం తగిన పని కాదని అయశస్యం (అపకీర్తి) అనాయుష్యం అయిన పరదారాభి మర్శనం [పరస్త్రీ వ్యామోహం] కూడదని హితవు చెప్పిన సహోదరుడు [తమ్ముడు] విభీషణుని మాటలు అప్రియములై తోప, అతనిని సింహాసనం నుండి క్రిందకు లాగి, నేలపై పడ త్రోసి, దుర్భాషలాడి తన రాజ్యము నుండే వెడల గొట్టాడు. ఇట్టిది రావణుని భ్రాతృత్వము. ఇట్టి దుష్ట ప్రవర్తనకు స్వార్థమే ప్రధానము. తన ఒక్కని సుఖం కోసం రావణుడు లంకను తోటి రాక్షసులను బలిచేశాడు. అనాడు రాముని అడవులకు పంపుమని వరమడిగిన కైక ఆలోచనలో కూడ ఇట్టి స్వార్థమే గూడు కట్టుకొంది.

కేవల అర్థపరులగు కైక వంటి వారును, కామ పరులగు రావణుని వంటి వారును, లోకంలో నిందలు మోయటం, అపకీర్తి పాలవటం చూస్తూనే ఉన్నాం. స్వార్థం విడివి రాముడు ధర్మ నిర్వహణకై అర్థ కామములను రెంటిని పరిత్యజించాడు. చేతికొచ్చిన రాజ్యాన్ని, కోరివచ్చిన కాంతను [శూర్పణఖ] లెక్కింపక [అధర్మములని] త్రోసి పుచ్చాడు. అదీ కాకుండా తన వనవాసానికి కారణమైన కైకను నిందిస్తున్న భరతునితో "కోపం విడిచి ఆమెను తల్లిగానే గౌరవింపుమని చెప్పి అది తప్పితే తనమీద, సీతమీద ఒట్టే"అంటాడు "మాతరం రక్ష కైకేయీం, మా రోషం కురు తాంప్రతి, మయాచ సీతయాచైవ శప్తోఽసి రఘునందన". స్వార్థ రహితుడైన రామునికి ఈ క్షమాగుణం మణిభూషణమై మరింత ప్రకాశము నిచ్చింది.

ఇంతకు స్వార్థం అనర్థం. అందుకు కైక చరిత్ర, రావణుని వినాశనం ప్రబలమైన ఉదాహరణము లవుతాయి. నిస్స్వార్థ బుద్ధియగు రామునకు శాశ్వత కీర్తితో పాటు సమస్త భోగాలు లభించినట్లు వింటున్నాము. ఇదే రామాయణ కథాసారం. ఇదే జాతికి ఆకడిచ్చిన ప్రబోధ సుధ, ఇదే ప్రపంచంలో మానవత్వానికి, మహర్షిత్వానికి వాల్మీకి చూపిన సులభమార్గం, పరిపూర్ణంగా అవి సాధించిన రాముడు అసామాన్యుడు. మాన్యుడు.

అందు వల్ల మనం రాముని సంప్రదాయానికి వారసుల మవటమే ఉచితం. దుష్ట రావణ సంప్రదాయం కూడదనటం ఇందులో పరమార్థం దాన్నే "రామాదివత్ వర్తితవ్యం, న రావణాది వత్" అని పెద్దలు అనేక విధాల బోధించారు.

స్నేహం

సంస్కృతంలో "సఖః" అంటే స్నేహితుడు. మిత్రుడు అని అర్థం [సఖీ స్నేహితురాలు] "సహ ఖేన వర్తతే ఇతి సఖః" అను వ్యుత్పత్తిని బట్టి స్నేహితుడంటే తన సుఖ దుఃఖములలో సమానంగా పాలుపంచు కొనే వాడని తెలుస్తోంది. అటువంటి సానుభూతి గల స్నేహమే నిజమైన స్నేహమనిపించుకుంటుంది. అట్టి స్నేహం స్వార్థరహితమైనది కావటం వల్ల అది శాశ్వతంగా నిలబడి ఉంటుంది మానవులలోనే కాకుండా ఇచ్చి పుచ్చు కొనే సంప్రదాయంతో కూడిన ఈ స్నేహప్రకృతి పశు పక్షాదులు కొన్నింటిలో కూడా చూడ గల్గుతాం. ఈ స్నేహాన్నే మైత్రి అని కూడా అంటారు. అ మిత్రుని భావమే మైత్రి.

ప్రీతితో తన కున్నది ఇచ్చి, చనువుగా అవసర మయినదడిగి తీసుకుంటూ, ఆత్మీయంగా తన మనసు పొరలలో దాగి ఉన్న రహస్యాలను విడమరిచి చెప్తూ, ఎదుటి వారి అంతరంగిక విషయాలను సహృదయంతో వింటూ, పరిష్కారం చెప్పి చేతనైన సాయం చేయడం ద్వారా ఊరట కలిగిస్తూ, తృప్తిగా తాను తింటూ, తోటి వారిని తినేటట్లు చేస్తూ కలసి మెలసి ఉండట మనేవి మిత్ర లక్షణంగా పేర్కొనబడింది.

దదాతి, ప్రతి గృహ్ణాతి, గుహ్య మాఖ్యాతి, పృచ్ఛతి !
భుంక్తే భోజయతీ త్యేవం, షడ్విధం మిత్రలక్షణమ్ !!

లోక సామాన్య స్థితి ననుసరించి సమాన శీల వయోఽవస్థలలో ఉన్నవారికే ఇట్టి మైత్రి కుదరటం జరుగుతుంది. ఇతరుల కది ఏర్పడదని భారతంలో ద్రుపదుని మాటలలో ఇలా చెప్పబడినది.

ధనపతితో దరిద్రునకు, తత్త్వ విదుండగు వానితోడ మూర్ఖునకు, ప్రతాంతుతోడ కడు క్రూరునకున్, రణశూరు తోడ భీరునకు వరూథి తోడ నవరూథికి, సజ్జను తోడ కష్ట దుర్జనునకు నెవ్విధంబు నను సఖ్యము తా నొడగూడ నేర్చునే

ద్రోణుడు. ద్రుపదుడు చిన్నప్పుడు ఒకే ఆశ్రమంలో ఉండి ఒకే గురువు దగ్గర విద్య నభ్యసించారు. అప్పట్లో వారిరువురు మంచి స్నేహితులు గానే ఉండే వారు. తర్వాత ద్రుపదుడు తండ్రి రాజ్యానికి వారసుడై రాజయినాడు. ద్రోణుడు సామాన్య పౌరుడుగానే మిగిలిపోయాడు. కొంత కాలానికి ద్రోణుడు తన కొడుకు అశ్వత్థామ పోషణ నిమిత్తం ఒక గోవు నిప్పించుమని కోరటానికి ద్రుపదుని వద్దకు వెళ్లాడు. ద్రుపదుడప్పుడు ద్రోణునితో అన్ని విధాలా ఎంతో అంతర మున్న మన ఇరువురి మధ్య స్నేహం పొసగదని చెప్పి తోసేస్తాడు. అధికార బలం అభిజాత్య, సంపదల వలన కలిగిన గర్వం, అతనిలో స్నేహ ధర్మాన్ని దూరం చేశాయి.

"సఖ్యం సాప్తపదీనమ్" అని ఏడడుగులు కలిసి నడిస్తేనే సత్పురుషుల నడుమ 'స్నేహం' ఏర్పడుతుందని చెప్తారు. ఈ స్నేహ భావం సజ్జనులలో తొలుత కొద్దిగా ఉండి క్రమంగా అభివృద్ధి చెంది స్థిరంగా నిలిచి పోతుంది. దుర్జనుల విషయంలో అయితే అది మొదట అధికంగా ఉండి రాను రాను పూర్తిగా తగ్గిపోతుంది.

మొదలఁ జూచినఁ గడు గొప్ప పిదపఁ గుఱుచ
యాగి కొంచెము తర్వాత నధిక మగుచు
దనరు దినపూర్వ పరభాగ జనితమైన
ఛాయ పోలికఁగుజన సజ్జనుల మైత్రి.

స్వార్థం కారణంగా ఏర్పడిన స్నేహమైతే ప్రయోజనం తీరిన తర్వాత అది కనుమరుగై పోతుంది. కొందరు స్నేహం చేస్తున్నట్లు నటిస్తారు. మరి కొందరు ఏ నిమిత్తం లేకుండానే కల కాలం స్నేహితులుగా మిగిలి పోతారు. అట్టిది వారి వారి సంస్కారాన్ని బట్టి ఏర్పడుతుంది. ఇందులో కొందరికి జన్మాంతర స్నేహం కూడా ఉంటుంది. మహాకవి కాళిదాసు ఈ విషయాన్నే "భావ స్థిరాణి జననాంతర సౌహృదాని" అని శాకుంతలంలో [2-5] అభివర్ణించాడు. భాగవతంలోని కృష్ణ కుచేలుల స్నేహం ఉత్తమోత్తమంగా పరిగణింప బడుతుంది.

సాంఘిక జీవితంలో కల్లా కపట మెరుగని స్నేహానికి ఎంతైనా ప్రాధాన్యం ఉంది. కానీ ఈ నాడది కొందరి ఆలోచనలనుబట్టి అంగడిలో డబ్బు పెట్టి కొనుక్కునే వస్తువుగా మారిపోయింది. ప్రకృతిలో చీమలు, తేనెటీగలు వంటి చిన్న చిన్న జీవాలు

కూడా సంఘ జీవితాన్ని కోరుకొని పరస్పర సహకారంతో హాయిగా బ్రతుకుతుంటే జ్ఞానం పెరిగే కొద్దీ జనులు స్వార్థంతో ఎవరి కెవరు ఎంత ఎక్కువగా నమ్మించి మోసం చేయగలుగుతున్నామన్నది లక్ష్యంగా, జీవిత భద్రత కోల్పోయి భయం భయంగా రోజులు వెళ్ళబుచ్చు కుంటున్నారని చెప్పుకోటానికి సిగ్గు పడవలసి వస్తోంది. మాటలలో చెప్పుకొనే అభ్యుదయం మానవత్వంలో లోపించి మసకబారి పోతోంది.

ఒక్కొక్కడు స్నేహితునిలా ప్రవర్తిస్తూ ముఖప్రీతికై ఇచ్చకపు (ఇష్టమైన) మాటలు చెప్తూ, చాటున గోతులు తీస్తూ పనులు చెడగొడ్తూ, ఉంటాడు. వాడు పయోముఖ విషకుంభం అట్టి మిత్రుని విడిచిపెట్టమని నీతి శాస్త్రం చెప్తోంది.

పరోక్షే కార్య హంతారం, ప్రత్యక్షే ప్రియవాదినమ్ !
వర్జయేత్ తాదృశం మిత్రం, విషకుంభ పయోముఖమ్ !! (హితోపదేశం)

రాజకీయంగా చూచినట్లైతే అందులో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు అంటూ ఎవ్వరూ ఉండరు. అవసరాన్ని బట్టి కాలక్రమంలో స్నేహ సంబంధాలు పెరుగుతూ, తరుగుతూ ఉంటాయి. నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే తంతు మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం.

సంఘంలో ఒక వ్యక్తికి ఎందరితోనో పరిచయం ఉండవచ్చు. స్నేహం మాత్రం కొందరితోనే ఏర్పడుతుంది. అయితే ఎంతో మంచి స్నేహితులుగా పేర్కొనబడేవారుకూడా ఏదో ఒక విషయంలో అభిప్రాయ భేదం కలిగి ఉండటం కద్దు. "పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి" అన్నట్లు లోకంలో ఎవరి అభిప్రాయం వారిది. అయితే అది అంత వరకే పరిమితం చేసుకొని తక్కిన విషయాలలో స్నేహంతో కలిసి మెలిసి బ్రతకటం ఉత్తమ పద్ధతి, దాన్నే పెద్ద చేసుకొని కారాలు, మిరియాలు నూరుకుంటూ కక్షలతో, కార్పణ్యాలతో ప్రతీకారంగా ఉప్పు, ఊప్పు తగుల బెట్టుకోవటం మూర్ఖ పద్ధతి. వీటన్నింటికి అతీతంగా ఉండేవారు కొందరు లేకపోలేదు. అందరితో స్నేహభావం పెంపొందించు కోవటం గొప్ప గుణం. సభ్య సమాజంలో అన్నింటి కంటే అది ముఖ్య లక్షణం. దానివలన మాన్యత సిద్ధిస్తుంది. అది సమన్వయ సిద్ధాంతం మీదనే ఆధారపడి ఉంటుంది. ఒకప్పుడు ఈ మిత్రులే హద

మీరితే దేశ, కాల పరిస్థితులను బట్టి క్రమంగా శత్రువులుగా మారటం కద్దు. నిత్యం సూర్యుడు తన కరస్పర్శచే కమలములను వికసింపజేస్తాడు. నీటబాసినప్పుడా కమలాప్తుని రశ్మియే కమలములను వాడిపోయేలా చేస్తుంది. అంటాడు సుమతీ శతక కర్త బద్దెన. అతడే భద్ర భూపాలుడు

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమిలిన భంగిన్
తమ తమ నెలవులు తప్పిన
తమ మిత్రులె శత్రు లవుట తథ్యము సుమతీ !

శ్రీమద్రామాయణంలో శ్రీరామ సుగ్రీవ మైత్రి మంచి స్నేహానికి నిదర్శనంగా నిలుస్తుంది.

స్నేహ శబ్దానికి "నూనె" అనే అర్థం కూడా ఉంది. దాన్నే తైల మంటారు. ఏ పరిస్థితులలో నైనా తైలధారవలె అవిచ్ఛిన్నంగా ఉండి, వ్యాపన శీలం కలది స్నేహం అని దాని పరమార్థం దాన్నే రామాయణం ఇట్లా వివరించింది. అందువల్లనే ఆ సంస్కృతి మనకు అనుసరణీయ మవుతోంది.

ఆఢ్యో వాఽపి దరిద్రోవా దుఃఖిత స్సుఖితోఽపివా ।
నిర్దోషశ్చ సదోషశ్చవయస్యః పరమాగతిః ॥ [8-8-4]

పరిస్థితులను బట్టి ధనవంతుడు, దరిద్రుడు, సుఖితుడు, దుఃఖితుడు, దోషి, నిర్దోషి అనే తారతమ్యం లేకుండా స్నేహం నిలుపుకో గల్గటమే మైత్రికి ముఖ్యలక్షణం అట్టి వాడే మంచి మిత్రుడు. ఒకప్పుడు స్నేహంలో ధనత్యాగం, సుఖత్యాగంతో బాటు అవసరమైతే దేశత్యాగం, దేహత్యాగం కూడా కొందరు చేయగల్గటం చూస్తూ ఉంటాం. తల్లిదండ్రుల తర్వాత సహజంగా ప్రేమించేవాడు, మేలుకోరేవాడు మిత్రు డొక్కడే అన్నది నిజం. సుగ్రీవుడు రామునితో హృదయపూర్వకంగా సఖ్యం చేయటానికి సంతోషపడుతూ "ఇంక నుండి మన ఇరువురి సుఖదుఃఖములు ఒకటే నంటాడు." "త్వంవయస్యోఽసి హృద్యో మేహ్యేకం దుఃఖం, సుఖం చనౌ." [19-5-4] రామ సుగ్రీవులిద్దరు భార్యావియోగంకలవారై ఒకే అవస ననుభవిస్తున్న

వారవటం ఇక్కడ విశేషం. ఒకరి బాధ ఒకరు తెలుసుకొనటం ద్వారా వారికి హృదయ సంవాదం ఏర్పడింది.

మంచి వారితో మైత్రి చేసిన మానవుడు ఉత్తమ లక్షణాలను ప్రోది చేసుకో గలుగుతాడు. తాను, తన కుటుంబం వఱకే పరిమితమైన అతని ఆలోచనలు స్నేహభావం పెంపొందిన కారణంగా క్రమవికాసం చెంది అతడు ఇతరులను గూడా ప్రేమించగలుగుతాడు. అందువల్ల ఈ స్నేహ మనేది మంచి వారితోనే చెయ్యాలి. కనబడ్డ ప్రతి వారితోనూ కలిసి స్నేహం చేయకూడదు. మనం ఫలానా వారితో స్నేహంగా ఉంటున్నామంటే దాని వలన మనకు బంధువులలో తక్కిన స్నేహితులలో గౌరవము సంపాదించి పెట్టేదిగా ఉండాలేకాని తక్కువ తనాన్ని కలిగించేదిగా ఉండ కూడదు.

[త్రాగుబోతు, తిరుగుబోతు, జూదరి, అసత్యవచనుడు, కృతఘ్నుడు మొదలైన దుర్గుణాలున్న వారితో స్నేహం చేసిన పక్షంలో సహజంగా ఆ లక్షణాలు అతనిలో లేకపోయినా పూర్వమే ఉన్నాయేమో అని గాని, లేక క్రొత్తగా ఇప్పుడు అలవడినా యేమోయనిగాని శంకించే అవకాశం ఉంది]

అందుకే గాంధీ మహాత్ముడొకచోట "నీ మిత్రులెవరో చెప్తే, నీ వెటువంటి వాడవో నే చెప్తా"నని అంటాడు. ["Tell me your friends. ! I tell you what you are? [M. K. Gandhi]

రఘువంశ సంభవుడైన రాముడు లోకైక వీరుడు అంతేకాదు సుగుణరాశి, ఇంకా ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సాధుజన రక్షాదక్షుడు. దీనబంధువు, పతితపావనుడు. అందు చేత అతనితో అగ్నిసాక్షికంగా మైత్రి చేసిన సుగ్రీవుడు సరిగ్గా అదేమాట అన్నాడు. తనకు కలిగిన ఆ గౌరవానికి సంతోషించాడు,

సోఽహం సభాజ్యో బంధూనాం, సుహృదం చైవ రాఘవ ।
యస్యాగ్ని సాక్షికం మిత్రం లబ్ధం రాఘవ వంశజమ్॥ [4-8-4]

భారతీయ సంస్కృతిలో అగ్ని ఉపాసన ఒక విశిష్ట సంస్కారంగా తెలియదగి ఉంది అగ్ని పవిత్రతకు చిహ్నం. ఆ అగ్ని హోత్రుడు మనం చేసే ప్రతి పనికి సాక్షీభూతుడై ఉండి, మనకు మంచి సంకల్పం, తగిన కార్యదీక్ష, చక్కని ఫలం ప్రసాదిస్తాడన్నది భారతీయుల విశ్వాసం. అగ్నిసాక్షికంగా జరిగిన ఏ పనైనా పవి

త్రమై, స్థిరమై [వివాహం సంబంధం, మైత్రీ బంధం మొ॥] అవిచ్ఛిన్నంగా కొనసాగుతుందని భావించడం కద్దు.

'ఉపకారఫలం మిత్రమ్' (27-5-4) అంటే మైత్రికి ఉపకారమే ఫలమని తెలుస్తోంది. ఒకరి కొకరు స్నేహంలో చేసిన ఆ ఉపకారం రోజులు గడిచే కొద్దీ ఎదుటివారు గుర్తించే లాగా మెలగాలే కాని అదే పెద్ద చేసి ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు నేను వాడికి అంత చేశాను, ఇంత చేశాను అని కానీ, అది ఇచ్చాను, ఇది ఇచ్చాను అని కానీ, గొప్పలు చెప్పుకుంటూ ఆత్మ గుణాలను మాటమాటికి పొగుడుకో గూడదు. తనగురించి తాను చెప్పుకోవడం యిష్ట పడని సుగ్రీవుడు రామునితో "నేను నీకు తగిన మిత్రుడనని నీవు ముందు ముందు తెలుసుకో గల్గుతావు" అంటాడు,

> అహమ ప్యను రూపస్తే. వయస్యో జ్ఞాస్యసే శనైః ।
> న తు వక్తుం సమర్థోఽహం స్వయ మాత్మ గతా న్గుణాన్॥ [5-8-4]

తమ్ముని భార్య కుమార్తెతో సమానం సుగ్రీవుని భార్య రుమను అతని నుండి బలాత్కారంగా అపహరించి, తమ్ముని తన్ని దిగంతముల వరకు తరిమిన చారిత్రక దూషకుడు వాలి. ఆ వాలిని రాముడు ఒక్క బాణంతో సంహరించాడు చేత కాని రాముడు చెట్టు చాటు నుండి కొట్టాడని కొందరు ఈ విషయం విమర్శిస్తారు. చిత్రకూట సభలో జరిగిన నిర్ణయం ప్రకారం భరతుడు పౌర జానపదులకు, రా.. డు వనవాసులకు రాజుగా ప్రకటింపబడ్డారు. ఆ కారణంగా ఇక్ష్వాకుల అధీనంలో ఉన్న ఆ వన భూములలో కాముకుడై పాపకర్మం చేసిన వాలిని రాముడు అధికారికంగా దండించాడు.

> ఔరసీం, భగినీం వాపి. భార్యాం వాప్యనుజస్య యః ।
> ప్రచరేత నరః కామా త్తస్య దండో వధ స్మృతః॥ [22-18-4]

అందునా రాముడు ఆ అధర్మ వర్తనుని [వాలిని] శిక్షించాడే కాని, ద్వంద్వ యుద్ధంలో ఎదుర్కొని పోరాడుతూ, అతడు న్యాయం తప్పి ప్రవర్తింపలేదు. శిక్షలు అనేక రకాలు, ఆ విషయం విజ్ఞులకు తెలియంది కాదు. పశుప్రవృత్తి గల అతనిని క్రూర జంతువును ప్రచ్ఛన్నంగా వేటాడి సంహరించినట్లే రాముడు సంహరించాడు.

రామ బాణ విహతుడైన వాలి దుఃఖావేశంలో వివశుడై రాముని నిందించి నప్పుడు ఆ వాలి ఆరోపణలకు రాముడు చేసిన వివరణ, చెప్పిన సమాధానం విని వాలియే స్వయంగా తన తప్పు తాను ఒప్పు కొని క్షమాపణ వేడు కున్నాడు. ఏదైనా ఒక విషయం పూర్వాపరాలు (ముందు. వెనుక) చూచి సమగ్రంగా అవగాహన చేసుకోవాలి కాని, ఏక దేశమైన విషయాన్నే గ్రహించి, ఏక పక్షంగా మాట్లాడటం సద్విమర్శకుల లక్షణం కాదు. గ్రంథ ప్రామాణ్యమే మనకు ముఖ్యంగానీ వ్యక్తి గత ఆగ్రహావేశాలకు ఈ చర్చలో తావు లేనే లేదు. సందేహం కలిగిన చోటనే సమాధానం లభించటం వాల్మీకంలోని విశిష్టత చూసే ఓపిక మాత్రం ఉండాలి. సత్యాన్వేషకుడు ఆమాత్రం శ్రమకు సిద్ధపడతాడు కదా!

ఒక మంచి మిత్రుడు లభించడం కష్టం. ఆ మైత్రిని కల కాలం నిలబెట్టు కోవడం అంత కన్నా కష్టం ఎవరితోనైనా మొదట మైత్రి చేసుకోవడం సులభమే అయినా, చంచలములైన చిత్తములలో ఏ కొంచెం అయిష్టత చోటు చేసుకొన్నా ఆ స్నేహ బంధం స్థిరంగా నిలుపుకో గల్గటం అసాధ్యం.

> సర్వథా సుకరం మిత్రం, దుష్కరం తత్పరి పాలనమ్ ।
> అనిత్య త్వా చ్చ చిత్తానాం ప్రీతి రల్పేఽపి భిద్యతే ॥ [7-32-4

వాలి మరణానంతరం సుగ్రీవుడు కిష్కింధకు రాజై సుఖ భోగములలో తేలియాడాడు. వర్షకాలం గడిచిన వెంటనే సీతాన్వేషణకు బయలు దేరు తానని ప్రతిజ్ఞ చేశాడు. శరత్తు వచ్చింది. సుగ్రీవుడు కర్తవ్యం మరచి నట్లున్నాడు. అంత వరకు ప్రస్రవణాద్రిపై రోజులు వెళ్ళ బుచ్చి, వారి సహాయం కోసం ఎదురు చూస్తున్న రాముడు లక్ష్మణుని ద్వారా కబురు పంపాడు. ఆ సందర్భంలో వాల్మీకి కృతఘ్నత (చేసినమేలు మరచుట) ఎంత నేరమో నిరూపిస్తూ –

"మిత్రుని సహాయం వలన తాను అభ్యుదయం పొంది, కష్టంలో ఉన్న ఆ మిత్రునకు సాయ పడని కృతఘ్నుని శవాన్ని క్రవ్యాదులైన కాకులు, గద్దలు కూడా ముట్టవని, తొలుత చెప్పి, ఆశ కలిగించి మాట తప్పినవాడు [నమ్మకద్రోహి] లోకంలో పురుషాధముడే అవుతాడని నిర్వచించాడు. [71-73-30-4]

అంతలో సుగ్రీవుడు కర్తవ్యాన్ని గుర్తు చేసుకొని వానర సమూహాలను పిలిపించి సీతాన్వేషణకై నలుదిక్కులకు పంపుతాడు. ఈ ఘట్టంలో సుగ్రీవుడు వానరులకు వివరించిన ఆయా దిక్కులలోని విషయాలు అనాటి భౌగోళిక విశేషాలను [Geagraphical structure] తెలియ జేసేవిగా ఉన్నాయి. ఈ దృష్టితో చూచినపుడు రామాయణం నేల విడిచి సాము చేసిన సాహితీ (సృష్టి) విన్యాసం మాత్రమే కాదని బోధ పడ్తుంది అది ఒక విజ్ఞాన సర్వస్వం ప్రపంచంలోని సకల ప్రాణుల, సమస్త లోకముల సంగతులు అందులో వివరింప బడ్డాయి.

హనుమంతుని ద్వారా సీతజాడ తెలిసి కొని ససైన్యంగా బయలు దేరి దక్షిణ సముద్రములో వారధి నిర్మించి, లంకపై దండెత్తి సపరివారంగా రాముడు రావణుని సంహరించ టానికై తోడ్పడి, సుగ్రీవుడు తన దృఢ మైత్రిని నిరూపించుకున్నాడు. ప్రాణాలు సహితం పణంగా పెట్టి మిత్ర కార్యం నిర్వహించటంలో సుగ్రీవుని అచంచల మయిన స్నేహ భావం లోని పవిత్రత ప్రకటిత మౌతుంది. ఈ విధంగా రామునికి ప్రత్యుపకారం చేసి సుగ్రీవుడు తన కృతజ్ఞత వెల్లడించు కున్నాడు అందు వల్లనే 'సుగ్రీవ మైత్రి' అన్న మాట సార్ధకమై లోకంలో స్థిరపడింది. వాల్మీకియే స్వయంగా భరతుని వంటి సోదరుడు సుగ్రీవుని వంటి మిత్రుడు ఇతరత్ర లభింపరని ఒకచోట రాముని నోట పలికించాడు

ఇది సర్వభూతంబు లెనసి సేవింపనౌ పరవస్తు. విద్వాం బరగుధర్మ
వెలింగి భావించిన నెల్లలోకంబులు సంతుష్టిగాంచును స్వర్గు లెలమి
మెచ్చి సన్మానింత్రు మేలొర్ల కొనరించు వారిజీవితమె భవ్యం బనంగ
మన కుపకారియై మనుచు నియ్యెడయనిం గొలిచిన నింకిటం గొఱంత లున్నె
త్వరపడుండు శ్రేయమొనంగూడం తటి ఘటిల్లె నన్ను ఋణముక్తుం జేయుడు నాడుచనవు
తడయుండు నిజప్రభావము ల్వెలను పడంగ జనకసుతవార్త గొనితేరజాలి కపులు

పయనము శుభమగు మీమీ, నయమును బౌరుషముం జెల్లు, నాకసదులుండో
డయి ప్రోతురు సత్కీర్తి నెనయం గలరు పొందు కూర్మి వాడెన నెగడన్

అని సుగ్రీవుడుశాసించిన నుబ్బున నెల్లవారుం జెలగుచు మే ల్మే
లని రేకగ్రీవముగా వనితామణి! వారి మేల్మి వశమే పొగడన్

శ్రీ. రా. క., కిం. కాం., 2ఆ. 366-368 ప

కృతజ్ఞత

'కృతజ్ఞత' అంటే చేసిన మేలు గుర్తించుట, మరువ కుండుట అని అర్థం. అట్టి వారికి తిరిగి మేలుచేయటం 'ప్రతికృతి' అవుతుంది. ప్రకృతిలో పశు పక్ష్యాదులు తమను ఆదరించి పోషించినవారియెడ కృతజ్ఞతను వెల్లడిస్తూ అవసరమైతే వివరకు ప్రాణాలను కూడా లెక్క చేయకుండా సహకరించి రక్షించటానికి పాటు పడ్తూ ఉండటం మనం చూస్తూనే ఉంటాం చెట్లు చేమలు కూడా ఒక వేళ చిన్నప్పుడు పోసిన ఉప్పునీరే అయినప్పటికి అవి పెరిగి పెద్దయిన తర్వాత కమ్మని మంచి నీటిని, చక్కని సువాసనలు వెదజల్లే పూవులను, తియ్యని ఫలాలను ప్రసాదించటం వాటి కృతజ్ఞతా భావమే అవుతుందని అనుకోవచ్చు.

ఉపకారికి తిరిగి ఉపకారం చెయ్యటం వంటిది లోకంలో విపరీత మేమీ కాక పోయినా, అది ఒక మంచి లక్షణం. అయితే నెపమెన్న కుండానే అపకారికి కూడా ఉపకారం చేయటం నేర్పరి తనంగా, అది ఒక ఉత్తమ స్వభావంగా ప్రసిద్ధి కెక్కింది. సుజనుల కిది సహజం.

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెప మెన్నక సేయువాడు నేర్పరి సుమతీ !

ఈ వీధి ఎటు వెళ్తుందో, అప్పుడు టైమెంత అయ్యిందో, చెప్పిన వారికి అగ్గిపుల్ల, చక్కపొడి వంటి కనీస వస్తు సహాయం అందించిన వారికి సహితం చేయెత్తి కృతజ్ఞతలు (Thanks) చెప్పటానికి ఇష్టపడే మనం తర తరాల నుండి పోషించి రక్షిస్తూ మన పెద్దలు నేడు మన కందించిన మన దేశం, మన జాతి, మన భాషా, మన సంస్కృతి సంప్రదాయాలు, (ఆచార వ్యవహారాలు) మన సాహిత్యం మన శాస్త్ర విజ్ఞాన సంపదలు అంటే గౌరవం లేక పోవటం, ఆ పెద్దల యెడ కృతజ్ఞత ప్రకటింపక పోవటం దురదృష్టం. సంఘ జీవియైన మానవుడు తన ఔన్నత్యానికి ఎంతగానో దోహదం చేసిన తల్లి తండ్రి సోదరులు, గురువులు మొదలగు వారిని మన్నించి సహకరించటం, త్యాగ ధనులైన, అమరులైన మన జాతి నేతలను సంస్మరించి, కృతజ్ఞత

ఘటించటం, మన అవశ్య కర్తవ్యమనే భావం నశించి, కువిమర్శలకు పూనుకొనటం ఈనాటి కొందరి అతి తెలివి తేటలకు నిదర్శనం. ఈ తండ్రికే పుట్టానని నమ్మక మేంటని పతివ్రతయైన తన తల్లిని ప్రశ్నించేటటి వివేక మేర్పడటమే వారి వెర్రి విజ్ఞానానికి తార్కాణం. పరాయి వారి నాగరికతా వ్యామోహాలు అధికం కావటం కూడా ఇందుకు కొంత కారణం కావచ్చు. 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నది ఈ విషయంలో ఏర్పడిన ప్రజావాణి. [నానుడి]

ప్రకృతి చేసిన మేలు మర్చిపోయి 'ఇదంతా నా ప్రయోజకత్వమే' అనే అహం భావంతో విర్రవీగి విపరీతంగా ప్రవర్తించటం సృష్టిలో గల పరమార్థం తెలియని మూర్ఖుని లక్షణం వీరు మానవులుగా ఉన్న దానవు లన్నమాట. తమను సృష్టించిన దైవాన్నే కాదనటం ఆ దానవ స్వభావం. అందుకే ఈ దుర్జనులను నీటిని తోడే యంత్రం [ఏతాము] తో పోలుస్తారు.

"జీవన గ్రహణే నమ్రాః, గృహీత్వా పున రున్నతాః ।
కిం కనిష్ఠాః కిం వా జేష్ఠాః, ఘటీ యంత్రస్య దుర్జనాః ॥

జీవన మంటే 'నీరు' అనీ, 'బ్రతుకు' అనీ రెండు అర్థాలు. అందుకే జీవన గ్రహణంలో వినమ్రత చూపి అనంతరం తల పైకెగరేసే దుర్జనులు ఘటీ యంత్రానికి అన్నలా? తమ్ముళ్ళా? అని ప్రశ్నిస్తాడీ కవి సూటిగా. అంటే దుర్జనులు వినయంగా ఉన్నట్లు నటిస్తూ వాళ్ళ పబ్బం గడుపుకున్నాక ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా తల ఎగరేస్తా రన్నది ప్రకృతార్థం 'స్వభావో దురతి క్రమః' మారని ఆ స్వభావం మంచికి, మనుగడకు మనిషిని దూరం చేస్తుంది. మానవత్వపు విలువలను మంట కలిపేస్తుంది.

శ్రీ మద్రామాయణం లో రాముడు తండ్రి ఇచ్చిన మాట నిలబెట్టటానికై అడవులకు పోయి చిత్ర కూటంలో ఉంటే భరతుడు వచ్చి, పాదుకలు పుచ్చుకు వెళ్తాడు. తర్వాత రాముడు దండకారణ్యంలో ప్రవేశించి నివసిస్తూ ఉంటాడు. రావణుని చెల్లెలు, విద్యుజ్జిహ్వుని భార్య అయిన శూర్పణఖ భర్త మరణించిన తర్వాత స్వేచ్ఛా సంచారం చేస్తూ, రాముని చూచి కామ మోహితయై అతని దగ్గర చేరి అనుచితమైన కోర్కె కోరటం జరిగింది. రాముడది అధర్మమని అంగీకరింపలేదు. ఇంతకూ నీవు

నన్ను తిరస్కరించ టానికి ఈ వృద్ధ స్త్రీయే కారణమని రాముని ప్రక్కనున్న సీతపై కులికి ఆమెను మ్రింగటానికి ప్రయత్నించింది. అప్పటి వరకు సహించిన రాముడామెకు బుద్ధి చెప్ప దలచాడు. ఆ రాము నభిమతమెరిగి క్షమించటానికిది తగదని ముక్కు చెవులు కోసి లక్ష్మణుడామెను విరూపిని చేసి పంపిస్తాడు. [అదే ఆ నాడు స్త్రీని శిక్షించే పద్ధతి] ఆ శూర్పణఖ చెప్పినమాటలు [చెప్పుడు మాటలు] విని ప్రతీ కారం తీర్చు కుందామని వచ్చిన ఖర దూషణాదులు రాము నెదిరించి యుద్ధంలో మరణిస్తారు. అది విన్న రావణుడు వంచనా శీలుడై మారీచుని [మాయలేడి] సహకారంతో రామ లక్ష్మణులు లేని వేళ సీతను అపహరించు కొని పోయాడు. అది అతని కపటితనానికి, అసామర్థ్యానికి నిదర్శనం. సీతాపహరణ వార్త చెప్పి జటాయువు మరణించాడు. రాముడు కృతజ్ఞతతో అతనికి స్వయంగా దహనా దిసంస్కారములు సలిపి ఉత్తమ గతులు కల్గేలా చేస్తాడు. అటు తర్వాత పంచవటి నుండి రాముడు ఋశ్యమూకగిరి జేరి. సుగ్రీవునితో మైత్రి పాటించి, అధర్మ వర్తనుడైన వాలిని సంహరించి. సీత జాడ తెలియడం కోసం ఎదురు చూస్తూ ఉంటాడు.

అంతలో సుగ్రీవాజ్ఞ తల దాల్చి సీతాన్వేషణ పరులైన వానరులు బయలు దేరుతారు. అందులో హనుమంతుడు తన సహచరులతో గూడి దక్షిణ సముద్ర తీరానికి చేరుతాడు. అచ్చట జటాయువు అన్నగారైన సంపాతి, సీత లంకలో అశోక వనంలో ఉన్నదని [తన దీర్ఘ దృష్టితో చూచి] చెప్తాడు. ఆ మాటలు విని జాంబవంతాదులు ప్రోత్సహింపగా ధీ, బల, ప్రాభవ ప్రౌఢుడైన హనుమంతుడు సముద్ర మధ్యంలోని లంకా పట్టణాన్ని గూర్చిన ప్రయాణానికి అంగీకరిస్తాడు. వివర్ధిత దేహుడై, శత్రు కర్శనుడైన ఆతడు (హనుమంతుడు) చారణులు (దేవతలు) సంచరించు ఆకాశమార్గమున శతయోజన విస్తీర్ణమగు ఆ లవణ సముద్రాన్ని లంఘింప (దాటటానికి) ఉద్యమిస్తాడు.

"తతో రావణ నీతాయాః, సీతాయాః శత్రుకర్శనః ।
ఇయేష పద మన్వేష్టుం. చారణా చరితే పథి" [1-1-5]

(ఇందు అధ్యాత్మ సుందరమగు నొక విశేషార్థము కూడా కలదు. కామ క్రోధాదులైన అరిషడ్వర్గమునకు రావణుడు ప్రతీక, అతనిచే నపహరింపబడిన సీత మనస్సు. రాముడు బుద్ధిస్థానీయుడు ఆ అంతశ్శత్రు సంహార దక్షుడైన

హనుమంతుడు యోగి. అతడు సీతాపద మన్వేషింప (చారణా+అచరితేపథి). చారణులనగా చరణములతో నడచువారు. అట్టివారు అచరితేపథి, సంచరించుటకు వీలులేని యోగమార్గమున యత్నించినాడు. (ప్రాణుల వెన్నెముక యందలి సుషుమ్నానాడియే అట్టి యోగమార్గము.)

హనుమంతుడు రావణుని నిగ్రహించి సీతను గొనివచ్చి రామునకు సమర్పించి వారి నిరువురిని ఒక్కచోట నిలిపి, చూచి సంతోషించినాడు. అంటే యోగియైనవాడు మనస్సును అరిషడ్వర్గముల బారి నుండి రక్షించి బుద్ధితో సంయోజన పరచి (జత గూర్చి) ఆనందపారవశ్యము నందుట యని అర్థము. ఇదియే యోగవిద్యా విషయకమగు పరిపూర్ణ జ్ఞానము. ఇట్టిది జగద్ధితమగు అనుక్షణ రామాయణముగా ప్రసిద్ధి కెక్కింది. మనస్సు, బుద్ధిననుసరించి ఉన్నప్పుడు వివేకం ఉదయిస్తుంది. ఆ వివేకం అభ్యుదయ, నిశ్శ్రేయసములకు హేతువైన ధర్మకర్మలకు కారణమవుతుంది అట్టి ధర్మమే ఎల్ల వేళలా, అన్ని విధములా విశ్వశాంతి, విశ్వకళ్యాణ సౌఖ్యసంపదలకు మూలమై వర్ధిల్లుతుంది

ఈ యోగవిద్యయే భారతీయ సంస్కృతికి విశిష్టతను కల్పిస్తోంది. ఇదియే భారతదేశమున సర్వ వాఙ్మయసార సర్వస్వముగా పరిగణింపబడుతోంది. ఇట్టి యోగవిద్య (Meditation) శారీరక, మానసిక సంస్కార సంపదను, ఆయురారోగ్య సౌభాగ్యములను ప్రసాదింపగలదని వైజ్ఞానికులు అంగీకరిస్తున్నారు.

ఆ సముద్ర లంఘన సందర్భమున హనుమంతుడు ముందుగా కొంత దూర మేగినాడు. అప్పుడతని కెదురుగా ఉన్నతమైన నల్లని కొండవంటి ఆకార మొకటి కాన వచ్చింది. అంతకు ముందది అక్కడలేదు. అంతత్వరగా వేరొక చోటనుండి వచ్చుటకూ వీలులేదు. ఎవ్వరెరుగని హఠాత్పరిణామ మిది, ఇప్పుడిప్పుడే అది క్రమక్రమంగా గోచరిస్తోంది. అదియేదో రాక్షస మాయయే అయి ఉంటుందని హనుమంతుడు దానిని తీవ్రంగా ప్రతి ఘటించాడు. అంతలో నొకడు మానవాకారమున ప్రత్యక్షమై, ఆ గిరి శృంగాగ్రమున నిలువబడి నయ, వినయ, భయ, సంభ్రమము లుట్టి పడ, వినమిత శిరస్కుడై హనుమంతుని గూర్చి ఇట్లని విన్నవించాడు.

"ఆర్యా! హిమవంతుని తనయుడనగు నన్ను మైనాకుడంటారు. పూర్వము

పర్వతములు రెక్కలు కలిగి ఎగిరి పడుచూ స్వేచ్ఛగా సంచరించుటం జేసి ప్రాణులతి భీతితో తమను రక్షింప ఇంద్రుని అభ్యర్థించినవి. అప్పుడా ఇంద్రుడు వజ్రాయుధంతో అన్ని పర్వతముల రెక్కలు ఖండింప బూని నాడు. ఆ సందర్భమున నేను మీ తండ్రి వాయుదేవుని సహాయమున ఈ సముద్ర గర్భమునఁ జేరి తల దాచుకొని ఆ ఆపద తప్పించు కొన గల్గితిని.

ఇంక రాముని వంశమున పూర్వీకులగు సగర తనయుల చేత వృద్ధి పొందినవాడు సాగరుడు రామునకు ప్రీతి ఘటింప స్వామి కార్య ధురంధరుడవై నీవీనాడు ఈ సముద్రమును లంఘించి, లంకకు బోవు టెఱింగి సముద్రుడు 'మా కతిథివైన నీకు సేవ లొనర్ప ప్రోత్సహించి నన్నంపి నాడు. ధర్మానురక్తి గల విజ్ఞులకు అతిథి పామరుడైనను పూజార్హుడగు చుండగా, నీ వంటి మహాత్ముడు లభించుట నేడు మా అదృష్టము.

"అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా ।
ధర్మం జిజ్ఞాసమానేన, కింపున స్త్వా దృశో మహాన్ ॥ [201-1-5]

కావున నీవు ఈ వనాంతమునగల మధుర ఫలములు భుజించి, ఇచ్చటి సరోవరము లందలి అమృతోపమానములగు జలములు గ్రోలి, ఈ శృంగాగ్రముల కొంత కాలము విశ్రమించి, సేద దీరి, తిరిగి ఇటనుండి సునాయాసముగ లంకకు బోగలవు ఈ విధముగా ధర్మజ్ఞుడగు సాగరుడు తనకు జరిగిన ఉపకారమునకు ప్రత్యుపకారము ఘటించి తన కృతజ్ఞత వెల్లడించు కొన యత్నించు చున్నాడు. అన్ని విధముల నీవు ఈ సమ్మానమునకు అర్హుడవు."

"కృతేచ ప్రతి కర్తవ్య మేష ధర్మ స్సనాతనః ॥
సోఽయం తత్ప్రతి కారార్థీ త్వత్తస్సం మాన మర్హతి" ॥
[114-1-5]

"ధరణా ద్ధర్మ మిత్యాహుః, ధర్మోధారయతి ప్రజాః" అన్న లక్షణాన్ని బట్టి సకల ప్రాణి ప్రపంచాన్ని కలిపి ఒకటిగా నడిపించేది ధర్మం, సనాతనమంటే శాశ్వత మని అర్థం. అందువల్ల ఈ కృతజ్ఞత అనే ధర్మం శాశ్వత మైందని భావం. అంటే ఏ జాతి వారైనా, ఏ ప్రాంతం వారైనా, ఏ దేశం వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా

ఏ కాలానికి సంబంధించిన వారైనా వారందరికీ ఇది పాటింప దగినదని తెలుస్తోంది.

అయితే ఈ సన్నివేశాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించి నపుడు భారతీయ సంస్కృతిలో భాగమైన అతిథి సత్కారము, కృతజ్ఞతా భావము అనే రెండు ముఖ్య లక్షణాలు గోచరిస్తాయి. అవి చక్కగా ఇక్కడ వివరింప బడటం జరిగింది. ఈ విధమైన యోజన ప్రపంచంలో అందరికీ అరుదే కాదు-కొందరికి మృగ్యంకూడా. అందువల్లే ఇది విశ్వ, విశ్వాంత రాళాల్లో అందరికీ ఆచరింపదగిన విశిష్ట సంస్కృతి అనడానికి ఏ మాత్రం సందేహం లేదు ఇదియే ఆ ఋషికిగల సామాజిక స్పృహ.

అయితే ప్రస్తుత సమాజంలో కొందరికి ఈ భావం శూన్యం. వారు చేసే ప్రత్యుపకారం సంగతి దేవుడెరుగు గానీ, తమకు జరిగే ఉపకారం వారి దుర్జనత్వాన్ని పెంపొందించేదిగా ఉంటోంది. అంతేకాదు ఉపకారం చేసిన వారియెడలనే అది ఒకప్పుడపకారంగా పరిణ మించటం కూడా కద్దు. అందుకేనేమో పాముకు పాలు పోయటం కేవలం విషవృద్ధికే అంటారు పెద్దలు.

"ఉపకారో஽పి నీచనా మపకారో హి జాయతే ।
పయః పానం భుజంగానాం కేవలం విషవర్ధనమ్" ॥

[హితోపదేశమ్]

అట్టిది దుర్జన స్వభావమైన 'కృతఘ్నత' అనిపించు కుంటుంది. గోవును చంపినా, కల్లు త్రాగినా, దొంగతనం చేసినా, వ్రత భంగమైనా, పెద్దలచే ప్రాయశ్చిత్తం [నిష్కృతి] విధింపబడింది కానీ 'కృతఘ్నత' కు మాత్రం తగిన ప్రాయశ్చిత్తం విధింప బడలేదు.

"గోఘ్నే చైవ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా ।
నిష్కృతి ర్విహితా సద్భిః, కృతఘ్నే నాస్తి నిష్కృతిః" ॥

[12-34-5]

అందువల్ల మనం పుట్టి పెరిగిన కుటుంబ వాతావరణంతో పాటు అందుకు సహకరించిన సమాజం, దేశం, సంస్కృతి వీటన్నిటి యెడ కృతజ్ఞత కలిగ యుండవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇచ్చటి నేల, గాలి, నీరు, విద్య,

పాడి పంట. జాతి నీతి మనల నింత వారిగా చేసిన వనుమాట మరువకూడదు సరి కదా! అవసరమైనప్పుడు తద్రక్షణమునకు, తదభ్యుదయమునకు సర్వవిధముల యత్నింప వలసియున్నది. ఈ దేశ పౌరులుగా మనందరిదీ ఈ బాధ్యత. అదే మనం ప్రకటించే కృతజ్ఞత. అదే మన కర్తవ్యంగా భావించుదాం

ఇంక సముద్ర లంఘన సందర్భంలో మైనాకు డావిధంగా పలికిన పలుకులు విని హనుమంతుడు ప్రీతితో చిరునవ్వు నవ్వి "నేను మీ ఆదరానికి ఎంతో సంతోషించాను. మీరు నా కాతిథ్యమిచ్చినట్లే భావిస్తున్నాను. కార్య భార నిర్వహణమున కాలము నన్ను త్వరపెట్టు చున్నది అవల ప్రొద్దు క్రుంకు సమయమగు చున్నది. మార్గ మధ్యములో నేనిప్పుడు నిల్చుటకు వీలులేదు. నే చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుట నాధర్మము" అని పల్కినాడు. [ప్రతిజ్ఞా పాలనం ధర్మః = ప్రతిజ్ఞాపాలనమే ధర్మము]

"త్వరతే కార్య కాలో మే. అహ శ్చాప్యతి వర్తతే ।
ప్రతిజ్ఞా చ మయాదత్తా, నస్థాత వ్య మిహాంతరే" ॥

[132-1-5]

ఆహా! ఏమి హనుమంతుని స్వామి కార్య నిర్వహణ దీక్ష, దక్షత, స్వార్థమునకు లోబడి విషయ లోలుడై, సుఖాను భవ పారవశ్యమున తన్ను దా మరచి ప్రవర్తించిన వాడుకాడతడు. ఇట్టి హనుమచ్చరిత్రము ప్రభుభక్తికి పరాకాష్ఠ-ఎట్టి ప్రలోభములు నట్టి యెడ నాతని దారి కడ్డు రాలేదు. ఆకలి దప్పిక లాతనిని బాధింప లేదు. కర్తవ్య నిష్ఠకు, సత్య సంధతకు ఆతడు ప్రబలో దాహరణము.

ప్రధానమగు ప్రభుత్వ రంగమున ప్రముఖ పాత్ర వహించుచు, సుఖలాలసులై స్వార్థ బుద్ధితో మిక్కిలి రహస్యముగా కాపాడు కొనవలసిన సమాచారముల సహితము అమ్మ జూపుచు, ఆత్మవంచన ప్రజాద్రోహము చేయ సంకల్పించు ప్రబుద్ధులకు బాధ్యతాయుతమైన హనుమంతుని వ్యక్తిత్వము చక్కని గుణపాఠము కాగలదు. ఆతడు మూర్తి భవించిన సేవాధర్మ మనదగియున్నాడు, జాతీయ సంపదయైన దేశ స్వాతంత్ర్య సౌభాగ్యములను పరిరక్షించుటయం దెల్లప్పుడు మన మెల్లర మత్యంత జాగరూకులమై ఉండవలసి యున్నది. ఎవ్వరు కానిండు, ఏ కారణముచేత కానిండు,

ప్రమత్తులై ప్రవర్తించుట తగదు. ఏ విధముగా నైనను చిల్లు పడిన పడవ ప్రయాణమునకు పనికిరాదు. అందు భద్రత ఏమాత్రము లేదు. ప్రజలకు, ప్రభుత్వమునకు కూడ నిస్వార్థ సేవాధర్మమే క్షేమ దాయకము. కాని యెడ మనుగడయే శూన్యమగును

రామాయణ కథానాయకుడైన రాముని చరిత్ర సహిత మీ కృతజ్ఞతను ప్రకటించునదై మానవతకు వన్నె గూర్చు చున్నది. తక్కిన వన్నియు అట్లుండ, సీతాన్వేషణ, సేతుబంధన, రాక్షస సంహారాది కార్య క్రమములలో తనకు వేదోడు. వాదోడుగా నిలిచి ఉపకరించిన వానరు లందరిని ఆదరించి. అభిమానించినాడు. రావణ మరణా నంతరము ప్రత్యక్షమయిన ఇంద్రుని తానేమియు కోరలేదు. కానీ తనకై యుద్ధమున మరణించిన వానరులపై అతనిచే అమృతము వర్షింప జేసి. బ్రతికించి నాడు. అంతేకాదు వారెచట నివాసముండిన నచ్చట ఫల, పుష్ప తోయములు సమృద్ధిగా లభించునట్లు వరము ప్రసాదింప జేసినాడు. ఇంకను వారి జీవితములకు పెక్కు విధములగు సుఖ సంపదల తో బాటు మాన్యతయు ఘటింప జేసినాడు.

కృత మెఱుగుట పుణ్యము, స
న్మతి దీనికి సమము సేత మధ్యము, మరి త
త్కృతమున కగ్గలముగ స
త్కృతి సేయుట యుత్తమంబు కృత బుద్ధులకున్.

[భారతం-1-6-224]

ఇట్లు కృతజ్ఞతా భావము యొక్క ప్రాముఖ్యతను తన నడవడి ద్వారా ఆచరించి చూపించినాడు. పరివారాన్నీ [తనవారిని] ఆ దారినే నడిపించినాడు.

[రక్షితాస్వస్య ధర్మస్య స్వజనస్య రక్షితా] [14-1-1]

ఇట్టి ధర్మ ప్రతిపాదనమునకై మాధవుడే మానవుడై ఈ భూమిపై పుట్టి ఆచరణము ద్వారా మనకు ఆదర్శమును ప్రసాదించి నాడు. ఈ రకమగు [సంభావన] ఆలోచనా విధానమే భారతీయ సంస్కృతికి విశిష్టతను సంతరించి పెట్టినది. సమాజ రక్షణమునకు, అభ్యుదయమునకు ఈ ధర్మ మార్గమే అలంబమై విలసిల్లుతోంది.

"ధర్మమార్గం చరిత్రేణ, జ్ఞానమార్గంచ నామతః ।
తథా ధ్యానేన వైరాగ్యం ఐశ్వర్యం స్వస్యపూజనాత్" ॥

సమయ స్ఫూర్తి

ఒకడేదైనా ఒక పని తలపెట్టి చేస్తూ ఉన్న సమయంలో దాని కనుబంధంగా చేయదగిన కార్యక్రమాలు ఉంటే, అవి చేయాలని అనిపించి, చేయడం వివేక లక్షణం. ఆ కృషి ఫలించి, మంచి ప్రయోజనం కనుక పొందగలిగితే అతడు ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నాడని, సమయస్ఫూర్తితో వ్యవహరించాడని లోకం మెచ్చుకుంటుంది. అట్లా కానప్పుడు నిందిస్తుంది

ఈ మధ్య శ్రీపతిరావు పెద్దకూతురికి ఎవరో సంబంధం చెప్తే, ఆయన విడివిడిగా ఖర్చెందుకు, మా ఆడ పిల్లలిద్దరికీ ఒకేసారి వివాహం చేస్తాను. నాకు "జోడు గిత్తలు" కావాలని అన్నాడట, సుందర్రావు కొడుకు ఉపనయనం, కుమార్తె వివాహం ఒకేరోజు నిర్వహించి "ఏక క్రియా, ద్వ్యర్థకరీ" అన్నట్లు ఒకే శ్రమ ఒకే ఖర్చుతో రెండు పనులు సాధించాడు.

ఆ మధ్య దయానిధి నెవరో సభలో అనవసరంగా దుర్భాష లాడారని స్నేహితునితో చెప్పుకొని బాధపడ్డాడని విన్నాం. విచారిస్తే వాళ్ళ మాటలన్నింటికి అతను సరియైన సమాధానం చెప్పగలడు, వాళ్ళనోరు మూయించనూగలడు కానీ, ఆ సందర్భంలో అతనికా (స్ఫూర్తి) ఊహ కలుగలేదు కొందరిలో సునిశితమైన దృష్టి, సద్యఃస్ఫురణతో గూడిన ఆలోచనా శక్తి, మనోహరమైన వ్యక్తీకరణ విధానం ఉండటం వలననే వారు ఆశుకవితా విశారదులు, అవధాన విద్యావాచస్పతులు అయి లోకంలో గణన కెక్కుతున్నారు.

ఒకప్పుడు ఆంధ్రదేశంలో అవధాన చక్రవర్తులుగా పేరొందిన తిరుపతి వేంకట కవులకు, ఎవరో సుప్రసిద్ధ కాశీ పండితులకు విద్యా విషయకంగా పోటీ (స్పర్థ) ఏర్పడింది. "వివాదం ఎందుకు, సభాముఖంగా ఎవరి గొప్పతనం వారు నిరూపించుకుందా" మను కొన్నారు. వేదిక ఏర్పాటు చేయబడింది, ఆంధ్రలో వీరు పేరు ప్రతిష్ఠలు బాగా ఉన్న వారవటం చేత చర్చ ఏ శాస్త్రంలోకి ఎప్పు డెలా వెళ తుందోనని ఆ కాశీ పండితుడు శాస్త్ర గ్రంథాలన్నీ పరిశీలించి మరీ వచ్చాడు. చర్చ ప్రారంభింపబడింది. తిరుపతి వేంకటకవులు సంస్కృతంలో "కోయం వాదీ ?"

ఈ వాదం చేసె వారెవరు? అని ముందుగా వారి పేరడిగారు. అయన పేరు "కాశినాథుడు". అందుకు అయన "అయం కాశినాథః అని సమాధానం చెప్పాడు. "కథం కాశినాథః?" ఆ 'కాశినాథ' శబ్దం ఎట్లా వచ్చిందని వీరు తిరిగి ప్రశ్నించారు. వ్యాకరణ శాస్త్రాన్ని బట్టి కాశీనాథుడనే రూపమే ఉంటుంది కానీ, మరోలా కాదు. ఆ శాస్త్ర పండితుడు ఆలోచించి, ఆలోచించి ఆ రూపసాధనకు అవకాశం లేక పోవటంవల్ల నిర్ణీత కాలం అయిపోయిన తర్వాత తన ఓటమిని సభాముఖంగా అంగీ కరించి వేదిక దిగివచ్చాడు. అప్పుడెవరో ఒక స్నేహితుడు అయన దగ్గఱకువచ్చి ఈ ప్రశ్నకింత దూరం ఆలోచన ఎందుకు ? "యథా కాళిదాసః తథా కాశినాథః" ప్రయోగ ప్రసిద్ధి ననుసరించి (వ్యవహారాన్ని బట్టి) కాళిదాసువిలాగే కాశినాథుడని చెప్పక పోయారా? అని సూచించాడు. దాంతో అయన సమయానికి ఆ సమాధానం స్ఫురించి, చెప్పలేక పోయినందుకు బాధ పడ్డాడు.

ఒకప్పుడు చంగిస్‌ఖాన్ (దుష్ట బుద్ధితో) శివాజీని సంధి సంప్రదింపులకై ఒంట రిగా తన శిబిరానికి రమ్మని పిలిచి, చంపుదామని ప్రయత్నం చేస్తాడు. శివాజీ ఆ దుష్టుని ఆలోచన గమనించి, ఉపాయంగా అతనినే చంపి ఆ అపాయం నుండి బయట పడటం. (ఆ తర్వాత హిందూ సామ్రాజ్య స్థాపన చేయటం) అతని సమయ స్ఫూర్తికి ఉదాహరణగా చరిత్రలో వర్ణిస్తారు. ధర్మవీరుడైన అతని విజయం అభి నంద నీయమే కదా! ఇట్టివే నిత్యజీవితంలో జరిగే సంఘటనలు మరెన్నో ఉదాహ రించుకోవచ్చు

ఇంక "చూచి రారా అంటే కాల్చివచ్చా"డని లోకంలో ఒకసామెత ప్రచారంలో ఉంది. అది రామాయణంలో హనుమంతుని సాహసాన్ని, సమయ స్ఫూర్తిని ప్రశంసించే వాక్యంగా ప్రసిద్ధి కెక్కింది.

దండకారణ్యంలో రావణుడు కపటోపాయంతో సీత నపహరించుకొనిపోయిన తర్వాత సీతాన్వేషణలో భాగంగా రాముడు సుగ్రీవునితో మైత్రి చేసుకుంటాడు వాలిని వధించి, సుగ్రీవుని కిష్కింధా రాజ్యానికి పట్టాభిషిక్తుని చేస్తాడు. ఈ ఘట్టం వ్యక్తికి 'స్వార్థంకన్నా పరోపకారం మిన్న'గా వన్నె తెస్తుందని తన ప్రవర్తనలో ప్రకటించాడు రాముడు. ఇది కేవలం తన మిత్రుని సంతోషం కొఱకు అతని శత్రువును (వాలిని) సంహరించటమే కర్తవ్యంగా భావింపబడింది కాక, అధర్మాన్ని

ఖండించి ధర్మాన్ని ప్రతిష్ఠించట మనేది మాత్రమే పరమార్థంగా ఎంచి నిర్వహింప బడింది.

"యావత్తం నాభిపశ్యామి తవ భార్యాపహారిణమ్।
తావ త్సజీవే త్పాపాత్మా వాలీ చారిత్రదూషకః"॥ (33-10-4)

పాపాత్ముడైన వాలిని శిక్షించటమే ఇందులోని ముఖ్యాంశం

ఇదే ధర్మ స్వరూపుడైన రాముడు ఆశించిన ప్రయోజనం. కేవలం సీతను తిరిగి తెచ్చుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లయితే రాముడు బలవంతుడైన వాలినే ఆశ్రయించి ఉండేవాడు.

సమయము రాగానే సుగ్రీవుడు వానరసేన లన్నింటికి కబురు పంపి సీత జాడ తెలిసికొని రండని నలుదిక్కులకు పంపుతాడు. అందులో జాంబవంతుడు అంగదుడు హనుమంతుడు మొదలైనవారు దక్షిణ దిక్కుకు వెళ్తారు. వీరిలో హనుమంతుడు బుద్ధిబలంతో సురస (దేవతల తల్లి) చేసిన పరీక్షలో నెగ్గి పరాక్రమంతో సింహికను జయించి, శతయోజన విస్తీర్ణమైన లవణ సముద్రాన్ని దాటి, లంక చేరి, లంకిణిని హతమార్చి, లంకలో ప్రవేశించి, అంతా వెదకి చిట్ట చివరకు అతి కష్టం మీద అశోక వనంలో ఉన్న సీతను సందర్శిస్తాడు. తాను తెచ్చిన రామ ముద్రిక నిచ్చి, ఆమె శోకమును పోగొట్టి, జీవితాశను కల్పించి సీతా సందేశాన్ని విని ఆమె వద్ద నుండి సెలవు తీసుకొని బయట పడ్డాడు.

వచ్చిన పని అయ్యింది గనుక ఆ క్షణంలో అతడు తిరిగి వెళ్ళవచ్చు. సామాన్యులయితే అదే చేస్తారు. (విధి నిర్వహణ చేతకాని వాళ్ళు కొందరు ఆ పని చెడగొట్టి కూడా వస్తారు. అది వారి అవివేకానికి, అహంకారానికి నిదర్శనం.) కానీ మతి మంతుడైన ఆ హనుమంతుడు "స్వామి కార్యానికి భంగం లేకుండా దూత ఇంక కొన్ని ప్రయోజనాలను సాధించటంలో తప్పు లేదని ఆలోచిస్తాడు "

"కార్యే కర్మణి నిర్దిష్టే, యో బహూన్యపి సాధయేత్।
పూర్వ కార్యా విరోధేన సకార్యం కర్తు మర్హతి॥"
[5 - 41 - 5

రావణుని చూచి, అతనికి బుద్ధి చెప్పటం అవసరమని, అశోకవనం నాశనం చేస్తేనే కాని ఆ అవకాశం దొరకదని భావించి, ఆ పని చేస్తాడు. అదివిన్న రావణుడు ముందుగా కొంత సేనను, తర్వాత మంత్రి పుత్రులను, అటు పిమ్మట తన కుమారుడైన అక్షుని సపరివారంగా హనుమంతుని పైకి పంపుతాడు. వారందరూ అతని చేతిలో హతులు కాగా, రావణుడు మఱియొక తనయుని ఇంద్రజిత్తుని కూడా యుద్ధానికి పంపుతాడు. అతడు చాలా సేపు యుద్ధం చేసి హనుమంతుని శక్తి తెలిసికొని, తుదకు బ్రహ్మాస్త్రమునువేసి బంధిస్తాడు. హనుమంతుడు బ్రహ్మపై గల గౌరవంతో ఆ అస్త్రానికి కట్టుబడతాడు. రావణుని దర్శనానికి ఆ సమయంలో ఇదీ ఒక మార్గంగా అతడు భావించాడు.

రావణుడు నిండు సభలో ఉండి హనుమంతుని రాక గూర్చి మంత్రి ప్రహస్తుని చేత అడిగించాడు. హనుమంతుడు తాను సుగ్రీవ మంత్రినని, శ్రీరాముని దూతనని చెప్పి సీతా సందర్శనం కోసం వచ్చానని వివరించాడు. అంతే కాదు ఇప్పటి కయినా సీతను రామునికి కప్పగించి తప్పొప్పు కోమని బుద్ధి చెప్పాడు. రామునితో ఏ విధంగానూ నీవు సరిరావని అనవసరంగా దురభిమానంతో చెడిపోవద్దని హెచ్చరించాడు. వారి బలా బలాలు తులనాత్మక దృష్టితో పరిశీలించి చూపించాడు.

కదిలింపఁగాఁ జాలవదె కాదె ముక్కంటి,
విల్లెక్కు వెట్టుచో విఱిచి వైచె
వెన్నక నిన్నుఁ జెఱఁ గొన్నహైహయుఁ ద్రుంచి
నట్టి భార్గవుఁ బట్టు పట్టి విడిచె
సంద్రంబు నిడి చతుస్సాగరంబులను నిన్ను
ముంచి యెత్తిన వాలి మురువడంచె
మునుల పాలిఁటి మిత్తియనఁ జను ఖరదూష
ణాది నంతకు నింటి కతిథిఁ జేసె
మఱచితే నీకు మఱవిన మఱపురాని,
వెన్నియో కలవాతని సన్నలింక
సిగ్గుమాలిన నీ చెవిఁ జేర్చెదైనఁ
జెప్ప వలెనన్న నాకేని సిగ్గు లేదె,

శ్రీ.రా.క., సుం కాం. 3అ. 232 ప.

ఇంక బ్రహ్మాదు లెవ్వరూ రామునికి యుద్ధమున ఎదురు నిల్చి గెలువ జాలరనీ, అట్టి రామునికి అప్రియము కల్గించి నీవు బ్రతుక జాలవని వక్కాణించాడు. ఇప్పటికైనా సీత నప్పగించి రాముని శరణు వేడుమని కర్తవ్యాన్ని గుప్త చేశాడు. [5-2-4-51-5] అది విన్న రావణుడు కోపంతో ఊగిపోతూ, ఈతనిని చంపండని సేనల కాజ్ఞాపించాడు.

విభీషణుడు దూతను చంపటం నేరమనీ, నీతి శాస్త్రం తెలిసిన నీవు ఇప్పుడు విజ్ఞతతో ప్రవర్తించాలని చెప్పి రావణుని వారించి, అందుకు అభ్యంతరం పెట్టాడు. అయినా కోప మాపుకో లేక రావణుడు హనుమంతుని తోకకు నిప్పంటించ మని భటుల కాదేశించాడు ఆ రాక్షసులు అతని తోకకు నూనె గుడ్డలు చుట్టి నిప్పంటించి వీధులలో ఊరేగించారు. హనుమంతు డది అవకాశంగా తీసుకొని, విభీషణుని గృహం మాత్రం విడిచి, ఆ లంకలోని తక్కిన గృహాలన్నింటికి ఆ నిప్పంటించాడు. జనమంతా హాహాకారాలు చేస్తూ, చంటి బిడ్డల నక్కున జేర్చుకొని, ఏడుస్తూ, పెడబొబ్బలు పెట్టూ, వీధులలో పరుగెడ్తున్నారు. చూస్తూ ఉండగానే క్షణంలో పట్టణమంతా కాలి బూడిదై కూలి పోయింది. రాముని పరాక్రమం ఇట్లా ఉంటుందని తాను ముందుగా వారికి ప్రకటించిన రీతి తోచింది. ఆ సందర్భంలో విషయం తెలిసికొని సీత హనుమంతునికి ఏ ప్రమాదం లేకుండా కాపాడమని అగ్నిహోత్రుని ప్రార్థించింది. ఆ ప్రతివ్రత విన్నపం అతడు మన్నించాడు. రామ కార్యార్థియైన హనుమంతునకు ఎట్టి శ్రమా కలుగలేదు.

చివరగా హనుమంతుడు సీత వద్ద సెలవు తీసుకొని సముద్రం దాటి ఈవలి ఒడ్డుకు చేరి, (దృష్టామయా సీతా) తాను సీతను చూచినానని చెప్పాడు. అతని రాక నిరీక్షిస్తున్న కపివరు లానందం చెందారు. అందరూ కలిసి కిష్కింధ చేరి ఆ శుభ వర్తమానం రామునికి నివేదించారు. తదుపరి సేతు బంధనం, రావణ సంహారం జరిగాయి జగములన్నీ ఉల్లాసంతో ఉల్లసిల్లాయి. ఇదంతా హనుమంతుని సమయస్ఫూర్తి వలన సిద్ధించింది.

"సింగన్న అద్దంకి పోనూపోయాడు, రానూవచ్చాడు." అన్నట్లు ఏదోపని మీద పోయి, అలసత్వంతో ఆ పని ముగిసి, ముగియకుండానే ఊరికే పరుగులు

పెడుతూ వ్యర్థంగా తిరిగి వచ్చే సామాన్యులకు హనుమంతుని కార్య దీక్ష, సమయ స్ఫూర్తి, దూరాలోచన అలవడితే తలపెట్టిన ఏ కార్యక్రమాలైనా శుభాంతములై సుఖాంతము లవుతాయి అనటంలో సందేహం లేదు.

అందుకే ముందుగా "వానరేంద్రా! నీ వలె ధైర్యము, దూరదృష్టి, బుద్ధి బలము, కార్యనిర్వహణ సామర్థ్యము కలిగిన వారెవ్వరూ కూడా తమ తమ పనులలో పరాజయం పొందరు" అని ప్రశంసించిన సురస వాక్యములలో కార్యశూరునకు కావలసిన లక్షణాలు వివరింప బడ్డాయి. వాల్మీకి హనుమంతునిలో గల విశిష్టత వర్ణిస్తూ, మనకు ఈ సందేశాన్ని అందించాడు ఆ ఆది కవి సామాజిక స్పృహకిది ఒక ఉదాహరణ.

యస్యత్వేతాని చత్వారి వానరేంద్ర యథాతవ ।
ధృతి ర్దృష్టి ర్మతి ర్దాక్ష్యం స కర్మసు నసీదతి॥ [201-1-5]

సీత జాడ తెలిసి వచ్చిన అద్భుత చరిత్రుడైన హనుమంతుని సాహస కృత్యమును ప్రశంసిస్తూ, రాముడు స్వయంగా "భువిపై నితరులిట్టి దుర్లభమైన పని చేయజాలరు సరికదా! మనసుతో నైన ఊహించుటకు కూడా సమర్థులు కార"ని పలికి, ఈ నాడు హనుమంతుని వలన తాను, లక్ష్మణుడే గాక రఘువంశము సర్వము అపదలపాలు కాకుండా కాపాడ బడిందని అతనిని మనస్ఫూర్తిగా అభినందించాడు.

కృతం హనుమతా కార్యం సుమహద్భువి దుర్లభమ్ ।
మనసాపి యదన్యేన నశక్యం ధరణీతలే॥ [2-1-6]

అహంచ రఘువంశశ్చ లక్ష్మణశ్చ మహాబలః ।
వైదేహ్యా దర్శనే నాఽద్య ధర్మతః పరిరక్షితః॥ [11-1-6]

అట్టి హనుమంతుని స్మరిస్తేనే బుద్ధి, బలము, యశస్సు, ధైర్యము, నిర్భయత్వము, ఆరోగ్యము సిద్ధిస్తాయని అభిజ్ఞులు ఉపదేశించారు.

బుద్ధి ర్బలం యశో ధైర్యం, నిర్భయత్వ మరోగతా ।
అజాడ్యం వాక్పటుత్వంచ, హనుమ త్స్మరణాద్భవేత్॥

మాట - మన్నన

మనసును తెలియజేసేది మాట. ఆ మాట తీరునుబట్టి మనిషికి విలువ కలుగుతుంది. అతని లోతు అర్థమవుతుంది. అందుకే లోకంలో ఎవరైనా ఏదైనా అన్నపుడు ఏరా! ఈ మాట ఎక్కడ నుండి వస్తోంది? నాభిదగ్గర నుండా? నాలిక చివరనుండా? అని ప్రశ్నిస్తారు. కారణం దుర్జనులకు. ముఖప్రీతికై ఇచ్చకములు మాటాడే వారికి నాలుక తియ్యగాను, మనసు విషంగాను ఉంటుంది అది ఎంత మాత్రం విశ్వసింప దగింది కాదు.

దుర్జనః ప్రియ వాదీచ. నైత ద్విశ్వాస కారణం ।
మధు తిష్ఠతి జిహ్వాగ్రే, హృదయేతు హలా హలమ్॥ (పంచ తంత్రం)

సజ్జనుల విషయం అట్లాకాదు. మనసు, మాటా కూడా వారి చేతలకు తగినట్లుగానే ఉంటాయి. "మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం" అట్టి రే లోకంలో మహాత్ములుగా గౌరవింపబడతారు. ఆ మాటనుబట్టి మంచి చెడులు తెలుస్తాయి. బాహ్య సౌందర్య హేతుకమైన స్రక్ (పూలమాల) చందనాది సుగంధములతో గూడిన అలంకారములకన్నా మంచి మాటయే మిన్నగా, మానవుని అలంకరిస్తుందని భర్తృహరి వక్కాణించినాడు. "వాణ్యేకా సమలంకరోతి పురుషం వాగ్భూషణం భూషణం." మృదువైన మాట వేయి వరహాల మూటగా పరిగణింపబడటం కద్దు. ఆపదలో ఉన్నప్పుడు ఈ మాటయే గుండెనిబ్బరాన్ని, పరమోత్సాహాన్ని యిచ్చి కొందరి ప్రాణాలు కాపాడుతుంది.

కడలేని కలుములు వచ్చినా, విడిపోని యిడుములు తెచ్చినా అందుకు కారణం మాట మాత్రమే అనేది సత్యం. "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని" చెప్పిన సామెత ఒక విధంగా సమాజంలో మాటకుగల మహిమను ప్రకటిస్తోంది. "నోరా వీపుకు దెబ్బలు తేకే" అన్నది అందులోని మర్మం. పరుషంగా మాట్లాడటం దుష్టుల లక్షణం. అది విషం కన్నా, దహనం (నిప్పు) కన్నా దారుణమైంది. అట్టి పరుషవాక్కు మానసికంగా బలహీనమైన క్షణాన ఒక్కొక్కరి ప్రాణం కూడా తీస్తుంది [అయితే హితము, పథ్యము చెప్పేవారు, వినేవారు లోకంలో అరుదు]

మనిషిఎదుట మెత్తగా మాట్లాడినట్లు నటించి, వెనుక గోతులు తీసే వారు, ఒకవేళ మాట కరకుగా ఉన్నా మనసునిండా మంచితనం నింపుకొని ఇతరులకు సహాయంచేసే వారు, ఈ లోకంలో లేకపోలేదు అది అందరి విషయం కాదు, కొందరికి మాత్రమే పరిమితం. అటువంటి మినహాయింపులు అన్నిరంగాలలోను

ఉంటూనే ఉంటాయి. ఆ విషయం జాగ్రత్తగా పరిశీలించి తెలుసుకొని తగినట్లు ప్రవర్తించాలి కాని, తొందరపడి ఒక నిర్ణయం తీసుకోకూడదు.

పోతే, సూటిగా కాక డొంకతిరుగుడుగా మాట్లాడటం మంచి లక్షణం కాదు. మీ నాన్నగారున్నారా? అనటానికి నీ అమ్మ మొగుడు ఉన్నాడా? అనటానికి తేడా ఉంది. అది వారివారి సంస్కారాన్ని తెలియజేస్తుంది. మాట్లాడటం ఒక కళ. ఎదుటివారికి అర్థం కానంత తొందరగా మాట్లాడటం, ఊరికే సాగదీయటం, మాట నాన్చటం, అతిగా మాట్లాడటం, అట్లాగే చెప్పే విషయం సందేహం కలిగే లాగాను, దోషయుక్తంగాను ఉండటం, అపశ్రుతులు పలకటం, అనుచిత సంభాషణ చేయటం, అశ్లీలాన్ని ఉచ్చరించటం (నాఽశ్లీలం కీర్తయేత్) మాట్లాడుతున్నప్పుడు ముఖంలో వివిధ వికారాలు ప్రదర్శించటం వంటివి చేయకూడదు. నిపుణంగా మాట్లాడటం అనేది అధికమైన విద్యా పరిశ్రమ వలన, మంచి అభ్యాసం వలన మాత్రమే సిద్ధిస్తుంది.

మధురంగా, మనోజ్ఞంగా, క్రోధరహితంగా, స్నేహ సంపన్నంగా, క్లుప్తంగా, అర్థయుక్తంగా మాట్లాడాలి శ్రీ మద్రామాయణంలో వాల్మీకి రామసుగ్రీవులకు మైత్రి ఘటించిన హనుమంతుని గూర్చి రాముని నోట ఈ మాటయే చెప్పించాడు. (27-35-4-4) అదియే హనుమంతుని ప్రత్యేక అర్హతగా కొనియాడబడింది.

సంస్కార క్రమ సంపన్నా మద్రుతా మవిలంబితాం ।
ఉచ్చారయతి కల్యాణీం వాచం హృదయ హారిణీమ్॥ (32-4-4)

అంటే హృదయాన్ని కదిలించే శుభదాయకమైన అభిభాషణం ఎప్పుడూ ఆరోగ్య లక్షణం అన్నమాట. ఏం చెప్పాడు అన్నదాని కన్నా, ఏ విధంగా చెప్పాడు అన్నది ముఖ్యంగా పరిగణిస్తారు విమర్శకులు. అట్టి సంభాషణా చతురత కల్గినవాడు ఎట్లాంటి పనియైనా ఇట్టే సాధించ గల్గుతాడు. ఈ హనుమంతుని మంత్రిత్వము వలననే సుగ్రీవుడు దుఃఖసముద్రందాటి బ్రతికి బట్ట కట్టుటయే కాక, కిష్కింధకు రాజై నాడన్నది నిజం. తొలిగా రామలక్ష్మణుల సన్నిధిలో మాట్లాడిన కొద్ది మాటలలోనే తన సంస్కార యుక్తమైన వ్యక్తిత్వాన్ని, పాండిత్యాన్ని తెలియజేసిన వాడు హనుమంతుడు. ఆ కొద్ది మాటలలోనే ఎదుటివారి ఔన్నత్యాన్ని చక్కగా గుర్తించగల సహృదుడు రాముడు. మాటకున్న విలువ ఏమిటో ఈ పాటికి సహృదయులకు అర్థమయ్యే ఉంటుంది. ఆ విషయం గమనించి మనం పాటింపగలిగితే సత్యాసత్యములను తెలిసి మెలగ గలుగుతాం. ఆ విధంగా రామాయణం నిత్యజీవితంలో మనకు ఉపకరిస్తుంది.

రావణాపహృతయైన సీత అశోకవనంలో రాక్షసీజన మధ్యంలో బందీగా ఉంచబడింది. రావణుడు మాటిమాటికీ అచటికివచ్చి మానవ మాత్రుడైన రాముని అసహాయతను ప్రకటిస్తూ, తన అధికార, బల సంపదలనుగూర్చి వివరిస్తూ, సీతను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తాడు. ఇవియేవీ లెక్కచేయని సీతను బెదరిస్తూ, నామాట విని, మనసు మార్చుకొని, రెండు మాసముల గడువులోపల అంతఃపురానికి రాని పక్షంలో నిన్ను చంపి నీ రక్తం త్రాగుతానని నీ మాంసంవండించి తింటానని రాక్షసంగాచెప్పి వెళ్తాడు. దాని కనుగుణంగా చుట్టూ కాపలాఉన్న రాక్షస స్త్రీలు ఆమెకు అనేక విధాల తర్జన భర్జనలతో హింసించడం మొదలు పెట్టారు. త్రిజట కలలో రామాభ్యుదయాన్ని రావణ వినాశనాన్ని చూచి, వారికి వివరించింది. వారిని వారించింది. వారు భయంతో దూరంగా జరిగి చూస్తూ నిలుచున్నారు

రామ వియోగంతో పాటు ఈ విధమైన వత్తిడులను సహించలేని సీత మనసు ధైర్యం కోల్పోయి, బలహీనపడి, నిరాశా నిస్పృహలకులోనై పైనున్న చెట్టు కొమ్మకు ఉరిపోసుకొని చావటానికి సిద్ధపడింది. "జీవితం త్యక్తు మిచ్ఛామి శోకేన మహతా వృతా" (14/1-25-5).

అప్పటికే అక్కడికి చేరిన హనుమంతు డిదంతా చూశాడు. అచట జరిగిన సంభాషణ విన్నాడు. సీత మనస్సు తెలుసుకున్నాడు. అప్పుడామెను ఆత్మహత్యా ప్రయత్నం నుండి విరమింపజేసి, రాముని క్షేమవార్త వినిపించి, ఆమెకు జీవితాశను కల్పించాలి. హనుమంతుని ఉచితజ్ఞకు ఇది ఒక పరీక్షా స్థానం.

ఇప్పుడు తానేమీ మాట్లాడకుండా, ధైర్యం చెప్పకుండా ఊరికే తిరిగి వెళ్తే రాముడు సపరివారంగా వచ్చి రావణుని సంహరించి సీతను పరిగ్రహించే లోపల ఏ అవాయం జరుగుతుందో చెప్పలేం. అందువల్ల తానిప్పుడు ఆమెతో మాట్లాడి తీరాలి. అయితే తొందరపడి ముందుగా తాను కనబడితే ఇదీ ఒక రాక్షస మాయగా భావించి భయపడి వెంటనే ప్రాణం విడిచే ప్రమాదంఉంది. ఇట్లా అనేక విధాల ఆలోచించి అందుకు మార్గంగా హనుమంతుడు, ఉద్వేగాన్ని మాన్పే ఇష్టమైన చల్లని మెల్లని మాటలతో ఆమెకిపుడు ఊరట కల్గించాలని ఒక చక్కని యోజన వేశాడు.

అతడా చెట్టు కొమ్మల మధ్యనేఉండి సీతకు తెలిసేటట్లు అర్థవంతము అయిన మనుష్య భాషణములతో రామచరిత్ర కీర్తన చేశాడు. ధర్మయుక్తము, శుభదాయకము, మధురాక్షర సంభరితమునైన ఆమాటలు ఆమె మానసిక వైకల్యమును పోగొట్టి, బలాన్ని, ప్రాభవాన్ని కలిగిస్తాయన్నది అతని ఆలోచనలోని పరమార్థం. (43-30-5) ఇదే సాంఘికంగా రామాయణ పఠనంయొక్క ప్రయోజనంగా కూడా మనం భావించవచ్చు.

అది విన్న సీత మరణోద్యమం మాని మెల్లగా తలఎత్తి పైనున్న హనుమంతుని చూచింది. అతడప్పుడు దగ్గరకువచ్చి ఆమె సందేహాలకు సమాధానాలు చెప్పి విశ్వాసం కల్గించి, జీవితాశను చిగురింపజేస్తాడు. తర్వాత రాముడు రావణుని సంహరించి, సీతను పరిగ్రహించి అయోధ్యలో పట్టాభిషిక్తుడవుతాడు.

లోకంలో మాటామాటా కలిసి ప్రణయం ఏర్పడుతోంది. మాట విభేదం వలన ప్రళయమూ సిద్ధిస్తోంది. ప్రపంచ వ్యవహారాలన్నింటికి మూలం మాటఒక్కటే. నిత్య జీవితంలో కూడా అట్టి మాటల ప్రభావం ఎంతైనా ఉంటుంది. అది గుర్తించి పలుకవలసిన అవసరం బాగా ఉంది.

పరీక్ష తప్పితే పెద్దలు మందలింవారని విద్యార్థులు, అత్తమామలు, అడబిడ్డలు, భర్త ఏదో అన్నారని కొందరు, అయినవారు కాని వారుఏదో విమర్శించారని మరికొందరు (స్త్రీ, పురుషులు) రైలు క్రింద తలపెట్టో, నీటిలో దూకో, నిప్పంటించుకొనో, ఉరిపోసుకొనో మరణించడం వింటూనే ఉంటాం. ఇటువంటప్పుడు మాట ఎదుటి వారి మనసుపై ఎంత ప్రభావం చూపుతుందో అర్థమవుతుంది. పరుషంగా మాట్లాడటం వలన వచ్చే అనర్థం తేటతెల్లమవుతుంది.

స్వాతి చినుకు ఆల్చిప్పలో పడి ముత్యమైనట్లు, సహృదయుని హృదయ సీమలో నాటిన ఒక మంచి మాట ఔదార్యమునకు, ఉన్నతాదర్శమునకు కారణమౌతుంది. భారతదేశ స్వాతంత్రోద్యమంలో "వందేమాతరం" అన్న ఒక్క మాట మంత్రమై ప్రతినోటా వినిపించింది. జాతీయ భావాన్ని జాగృతం చేసింది. మహాత్ములను సృష్టించింది. మాన్యతలను ఘటింప జేసింది.

మాటలచేత దేవతలు, భూపతులు, భామినులు తృప్తిపొంది క్రమంగా వరాలు, పుణ్యాలు, సుఖాలు ప్రసాదించటం క్రొత్త కాదు. మాటవలననే మన్నన అభిస్తుందనటంలో వింతలేదు.

అయితే బాగా మాట్లాడకలిగే వానిని వాచాలునిగాను మితంగా మాట్లాడే వానిని మూగిగాను, చిత్రించే ఈ లోకంలో బ్రతకటం కత్తిమీద సామే అవుతుంది. "కుడితే తేలంటారు కుట్టకపోతే కుమ్మరి పురుగంటారు" అయినా ఉచితజ్ఞుడైన వాని నోటిమాటకు ఎప్పుడూ విలువ ఉంటూనే ఉంటుంది. అతడు అద్భుతములను సృష్టించ గల్గుతాడు. అపూర్వములను సాధించగల్గుతాడు.

మాటకొక శక్తి ఉంది. మౌనానికి అంతకన్నా గొప్పశక్తి ఉంది. అతిగా మాట్లాడే వారికన్నా, పరిమితంగా మాట్లాడే వారు సమాజంలో గౌరవింపబడతారు. అందరిచేత ఆదరింపబడతారు. అటువంటివారి సక్రమమైన అభిప్రాయములు నిశ్చలంగా ఉండి, నిస్సందేహంగా జాతి ప్రయోజనానికి ఉపయోగపడేవిగా ఉంటాయి.

నిత్యం ప్రశాంత చిత్తుడైన వానికి మాత్రమే అట్టివి సాధ్యమవుతుంది. అట్టివాడు మాత్రమే ఎప్పుడు మృదువుగా (ఎదుటివారు నొచ్చుకొనని విధంగా) మధురంగా మాట్లాడ గలుగుతాడు. కార్యసాధన కట్టి సంభాషణ ఉపకరిస్తుంది. ఒక వేళ ఎదుటి వారు తొందరపడి పరుషంగా మాట్లాడినా, తిరిగి తాను కఠినంగా మాట్లాడటం సత్పురుషుల లక్షణం కాదు. "పెద్దవాడెప్పుడూ పెద్దవాడు కాదు" అని పెద్దలనటం ఈ సందర్భంగా గుర్తుకు వస్తుంది. ఆ క్షమాగుణం అతనిని పురుషోత్తమునిగా చేస్తుంది. ఆవిధమైన మంచి లక్షణం రామునిలో ఉన్నట్లు వాల్మీకి అయోధ్య కాండలో అతని గుణాభివర్ణన చేస్తూ వివరించాడు.

స తు నిత్యం ప్రశాంతాత్మా మృదుపూర్వం ప్రభాషతే ।
ఉచ్యమానోఽపి పరుషం నోత్తరం ప్రతి పద్యతే ॥ (10-1-2)

రాముడు, తాను చక్రవర్తి తనయుడనని, ఇతరులతో తనకు ఎట్టి పనీలేదని ఒకప్పుడు ఏదైనా తనతో అవసరముంటే వాళ్ళుగా ముందుకు వచ్చి మాట్లాడాలే కాని తానెన్నడూ మాట్లాడనని మూర్ఖించుకొని కూర్చోలేదు. (లోకంలో కొందరు ప్రేమగా పలుకరించినా పలుకరు అది వేరే విషయం) రాముడు స్నేహపూర్వకంగా నవ్వుతూ (స్మిత పూర్వాభిభాషీ, (42-2-2) తానే ముందుగా పలకరించేవాడు. అడిగినదానికి తక్కగా సమాధానం చెప్పేవాడు. అందుకే వాల్మీకి రాముని "బుద్ధి మంతుడు" అంటాడు. అధరం కదిలివచ్చిన అతని ప్రతిమాటా మృదు మధురం.

"బుద్ధిమాన్ మధురాభాషీ, పూర్వాభాషీ, ప్రియంవదః! (13-1-2)

కోసల దేశంలోని పౌర, జానపదులైన ప్రజలందరు సభలో దశరథుడు రాముని రాజు చేయటానికి నిర్ణయించటంలో గల ఔచిత్యాన్ని మెచ్చుకుంటూ, అతని నాయకత్వ లక్షణాలను గూర్చి అనేక విధాల వివరించారు. అందులో సత్య నిష్ఠితుడైన ఆ రాముడు అసూయలేక భూతహితం కొఱకు, మితంగా మాట్లాడే వాడుగా పేర్కొనబడ్డాడు. మంచి మాటయే అతనికి అంతటి మన్నన చేకూర్చింది. ఇంకను "అగ్రహానుగ్రహ సమర్థుడైన అతని క్రోధ ప్రసాదములు ఎన్నడు నిరర్థకములు కావని విన్నవించిన ఆ ప్రజల మాట అక్షరాలా నిజం.

"నాస్య క్రోధః ప్రసాదశ్చ నిరర్థోఽస్తి కదాచన" (45/2-2-2)

సుగ్రీవ, విభీషణులకు అభయమిచ్చి అనుగ్రహించిన సందర్భంలో అతని ప్రసాదగుణం, వాలి, రావణులను నిగ్రహించిన సందర్భంలో అతని క్రోధగుణము సార్థకములై, ఫలితంగా లోకహితం జరిగిందనటంలో అతిశయోక్తి లేదు.

ఏ మాట ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలిసి మాట్లాడటం వివేకవంతుల లక్షణం. సీత వార్తకై సముద్రతీరంలో ఎదురు తెన్నులు చూస్తున్న వానరులలో గల ఆందోళనను పోగొట్టి ఆనందం కలిగించేందుకు లంక నుండి తిరిగి వస్తున్న హనుమంతుడు "దృష్టా మయా సీతా" మాశాను సీతను చేసని ముందుగా చెప్పటంలో గల విశేషం లోకవిదితమే.

"సామాజిక జీవితం రామాయణంలో ఏ విధంగా ప్రతి ఫలిస్తుంది ? అనే ప్రశ్న మనసులో ఉంచుకొని యీ గ్రంథం చదివితే మనోరంజకమైన సమాధానం వస్తుంది. అన్నింటికీ రామాయణమే ఆదర్శగ్రంథం అని 'ఏలాంటి వాదులు' నిశ్శంకంగా అంగీకరించి తీరుతారు ... ఇది సామాజిక జీవితము నిండుగా ప్రతిఫలించే నిర్దుష్ట దర్పణమే ... కళాశాలల్లో పాఠ్యముగ నిర్ణయించదగిన రచన."

— శ్రీ యామిజాల పద్మనాభస్వామి. ['భారతి' సెప్టెంబర్ 1988]

"మన సాహిత్యమంతా సమాజంతో ముడిపెట్టుకొని ఉన్నదే తప్ప ఆకాశ పురాణంకాదని, సమాజానికి రామాయణ ప్రయోజనం ఈనాటికీ ఉన్నదని ఈగ్రంథం వలన గ్రహింప గల్గుతాము ... ఈ గ్రంథమును పొందుట సజ్జన సాంగత్యము లభించుటయే" — 'సుజన ప్రియ' శ్రీఅన్నదానం చిదంబరశాస్త్రి

('హనుమత్సేవ' ఆగస్ట్ 1988)

"రామాయణ గాథలో సమాజోపయుక్తమయిన భిన్నాంశాలను, సామాజిక ప్రవృత్తులు రామాయణంలో ప్రతిబింబితమయిన తీరును వివరించటం ఈగ్రంథం లక్ష్యం.... రామాయణ గతధర్మాలను ఆచరణ యోగ్యంగా వివరించి ప్రచారం చేయటం గ్రంథం ప్రయోజనం" —డా॥ వాలిలాల సుబ్బారావు

(పాపయారాధ్య 1988 ఆగస్ట్ 20)

"రామాయణం-సమాజదర్పణం అను గ్రంథము సరళమైన ఆంధ్రభాషలో రచించబడిన ఒక రామకథా భాష్యము. శ్రీ దక్షిణామూర్తిగారు రామాయణ గత సార్వకాలిక మహాసత్యములను వ్యాఖ్యాన రమణీయముగా గ్రంథ గతము చేసిరి. రామకథా ధర్మములు ఆచరణ యోగ్యములు, సుఖైక ప్రాప్తికి సాధనములు. ....దక్షిణామూర్తిగారి వ్యాఖ్యాన వైఖరి సనాతనం మరియు సర్వకాలాను సరణీయముగా నున్నది." -డా॥ కాజలక్ష్మీనరసింహారావు (శ్రీవాణి జూన్ 1988)

రామాయణం వ్యక్తినీ, వ్యవస్థనూ తీర్చిదిద్దడంలో అపూర్వ సామాజిక ప్రయోజనాన్ని సాధించిందని నిరూపిస్తూ, శ్రీ దక్షిణామూర్తిశాస్త్రి, రామకథమీద సమగ్ర పట్టాపుచ్చుకొని, ప్రస్తుతం ఈ గ్రంథాన్ని వెల్వరించారు .. సహేతుకంగా, సత్యప్రకాశనం చేస్తూ సాగిన ఈ రచన భారతీయ ధార్మిక సాహితీ సంస్కృతుల ప్రదర్శన కేశామెత్తింది", -డా॥ కసిరెడ్డి ['జాగృతి' ఆగష్ట్ 8-14, 1988]

వ్యక్తి, కుటుంబం, సమాజం, జాతి అనే క్రమంలో ఆలోచన సాగించి జీవిత లక్ష్యం అందుకోవాలనే జిజ్ఞాసగల వారికి రామాయణం ఎట్లా ఉపయోగపడుతుందో చెపుతూ రామాయణ పఠనం ఏ దృష్టితో చేయాలో కూడ వివరిస్తుంది ఈ గ్రంథం

డాక్టర్. దీవిదీక్షితులు [-'జనతా' దిన పత్రిక 21-2-88]

రామాయణం-సమాజదర్పణం

2వ భాగము

రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్, తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి

ఎం ఏ., పిహెచ్. డి.

రామాయణం - సమాజదర్పణం

2వ భాగము

వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామంటపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే వీరాసనే సంస్థితమ్।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్॥

శ్రీరామ కర్ణామృతమ్

రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్, తూములూరు శ్రీ దక్షిణామూర్తిశాస్త్రి

ఎం. ఏ., పిహెచ్. డి.

సర్వస్వామ్యములు రచయితవి.

ప్రతులు 1000

విభవపుష్య బహుళ పంచమి
25, జనవరి 1989

సింధువునుజేరి బిందువు సింధు వగును
ధ్యేయమును బట్టి ప్రతిపని దివ్య మగును
గాలిబ్ గీతాలు—దాశరథి

ప్రతులకు :

శివశ్రీ ప్రచురణలు
బ్రాహ్మణ వీధి, పొన్నూరు.
గుంటూరు జిల్లా-522 124.

మూల్యము రు. 12/-

ముద్రణ :

శ్రీ నటరాజ ప్రెస్
కోటమ్మగుడివద్ద
పొన్నూరు-522 124

"ఎవడు జీవింప జీవింతు రితరు లతని
జీవితమె జీవితము ధన్యజీవి అతడు"

"ఇతడు జీవింప జీవింతు రితరు లితని
జీవితమె జీవితము ధన్యజీవి ఇతడు"

ముద్రాపకులు
"దానవీర"

శ్రీ గ్రంధి సుబ్బారావుగారు
ప్రొప్రయిటర్ :
క్రేన్ బెటల్ నట్‌పౌడర్ వర్క్సు - గుంటూరు

ర చ యి త

భాషాప్రవీణ. విద్యాప్రవీణ

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి

ఎం. ఏ., పిహెచ్. డి.

రచయిత తల్లిదండ్రులు



బ్ర. వే. తూములూరు వెంకట్రామశాస్త్రి
ధర్మపత్ని వెంకట నరసమ్మ

అంజలి

'తెలిసి రామచింతన చేయండి' అన్నది త్యాగరాజస్వామి ప్రబోధం.

ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో 'శ్రీరామ కథాఽమృతము' పై పరిశోధన నిబంధము వ్రాసే భాగ్యం నాకు లభించింది. అది రామానుగ్రహం

రామాయణంలో కనిపించే గాథలు, వినిపించే బోధలు సార్వకాలికములు, సార్వజనీనములు.

మహర్షులు సమాజశ్రేయస్సుకై సాహితీ రూపంలో అందించిన సందేశ తరంగిణిలోని కొన్ని తరంగాలకు అక్షరాకృతి ఈ కృతి.

అదుపు తప్పిన అరిషడ్వర్గాలకు పగ్గం పట్టటం కోసమే ఈ ప్రయత్నం.

నా ఆలోచన సమాజానికి ఈరూపంలో అందడానికి ఆర్థికంగా సహకరించిన శ్రీ గ్రంధి సుబ్బారావుగారికి, హార్దికంగా చేయూతనిచ్చిన శ్రీ బూసా కోటయ్యగారికి నా కృతజ్ఞతలు.

సాహిత్య ప్రయాణంలో నన్ను ఎందరో పెద్దలు ఆశీస్సులతో, ఆప్తవాక్యాలతో, శుభాకాంక్షలతో ప్రోత్సహించారు. శ్రుతి కలిపారు, ఉపశ్రుతి పలికారు. ముందు మాటలు చెప్పారు. మంగళాశాసనంతో మార్గదర్శనం చేశారు. 'రత్నదీపాన్ని' కరదీపికగా అందించారు. వారి సహృదయతకు నా నమస్సుమాంజలి.

పాఠక సోదరుల సంపూర్ణ సహకారమే నా కృషికి సార్థకత చేకూరుస్తుంది.

అన్నివిధాలా నాతో సహకరించి ముద్రణకు తోడ్పడిన శ్రీ నటరాజ ప్రెస్ యాజమాన్యం వారికి, సిబ్బందికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

కృతజ్ఞతలతో
రచయిత

విషయసూచిక

	పుటలు
పెద్దల అభిప్రాయాలు	
1) సమాజం........	
2) నేరము-శిక్ష	103-111
3) అసూయ	112-117
4) వ్యసనాలు	118-125
5) జీవితం	126-130
6) ఎడబాటు	131-138
7) అవకాశవాదం	139-148
8) ఆకలి దప్పికలు	149-156
9) అమృతత్వము	159-166
10) ప్రేయము-హితము	167-174
11) కారుణ్యము	175-182
12) పతిత పావనత్వము	183-188
13) ధర్మవృక్షము	189-210

ఈ సంసార మదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి రో
సా సంక్రాంత ఋణంబు దీర్పగలదా? సత్కావ్య నిర్మాణరే
ఖా సామగ్రి ఋణంబు దీర్పగలదా? కాకుత్స్థుడౌ స్వామి గా
థా సంపన్నము భక్తి దీర్చినను ద్వైతాద్వైత మార్గంబులన్.

శ్రీ విశ్వనాథ

'రామాయణం - సమాజదర్పణం'పై

(మొదటి భాగము)

వివిధ పత్రికలలో ప్రచురితమైన, పెద్దల అభిప్రాయాలు

"సామాజిక జీవితం రామాయణంలో ఏ విధంగా ప్రతి ఫలిస్తుంది? అనే ప్రశ్న మనసులో ఉంచుకొని యీ గ్రంథం చదివితే మనోరంజకమైన సమాధానం వస్తుంది. అన్నింటికీ రామాయణమే ఆదర్శగ్రంథం అని ఏలాంటి 'వాదులు' నిశ్శంకంగా అంగీకరించి తీరుతారు ఇది సామాజిక జీవితము నిండుగా ప్రతిఫలించే నిద్దపుటద్దమే... కళాశాలల్లో పాఠ్యముగ నిర్ణయించదగిన రచన."

— శ్రీ యామిజాల పద్మనాభస్వామి ['భారతి' సెప్టెంబర్ 1988]

"మన సాహిత్యమంతా సమాజంతో ముడిపెట్టుకొని ఉన్నదే తప్ప ఆకాశపురాణం కాదని, సమాజానికి రామాయణ ప్రయోజనం ఈనాటికీ ఉన్నదని ఈగ్రంథం వలన గ్రహింపగల్గుతాము ఈ గ్రంథమును పొందుట సజ్జన సాంగత్యము లభించుటయే" — 'సుజన ప్రియ' శ్రీఅన్నదానం చిదంబరశాస్త్రి

('హనుమత్సేవ' ఆగష్టు 1988)

"రామాయణ గాథలో సమాజోపయుక్తమయిన భిన్నాంశాలను, సామాజిక ప్రవృత్తులు రామాయణంలో ప్రతిబింబితమయిన తీరును వివరించటం ఈగ్రంథం లక్ష్యం రామాయణ గతధర్మాలను ఆచరణ యోగ్యంగా వివరించి ప్రచారం చేయటం గ్రంథం ప్రయోజనం" —డా॥ వాలిలాల సుబ్బారావు

(పాపయారాధ్య 1988 ఆగష్టు 20)

"రామాయణం-సమాజదర్పణం అను గ్రంథము సరళమైన ఆంధ్రభాషలో రచించబడిన ఒక రామకథా భాష్యము. శ్రీ దక్షిణామూర్తిగారు రామాయణ గత సార్వకాలిక మహాసత్యములను వ్యాఖ్యాన రమణీయముగా గ్రంథ గతము చేసిరి. రామకథా ధర్మములు ఆచరణ యోగ్యములు, సుఖైక ప్రాప్తికి సాధనములు. ....దక్షిణామూర్తిగారి వ్యాఖ్యాన వైఖరి సనాతనం మరియు సర్వకాలాను సరణీయముగా నున్నది." - శ్రీ కాజ లక్ష్మీనరసింహారావు (శ్రీవాణి జూన్ 1988)

రామాయణం వ్యక్తినీ, వ్యవస్థనూ తీర్చిదిద్దడంలో అపూర్వ సామాజిక ప్రయోజనాన్ని సాధించిందని నిరూపిస్తూ, శ్రీ దక్షిణామూర్తిశాస్త్రి, రామకథమీద

సమగ్ర పట్టాపుచ్చుకొని, ప్రస్తుతం ఈ గ్రంథాన్ని వెల్వరించారు ... సహేతుకంగా, సత్యప్రకాశనం చేస్తూ సాగిన ఈ రచన భారతీయ ధార్మిక సాహితి సంస్కృతుల ప్రదర్శన కేతామెత్తింది", -డా॥ కసిరెడ్డి ['జాగృతి' ఆగస్టు 8-14, 1988]

"రామాయణేతి హాసంలోని వివిధములైన సన్నివేశాల సారాన్ని సమాజ పరంగా, ధర్మ సంబోధకంగా, ఋజుశ్రీ ప్రవర్తకంగా సోదాహరణంగా మలచి, మహనీయత మలిచారు." –శ్రీ బద్దెపూడి రాధాకృష్ణమూర్తి బి.ఏ., బి.యల్., సుప్రీంకోర్ట్ అడ్వకేట్, గుంటూరు.

"మీ రామాయణం–సమాజదర్పణం'లో రామాయణాన్ని ఆధారంగా భిన్న విషయాలు సమాజానికి అవసరమైన వాటిని చక్కగా విశ్లేషించి నిరూపించారు. యథోచితంగా అన్యగ్రంథ విషయాలను కూడా కలుపడం ఎంతో ముదావహం ... వ్యాసాలు చిన్నవి. విషయం సర్వజన శిరోధార్యము. అత్యంత సుగమం."

–డా॥ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి
రీడర్, ఆంధ్రాయూనివర్సిటీ.

రాముడు వ్యక్తికి ఆదర్శం. సీతారాములు కుటుంబానికి ఆదర్శమూర్తులు. రామాయణం సమాజానికి ఆదర్శం, సంస్కృతికి ఆధారం.

వ్యక్తి, కుటుంబం, సమాజం, జాతి అనే క్రమంలో ఆలోచన సాగించి జీవిత లక్ష్యం అందుకోవాలనే జిజ్ఞాసగల వారికి రామాయణం ఎట్లా ఉపయోగపడుతుందో చెపుతూ రామాయణ పఠనం ఏ దృష్టితో చేయాలో కూడ వివరిస్తుంది ఈ గ్రంథం

['జనతా' దిన పత్రిక 21-2-88, డాక్టర్. దీవిదీక్షితులు]

"రామాయణం-సమాజదర్పణం" పూర్తిగా చదివాను, ఆనందం కల్గించింది. మన గ్రంథాలలోని విషయాలను సమాజపరంగా అన్వయించి చెప్పడం ఈనాటి మన ముఖ్యావసరాలల్లో ఒకటి. ఆ లక్ష్యం సాధించేందుకు ఇందులో కొంతవరకు ప్రయత్నం జరిగింది.

–శ్రీ తూములూరి లక్ష్మీనారాయణ
విజయవాడ, 6-1-89.

సంకలనం :

బి. వి. యల్. శేషగిరిరావు

పొన్నూరు

ఆశీస్సు

"ఉపన్యాసకళానిధి" ప్రభాకర శ్రీకృష్ణభగవాన్

ఓంకారమే మూలకందమై, విజ్ఞాన సర్వస్వమే మూలస్కంధమై, షడంగ షడ్దర్శనాది విద్యలే శాఖాసమూహమై, వేదాంత సంచయమే లతాంత సంతానమై, మోక్షమే సర్వరస ఫలమై విరాజిల్లు వేదకల్ప వృక్షమునకు నమశ్శతములు.

ప్రపంచంలో ఇంత వరకు లభించిన గ్రంథాలలో అత్యంత ప్రాచీన గ్రంథం ఋగ్వేదం. ఆఋగ్వేదం సప్తసింధు దేశాన్ని ముందుగా ప్రకటించి దానినే ఆర్యావర్తము. దేవనిర్మిత భూమి అని దానినే ఆర్యుల కొసంగినట్లు తెలిపినది. ఆర్యావర్తంలో రాజ్యాలు మారినా, కాలం విభమించినా, విపత్తులు పరంపరగా సంభవించినా, సమస్త భాషాప్రకృతులకు తల్లియైన సంస్కృత భాష, అసమాన వైభవంతో, అనిర్వర్ణనీయ వైచిత్ర్యంతో విలసిల్లి గ్రీకుభాషలోని మెత్తదనానికి, రోమన్ భాషలోని బలసంపత్తికి మూలాధారంగా ఖ్యాతి గాంచినది.

మహామహి మాన్వితుడుగ, తపస్స్వాధ్యాయ నిరతుడుగ, ద్రష్టగ, తపోధనుడుగ కీర్తింపబడు ఆదికవి వాల్మీకి, సంస్కృత సాహిత్యాన్ని సుసంపన్నంచేసి, రసభావాల అద్వైత మధుకుల్యల్లో సహృదయ లోకాన్ని ఓలలాడించాడు. ప్రపంచ వాఙ్మయానికే మూలం శ్రీమద్రామాయణం.

భారతీయ సంస్కృతి, సభ్యత, నాగరికత, ఆచార వ్యవహారాలు, హృదయము ఈ రామాయణ మహాకావ్యంలో దర్శింపవచ్చు. తరతరాల అర్షవాఙ్మయ సారం ఆదికవి వాల్మీకి కవితా శిల్పంలో అక్షరబద్ధమైంది. రామాయణం చిత్త సంస్కారాన్ని పూలవానకల్లా గుబాళింపజేసి, గుండెల్ని తట్టి, మేల్కొల్పి, కలకండలు పండించింది. సారస్వతాద్భుత రోచిస్సుతో వెలుగొందింది. ఎన్నో హేమంతాలు, ఎన్నెన్నో శిశిరాలు గడచినా వసి వాడలేదు;

వేదాంతి, విజ్ఞానవేత్త, ఋషి పుంగవుడు, దార్శనికుడు, కవి, తపస్వి అయిన వాల్మీకి సర్వ కాలాలలోని, సమస్త ప్రజలకు శాంతి, సౌఖ్య, సౌభాగ్యాలను ప్రవహింపజేసే జీవనదిగా రామాయణాన్ని అవతరింప జేశాడు. ఆపావన గంగలో పుణ్యస్నానాలను చేసి పునీతుల మవటలు, మన కర్తవ్యం.

పరిపాలనలో రాజకీయ సంపదతో పాటు, సంస్కృతీ వైభవాన్ని, సారస్వత ప్రాభవాన్ని కోల్పోయిన భారతజాతి, స్వరాజ్యానంతరం కూడా బానిస భావాలతో, మూఢానుకరణతో, నిర్జీవంగా కాలంగడపటం మనజాతి ఆరోగ్యానికి క్షేమంకాదు. సాహిత్య సంపదను పదిలంగా రక్షించుకుంటూ, భావితరాల వారికి అందివ్వ వలసిన బాధ్యతను విస్మరిస్తే, ముందు తరాలవారి కోపాలకు, శాపాలకు గురి అవుతాం.

ఒకవైపు సనాతన ధర్మసంప్రదాయాలను విమర్శించే వారూ, మరొకవైపు సంస్కృత సాహిత్యాన్ని అవహేళన చేసేవారూ, ఒకరు మతాన్ని మత్తుమందు అనే వారూ, మరొకరు పాత అంతా రోత అనేవారూ, ఒకవైపు రామాయణ భారతాల్లో సామాజిక స్పృహలేదనే వారూ, మరొకవైపు దేవుడు లేడనేవారూ, స్వర్గ నరకాలు, పాప పుణ్యాలు, ధర్మాధర్మాలు లేవనే వారూ, ఈ విచిత్ర వేషధారుల బూటకపు కపటనాటకాల నుండి. ప్రాచీన భారతీయ సాహిత్య సౌధాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిది.

ఆదర్శం అంటూ ఏమీ లేకుండా, ఆశయాలకు దూరంగా గమ్యం తెలియక, లక్ష్యం గుర్తించకుండా, నైతిక విలువల స్వరూప స్వభావాలు కూడా గమనించకుండా, అస్తవ్యస్త విధానాలతో, పరదాల సంబరాలతో, విలాసాల ముసుగులో జీవయాత్ర సాగిస్తున్న, ఈతరం కొత్తవారికి రామాయణపరమార్థాన్ని తేటతెల్లంగా తెలియపరచి, వారిని కర్తవ్యోన్ముఖులనుగా, కార్యశూరులనుగా తీర్చిదిద్దటానికి "కాయకల్ప చికిత్స"ను చేపట్టిన డా॥ దక్షిణామూర్తిశాస్త్రి అభినందనీయుడు. యువతరానికి చెందిన కవిపండితుడైన శ్రీశాస్త్రి శైలి, సర్వత్ర మధురప్రసన్నము, లలిత లావణ్య సుసంపన్నము. శ్రీశాస్త్రి రచన శబ్దపుష్టితోపాటు అర్థశక్తి కూడా కలది. విప్పుకుంటానికి వేచిన శ్రీశాస్త్రి తన ప్రతిభా ప్రాభవాలతో దిక్కులను పుష్కలింపాలి. రసవతియైన సరస్వతికి పట్టుసెల్లాలుకట్టి, పువ్వుల పల్లకిలో ఊరేగింపాలి. రామాయణ మహాకావ్యంలోని సాహిత్య సౌష్ఠవం, కవితాసౌరభం జీర్ణించుకున్న డా॥ దక్షిణామూర్తిశాస్త్రి రచన "రామాయణం-సమాజదర్పణం" సహృదయ సమాజానికి రత్నముకురంగా, తెలుగుతోటలో పసిడిపూవుగా భాసిల్లాలని ఆశిస్తున్నాను. మనకు కావలసింది మృతం కాదు అమృతం—చ్యుతం కాదు అచ్యుతం. క్షయం కాదు అక్షయం.

డా॥ శ్రీ దక్షిణామూర్తిశాస్త్రీ! భద్రం తే!

ఆప్తవాక్యం

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్
ఎం.ఎ., పిహెచ్.డి.

శ్రీయుతులు డాక్టర్ తూములూరు శ్రీ దక్షిణామూర్తిశాస్త్రిగారి "రామాయణం--సమాజదర్పణం" అను గ్రంథమును ఆమూలాగ్రము చదివి ఆనందించితిని. భారతదేశములో రామగాథకున్న ప్రాశస్త్యము వేరుగా చెప్ప నక్కరలేదు. అట్లే రామాయణముపై జరిగినన్ని పరిశోధనలును, వచ్చినన్ని రచనలును మరొక గ్రంథముపై రాలేదనినచో అతిశయోక్తి కానేరదు. కాని ఎవరి రచన వారిదే. ప్రతి దానిలోనూ ఏదో నవనవోన్మేషమైన ప్రతిభ కన్పడుచునే యుండును. శ్రీ దక్షిణామూర్తిశాస్త్రిగారి కృతి యట్టిది. ఇందు వీరు రామాయణమును సామాజిక దృష్టితో అధ్యయనము చేసినారు.

శ్రీ దక్షిణామూర్తిశాస్త్రిగారు కేవల పండితులే కారు ప్రతిభావంతులును. వారి ప్రతిభ, వ్యుత్పన్నత రెండును ఈ గ్రంథములో పుష్కలముగా కన్పడును. ఎప్పుడో త్రేతాయుగములో జరిగిన కథ ఎంత నిత్యనూతనమైనదో, ఎట్లు సార్వకాలికమైనదో శ్రీ శాస్త్రిగారు వివరించిన తీరు ప్రశంసాపాత్రము.

శ్రీ దక్షిణామూర్తిగారు వేదధర్మ నిరతులు. కావుననే ఒకచోట (37 పుట) ఇట్లనినారు. "వేదం సర్వవిద్యల సమాహారం సకల కళలకిది కాణాచి అందలి విషయము లొక్కొక్కటి ప్రత్యేక విభాగమై అదియు శాఖోపశాఖలమై నేడు వివరింపబడుతూ వైజ్ఞానికంగా (సైన్సు) ప్రపంచంలో విస్తరిస్తూ విశేషఖ్యాతి గడించడం పరిశోధనా పరంపరల వలన నిరూపితమైన సత్యం"

వర్తమాన దుస్థితికి నైతిక, ఆధ్యాత్మిక శిక్షణారాహిత్యమునకు నిగమార్థ ప్రచారము, తదనుగుణమైన ఆచరణము వినా మరొక పరిష్కారము లేనేలేదు. "వేద వేద్యే పరే పుంసి" శ్లోకము ననుసరించి వేదమే రామాయణ మైనది. వేదపురుషుడే ఆచరణ రూపములోని రాముడు. శ్రీ దక్షిణామూర్తిశాస్త్రిగారి సుగమము, సుందరము అయిన రామాయణ సామాజిక వ్యాఖ్య పండిత పామరుల నలరించి జాతికి కరదీపిక కాగలదను ఆశతో

శే దీ
10-12-1988

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్
ఎం. ఎ., పిహెచ్.డి.
2-2-647 / 132-B
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాదు-13. (A.P.)

ఉపశ్రుతి

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి యువతరం పండితులకు ప్రతినిధి. గురుకుల క్లిష్టంగా గుంటూరు కళాశాలలో సంస్కృతాంధ్రాలను అభ్యసించాడు. అసలే పండిత వంశం. అపైని దిగ్గంతులవంటి పండిత ప్రకాండుల శిక్షణ అనురుచి అగ్రహం ఉండనే ఉన్నాయి. ఇక చెప్పేదేమి. చదివిన చదువులకి ఉద్యోగం సార్థకత చేకూర్చింది. మకిలి పట్టకుండా చదును పెట్టుకోడానికి అవకాశం వచ్చింది.

చదువుకుంటున్న రోజుల్లో ఇతడూ ఇతని మిత్రులు మరొక దక్షిణామూర్తి (పరుచూరి) రామకృష్ణుడూ సినిమా పాటల్లో కూడా వ్యాకరణాంశాలనూ అలంకారాదికాన్నీ గవేషించేవారు. సాయంకాలాలు నాతో భేటీ వేసుకుంటూ ఉండేవారు. "తేహి నో దివసా గతాః."

సరే-ఇటీవల ఇతని బుద్ధి రామాయణం మీదికి ప్రసరించింది. శ్రీరామ కథామృతాన్ని పరిశోధించి డాక్టరేట్ పట్టాను ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పొందాడు. అది ముద్రింపబడి పెద్దల మన్ననలను అందుకుంటోంది.

అక్కడితో ఆగలేదు. ఆధునికమైన సామాజిక దృక్పథం ఇతడిని వెంటాడింది. ఆ దృష్టితో రామాయణ కథను పాఠకులకు అందించాలి అనుకున్నాడు. ఈనాటి సమాజానికి పనికివచ్చే అంశాలు రామాయణంలో ఏమున్నాయి, ఎలా ఉన్నాయి అనేది సోదాహరణంగా వివరిస్తూ ఇది రెండవభాగం అందిస్తున్నాడు. శ్రీమద్రామాయణం ఈనాటి సమాజానికి కూడా దర్పణం అని ఎన్నో విషయాలతో నిరూపించాడు.

ఇది ఈనాటికి అవసరమైన ప్రయత్నం. రచయిత పడిన శ్రమ వృథా పోదు. ఈ రెండవ భాగంలో లోకాభి రామాయణం రవ్వంత ఎక్కువ అయ్యింది. అదీ అవసరమే. రచనలో కొంతసేపు గ్రాంధికచ్ఛాయ మరికొంత దూరం వ్యావహారికం ఇలా కలగలుపుగా సాగాయి. ఇదొక అందం. అయితే ఏది మాట్లాడినా ఒక శ్లోకాన్నో ఒక పద్యాన్నో ఒక సూక్తినో ఆధారంగా ఉదహరించాడు. ఆధునిక సమాజానికి దర్పణం పట్టాడు.

ఇటువంటి మరిన్ని మంచి గ్రంథాలు ఈ చిరంజీవి నుంచి సమాజానికి అందాలి. అందుకు తగిన ప్రోత్సాహాన్నీ, ఆశీస్సులనూ ఇతడికి అనుగ్రహించవలసిందని పండిత మండలిని వేడుకొంటున్నాను.

మరికొన్ని మంచిమాటలు చెప్పాలని ఉంది. కానీ శైష్యోపాధ్యాయిక అడ్డం వస్తోంది. సెలవు.

తెలుగు విశ్వవిద్యాలయం
రాజమహేంద్రి

మీ
బేతవోలు రామబ్రహ్మం
20-12-88

ముందుమాట

మన్నవ గిరిధరరావు EX. M.L.C. గుంటూరు

ఒక వస్తువు విలువ వినియోగం వలన వెల్లడవుతుంది. ఒక సిద్ధాంతం యొక్క ప్రయోజనం ఆచరణ వలన ప్రకటితమవుతుంది. అనుభవంలోకి రాని జ్ఞానమంతయు మిధ్యగా మిగిలిపోతుంది.

వ్యాస వాల్మీకాది మహర్షులు జ్ఞాన భాండాగారములను అందించి పోయారు. అన్ని కాలముల కుపకరించు అమృత వాక్కులందున్నాయి. అవి హృదయాలను ద్రవింప జేస్తాయి; మనస్సులను వికసింప జేస్తాయి; జనులను కార్యశీలుర నొనరిస్తాయి.

అట్టి ప్రాచీన సాహిత్యంలోని ఆలోచనామృతమును నేటి జీవన పరిస్థితులకు అన్వయింపజేసి ప్రబోధించ వలసిన అవశ్యకత ఎంతైనా వున్నది. అలా వివరించి చెప్పేవారు కొరవడినందున నేటి యువతరం భారత రామాయణముల ప్రయోజనాన్ని గుర్తించ లేకుండా వున్నది.

అట్టి అవశ్యకతను గుర్తించి డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తిగారు 'రామాయణం-సమాజ దర్పణం' అను వ్యాస సంపుటిని వెలువరించారు. సమాజంలో అనుదినం ఎదురయ్యే జీవన సమస్యలను, కన్నీటి గాథలను ఉటంకిస్తూ వాటికి రామాయణం ఎట్టి పరిష్కారములను సూచించగలదో చిత్రించారు.

'ఎడబాటు' అనే వ్యాసం ఒక మచ్చుతునక. అందులో కృష్ణమోహన్ లోకంలో కానవచ్చే సంగతులను సమీక్షించుకుంటూ వుంటాడు. ఒకడు తాను గాఢంగా ప్రేమించిన భార్య మరణిస్తే ఏడాది తిరగకుండానే బిడ్డలకు తల్లికావాలని మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. మరొక రింట్లో ముద్దులు మూటగట్టి తల్లిదండ్రులనేగాక ఇరుగు పొరుగు వారినిగూడ మురిపించిన బాలుడు ఐదోఏటనే శాశ్వతంగా కన్ను మూశాడు. జీవితంలో నానాకష్టాలు పడి ఎంతధనం కూడా బెట్టినా, అది తన వెంట వస్తుందనిగాని, తరతరాల వరకు శాశ్వతంగా నిలుస్తుందనిగాని చెప్పడానికి వీలులేదు.

ఇలా ఆలోచించుకుంటూ దేవాలయానికిపోతే అక్కడ పౌరాణికుడు రామాయణంలో లక్ష్మణుడు రామునితో పలికిన పలుకులు కృష్ణమోహన్‌కు వినిపించాయి. వాల్మీకి రామాయణం ఉత్తరకాండలోని ఒక శ్లోకార్థం ఇలా వున్నది:

"ఒకపోట చేరిన సిరిసంపదలు కరిగి తీరిగిపోతాయి. ఉన్నతంగా పెరిగి నవి విరిగి నేలపై పడిపోతాయి. కూడినవారు విడిపోతారు. పుట్టినవారు మరణి స్తారు. అందువల్ల ఏరకంగానూ వియోగం తప్పని దారా పుత్రాదులందుగాని, బంధు మిత్రులందుగాని, ఇళ్లు వాకిళ్లు పొలాలు స్థలాలు ధనం బంగారం మొదలగు వస్తు లందుగాని అధికమైన ఆసక్తిని పెంచుకోకూడదు. ఏదో ఒకనాడు ఏ కారణంగానైనా వీటన్నింటితో వియోగం తప్ప దన్నది పరమసత్యం"

ఇలా జీవిత సమస్యలకు రామాయణం చెప్పే పరిష్కారాలను రచయిత వివిధ వ్యాసాలలో పేర్కొన్నారు.

మరొక ఉదాహరణ ; మానవులకు ప్రియమైన మాటలు నచ్చుతాయిగాని హితమైన పలుకులు నచ్చవు. రావణుడు మారీచుని వద్దకు వచ్చి సీతను అపహరిం చటలో తనకు తోడ్పడమని కోరాడు. అందుకు మారీచుడు రావణునితో "రాజా! ముఖ ప్రీతికై ఇచ్చకాలాడేవారు ఎందరైనా వుంటారు. వారెక్కడైనా దొరుకుతారు. అప్పటికి ప్రియం కాకపోయినా హితాన్ని చేకూర్చే పలుకు పలికేవారు బాలా అరుదు. ఒకవేళ మొహమాటం లేకుండా ఎవరైనా తమకు హితమైన మాట చెపితే అదివినే వారులేరు. ఇది లోక ప్రవృత్తి" అంటాడు.

"ఎవరికెట్టి సందేహం కలిగినా, ఎవరు ఏ రకమైన ప్రశ్న వేసినా అన్నింటికి వాల్మీకి రామాయణంలో సరియైన సమాధానం లభిస్తుంది— అంటారు రచయిత.

శ్రీ దక్షిణామూర్తి గారి కలంనుండి ఇట్టి రచనలు మరిన్ని వెలువడి లోకా నికి వెలుగుబాటలు కావాలని ఆకాంక్షిస్తున్నాను. —మన్నవ గిరిధరరావు

మంగళా శాసనము

ఊహించని వేగాన్ని పెంచుకుపోతున్న ఈనాటి నాగరిక జీవన యానంలో మనస్సును క్రమబద్ధం వేయగలిగి, మనుగడను ఫలవంత మొనర్చి నైతిక ప్రమాణా లను సుస్థిరంగా పునః ప్రతిష్ఠింపటానికి తగినంత ప్రయత్నం జరగటం అభి లషణీయం.

సమాజశ్రేయస్సుకై ఎన్నో భావాలతో రూపందిద్దుకున్న ఈ వ్యాసపరం పరలో అతి ముఖ్యమైనవి సత్సాంగత్యము, చిత్తస్థైర్యము మాట — మన్నన, (మొదటి భాగము) జీవితం, అమృతత్వము, కారుణ్యము ధర్మవృక్షము వీటన్నింటి లోని సహజమైన ఉదాహరణలు పాఠకుల హృదయాలను స్పందింప జేస్తున్నాయి.

ఇటువంటి సద్విమర్శన వ్యాసాలు జాతి సౌభాగ్యానికి కరదీపికలు కాగా ఆ కాంతి కిరణాల వ్యాప్తికై సల్పుతున్న శ్రీశాస్త్రిగారి కృషి శ్లాఘనీయము.

పొన్నూరు
13-12-88

శ్రీమతి అంబటిపూడి విజయలక్ష్మి
హిందీ ప్రచారక్

ఆంకాంక్ష

డాక్టర్ ప్రసాదరాయకులపతి
గుంటూరు

డా॥ తూములూరు శ్రీదక్షిణామూర్తి విద్యార్జన కాలమునుండి తెలిసినవాడు. నేటికి కళాశాలలో ఉపన్యాసకుడై, రచయితయై, ప్రజ్ఞావంతుడై పదిమంది ముందు నిలిచి భాసనిపించుకోగల స్థితికి వచ్చినాడు. రామాయణ మనిన సహజముగా ఇతనికి భక్తిశ్రద్ధ లెక్కువ. దానికితోడు డాక్టరు డిగ్రీ కొరకు పరిశోధన చేయునప్పుడు అవసరమును ఏర్పడినది. అది పరిశీలనకు పదును పెట్టినది.

ఇప్పుడతనికి రామాయణములో ఎన్నో విశేషములు కనబడును. అర్థము లైన ఆ మహాగ్రంథములలో చూచెడి వాని చూపు చొచ్చుకొని పోవలెనుగాని ఎప్పటి కప్పుడు చూడదగిన విశేషము లెన్నో ఉండును. రామకథలోని సామాజిక విశేష ములను దర్పణముపట్టి చూపుట ఇతని ధ్యేయము. వివిధ పాత్రల ద్వారా స్నేహము, ప్రజాస్వామ్యము, సత్సాంగత్యము అందెటులున్నవో అటులే అసూయ, నేరములు మొదలైన దుర్లక్షణాలు వ్యక్తమైన పాత్రల వివరిదశ లెటులైనవో అనే కోదాహరణల మూలమున సరళమైన తెనుగులో వ్యక్తీకరించినాడు.

ఇంతకు ఇతడు రామాణములోని విశేషములు చెప్పటకు ఆలోచించి ప్రస్తుతమందలి సామాజికాంశములను విశ్లేషించు చున్నాడా? భవిష్యత్తులో అందలి ఇతర విశేషములను పరిశీలించి చెప్పునా ? లేక సమాజపరమైన నైతిక బోధచేయ వలెనని భావించి దానికి రామాయణము-అది ఇతనికి ఇష్టమైనది గనుక ఆధారముచేసి కొన్నాడా ? గ్రంథనామము మొదటి దానిని బలపరచిన గ్రంథ గతాంశములు రెండవ దానిని బలపరచును. దీని సమాధానము అతనికి తెలిసినచాలును. మనకు తెలియ నక్కరలేదు. మన ముందున్న గ్రంథము బాగున్నదా లేదా చెప్పినది బాగుగా చెప్పినాడా లేదా, అనునది మాత్రము మనకు కావలెను. వ్రాసినంత వరకు హృద యాకర్షకముగా సుబోధకముగా సూక్తి సుందరముగా వ్రాసినాడు. అదిచాలు-అతనిని ఉన్నతశ్రేణి రచయితగా తీర్చుటకు. భవిష్యత్ సాహితీ దేవాలయ సోపానము లెక్కించుటకు. శ్రీ దక్షిణామూర్తి కృషి ఫలించునుగాక ! భద్రమస్తు !

రత్నదీపం

దక్షిణామూర్తిగారికి రామాయణం ఆరో ప్రాణం. ఎప్పుడే విషయం మాట్లాడినా వాల్మీకి వాక్యాన్ని ఉదహరిస్తేనే ఆయనకు తృప్తి. అది ఆయన స్వభావం. చాలా మందికి ఎన్నో విషయాలు తెలిసి ఉండవచ్చు కానీ వాటిని అనుభవపూర్వకంగా ఇతరులకు వివరించడం అందరికీ సాధ్యం కాదు. అది దేవతనైతే ఒక వరం పొందినట్లే. శ్రీ శాస్త్రిగారి ప్రయత్నం అంతా ఆ వరాన్ని విరాట్ స్వరూపమైన సమాజం నుండి పొందడానికే.

మానవుడు కొన్ని పనులను విజ్ఞానంతో చేస్తాడు మరికొన్నిటిని విశ్వాసంతో చేస్తాడు. విజ్ఞానం అతనికి కృషివల్ల లభిస్తే విశ్వాసం తరతరాలుగా అతని రక్తంలో కలిసి ప్రవహిస్తూ ఉంటుంది. విజ్ఞానాత్మకమైన విశ్వాసం వ్యక్తియొక్క జీవిత లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఈ గ్రంథంలో అదే కనిపిస్తుంది.

కొన్ని విషయాలు ఎవరు చెప్పినా ఇంకా వినాలనిపిస్తుంది. ఇంకా ఏమిటో తెలియని రహస్యం ఉందనిపిస్తుంది. రామ కథ అట్లాంటిదే. అది ఈ జాతి రక్తంలో కలిసిపోయింది. ప్రకృతిలో ప్రతి కణంలో నిలిచి ఉంది. అందుకనే సమాజం రామాయణాన్ని హృదయ పేటికలో భద్రపరచుకొని ఉంది. కనుకనే గుండెగుండెను రామాలయంగా మలచడమే వాల్మీకి ఉద్దేశం అయింది. కుశలవులకు రామగానం అందుకే ఆయన నేర్పాడు. వారిద్దరూ సమాజానికి ప్రతిబింబాలు. వాళ్లలో రామతత్వం నిండి ఉంది. అట్లాగే సమాజంలో కూడ దాన్ని వ్యక్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఈ గ్రంథంలోని వ్యాసాలుకూడ కొన్ని కాంతికిరణాలను ప్రసారం చేస్తున్నాయి.

ధర్మసంస్థాపన అవతారలక్ష్యం. దుష్టశిక్షణ శిష్టరక్షణ అవతారకర్తవ్యం. ఏ అవతారమైనా సమాజ శ్రేయస్సు కోసమే. ధర్మం నిరాధారం కాదు గదా. పాలలో వెన్నలాగా సమాజంలో అది ఇమిడి ఉంటుంది. అవసరాన్నిబట్టి అది వెల్లడి అవుతుంది.

శ్రీరామునిదృష్టి ప్రచారం మీద కంటె ప్రవర్తనపైననే కేంద్రీకృతం. తనను గురించి "ఎందరు ఆలోచిస్తున్నారు?" అనే ప్రశ్నకంటె "ఏం అనుకొంటున్నారు?" అనేది ఆయనకు ముఖ్యం. ఏ విధమైన అపఖ్యాతిని ఆయన సహించలేదు - సమర్థించలేదు. ప్రత్యక్షంగా తనకు పట్టాభిషేకం చేయమని కోరిన సమాజం పరోక్షంగా తనపైన పెంచుకొన్న భావం ఒకే రకంగా లేకపోవడం అనుచితం కాబట్టి ఆ ధోరణికి అగ్ని పరీక్ష అవసరమే అని కూడ ఆయన భావించాడు. ఆ రుగ్మతకు చికిత్స చేశాడు. రాముని మాట-బాట-బాణము అందుకోసమే ఉపయోగపడినాయి. కాబట్టిషడ్గుణైశ్వర్య సంపన్నత రామాకృతిని పొంది జగతికి సూర్యబింబం అయింది.

ప్రభాకర ప్రకాశానికి కుల-మత-ప్రాంత-భాషా భేదాలు లేవు. ఆ చీకటి గుహలే జగత్తు అని భ్రమపడే ఆతతాయులకు-లేత బుర్రలకూ, మార్గదర్శనం చేయటానికే మహర్షులు కృషి చేశారు. వచ్చింది స్వీకరించే పాక్షిక దృష్టి సత్యాన్ని మరుగు పరిచింది. తత్వాన్ని మరచిపోయింది. ఎవరికోసమైతే అవతారం వచ్చిందో వారే అవతారం లక్ష్యాన్ని అపార్థం చేసికొనే దుస్థితి ఏర్పడటం వాంఛనీయంగాదు. కనుక వసిష్ఠ-విశ్వామిత్రులతోపాటుగా శబరికి-గుహుడికి-వానరులకు-రాక్షసులకు కూడ అర్థం అయిన రామతత్వాన్ని సమాజానికి ఇంకా సుబోధం చేయాలి అని వాల్మీకి సంభావించాడు. మహాకావ్యాన్ని సమాజానికి అందించాడు. మహర్షి హృదయావిష్కరణకు ఈ గ్రంథం ఒక వేదిక. ఇది ఈ కాలానికి అవసరం.

ఏ శక్తినైనా జీవితంలోకి అన్వయించుకొన్నప్పుడే అది సార్థకం అవుతుంది. భౌతిక ఆధ్యాత్మిక విషయాల సమన్వయ స్వరూపం మన సంస్కృతి. వాస్తవాలను వదలి ఊహలను ఊరేగించడం ప్రోత్సహించదగినదికాదు. అందుకోసం మనిషికి కృషి అక్కరలేదు. ఏ కృషి అయినా మనిషిని ఋషిగా మారుస్తుంది. ఋషి వాక్యాల్ని విశ్వసిస్తే వెలుగులోకి ప్రయాణం సాగుతుంది. విస్మరిస్తే వైపరీత్యం ఏర్పడుతుంది. శిల్పి ముగ్గురాయిని శిల్పంగా మలిచినట్లుగా వాల్మీకి మహర్షి మనిషిని మాధవుడిగా దిద్దటానికి చేసిన ప్రయత్నం రామాయణం. అందుకు తానే మొదటి ఉదాహరణగా కూడ ఉన్నాడు. కాబట్టి ఆ మహనీయుడు చెప్పిన ప్రతి విషయము అనుభవ పూర్వకము-ఆచరణీయము-అనడం ఈ గ్రంథం ఉద్దేశం.

శీలం వ్యక్తికి జీవం. అది వ్యక్తిత్వానికి ఆయువుపట్టు. వ్యక్తి నిర్మాణం చేయగల వ్యవస్థ జాతికి పుష్టి చేకూరుస్తుంది. వ్యష్టి చైతన్యంద్వారా విశ్వచైతన్యాన్ని వ్యక్తం చేస్తుంది. సీతారాముల ప్రభావం మనుషులపైన మాత్రమేగాకుండా మానవ తత్వంపై శాశ్వతంగా ఉంది కనుకనే సమాజం-రామాయణం-రెండూ అవినాభావంగా ఉంటున్నాయి. అందుకే కొండలు-నదులు ఉన్నంత వరకూ రామగాథ ఉంటుంది అని పెద్దలు వివరించారు. కొండలు ధీరత్వానికి-నదులు విశ్వత్వానికి ప్రతీకలు.

కవులు-పండితులు-శాస్త్రచర్చలతో రామతత్త్వాన్ని కూలంకషంగా చర్చించ డానికి పూర్వమునుండే సమాజానికి రామాయణం అనుభవంలో ఉంది. అది పలు విధాలుగా నిలచిఉంది. ఎన్నో రామాయణాలు ఈ నాటికీ ప్రచారంలో ఉండటం, ఇంకా రామాయణంపై విమర్శలువస్తూ ఉండటం-ఇప్పటికీ రామాయణం అందరిపైన ప్రభావం చూపిస్తూ ఉండటం ప్రత్యక్షంగా కనిపిస్తూ ఉన్నదే. అయితే వాల్మీకి చెప్పిన విషయానికే ఎక్కువమంది ప్రాధాన్యం ఇస్తూ ఉండటంవల్ల దక్షిణామూర్తి గారి ఆలోచనకూడ వాల్మీకి రామాయణం ఆధారంగా సాగింది. వాల్మీకి గిరి సంభూతమైన రామాయణగంగ ముల్లోకాలను పవిత్రం చేస్తుంది అనే విశ్వాసం ఇందుకు ప్రేరణ. సత్సాంగత్యము-వివాహం-స్నేహం మొదలైన విషయాలపట్ల వాల్మీకి వివరణ ఆధారంగా తాము సమాజాన్ని దర్శించి చెప్పదలచుకొన్న అంశాలకు రూపకల్పనచేసి సమాజానికి శాస్త్రిగారు లోగడనే పదిహేను వ్యాసాలతో రామా యణం-సమాజదర్పణం అనే గ్రంథాన్ని అందించారు. దానికి స్పందించిన సమాజం ఇచ్చిన ప్రోత్సాహమే ఈ రెండో ప్రయత్నానికి దోహదం చేసింది. "తన చుట్టూ ఆవరించిఉన్న చీకటిని తొలగించుకోవడం - ప్రతి వ్యక్తీ తాను సంఘజీవిని అనే వివేకం కలిగిఉండటం - తాత్కాలికమైన అనుభవానికే జీవితాన్ని అంకితం చేయ కుండా శాశ్వతత్వం గలిగిన ఆనందానుభూతికి అర్హత సంపాదించుకోవడం. నేను అనే స్థితి నుండి మనము అనే స్థాయికి ఆలోచన పెంచుకోవడం మంచిని పది మందితో కలసి పంచుకోవడం" మొదలైన అంశాలు 'భారతీయత' అనే పరిధిలో ఇమిడి ఉండే కొన్ని సత్యాలు. సంస్కృతి అనే పద్మంలో కొన్ని పత్రాలు. వీటన్ని టికీ రామాయణం లక్ష్యం గ్రంథం ఎట్లా అవుతుందో శాస్త్రిగారి రచనలో పాఠకులు కొంతవరకు గ్రహిస్తారనడం నిస్సందేహం.

రామావతార రహస్యాన్ని అందుకొనదలచిన వాళ్లకి వాల్మీకి ఆదర్శం జీవితం అంటే ఏమిటో తెలుసుకోవాలనుకొన్నవాళ్లకి రాముడు ఆదర్శం. బ్రతకాలను కొన్న ప్రతివ్యక్తికీ సంఘదృష్టి కావాలి. ధర్మనిష్ఠ కావాలి. బాధలలో వెన్నుతట్టే వాళ్లు చీకటిలో దారిచూపేవాళ్లు ఉండాలి. జీవితంలో ఎన్నో ఒడుదుడుకులుంటాయి అవి. సహజం-లక్ష్యాన్ని విర్దేశిస్తూ నిర్లక్ష్యాన్ని తొలగిస్తూ-తప్పుచేస్తే దిద్దుతూ-ఒప్పు చేస్తే మెచ్చుకొంటూ ఉండే మంచి మనసుకు ప్రతివాళ్లూ కృతజ్ఞత చెప్పుకొంటూనే ఉంటారు. కృతజ్ఞతకు మించిన మానవత్వం ఏముంటుంది? బ్రతుకు అంటే అర్థం చెపుతూ జీవితంపై విశ్వాసం నిలబెట్టేవాళ్లు సమాజానికి ఎప్పుడూ అవసరం. విరక్తి కలిగితే దానికి విరుగుడు చెప్పేవాళ్లు-విశృంఖలత ఏర్పడితే క్రమశిక్షణ నేర్పే వాళ్లు జాతికి రత్నదీపాలు. రాముడు రత్నదీపం. ఆ దీపం నుండి ప్రసారమయ్యే కాంతిపుంజం రామాయణం.

పాఠకుని హృదయం అద్దం అయితే సీతారాముల ముఖారవిందాలు హృదయ కాసారంలో దర్శనమిస్తాయి ఎన్నో సమస్యలకు పరిష్కారాలు ప్రబో ధిస్తాయి. రామాయణంపట్ల ఆత్మీయత పెంచుకొన్న కొలది రాముడు మానవా దౌతాడు. సీతమ్మ మన యింటి ఆడపడుచుగా అనుభూతి కల్గుతుంది. అందుకే ప్రతి పెళ్లిపందిట్లో జరిగే వివాహం సీతారామ కల్యాణమే. "పోయిరాగదమ్మ జానకి!" అంటూనే అంపకాలు. ఈ విధంగా సమాజం రామాయణాన్ని తనలో ఇముడ్చుకొంది. రామాయణం సమాజాన్ని తనలో దాచుకొంది. పవమాన సుతుడుః ట్టు పాదాలు మానవాళికి మంగళ చరణాలయినాయి.

"కొందరు తమ వాక్చాతుర్యంతో రామాయణాన్ని కొండెక్కిస్తున్నారు. మరికొందరు విరాశావాదంతో రామకథను నీరుగారుస్తున్నారు. అయినా కొండలు-నదులు ఉన్నంత వరకు వాల్మీకి వాణికి తిరుగులేదు. మహర్షి నిష్ఠ అలాంటిది శ్రీరాముని జీవితం అలాంటిది. గంగా యమునలవంటి సీతారాముల సాహ చర్యంలో అంతర్వాహినియైన సరస్వతీ సాక్షాత్కారమే రామాయణం. అది పాఠ కుని హృదయాన్ని త్రివేణీ సంగమంగా చేసే సాహితీ స్రవంతి. సమాజానికి దారి చూపే రత్నదీపం."

ధర్మవృక్ష రక్షణలో నిత్యవసంతంగా వాల్మీకి వాణి ఎట్లా స్ఫూర్తిదాయ కంగా ఉందో ఈ వ్యాస సంపుటిలో కొంతవరకు రచయిత వివరించారు. ఇటువంటి వ్యాసాలు ఇంకా రావాలి. రామాయణంపైన అధికారము-సమాజాన్ని గురించిన అవగాహన-సాహిత్యంలో ప్రవేశము-కాలానుగుణమైన ఆలోచన-కలిగిన రచయితగా గుర్తింపు పొందుతున్న శాస్త్రిగారి కృషి ఇతోధికంగా కొనసాగాలి. రఘుకులాన్వయ రత్నదీప కాంతులు దుష్టభావ నికాపర వినాశకరాలుగా ప్రకాశిస్తూ ఉంటాయనే త్రికాల సత్యాన్ని మరొకసారి లోకానికందించిన రచయిత అభినందనీయుడు.

—డాక్టర్, దీవి దీక్షితులు
సంస్కృత కళాశాల, పొన్నూరు.

సమాజం

ప్రతి వ్యక్తి జీవితంలో మానవునకు అవసరమైన ఆహారం, వస్త్రం, గృహం, విద్య, విజ్ఞానం, వికాసం, వినోదం, విలాసం. మొదలైనవన్నీ సాధించబడాలి అంటే ఏ ఒక్క వ్యక్తి వల్ల, లేక కుటుంబంగాని చేయగలిగేవి కావు. స్వయం సమృద్ధి పొందలేవు. అందువల్ల ఒక్కొక్కరు ఒక్కొక్క పనిలో నిపుణత సంపాదించి, తద్వారా జీవితం సుసంపన్నం చేసుకోవటం జరిగింది. ఇందులో ఎక్కువ తక్కువలు అనేవి లేనేలేవు. ఎవరెన్నుకొన్న రంగంలో వారు ప్రగతి సాధించి వారి విలువలను పెంపొందించుకో గలుగుతారు. ఇలాంటి వ్యక్తులతో కూడిన కొన్ని కుటుంబాలు కలిసి సమాజంగా స్థిర పడతాయి. కొన్ని సమాజాలు దేశం (రాష్ట్రం)గా గణుతికెక్కుతాయి. అందులో ఒకే లక్ష్యాన్ని మనస్సులో పెట్టుకొని జీవించే జనం అంతా ఒక జాతిగా వ్యవహరింపబడ తారు. వారికొక నియమం, నిష్ఠ, జీవనప్రమాణము, అందుకొక ప్రణాళిక ఏర్పరుప బడతాయి. అదే ఆజాతి సంస్కృతిగా పేర్కొనబడుతుంది. ఆ సంస్కృతి స్వభావమే జాతీయతగా వన్నెకెక్కుతుంది. అట్టి జాతీయభావన ఆ జాతి సమైక్యతను సూచిస్తుంది.

భారతదేశంలో ఉండేవారు భారతీయులు. వారి సంస్కృతి సంప్రదాయములు భారతీయతగా ప్రసిద్ధి చెందాయి. ఇలాగే ప్రపంచంలో వివిధ దేశముల వారికి వారి జాతీయత సిద్ధించింది. ఎవరి జాతీయత వారికి గొప్ప. ఎవ్వరికైనా తమ జాతీయతా భావ పరిరక్షణము ముఖ్యోద్దేశము. జీవలక్షణము, వ్యక్తిత్వ సంపద, శీలసౌభాగ్యము, క్రమశిక్షణలేని జాతి ప్రకృతిలో కాలక్రమేణ నామరూపాలు కోల్పోయి నశిస్తుంది. ఇట్లే ప్రపంచంలో ఇప్పటికెన్నో జాతులు అస్తిత్వాన్ని పోగొట్టుకొని, అంతరించి పోయినట్లు చరిత్ర నిరూపించింది. భారతీయులు మొదటినుండి సంస్కృతీ రక్షణమున ఆదరబుద్ధి కలిగి, విజ్ఞాన సర్వస్వము తమ వారసత్వ సంపదగా పొంది, ఆర్షధర్మాచరణం ద్వారా విశిష్టత సంపాదించుకొన్నారు.

ఎప్పుడైనా (ఎక్కడైనా) సమాజంలోని ప్రతివ్యక్తి అందులోని ప్రతి విభాగంతోను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం కలిగి ఉంటాడు. ఆ అనుబంధం స్థిరంగా ఉండి, ప్రగతి సాధించుకొనేందుకు సమాజంలోని వ్యక్తులకు కొంత ఆలోచన కావాలి. సమాజం యొక్క మంచి, చెడులు విచారించి దాని అభ్యుదయాన్ని గూర్చి చేసే ఆలోచన "సామాజిక స్పృహ" అవుతుంది. ఆ సంస్కారం ద్వారా సమాజాన్ని అవగాహన చేసుకోవాలి. తాము నివసిస్తున్న ఆ సమాజం కొఱకు పాటుపడాలి. సమాజం బాగుపడాలి అంటే ముందుగా వ్యక్తిగత సంస్కారం ఏర్పడాలి. అట్టివారు చేసే నిర్మాణాత్మకమైన ఆలోచన ఆచరణలోకి రావాలి. కేవలం భావాలలోనే అది పరిమితమైపోయి ఏ మాత్రం ఆచరణలో లేనప్పుడు ఎంతటి మంచి ఆలోచన అయినా సత్ఫలితాన్ని ఇవ్వదు.

సమాజానికి నిజంగా సేవచేసే వ్యక్తి ఆ సమాజంచేత ఆదరింపబడతాడు, గౌరవింపబడతాడు. ఉన్నతిని పొందగలుగుతాడు. ఇతరులకు కూడా అతడు ఆదర్శంగా నిలుస్తాడు. దీనినే పెద్దలు "కూపఖానక న్యాయం" అంటారు. బావి త్రవ్వేటప్పుడు శరీరానికి శ్రమ మురికి కూడ అవుతాయి. అవి ఆ బావి నీళ్ళతోనే పోగొట్టబడతాయి. శాశ్వతంగా అక్కడి వారందరికి జలవసతి ఏర్పడటం దాని ప్రయోజనం. ఇంక ఆ సమాజం యొక్క అభ్యుదయమే దేశాభ్యుదయంగా పరిగణింపబడుతుంది. సమాజంలోని ప్రతివ్యక్తి విడిగా ఉంటే ఒక నూలుపోగువంటివాడే అవుతాడు. పోగులు కొన్ని కలిస్తే (కొన్ని అడ్డం-కొన్ని నిలువు) వస్త్రం అవుతుంది. పూవులు కొన్ని కూడితే మాలిక అవుతుంది. ప్రజలందరిని కలిపి ఉంచటానికి ఆధారమైన సూత్రం వంటిది ఆ జాతి సంస్కృతి. ప్రాథమిక దశలో జనం అవసరాల కోసం (ఆహారం, ఆత్మ రక్షణ మొ॥) ఒకటిగావేరి, ఆ కలయికను శాశ్వతం చేసుకొనేందుకు వ్యక్తిత్వం కాపాడబడేందుకు కొన్ని నియమాలు ఏర్పరచుకొంటం జరిగింది. ఈ నియమాలు వ్యక్తిగతమైనవి కొన్ని, ఇద్దరి మధ్యలో ఉండేవి కొన్ని, ఇరుగు పొరుగు కుటుంబాల మధ్య పరిమితమైనవి కొన్ని, సమాజంలోని అందరికి సంబంధించినవి మరికొన్ని. అవే సాంఘికమైన ఆచారాలుగా, సంప్రదాయాలుగా పరిణమించాయి. అందులో హింసా ప్రధానములు కాని, కుల, మత, వర్గ, ప్రాంత, భాషా విభేదములులేని, లౌకిక జీవన విధానాలు అనుసరింపబడి నప్పుడే అవి సమాజం అంతటికి హర్షదాయకంగా ఉంటాయి. కలిపి కట్టుగా ఉండటానికి దోహదం చేస్తాయి. కలకాలం వర్ధిల్లుతాయి. లేకపోతే కాలగర్భంలో కలిసిపోతాయి.

నేను, నాది అనేవి అహంకార, మమకారాలు. అవే వ్యక్తి స్వార్థానికి మూలకారణాలు. మనిషిలోని ఆ స్వార్థచింతన పెచ్చు పెరిగితే అది సామాజిక నియమాలకు కూడా భంగం వాటిల్లజేసేందుకు ప్రోత్సహిస్తుంది. అప్పుడే మానవుడు దానవుడవుతాడు. ఆ రాక్షసత్వ ఒక కాలమను పాడుగ్లోని మానవుడు మాన

వుడుగా పరిగణింపబడటానికి అతడు నిత్యం ఎంతో సాధన చెయ్యాలి. గొంతెమ్మ కోరికలతో పరి పరి విధాల పరుగులు తీసే మనస్సును నిగ్రహించి ఆత్మ సంయమనం పాటించాలి. ఆ ప్రయత్నంలో ఎన్నో అవాంతరాలు ఏర్పడుతాయి. మరెన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. వాటన్నింటిని అధిగమించి, ఆత్మగౌరవం చెడకుండా, స్వీయధర్మాన్ని ఆచరింపగలగటం అనుకున్నంత తేలిక పని ఏంకాదు. అందుకే "ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము. నరుడు నరుడౌట ఎంతొ దుష్కరము సుమ్ము" (గాలిబ్ గీతాలు-అనువాదం-దాశరథి) అన్నారు. ఎవరైనా తనలోపం తాను తెలుసుకోగలగటం, తెలియనిది ఇతరులు తెలియజేసినపుడు గుర్తించి సరి దిద్దుకోవటం వారిలోని మానవతకు పరిపూర్ణతను కల్పిస్తుంది. "స్వీయ లోపమ్ము లెరుగుట పెద్దవిద్య, లోపమెరిగిన వాడె పూర్ణుడగు నరుడు" (గాలిబ్ గీతాలు-దాశరథి) ఆ విద్య అందరికీ చేతకాదు.

సమాజశ్రేయస్సు కోరిన పెద్దలు కొందరు ఆ వ్యవస్థ సుస్థిరంగా నిలబడటానికి, కాలగతి ననుసరించి అందులో ఏర్పడిన అవకతవకలను, సరిదిద్దటానికి అడ్డుగోడల నుపడగొట్టడానికి (సతీసహగమనం, అస్పృశ్యత మొ॥) సరియైన సందర్భంలో జాతిని జాగృత పరచటానికి, చైతన్యవంతంగా ముందుకు నడపటానికి ప్రయత్నిస్తారు. సంస్కరణాభిలాషులైన కొందరు కవులు ఋషిధర్మంతో తమవంతు బాధ్యతగా సమాజసేవచేసి జాతికి చిరస్మరణీయులౌతారు.

ఈ 20వ శతాబ్దంలోనే మనదేశ స్వాతంత్ర్యోద్యమ సందర్భంగాను, ఆంధ్రప్రదేశ్ అవతరణ ఘట్టంలోను, నిజాం పరిపాలనను ప్రతిఘటించిన సమయంలోను ఎందరో కవులు తమ గళం విప్పి స్వాతంత్ర్య భావగీతిక లాలాపించి, స్వేచ్ఛా జీవితం ఎడల ప్రీతిని (మా కొద్దీ తెల్లదొరతనం) ప్రకటిస్తూ దేశభక్తిని (వందేమాతరం) ప్రబోధించారు. మనజాతి కర్తవ్యాన్ని గుర్తు చేశారు. సంఘంలోని చెడును విమర్శించి (కన్యాశుల్కం, వరవిక్రయం, బాల్యవివాహాలు మొ॥) మంచిని ప్రశంసించి (ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి, శివపురాణం, ఆంధ్ర పురాణం మొ॥) ప్రగతి పథానికి మార్గదర్శకులై వ్యవహరించారు. ఆ సాహిత్యం నాటి ప్రజల నుద్బోధించి, ఉత్సాహపరచి, ఉద్యమం వైపుకు ఉరకలు వేయించి ఆశయ సిద్ధికై తోడ్పడిన సంగతి చరిత్ర చాటిన సత్యం. ఆరచనలు ఆనాటి దేశ సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులను ("భరతఖండంబు చక్కని పాడియావు... తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియగట్టి") తెలియజేయటం గమనింపగలం

'సాహిత్యం సమాజానికి అద్దం' మనటాన్ని అది నిరూపిస్తుంది. సామాజిక స్పృహ కలిగి స్పందించిన అప్పటి రచయితల, సాహితీ సంస్థల కృషి ఫలితమే ఆ సాహిత్య సంపద అనటం నిర్వివాదాంశం.

రవి అస్తమించని బ్రిటిష సామ్రాజ్యవాదుల కబంధ హస్తాలనుండి జాతికి, దేశానికి విముక్తి సాధించిన మహాత్ముల విషయం మరియొక నాటికి (భావితరాల వారికి) నమ్మశక్యం కానిది కావచ్చు. కాని చరిత్ర సత్యం కాదన లేనిది కదా! నాటి సాహిత్యం చరిత్రలో ప్రముఖస్థానం సంపాదించుకొని మరల ఇంకెన్నడూ ఈదేశము పారతంత్ర్యము పాలు కాకుండా ఉండేందుకు, పరభావ దాస్యమును విడచి, జాతి సమైక్యంగా జీవించేందుకు జాతీయతను కాపాడుకొనేందుకు కావలసిన జ్ఞానాన్ని కలిగిస్తుంది. అనైక్యతవల్ల అనర్థం, సంఘటనంవల్ల శక్తి లభిస్తుందని గుణపాఠం బోధిస్తుంది. ఆ దృష్టితో చరిత్ర అధ్యయనంచేసి మనమెంతో స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది.

రామాయణం ఒకనాటి సమాజచరిత్రకు దర్పణం. వాల్మీకి కవి కథాకాలమున జీవించి ఉండి, స్వానుభవానికి తోడుగా లోకజ్ఞుడైన నారదుని అభిప్రాయం సహితం సేకరించి ఆనాటి సమాజంలోని మంచి, చెడులను విమర్శించి, విశ్లేషించి, దుర్గుణుల దౌష్ట్యాన్ని నిరసించి, మానవత్వానికి అవసరమైన నైతిక విలువలను వివరించి, సత్య, ధర్మముల శాశ్వతత్వమును నిరూపించి భవిష్యత్తరముల వారికి అందించటానికై విజ్ఞాన భాండాగారమైన రామాయణాన్ని అక్షర దీపంగా రూపొందించాడు. రోగ నిర్ణయం చేయగల వైద్యుడే కదా! తగిన ఔషదాన్ని కూడా సూచించగలిగేది. ప్రపంచ సాహిత్యంలో ఈనాటికే కాదు ఏనాటికి వ్యక్తిని, సమాజాన్ని ప్రభావితంచేసి సౌశీల్యాన్ని పెంపొందింపగలిగింది రామాయణం. భారతీయ సంస్కృతిని వివరిస్తూ జాతికి రక్షణ కవచమై అదిఎంతోకాలంగా నీతి, నియమాలను కాపాడుతోంది. మనుగడకు తోడుగా మానవునకది మాన్యతను సంఘటింపజేస్తుంది. భౌతిక జీవన విధానంలో వ్యక్తి సరియైన మార్గంలో పయనించినప్పుడే ఆతనికి ఆధ్యాత్మిక (జ్ఞానం,) సిద్ధి లభిస్తుంది. అందుకు తగిన సంస్కారం అందిస్తుంది రామాయణం. అభ్యుదయ నిశ్రేయసములైన లౌకికాలౌకిక ధర్మములు రెండూ అందులో వ్యక్తావ్యక్తముల గా గోచరిస్తాయి. మర్త్యులు అమృతత్వాన్ని సంపాదింపగల మార్గం కూడా అందు సూచింపబడింది. రామాయణము ఉన్నతమైన సాంస్కృతిక చైతన్య బీజాలను ప్రజా హృదయ క్షేత్రములలో పాదుకొల్పి, జాతీయతా భావస్ఫూర్తికి దోహదం చేయగల "కల్పవృక్షం"గా అభివర్ణింపబడింది. భారతదేశంలోని ఏ ప్రాంతం వారైనా ఏ భాష

మాట్లాడేవారైనా, ఏ సంప్రదాయానికి చెందినవారైనా వారందరికీ అభిమాన పాత్రము, అనుసరణీయము, ఆరాధ్యము ఐనది. రామాయణం. మనదేశములోగల భిన్నత్వములో సాధించబడిన ఏకత్వమిదియే. ప్రపంచములోని వివిధ దేశములందు భారతీయ సంస్కృతి ప్రభావములు ప్రస్ఫుటంగా గోచరించటానికి రామాయణం పొందిన ప్రచుర ప్రచారములే కారణములనుట నిస్సందేహము.

రామాయణంలో సాంఘికములైన సమస్యలు అనేకం చర్చించి, పరిష్కారములు సూచించి, ఆదర్శ జీవన పద్ధతులు నిరూపింపబడ్డాయి. ఉదాహరణకు దశరథుని బహుభార్యాత్వము - అందువలన కుటుంబంలో ఏర్పడు చిక్కులు (సపత్నుల వైమనస్యము) వివరించి, పరిష్కారముగ రాముని ఏక పత్నీత్వము అందరకు ఆచరణయోగ్యమగుట చెప్పి సీతారాముల ద్వారా విశిష్ట దాంపత్యము యొక్క స్వరూపం ప్రకటింపబడింది. ఇంక ఈనాటి సమాజాన్ని పెనుభూతంలా పట్టి పీడిస్తున్న మద్యపాన వ్యసనం ఎంత భయంకరమైందో చెప్తూ, రామాయణం 'పానాదర్థశ్చ ధర్మశ్చ కామశ్చ పరిహీయతే' (కి. కాం.) అని దానివల్ల వచ్చే అనర్థాలను ఏకరువు పెట్టింది. "త్రాగుడు వల జేబులో డబ్బులు ఖాళీ అవటమే కాకుండా, త్రాగిన మైకంలో తాను ఏం చేస్తున్నాడో తెలియని పశుప్రవృత్తి ప్రబలి అకృత్యాలు చేస్తాడు. అధర్మమాచరిస్తాడు. మతి మరుపు పెరిగిపోతుంది. క్రమశిక్షణ నశించి, కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేస్తాడు. బాధలను మర్చిపోటానికని ప్రారంభించి అనేక బాధలను కొనితెచ్చుకుంటాడు. అందువల్ల ఆవ్యక్తికే కాక కుటుంబ సభ్యులతోపాటుగా సమాజానికి కూడా ప్రమాదం సంభవిస్తుంది. అంతేకాదు త్రాగితే తాను ఏదో గొప్పగా సాధించగలననే ఊహ తప్పని చెప్పి ఇంద్రియ పటుత్వం తగ్గి, నరాల బలహీనత ఏర్పడి ఆశక్తుడైన అతనికి కామం కూడా నశిస్తుందని, తాత్కాలికమైన ఆనందంకోసం అనారోగ్య, లక్షణమైన ఆనేరం ఎవ్వరూ చేయరాదని శాసించింది. ఈనాటి వైద్యశాస్త్ర నిపుణులు అదే చెప్తున్నారు. ఈ విధంగానే మానసిక బలహీనతల నెన్నింటినో (పర ధనవాంఛ, పరస్త్రీ వ్యామోహము మొ॥) వివరించి వాటివల్ల ఎదురయ్యే కష్టనష్టాలను తెలియజేసి మానవులు బుద్ధిగా బ్రతకటానికి తగిన మార్గం చూపించింది రామాయణం. మరి రామాయణమంటే మన చుట్టూ ఉన్న సమాజమే వేఱుకాదని చెప్పటంలో సందేహం లేదు.

స్త్రీ తనను గౌరవించాలని ఆశించే పురుషుడు స్త్రీ పట్ల తానెటువంటి ఆదరం చూపించాలో చెప్పింది రామాయణం. ఆ సూచన అనుసరిస్తే వ్యక్తిగత స్పర్ధలు, కుటుంబ కలహాలు ఏర్పడవు సరికదా ఈనాడు కట్నం తేలేదని, తెచ్చింది చాలలేదనే నెపంతో రోజూ జరిగే గొడవలు జరిగే హత్యలు, ఆత్మహత్యలు జరుగవు "మితం దదాతిహి పితా, మితం మాతా, మితం సుత: । అమితస్యహి దాతారం భర్తారం కా న పూజయేత్" (30-39-2) ఎవరెంత చదువుకొన్నా వారు ధర్మం ఆచరించినప్పుడే నిజమైన పండితులు అవుతారని చెప్పి బ్రహ్మ వంశంలో పుట్టిన రావణునికి ఎంతటి గొప్ప చదువు సంధ్యలున్నా అధర్మాచరణం వల్లనే అతడు నిందితుడయ్యాడని, ధర్మాచరణకు (కర్తవ్య నిర్వహణకు) కులంకంటే, గుణం ముఖ్యమని తెలిపింది రామాయణం ఇంద్రియాలను జయించినవాడే (రాముడు) అసలైన శూరుడని వివరించి, విషయలోలుడైన రావణుని వినాశనానికి అతని నైతిక పతనమే కారణమని ప్రకటించింది. కేవలం భౌతిక సుఖాలకు (అందం, అధికారం, ధనం మొ॥) ప్రాకులాడిన అతడు అశాంతికిలోనై తుదకు అనర్థాలకు పాలయ్యాడన్నది చెప్పి. ఈనాటి సమాజంలో అవిక్రాంతమయిన మన జీవిత పరుగుపందెముల యొక్క పర్యవసాన మేమిటో నిరూపించింది రామాయణం. ఇంక రావణునివంటి మర్యాదహీనునకు పాపాచార సమన్వితునకు సత్పురుషుల ఎడమ గౌరవము లభింపదని, కావున ప్రతి ఒక్కరు అందుకు తగిన సభ్యత సంస్కారములు అలవర్చుకోవలసి ఉందని హెచ్చరించింది. "నిర్మర్యా దస్తు పురుషః, పాపాచార సమన్విత: మానం నలభతే సత్సు భిన్న చారిత్ర దర్శనః॥ (3-109-2).

ఈనాడు మానవ జీవితం ప్రతిరంగంలోను పోటీతత్వం పెరిగిపోయింది, అందులో అంతటా నిరాశా, నిస్పృహలు ప్రత్యక్ష మవుతున్నాయి. అసంతృప్తి అందుకు ముఖ్యకారణం. అట్టి వారికి చింతా, శోకములు పోగొట్టి ఆత్మవిశ్వాసంతో బాటుసామర్థ్యాన్ని విజయోత్సాహాల్నికలుగజేసేందుకురామాయణంసుందరకాండలోని 'లంకా విజయం' యుద్ధకాండలోని 'ఆదిత్య హృదయం' వంటి ఘట్టాలు స్ఫూర్తి నిస్తాయి. ప్రయత్నం శుభదాయక మవుతుంది.

మర్యాదా పురుషోత్తముడు, పతితపావనుడు, కారుణ్యమూర్తి, సహనశీలి వాత్సల్యపూరిత హృదయుడు ధర్మవిగ్రహుడు మితహిత సత్యవాక్ప్రతుడు అయిన రాముని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు కొనసాగితే వ్యక్తిలో ఉండే నేరప్రవృత్తి, అసూయ, వ్యసనాలువంటి దుర్లక్షణాలుపోయి ఉత్తముడుగా తీర్చిదిద్దబడతాడు. అప్పుడే మనిషి మనీషి అవుతాడు. జీవితం సార్థకమవుతుంది. అట్టి వానిని సమాజం అభివందిస్తుంది. అతడు జాతినేతయై స్వతంత్ర

ధర్మదీప్తితో స్వారాజ్యరక్షణ దీక్షకు పూనుకొంటాడు. ఆనాడే స్వరాజ్యం మహాత్ముడు కోరుకొన్న రామరాజ్యంగా రూపొందుతుంది.

రామాయణం మతగ్రంథం దైవసాక్షాత్కారమో, మోక్షమో అంటూ పరితపించే మానసిక బలహీనతలున్న భక్తులు దాన్ని పారాయణం చేస్తారు. అది వయస్సు మళ్ళిన వారికి, సోమరిపోతులకేగాని కండబలం, గుండెబలం ఉన్న యువతరానికి కాదనే ఆలోచన ప్రస్తుత సమాజంలో బాగా పాతుకు పోయింది. అది సరియైన అవగాహనకాదు. నేటి సామాన్య మానవునికి ఆధునిక సమాజానికి రామాయణం అనేకరకాలుగా ఉపయోగపడుతుంది. నిజానికి అర్థం చేసుకొని అనుసరింపగలిగితే ఇంతకు పూర్వమే ఒక లక్ష్యం ఏర్పరచుకొని, ఆలోచనలలో ఒక నిర్ణయానికి వచ్చి జీవితం పొద్దువాటారి పడమర దిశగా ప్రయాణం సాగిస్తున్న వృదులకంటే బాలలకు, యువకులకే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. విషయం సుబోధకంగా అందిస్తే, నిర్మలమైన వారి హృదయాలలో అది బాగాహత్తుకొని ఆచరణ సాధ్యమవుతుంది. ఉన్నతమైన ఆదర్శం వారి ముందున్నప్పుడు వారు ఉత్తమ పౌరులు కాగలుగుతారు. భవిష్యత్‌లో వారు ఉదాత్త జీవితం గడపటానికి వీలుంటుంది. చిన్నతనంలో హరిశ్చంద్ర నాటకం చూసి ఇంక తానెన్నడూ అసత్యమాడనని నియమం పెట్టుకొన్న గాంధీగారు "మహాత్ముడు"గా ప్రపంచంలో మన్ననలను పొందటం ఇందుకొక ఉదాహరణం. స్వామి వివేకానందవంటి పెద్దలు జాతి సౌభాగ్యానికి, దేశ ఔన్నత్యానికి కారకులైన యువతరాన్ని ఉన్నతంగా తీర్చిదిద్ద వలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. అట్టి ప్రయోజనాన్ని ఆశించి చేసిందే ఈ ప్రయత్నం.

అందరికి అవసరమైన విద్య, వివాహం, స్నేహం, లక్ష్యశుద్ధి, సమయస్ఫూర్తి, మాట-మన్ననలలో బాటు, దేశానికి అవసరమైన "ప్రజాస్వామ్యం" సమాజంలో ప్రతి ఒక్కరికి ఉండవలసిన కృతజ్ఞతాభావం అది ప్రోది చేసుకోవటానికి యోగ్యమైన సాహిత్యం-సాంగత్యం మొదలైన విషయాలతో కూడి రామాయణం-సమాజదర్పణంగా ఉంటూ ప్రజావళికి మేలు చేస్తుందనటం యథార్థం. అది వ్రాసిన వాల్మీకి ధన్యుడు. వైద్యుని చేతిలో కత్తి ప్రాణం పోస్తే, కసాయి వాని చేతిలో కత్తి ప్రాణం తీస్తుంది. సాహిత్యాన్ని కూడా మంచిగా వినియోగించటంలోనే సార్థకత లభిస్తుంది—ఆదికవి ధర్మం.

నేరము - శిక్ష

మానవునకు జీవితంలో స్వేచ్ఛతోబాటు నియమాలు, హక్కులతోబాటు బాధ్యతలు ఉన్నట్లు గుర్తించి ఆచరించిననాడు ఆ వ్యక్తి బాగుపడతాడు. ఆ సమాజం సువ్యవస్థిత మవుతుంది. ఆ జాతి సుసంఘటితమవుతుంది. అప్పుడే వ్యక్తికి సాంఘిక భద్రత ఏర్పడుతుంది.

సభ్యులామోదించిన ఉత్తమమైన నడవడిని సభ్యత అంటారు. తమ ప్రవర్తన వలన ఎదుటి వారికి ఇబ్బంది గలుగకుండా మెలగటాన్ని సంస్కారం అంటారు. అట్టి సభ్యత, సంస్కారములు లేక ప్రజలలో కొందరు విచ్చలవిడిగా సంచరించటం వలన ఆ వ్యక్తికి సమాజానికి కూడా ప్రమాదం సంభవిస్తుంది. ఏ వ్యక్తియైనా తాను సమాజంలో భాగమన్న విషయమెన్నడు విస్మరించరాదు.

నేడు కొందరు రాజ్యాంగం ద్వారా తమకు సంక్రమించిన హక్కులను దుర్వినియోగం చేస్తూ, దౌర్జన్యంతో సమాజ విధ్వంసక చర్యలకు పాల్పడటం గమనిస్తూనే ఉన్నాం. అందుకు పదవినో, పార్టీనో, మతమునో, మమతనో అడ్డుపెట్టుకొని ఆ నేరం కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నారు. అనియతమైనవారి జీవితం కడు స్వార్థపూరితం అందులో సందేహంలేదు. ఒక విధంగా వారు తమ బాధ్యతలను విడిచిపెట్టటమేకాక, ఎదుటివారి స్వేచ్ఛకు, స్వాతంత్ర్యమునకు భంగం కలుగచేయటం కూడా జరుగుతోంది అనుశాసనబద్ధమైన (Self discipline) జీవితాన్ని అలవర్చుకోక పోవటం అట్టివారిలో గల పెద్ద లోపంగా గోచరిస్తుంది. క్రమంగా ఎదుటివారి కష్టసుఖాలకు స్పందించే గుణం వారిలో నశిస్తుంది.

కారణం ఏదైనా ఫలితం అలజడి ఆందోళన, అశాంతి, అసంతృప్తి ఏర్పడి ఆది సమాజంలో, భయోత్పాతాన్ని సృష్టిస్తోంది.

మరికొందరు విలాసమునకో, పరిహాసమునకో, ప్రకర్షకో (గొప్పతనం) ప్రతీకారమునకో, అనుభవమునకో, ఆనందమునకో అనుచిత కృత్యములను చేయటం,

అమాయకులను బాధించటం చూస్తున్నాం. వారలా ప్రవర్తించడానికి వ్యక్తిగత కారణములేకాక వారు నిత్యము చూస్తూ, చదువుతూ ఉన్న చౌకబారు సాహిత్యం కూడా. అందుకు ఎక్కువ భాగము దోహదం చేస్తోంది. ప్రస్తుత సమాజం ఆ విషయం గమనింపలేక పోవటం దురదృష్టకరం లోకంలో చెడు ఆకర్షించినంత తొందరగా మంచి అలవడటం కష్టమన్నది నిజం. చుట్టూ ఉన్న వాతావరణం వ్యక్తియొక్క ప్రవర్తపై (ముఖ్యంగా పసిహృదయాలపై) ప్రభావం కలిగి ఉంటుంది అన్నది సత్యదూరం కాదు. అందువల్ల సంస్కార యుక్తమై, సమాజ అభ్యున్నతికి తోడ్పడే సాహిత్యాన్ని మనం ఉపాసించాలి. భావితరాలకు అందించాలి. తద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారం సాధింపబడాలి.

శ్రీమద్రామాయణంలో సీతాపహరణానంతరం రాముడు సుగ్రీవ మైత్రి పాటించి, ఆత్మశక్తికి తోడు భౌతికమగు వానరసేనా సహాయమును సంపాదించుకొని హనుమంతుని ద్వారా సీత జాడ తెలిసి, సముద్రముపై సేతువును నిర్మించి లంకపై దండెత్తి పోయినాడు. అది విన్న రావణుడు మంత్రి సేనాపతులతో అత్యవసర సమావేశమును ఏర్పాటుచేసి, ప్రస్తుతమును గూర్చి చర్చించి, కర్తవ్యమును నిర్ణయించండని కోరినాడు. ఎవరికి తోచినరీతి వారు వివరించినారు. అందు కొందరు రావణుని సమర్థించుచు తమతమ పరాక్రమ ప్రకటనమునకిది తగిన సమయముగ భావించి వీరోచితముగ పోరాడి శత్రువులను చీల్చి చెండాడ గలమని ప్రతిజ్ఞలు చేశారు. విభీషణుడు మాత్రము ఇప్పటికైనను సీతను రామున కిమ్మని (దీయతాం దాశరథాయ మైథిలీమ్ 9/22) అర్థించినాడు. విద్యావంతుడవగు నీ యట్టి వానికి ఇది తగదని హితము బోధించినాడు.

అయశస్య మనాయుష్యం పరదారాభిమర్శనమ్
అర్థక్షయకరం ఘోరం పాపస్య చ పునర్భవమ్॥ యు.కాం. 9/15 శ్లో

పరస్త్రీ గమనము అపకీర్తి కారణమేకాక ఆయు రర్థములను హరించి, పాపమును కలిగించునని" వివరించినాడు.

అతని నీతివాక్యములు రావణునికి రుచించ లేదు. వినాశోన్ముఖుడగు వానికి మంచి కన్పించదు, వినిపించదు.

ఆ సభలో రావణుని మంత్రులలో మహాపార్శ్వుడు లేచి తన మతము (అభిప్రాయము) నిట్లు వివరించినాడు. రాముడు కోతిమూకల వెంట బెట్టుకొని లంకపై దండెత్తి వచ్చుట పరిహాసమును పుట్టించుచున్నది. అతని జయించు టెంత పని? అది అట్లుండనిండు. దేవా? గోటితోపోవు దానికి గొడ్డటితో పనియేమి? అన్నట్లు అల్పుడైన మానవునితోడి యుద్ధమున కింత సంరంభమేల? అందులకు మీరింత కలవరమంద నేల? చెఱపట్టబడి మీ అధీనమునను్న సీతను బలవంతముగ చెఱచివేయ మిమ్ము ఆ రాముడు ఇప్పుడేమి చేయగలడు? చెడిన సీతవేమి చేసుకొన కలడు. శీలవతి అయిన సీత అంతటితో కుమిలి కుమిలి ఏడ్చి ఆత్మహత్య చేసుకొని మరణించును. సీత లేనినాడు రాముడు తనంత తానే నశించును. ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నట్లు. మీ కోర్కె తీరుటతోపాటు శత్రువినాశనమును అనాయాసముగా సిద్ధించును. సర్వనియంతవైన నిన్ను శాసించగల నియామకుడు ఎవ్వడూలేడని చెప్పి నిర్భయముగా రావణుని దౌర్జన్యము చేయ ప్రేరేపించినాడు.

ఈశ్వరస్యేశ్వరః కోఽస్తి తవ శత్రు నిబర్హణ।
రమస్వ సహ వైదేహ్యా శత్రూ నాక్రమ్యమూర్ధసు॥
బలాత్ కుక్కుట వృత్తేన వర్తస్వ సుమహాబల।
ఆక్రమ్యాఽక్రమ్య సీతాంవై తథా భుంక్ష్వరమస్వచ॥ యు.కాం. 13/3, 4 శ్లో॥

"లబ్ధ కాముడవైన నీవు నేడు ఏర్పడిన పరిస్థితిని కాని, రేపు రాబోవు పరిణామమును కాని ఏ విధముగానైనను ఎదుర్కొన కలవాడవు. పరాక్రమముతో మేమందరము నిన్ను అనుసరించి శత్రువులను వశపరచుకొనగల వారము" అనియు ప్రతిజ్ఞ చేసినాడు. (13/5, 8 శ్లోకములు)

ఇది అంతయు విన్న రావణుడు "ఈపాటి విపరీతపు ఆలోచన లోగడ ఏనాడో నా బుద్ధికి రాక పోలేదు. కాని అందులకు నేను అశక్తుడను. నాకు గల బలహీనత (weekness) వివరించెదను వినుము," అని ఇట్లు చెప్పినాడు (3/10,) "పూర్వము ఒకప్పుడు. బ్రహ్మ సభకు పోవుచున్న 'పుంజికస్థల' అను అప్సరసను నేను బలాత్కారముగ పట్టుకొని అనుభవించితిని. కుడిపివేయబడిన పద్మమువలె ఉన్న ఆమెను చూచి బ్రహ్మ జరిగిన విషయము మనమున నెరింగి ఆ అకృత్యమునకు రోసి, నేటినుండి రావణుడు ఇకపై ఎప్పుడైనను కామపరవశుడై పరస్త్రీని బలాత్కరించినచో తల నూరువక్కలై పడి అతడు మరణించునని శపించినాడు.

అద్యప్రభృతి యాం మన్యాం బలా న్నారీం గమిష్యతి।
తదాతే శతధా మూర్ధా, ఫలిష్యతి న సంశయః॥ యు.కాం. 13/14 శ్లో॥

నేనాతని శాపమునకు భయపడి ఇంత కాలము సీతను బలవంతము చేయజాలనైతిని.

ఇత్యహం తస్య శాపస్య భీతఃప్రసభ యేవతాం।
నా రోపయే బలాత్ సీతాం వై దేహీం శయనేశుభే॥ (13/15 శ్లో॥)

బ్రతుకునిచ్చి, ఒకప్పుడు అతని సంయమనమునకు, (ఇంద్రియ నిగ్రహము) తపశ్చర్యకుమెచ్చి, అజేయ పరాక్రమముతోబాటు అనంత వరములను ప్రసాదించిన బ్రహ్మయే అతని దుశ్చర్యను నిరసించి జీవితముపై ఆంక్షవిధించినాడు. అతని చావునకు తానే ముహూర్తము పెట్టినాడు. రక్షించువాడే శిక్షింప సమర్థుడగుననుట యథార్థము కదా! "పెట్టేవేతికే కొట్టే హక్కు వుంటుంది" అనేది లోకంలోని నానుడి. సాధులను, సాధ్వులను పీడించి, బాధించు జగత్కంటకుడైన రావణుని వంటి దుష్టునికి అట్టి అదుపు, ఆజ్ఞ లేనినాడు లోకములో సంసారములు సాగుటెట్లు? లోకైక వీరుడైన రాముని భార్యకే ఇట్టి సంకట స్థితి వచ్చినదనిన సమాజమున తక్కినవారి సంగతి ఏమని చెప్పవచ్చును.

సాక్షరులై, విజ్ఞాన సముపార్జనచేసి, లోక హితం కోరతగిన విద్యావంతులే స్వార్థంతో విపరీతభావనులైనచో రాక్షసులగుదురని పెద్దలనుట ఈ యెడస్మరింప తగియున్నది.

"సాక్షరా విపరీతశ్చేత్ రాక్షసాఏవ కేవలమ్"
(– సాక్షర - రాక్షస)

ప్రవృత్తిచే రావణు డట్టి రాక్షసుడే అయినాడు. మూర్ఖుడైన అతని శిక్షింపుటకు బ్రహ్మాదులు ప్రాణభీతి కల్పించిరి. (రంభా సంబంధమున అంతకు పూర్వమే నలకూబరుడు శపించుట జరిగినది) ఎట్టివారికి ప్రాణమున్న ప్రీతియే కదా!

దురతిక్రమము (స్వభావోదురతిక్రమః), కామమోహితమునైన అతని దుష్స్వభావము బ్రహ్మశాపమునకు లోబడినది. కావుననే ఆ తరువాత అతడే అబలనూ బలాత్కారము చేయజాలక పోయినాడు. దండకారణ్యమున రామలక్ష్మణులు లేని

సమయమున ఒంటరిగనున్న సీతను కపటి అయి అపహరించి లంకకు దెచ్చి, అశోక వనమునుంచి తనను పతిగ అంగీకరింపుమని బ్రతిమాలి, భంగపడినాడు. అధికార సంపదలతో ప్రలోభపెట్టి ఆమెను లొంగదీసుకొన జూచాడు. మాటిమాటికి తన ఔన్నత్యమునూ, రాముని అసహాయతనూ వర్ణించి భేదమును సృష్టింప యత్నించాడు అది అతని చిత్త లౌల్యమునకు ఉదాహరణము. స్థిర చిత్తయగు సీతయెడ నీయెత్తు లేమియు పారకుండుట తెలిసి, తుదకు క్రౌర్యమున చంపివేయుదునని కూడ బెదిరించాడు కానీ, చేజేతులా చెరచ బూనిన వాడు కాదు. ఇది అతని నైతిక గుణమునకు, మానవత్వ లక్షణమునకు నిదర్శన మెంత మాత్రము కాదు. కేవలము అతని మరణ భీతికి, ప్రాణ ప్రీతికి తార్కాణము. పరస్త్రీని చెరపట్టిన పాపమున చివరకు అతడు సమూలముగా నశించాడు. అతని దుశ్చర్యను సమర్థించినవారు, అనుసరించిన వారునూ, వినాశనము నందిరి, అధికారముగాని, ఐశ్వర్యముకాని పౌరుష బలములు కాని శాశ్వతములు కావు. కావున వానిని ఆశ్రయించుట కంటె శాశ్వతములగు సత్య ధర్మములను ఆశ్రయించుట శ్రేయస్కరము. అట్టి వారికి మృత్యుభయము లేదు. ఆ విషయమే రామాయణమిట్లు చెప్పుచున్నది.

"సత్యధర్మాభిరక్తానాం నాస్తి మృత్యుకృతం భయమ్" (34-46-6)

ఈనాడు లోకంలో నీతి నశించింది. రాజభీతి కూడ నష్టమై పోయింది. కొందరు అవినీతిపరుల చేతిలో న్యాయం చిక్కుకుపోయిన కారణంగా హత్యలు, అఘాయిత్యములు చేసికూడా, హంతకులు రొమ్ము విరుచుకుని బయట ప్రపంచంలో హాయిగా తిరుగుతున్నారు. న్యాయస్థానాలకు చెవులున్నాయేకాని కళ్ళు లేవు కదా! కారణాంతరాలవల్ల సత్యం మరుగునపడిపోవటంతో అమాయకులు శిక్షల ననుభవిస్తున్నారు. డబ్బుతో ఏదైనా కొనగలం, ఎంతపనియైనా సాధించగలం అనే ఆలోచనరావటంతో జనజీవన విధానంలో ధనముయొక్క ప్రాబల్యం ఎక్కువై పోయింది దాంతో ధర్మం కుంటుపడింది అరాచక శక్తులు విజృంభించాయి పెడబుద్ధులు పుట్టి జనంలో దోపిడీలు, దొంగతనాలు, దౌర్జన్యాలు మొదలైన సమాజ విద్రోహక చర్యలు పెచ్చు పెరిగి పోయాయి. నేడు రావణుని వంటివారు అనేకులు పుట్టుకొస్తున్నారు. ఆనాడు అతడొక్కడే. ఆరేళ్ళ పసిపాపలనుండి అరవయ్యేళ్ళ వృద్ధురాండ్రవరకు మానభంగాలకు గురి అవుతున్నారన్న వార్తలు తరచు వింటున్నాం. వీరు, వారన్న వివరంతో పనిలేకుండ వ్యవహరించే పశు

ప్రవృత్తికి విచక్షణ ఎక్కడిది? స్త్రీ రూపమై ఉంటే చాలు అనుభవానికి అర్హులు చావి, రసాభాస సృష్టిస్తున్నారు. కామాంధులకు లజ్జా, భయములనునవి ఉండవు.

"కామాతురాణాం నభయం నలజ్జా"
కావున వారెందులకైనను, వెనుకాడరు.

ఇట్టి భయంకర పరిస్థితిలో సమాజ సంక్షేమాన్ని కోరిన పెద్దలు స్త్రీకి స్వాతంత్ర్యమెన్నడూ తగదని వక్కాణించారు. కన్నెవయసులో తండ్రి, యౌవ్వనంలో భర్త, వార్ధక్యంలో తనయుడు వారిని కాపాడాలని శాసించారు. అందులో గల పరమార్థం తెలియని కొందరు విపరీతార్థం చెప్పటం శోచనీయం. అట్టివారు అల్పజ్ఞులై వారి అన్వయ జ్ఞానాన్నే శంకించ వలసి వస్తుంది. వారికి సందర్భ శుద్ధి తెలియదని అనుకోక తప్పదు.

తండ్రి వెంటో, భర్త వెంటో, బిడ్డ వెంటో వెళ్ళే స్త్రీకి ఉండే రక్షణ ఈ జనారణ్యంలో ఒంటరిగా వెళ్తుంటే ఉండదనే సత్యం అందరికీ అనుభవంలో ఉన్నదే. ఇందుకు ఆ మధ్య జరిగిన ఒక విషయం చెప్పుకుంటే ఉదాహరణగా ఉంటుంది.

ఒక గృహస్థుడు తన కుమార్తెకు ప్రక్క ఊరిలోనే సంబంధం చూచి వివాహం చేశాడు. క్రమంగా ఆమెకు పిల్లలు, మనుమలు కూడ కలిగారు. ఆమె తీరికను బట్టి అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్ళి బంధువులను పలుకరించి దగ్గర కావటం చేత సాయంకాలానికి ఇంటికి వస్తూ ఉండేది. అలాగే ఒక రోజు పుట్టింటికి వెళ్ళి, తిరిగి వస్తూ ఉంటే దారిలో ప్రొద్దుక్రుంకి మసక చీకట్లు అలుముకున్నాయి. అదే సమయంలో ఎవరో దారిని పోయే దాసయ్యకు ఈమె ఒంటరిగా వస్తోంది ఒంటిమీద నగ, నట్ర కూడా ఉంది. హాయిగా కౌగిట దాచుకుందాం, ఇమ్మల సొమ్ములు దోచుకుందా మనే పాడు బుద్ధి పుట్టింది. అలోచన వచ్చిందే తడవుగ ఆమెను సమీపింప బోయాడు. ఆమె అప్పుడే అతని వాలకం గ్రహించింది. అతనిలో చెలరేగే వికృత భావాలను పసికట్టింది. నిబ్బరంగా నిలబడి వెనుకకు తిరిగి "అయ్యా! మావాళ్ళు వస్తున్నారు ఎంతదూరంలో ఉన్నారో? చూడు" నాయనా! అని (చూపు ఆనని దానిలా నొసటిపై చేయిపెట్టి చూస్తూ) అతనిని అడిగింది. ఎప్పుడైతే తన వాళ్ళు అదరిదాపులలో ఉన్నారని చెప్పిందో అప్పుడే వాడు ఈమెకు రక్షణ ఉందని గ్రహించి నెమ్మదిగా జారుకున్నాడు. వాళ్ళెవరైనా వస్తే ఒళ్ళు గుల్ల అవుతుందని భయంతో సర్దుకొని దూరంగా వెళ్ళి పోయాడు. అతడు యథార్థం

గ్రహించి వెను తిరిగి వచ్చేటప్పటికి ఆమె తొందరగా నడక సాగించి, ఊరి పొలిమేరకు చేరుకుంది. ఆమె సమయస్ఫూర్తితో వ్యవహరించటం వలన ఆపదను తప్పించుకొని ఆరోజు క్షేమంగా ఇల్లు చేరగలిగింది. లేకపోతే ఎంత ప్రమాదం జరిగి ఉండేది? ఇటువంటి సన్నివేశాలెందరికో ఎన్ని సందర్భములలోనో ఎదురవ్వటం కద్దు. ఈ మధ్య తిరుపతిలో ఒంటరిగా సినిమాకి వెళ్ళివస్తున్న ఒక గృహిణిని నలుగురు స్కూటరిస్టులు అనుసరించి, రిక్షాకార్మికుని బెదిరించి లోగొనబోయిన వివరాలు వార్తాపత్రికలు ప్రచురించటం అందరికి తెలిసిందే. అనాథలై, ఆత్మరక్షణ చేసుకోలేని మైనరు బాలికలకు జరిగే అన్యాయాలన్నీ నేడు వెలుగుచూచే భాగ్యానికి నోచుకోని మాటనిజం. కొన్ని చెప్పుకోటానికి నోరురానివి, మరికొన్ని దాచుకోటానికి వీలులేనివి. నేటి భారతంలో ఈ మానభంగ పర్వం ముగిసే దెన్నడో? స్త్రీకి నిజమైన స్వాతంత్ర్యం కలిగే దెప్పుడో?

అనాడు రావణుడు కూడ రామలక్ష్మణులు పర్ణశాలలో లేకుండా దూరంగా వెళ్ళటానికి కనక మృగరూపమైన కపటోపాయాన్ని పన్ని ఒంటరిగా ఉన్న సీతనే అపహరింపగలిగాడు. ఒకవేళ అతడు రామలక్ష్మణుల కంట పడిఉంటే నాడే రావణవధ జరిగి, రామాయణం మరో మలుపు తిరిగేది. అయితే బంగారు లేడి కూడా రాక్షస మాయయే అయినట్లయితే తద్వధ సహితం తనకు అవశ్య కర్తవ్యమేనని రాముడు సంకల్పించి దానిని అంతమొందించాడు. ఇంకపోతే, ఏ సమయంలోను స్త్రీ దౌర్జన్యానికి లోను కాకుండా ఉండేందుకు ఆమెకు రక్షణ ఉండి తీరాలన్నదే (నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి) మన పెద్దల మాటలోని ఉద్దేశం అంతే కాని ఆడవారిని అణగ ద్రొక్కాలని కాని, వారికి వ్యక్తిత్వం లేకుండా చేయాలని కాని కాదు.

కొన్ని సందర్భములలో స్త్రీలే (శిక్షణపొంది ఉంటే) అత్యాచారాలకు పాల్పడే దుష్టులను స్వయంగా ప్రతిఘటించి, మాటలతో చేతలతో వారికి బుద్ధి చెప్పిన సందర్భాలు లేకపోలేదు. అట్టిది అభినందనీయమగు విషయం. కానీ అబల లందరు అట్టి ధైర్యసాహసములు కలిగి యుండుట సాధ్యం కాదు కదా! అట్టి యెడ స్త్రీకి రక్షణ తప్పనిసరిగా కోరబడుతుంది. శీలమున కంత ప్రాధాన్యత లేని అభివృద్ధి చెందిన కొన్ని దేశములలో ఈ బెడద లేదు. భారతీయులు మాత్రము ప్రాణమునకన్న మానమునకే ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చారు. కావుననే ఇంత బాధ నీతి బాహ్యులై నియమోల్లంఘన చేసేవారి శాతం కొంత ఎప్పుడూ ఉండట మనేది

వారి వ్యక్తిగత బలహీనతే అవుతుంది. కానీ అది వ్యవస్థలోని లోపం కాదు. అట్టి వారిని గూర్చి ప్రస్తావించటం అనవసరం. ఆ సందర్భంకూడా, సమాజానికి అట్టి వా రాదర్శవంతులెలా అవుతారు?

అది యట్లుండ అత్యాచారములు జరుగుచోట నిందితులకు సరి అయిన శిక్ష లేకపోవుటయే అట్టి అకృత్యములు మరికొన్ని జరగటానికి ప్రబలమైన కారణంగా గోచరిస్తోంది. ప్రభుత్వరంగంలో వివిధ దశలలో పేరుకుపోయిన అవినీతికి, పక్షపాత వైఖరికి ఇది ఒక దర్పణంగా చూపబడుతోంది.

కఠినమైన శిక్షలు అమలు పరుస్తున్న దేశాలలో ఇప్పటికీ సాంఘిక వ్యవస్థ ఇంతగా దిగజారిన దాఖలాలు లేవు. భారతదేశంలో స్వర్ణయుగంగా ప్రసిద్ధికెక్కిన గుప్తులకాలంలో ఇట్టి శిక్షలు ఉండటం వలననే దేశం నైతికంగా అభివృద్ధి చెందినట్లు చరిత్రకారులు వివరిస్తున్నారు. వైజ్ఞానికంగా అన్ని విధాలా ఎంతో ప్రగతిని సంతరించుకొన్న ఈనాటి సమాజం నైతికంగా పతనమై పోతోందని చెప్పుకోవటం అతిశయోక్తి కాదు. నాగరికతకే అది సిగ్గుచేటుగా పరిణమించింది గత కాల వైభవాన్ని పొగుడుకుంటూ ఇప్పటి వ్యవస్థను నిందించడం ప్రస్తుత లక్ష్యం కానే కాదు. ప్రాత అంతా ఒక రోతగా భావించి నెట్టి వేయటం కాకుండా మంచి ఎక్కడున్నా స్వీకరించాలన్నది ఇందులో చెప్పదలుచుకొన్న ప్రధానాంశము. తద్వారా నేడు మానవత్వమునకు సంపూర్ణతను సంతరించుకో కలుగుతామేమో" అన్నది ఆశంస.

జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న రామరాజ్యం (అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా ఏ ఇబ్బంది లేకుండా ఇంటికి తిరిగివచ్చే రోజులు) రావాలంటే, ప్రజాస్వామ్యం అమలులోఉన్న మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలో నిర్మింపబడ్డ శిక్షాస్మృతి అవసరమైతే సవరించుకొని అయినా, స్త్రీ జాతి రక్షణకు, తద్వారా సమాజ అభ్యున్నతికి దోహదం చేసే తీరుతో అది అనుసరింపబడుతూ "సతి" వంటి సాంఘిక దురాచారములను నిషేధించేదిగా ఉండేటట్లు చూడాలి. అనేక సందర్భాలలో మన రాజ్యాంగం అనేక విధాలైన మార్పులకు లోనవ్వటం మనకు తెలిసిందే కదా! దేశకాల, ప్రయోజనములను బట్టి ఒక మంచి పనికై వ్యవస్థ మార్పు చెందటం అభిలాష ణీయమే అవుతుంది. ప్రభుత్వం యొక్క నైతిక పటిష్ఠత కూడా ఇందుకు అధికంగా తోడుపడుతుంది.

ఇంక ఒకప్పుడు రక్షకులే భక్షకు లయ్యే ప్రమాదం కూడ ఉంది. బాధ్యతతో కూడిన ఎవరి కర్తవ్యాన్ని వారు మరచి పోరాదు. ప్రభుత్వమే అవినీతికి పాల్పడితే ప్రజలకు రక్షణ ఎక్కడిది? కంచెయే చేను మేస్తే ఇంకదానికి విలువేమిటి? దాని వలన ప్రజకు ప్రయోజనం ఏమిటి? అనవసరమనుకొన్నవి బజారుపాలుకాక లోకంలో కాపాడబడతాయా? అట్టి ప్రమత్తత వారి ఉనికికే భంగాన్ని కలుగజేస్తుంది. ఈ విషయం అందరు గుర్తించుకోవాలి.

ఏ భయం లేనినాడు సమాజంలో న్యాయం, ధర్మం పరిరక్షింప బడవు. కావున దేశంలో ఒక్కచోట "మానభంగానికి, మరణశిక్ష" అన్నది అమలు పరిస్తే ఇంత దారుణం ఉండదు. శ్రమకు తగిన ప్రతిఫలం కావాలని కోరుకున్నట్లే, నేరానికి తగిన శిక్ష జరిగి తీరాలి. అట్లా జరిగిననాడు పురుషుడెవ్వడూ పరస్త్రీకై చేయిచాచడు సరికదా! కన్నెత్తి కూడ చూడటానికి ఇష్టపడడు. అప్పుడే స్త్రీలకు నిజమైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. పురుషుని చాపల్యానికి నాడే అడ్డుకట్ట ఏర్పడుతుంది. ఆనాడే స్త్రీల వెంటపడి వేటాడే క్రౌర్యం అంతమవుతుంది.

సుఖసమాజ జీవనానికి అన్నివిధాలా వసతులు కల్పించి, రక్షించే, ప్రభుత్వమే ఏ ప్రలోభాలకు లొంగనప్పుడు నేరస్తులను శిక్షించడానికి తగిన అర్హత కలిగి ఉంటుందనటం నిజం. తన మన అనే భేదం విడిచి, మనుమడనే బంధంకూడా మరచి ఆనాడు బ్రహ్మ రావణుని విషయంలో నిష్కర్షగా ప్రవర్తించాడు, నిష్పక్షపాత బుద్ధితో అతనిని శాసించి, తక్కిన సమాజానికి భద్రత కలిగించాడు. ప్రజలకు ప్రభుత్వానికి ఈ విధమైన స్ఫూర్తినిస్తూ "రామాయణం సమాజదర్పణం"గా నిలిచి నైతిక విలువలను ప్రసాదించటంలో సమర్థమవుతుంది.

శ్రుతి స్మృత్యుక్త మాచారం నత్యజేత్ సాధుసేవితమ్ ।
దైత్యానాం శ్రీవియోగోఽభూత్ సత్యధర్మచ్యుతాత్మనామ్ ॥
(క్షేమేంద్రుని చారుచర్య - 83 శ్లో)

"అసూయ"

ఒకాయన ఫలానా ఊళ్లో మంచి సంబంధం ఉందని తెలిసి, పెండ్లి చూపులకని ఆ ఊరువెళ్లాడు. అక్కడి వారెవరో ఒకరు ఈయన ఏ పని మీద వచ్చింది ముందుగా ఆరాతీసి ఇంతకన్నా మీకు వేరే సంబంధం ఎక్కడా దొరకలేదా? అని లేనివి, కానివి అయిన కొన్ని మాటలు చెప్పి పెదవి విరిచేసరికి ఆ వచ్చిన ఆయనకు పూర్వం విన్నదానికి ఇక్కడ చెప్తున్న దానికి పొంతన లేక పోవటంచేత దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ఆయన తానిప్పుడేం చేయాలి? అన్న సందేహంలో పడ్డాడు. మొత్తం మీద జరగవలసిన శుభకార్యం కాస్తా ఆగిపోయింది. అలాకాకుండా చేసిన పెద్ద మనిషికి కూడా పెండ్లి కెదిగిన ఆడపిల్లలు ఒకరుకారు ముగ్గురు ఉన్నారు. తన పిల్లలకు పెండ్లిండ్లు చేయలేడు. ఇతరులకు జరుగుతుంటే చూచి సహింపలేడు. ఊళ్లోవాళ్ల ఇంట్లో పెండ్లి ఆగిపోవటంతో అతనికో సంతృప్తి కలిగింది. అదొక వింత మనస్తత్వం.

లోకంలో ఒక పండితుడు మరొక పండితుని గూర్చి అవహేళన చేస్తూ చాలా నీచంగా మాట్లాడతాడు. తనంతవాడు, తనకంటే గొప్పవాడు మరొకడు లేడని అతని ఆలోచన కాబోలు. ఒకవర్గం వారు వేరొక వర్గం వారిపై దుమ్మెత్తి పోయటమే రాజకీయంగా భావింపబడుతోంది ఈ రోజుల్లో. "ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా" యని వాపోయాడు ఏనాడో (విజయవిలాసము) కవి లోకాన్ని గూర్చి చింతిస్తూ ఒక మహాకవి. ఏ కార్యాలయంలోనైనా ఒక కుర్చీలో వాడు ప్రక్క కుర్చీలో వానిగూర్చి మంచిగా చెప్పటానికి ఇష్టపడడు. ఇరుగు పొరుగు వారు ఒకరి విషయం మరొకరు ఎన్నడూ ఉన్నది ఉన్నట్లుగా చెప్పుకోవటం జరుగదు. ఎదుటివానికున్న అవకాశాన్ని చూచి ఓర్వలేక పోవటం తనకు లేదనే బాధ. అన్నీకలిసి అసూయగా రూపుదిద్దు కొంటాయి. ఈ అసూయ వలన ఎదుటివారిలోని గుణములను కూడా దోషములుగా చిత్రించటం కద్దు. "గుణేషు దోషారోపః అసూయా" అని అసూయా స్వభావాన్ని మనస్తత్వ శాస్త్రవేత్తలైన పెద్దలు విశ్లేషించి చెప్పారు. లోకంలో ఈ అసూయవల్ల పచ్చని సంసారంలో చిచ్చురగిలి చితిగా మారిన సన్నివేశాలు, నిండు కుటుంబాలు నిలువుగా చీలిపోయి అంగబలంతో బాటు అర్థబలం కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ కారణంగానే సమాజంలో

అనేక సమస్యలు తలెత్తటం గమనిస్తూనే ఉన్నాం. కొందరీ అసూయ వల్లనే గుణవంతుని కూడా గుణహీనునిగా చిత్రించటం సంభవిస్తుంది. ఈ విషయంలో భర్తృహరి భావాన్ని ఏనుగు లక్ష్మణ కవి ఈ విధంగా వివరించాడు.

"హ్రీరమ్యుం జడుగాగ, సువ్రతుని శూయింగా, శుచిం దంభిగా, శూరున్ నిర్దయుగా, మునిన్ విమతిగా, శ్రోత్రప్రియాలాపు నిస్సారుంగా, బలవంతు గర్వితునిగా, సద్వక్త వాచాలుగా, గ్రూరుండెన్ని సుధీగుణంబు దురితా రూఢంబు చేయుం గదా! (దుర్జన పద్ధతి 43 ప) ఇట్టిది క్రూర స్వభావమని ఆతడే సూటిగా పేర్కొన్నాడు. కుల, మత, ప్రాంత వర్గభేదాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఈ విషయంలో ఆశ్రిత పక్షపాతం, పరహింసారతి విపరీతంగా చోటు చేసుకోవటం లోక విదితమే గదా!

శ్రీమద్రామాయణ కథా విశేషమును బట్టి ఈ అసూయా గుణము వల్లకలిగే అనర్థం ఏమిటో తేట తెల్ల మవుతుంది. దండకారణ్యంలో పంచవటి ప్రదేశంలో ఆశ్రమం నిర్మించుకొని సీతారాములు వనవాసవ్రతాన్ని పాటిస్తున్న రోజులవి. లక్ష్మణుడు భక్తితో సేవిస్తూ వారిని అనుసరిస్తున్నాడు.

ఒకనాడు సీతారాము లిద్దరూ ఆశ్రమ ప్రాంగణంలో ఒకచోట కూర్చుని ముచ్చటలాడుకొంటూ ఉండగా రావణుని చెల్లెలు శూర్పణఖ అక్కడికివచ్చి, లోకాభిరాముడైన ఆ రాముని చూచి మోహపడింది. సిగ్గు విడచి తనకోరిక వెల్లడించింది. ఏకపత్నీవ్రతుడు, ధర్మస్వరూపుడు అయిన రాముడు అనుచితమైన ఆమెకోర్కెను తిరస్కరించాడు. రాముడు తనను కాదనటానికి అతని సన్నిధిలోఉన్న సీతయే కారణమని భావించి శూర్పణఖ ఆమెను విరూపగా, వికృతాకారగా వర్ణించి సీత రామునకు తగదని అనురూపవతియగు తానన్ని విధముల అతనికి తగుదునని, తనను భార్యగా స్వీకరింపుమని చెప్పి, తమ ఇరువురు స్వేచ్ఛగా విహరించుటకు సీతతో సహా లక్ష్మణుని భక్షించి వారి బెడద లేకుండా చేస్తానని వివరించింది. ఇప్పుడు లోకంలో ఇటువంటివారు ఎంతో మంది తయారైనారనే విషయం తరచు వింటున్నాం.

విరయా భవ మే భర్తా సీతయా కిం కరిష్యసి॥
వికృతాచ విరూపాచ న చేయం సదృశీ తవ॥

అహ మే వాను రూపా తే భార్యరూపేణ పశ్యమామ్।
ఇమాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్
అనేన సహ భ్రాత్రా భక్షయిష్యే మమానుషీమ్
తతః పర్వత శృంగాణి వనాని వివిధానిచ
పశ్యన్సహ మయా కాంత! దండ కా న్విచరిష్యసి॥
(అర. కాం 17స. 26 301 శ్లో)

శూర్పము అంటే చేట అని అర్థము. చేటల వంటి నఖములు (గోళ్ళు) కలది శూర్పణఖ. నఖములే అట్లుండ, ఇకనామె సర్వావయవ సౌందర్యమును గూర్చి వేరే చెప్పవలయునా? అట్టి శూర్పణఖ లోకాతిశయ సురుచిర లావణ్య వారశియు, సౌజన్య ధన్యయు నగు సీతను అసతి, కరాళ, నిర్ణతోదరి, విరూపయని నిరూపింపబూనినది. ఆమె చెప్పనాతి తనమున కింతకంటే నితర సాక్ష్యములు కావలయునా? ప్రయోజనా పేక్షితమైన స్వార్థబుద్ధితో పలికెడి అమెపలుకులలో సత్యమెక్కడిది? ఇచ్చట శూర్పణఖ యెదలి అసూయచే సీతా సౌందర్యము దోషదూషితమైనదిగా చిత్రింపబడినది. మరియు ఈమెను చూచుకొనియే కదా! నన్ను నీవు లెక్క సేయకున్నావు? కావున నిప్పుడే నీ యెదుటనే నే నీమెను మ్రింగి, సవతి లేకయే నీతో గూడి సుఖముల ననుభవింపెదనని క్రూరముగా బల్కి, చంప నుద్యుక్తురాలై సీతపైకి దూకింది.

ఏనాం విరూపా మసతీం కరాళాం నిర్ణతోదరీమ్।
వృద్ధాం భార్యా మవష్టభ్య మాం నత్వం బహుమన్యసే॥
అద్యేమాం భక్షయి ష్యామి పశ్యత స్తవ మానుషీమ్।
త్వయా సహ చరిష్యామి ని స్సపత్నా యథాసుఖమ్॥
(అర. కాం. 18స 15.16 శ్లో)

ఇక్ష్వాకు వంశమున రామునకు ఇరవై తరముల పూర్వము వాడు అనరణ్యుడు. యుద్ధోన్మాదియగు రావణు డాతని హింసించి సముద్రమున ముంచి చంపినపుడు మా వంశములో బుట్టిన వీరునిచేతిలో మరణిస్తావని ఆమహారాజు క్రూరకర్ముడగు రావణుని శపించాడు. అట్టి రావణునికి చెల్లెలు శూర్పణఖ అమె విద్యుజ్జిహ్వుని పెండ్లియాడి చాలకాలం కాపురం చేసింది. ఇప్పుడాతడు కూడా మరణించాడు. కావున ఆమెయు నింపుమించుగా రావణునియంత వయస్సు కలదియే యగుటచే

నిజమునకు అమె వృద్ధురాలు కాని సీతకాదు కదా! కాని ఇట శూర్పణఖ సీతను వృద్ధురాలనుట ఎంతటి హాస్యాస్పదము. అమెకేమి ఈ పాడు బుద్ధి. అంతటి సౌందర్య గర్వితయగు శూర్పణఖ తుదకు తన అనుచిత ప్రవర్తనము వలన లక్ష్మణుచే ముక్కు చెవులు కోయబడి విరూపయై పరాభవింపబడినది. అప్పటికైనను అమెకు బుద్ధి వచ్చినదా! లేదు. ప్రతీకార వాంఛతో ఖర దూషణాది రాక్షసులను ప్రేరేపించి వారు రాముని చేతిలో మరణించుట చూచి, రావణుని సమీపించి పరస్త్రీ వ్యామోహ రూపమైన అతని బలహీనతను ఆసరాగా చేసుకొని "రాముని భార్య సీత లోకైక సుందరి. సర్వలక్షణ సంపన్న యగు నామె నీకు తగిన భార్య. నీ కొఱకు నే నామెను గొనితెచ్చుటకై యత్నించి, క్రూరుడగు లక్ష్మణునిచేనిట్లు పరాభవింప బడితిని. ముల్లోకములకు ప్రభువగు నీవామెను పొందగలిగినపుడే నీ పౌరుష బలములకు సార్థకత. సంపూర్ణత సిద్ధించుననని ప్రోత్సహించి. సీతాపహరణమునకై ప్రేరేపించి, రావణుని తక్షణము కదలి పొమ్మని తొందర పెట్టింది.

భార్యార్థంచ తవానే తు ముద్యతాఽహం వరాననామ్
విరూపితాస్మి క్రూరేణ లక్ష్మణేన మహాభుజ
యది తస్యా మభి ప్రాయో భార్యార్థే తవజాయతే
శీఘ్ర ముద్ధ్రి యతాం పాదో జయార్థ మిహ దక్షిణః॥
అర. కాం, (34స. 201 22 శ్లో)

శూర్పణఖ సీతను రాముని యెదుట విరూప, వికృతాకారగా చిత్రించి చెప్పి రావణునియొద్ద మాత్రము "వరారోహ, తనుమధ్యమ, విశాలాక్షి, పూర్ణేందు - సదృశానన, సుకేశియైన సీతను జగదేక సుందరిగా అభివర్ణించింది అంతటి అశ్లీలము నకు పాల్పడిన అమె, అబద్ధ మాడుటకు వెనుకాడునా? ద్వంద్వ ప్రవృత్తిగల అమె నైజమునకిది అద్దము పట్టుచున్నది

ఈమె మాటలు విన్న రాముడు వెంటనే సీతాపహరణార్థియై, జనస్థావమునగల మారీచ ఆశ్రమముచేరి రామునిగూర్చి అతనితో అతినీచముగా పల్కినాడు: క్షత్రియపాంసనుడగు రాముడు కుపితుడగు తండ్రిచే అడవులకు వెడలగొట్టబడిన వాడనియు, ఇంకను అతడు మూర్ఖుడు, దుశ్శీలుడు, కర్కశుడు, తీక్ష్ణుడు, లుబ్ధుడు, ఇంద్రియ లోలుడు, అధర్మాత్ముడు భూతముల కహితము చేయువాడు. ఇప్పుడా రాముడు ధర్మమును విడచి ఈ యరణ్యమున నుండు నా చెల్లెలు శూర్పణఖ

విషయమున అకారణముగా వైరమును బూని, ముక్కు చెవులు కోసి, విరూపను గావించాడు. కావున నే నాతని భార్యయగు సీతను అపహరింప బూనుకొన్నాను అందు నిమిత్తము నీవు నాకు సహాయపడుమని మారీచుని కోరాడు.

(అర. కాం, 36 స, 11 – 14 శ్లో)

అదివిన్న మారీచుడు తను మొదటి నుండియు రాముని పరాక్రమము తెలిసిన వాడు కావున రాముని గూర్చి రావణునికి ఇట్లు చెప్పాడు. అతడు మర్యాద లేనివాడు, తండ్రిచే వెడల గొట్టబడినవాడు కాడు. లుబ్ధుడు, దుశ్శీలుడు కానేకాడు. అతనియందు తీక్షణత, భూతముల యెడ అహిత భావన లేనేలేదు కైకేయి వరముల నిమిత్తముగా తండ్రి దశరథునకు అపత్య దోషము రాకుండా ఉండటానికి రాజ్యమును, భోగములను తానుగా త్యజించి అతడు దండ కారణ్యమును ప్రవేశించాడు. మరియు రాముడు కర్కశుడు, అవిద్వాంసుడు అజితేంద్రియుడుకాడు. అతని నోట అసత్యమను మాట పలుకబడుట ఎన్నడును లేదు యథార్థ మిట్లుండ, నీవాతని గూర్చి పరుషముగా పలుకుట తగదు. అతడు రూపు దాల్చిన ధర్మము దేవతల కింద్రునివలె సర్వలోకములకు అతడు అధిపతి

నచ పిత్రా పరిత్యక్తో నామర్యాదః కథంచన
నలుబ్ధో నచ దుశ్శీలో నచ క్షత్రియ పాంసనః
నచధర్మ గుణైర్హీనః కౌసల్యానందవర్ధనః
నతీణ నచ భూతానాం సర్వేషా మహితేరతః
కైకేయ్యాః ప్రియ కామార్థం పితుర్దశరథస్యచ
హిత్వారాజ్యంచ భోగాంచ ప్రతివిష్టో దండకావనమ్
నరామః కర్కశ స్తాత నావిద్వాన్ నాజితేంద్రియః
అనృతం దుశ్శ్రుతం చైవ నైవం త్వం వక్తు మర్హసి
రామో విగ్రహవాన్ ధర్మః సాధు స్సత్య పరాక్రమః
రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ

(అర కాం. 39 స. 8,9,11,13 శ్లో)

శుచట మారీచ రావణ లిరువురు రాక్షసులే అయినను రావణుడు అసూయాగ్రహగ్రస్తుడు. కావున రామ పరాక్రమాది గుణములను వినియుండియు వానినన్నింటిని దోషములుగా నారోపించి రాముని అసమర్థునిగా జిత్రింప జూచాడు.

మారీచుడు విశ్వామిత్ర యాగ సంరక్షణ సందర్భమునందే కాక ఈ దండకావనము నందును అతని పరాక్రమము, సత్యవ్రతనిష్ఠ తెలిసిన వాడగుటచే రావణునకు హితము చెప్పటానికి యత్నించాడు. మారీచునిది యథార్థ దర్శనము. రావణునిమాపు రంగుటద్దాలచే వివర్తత నందింది. అట్టి వానికి నిజము కనబడదు. చెప్పినను వినబడదు. అది సహజమే. పచ్చకామెర్లవానికి లోకమంతా పచ్చగా కనబడు ననుట లోక ప్రసిద్ధము కదా!

ఈ సందర్భమున స్వార్థబుద్ధులగు శూర్పణఖ, రావణు లిర్వురూ సీతారాముల యెడగల అసూయచే వారి గుణములందు దోషారోప మొనరించారు. ఆ అసూయయే వారిని దుష్కార్యములకు ప్రోత్సహించి, తుదకు వారినే దహించి వేసింది కట్టెలలో రగుల్కొను మంట ముందుగా ఆ కట్టెలనే కాల్చి మసి చేయుట అనుభవ సిద్ధమే కదా!

లోకమున నేడు ఈ "అసూయ" అన్నిరంగములలోనూ చోటు చేసుకొని పరస్పర విద్వేషములకు కారణమై ప్రాణికోటికి శాంతి భద్రతలు కొఱవడేటట్లు చేస్తోంది. కావున అసూయ విడచి మానసిక పరివర్తనము చెంది మానవు లెల్లరు ఉదార చరితులై, వ్యవహరింపుటకై స్ఫూర్తి నిచ్చుచు "రామాయణము - సమాజదర్పణము"గా వెలుగొందుచున్నది.



వ్యసనాలు

ఆకాశము, గాలి, నిప్పు, నీరు, భూమి అనునవి ఈ ఐదు పంచ భూతములు. వీని కలయిక వలన ఏర్పడిన ఈ ప్రకృతిని ప్రపంచము అంటారు. సృష్టిలోని ప్రతిప్రాణికి ఈ పంచ భూతములకు సంబంధించిన దేహం ఏర్పడుతుంది.

శబ్ద, స్పర్శ, రూప, రస గంధములు పంచ భూతములయొక్క గుణములు. ప్రాణులకు ఈ గుణాను భవమునకై త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వాఘ్రాణములను పంచేంద్రియములు సాధనములుగా సిద్ధించాయి. వీనినే జ్ఞానేంద్రియములు అంటారు. ఇవిగాక కర్మేంద్రియములు మఱి ఐదు కలవు అవి వాక్, పాణి, పాద పాయు ఉపస్థలుగా పరిగణింపబడుతున్నాయి. వీనిలో దేని ప్రయోజనము దానిది. ఇందులో ఏది లోపించినను, జీవయాత్ర కడు దుర్భరముగాదోచి, తన్మాధుర్య ఫలము పరిపూర్ణముగా అనుభవింప నవకాశము లభింపదు.

అయితే 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు ఏ విషయంలోను అతి ప్రసక్తి పనికిరాదు. తినటం, కనటం (చూచుట), వినటం, వాసన చూడటం, స్పర్శ సుఖం కోరటం వంటి ఇంద్రియ వ్యాపారములలో ఏ ఒక్క దానికో అధిక ప్రాధాన్యాన్నిచ్చి సుఖానుభవంకోసం ఆరాటపడటం వ్యసనంగా పరిణమిస్తుంది. ప్రకృతిలోని ప్రాణికోటి ఈ వ్యసన వాగురలకు (వలలకు) పట్టుబడి నశించటం చూస్తున్నాం.

> వనకరి చిక్కెమైనసకు, వావలికిం జెడిపోయె మీను. తా
> వినికికిఁజిక్కెఁ జిల్వ. గనువేమరఁ జెందెను లేళ్ళు, తావిలో
> మనికి నశించెఁదేఁటి, తరమా? యిరు మూటినిగెల్వ నైదు సా
> ధనముల నీవె కావనగు దాశరథీ కరుణా పయోనిధీ! (83 ప)

అడవి ఏనుగు (వనకరి) చర్మముయొక్క దురద తీర్చుకొనేందుకు మద్దిచెట్లకు రాసుకుంటూ వేటగాండ్రచే పట్టుబడి పరాధీన మగుచున్నది. చేప (మీను) జిహ్వా చాపల్యమునకు చిక్కి, ఎరను మ్రింగబోయి గాలమునకు తగుల్కొని ప్రాణములు కోల్పోవుచున్నది. పాము (చిల్వ) నాగస్వరము వినుచు లోబడుట లోక విదితమే. లేళ్ళు ఎండమావులను జూచి జలాశయములని భ్రాంతి పడి పరువులెత్తి, అలసటచెంది, అనర్థముల పాలగుట అనుభవ సిద్ధము. తుమ్మెద (తేటి) పద్మములోని పరిమళమునకు చొక్కి ప్రొద్దుక్రుంకుట యెఱుంగక అందే బంధింప బడుట చూస్తున్నాము.

కావున ఈ యిరు మూటిని ($2+3=5$) గెల్చుట సాధ్యముకాదు. పంచాయుధుడవైన నీవె నన్ను రక్షింప సమర్థుడవనియు, నీయందే లగ్నమైన ఇంద్రియ సముదాయము మాత్రమే పరమార్థ సాధనోత్కరము కాగలదనియు (84 ప.) దాశరథీ శతకకర్త కంచెర్ల గోపన్న శ్రీ మహావిష్ణువును ప్రార్థించుచున్నాడు.

ఈ విధంగా లోకంలో ఆయా ప్రాణులొక్కొక్క ఇంద్రియ బంధముకే చిక్కి భౌతికముగా వినాశనమును చెందుచుండ, మితిలేని సకలేంద్రియానుభవ ప్రాప్తికై ప్రాకులాడెడి మానవుడు పతనమగుటను గూర్చి వేరే చెప్పవలయునా? లోకతత్త్వము నెఱిగిన నిపుణులు కొందరు మాత్రము ప్రకృతి నియమానుసరణము ద్వారా ఇంద్రియములు జయించి పరమోత్కృష్టమగు ధర్మమును సంపాదింప గలుగుచున్నారు.

పైన పేర్కొన బడినవే గాక శాంతికి భంగకరములై, ఆత్మవినాశమునకు హేతువులగుచు దుర్గతికి ద్వారము లనదగిన కామ, క్రోధ, లోభములను వ్యసనములుగా పరిగణింపబడి మానవులచే పరిత్యజింపదగినవిగా చెప్పబడుచున్నవి

> త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః।
> కామ క్రోధ స్తథా లోభః తస్మా దేతత్త్రయం త్యజేత్॥
> ॥గీత॥ 16/21 శ్లో

శ్రీ శంకరులవారీ మూడింటిని జ్ఞానరత్నము నపహరించుటకు మనలో పొంచియుండు దొంగలుగా (తస్కరత్రయము) నభివర్ణించి. జాగరూకులై ప్రవర్తింపుడని హెచ్చరించారు.

> కామ క్రోధశ్చ లోభశ్చ దేహే తిష్ఠతి తస్కరాః।
> జ్ఞాన రత్నాపహారాయ తస్మా జ్జాగ్రత జాగ్రత॥

'వ్యసన'మను పదమునకు వ్యామోహము, ఆపద అను రెండు అర్థములు వ్యవహారమున కలవు. వ్యామోహము యొక్క పర్యవసానమే ఆపద, కావున రెండును సమర్థనీయములే అగుచున్నవి. ఈ వ్యసనము మరణమున కంటె మిక్కిలి దుఃఖ కరముగా భారతము అభివర్ణించుచున్నది.

"వ్యస నస్యచ మృత్యోశ్చ వ్యసనం కష్టముచ్యతే!"

లోకమున తత్త్వశాస్త్రాది చింతనములతో బుధులు జ్ఞానమార్గమున పొద్దు పుచ్చుచుండ, మూర్ఖులు మాత్రము వ్యసన పరులై కాలము వ్యర్థపరచుచున్నారనుట (దేవీభాగవతము) సత్యము. ఈ విషయమే రామాయణమున నతి నిపుణముగా ప్రతిపాదింపబడింది. మహర్షి వాల్మీకి లోకహిత చింతనకిది తార్కాణం.

రామాదులు చిత్రకూటమును విడిచి, దండకారణ్యమున ప్రవేశించి అందలి మున్యాశ్రమములను సందర్శించుచు ముందునకు పోవుచుండిరి. అట్టి సందర్భమున అచటి మునులందరు ఒక ఆశ్రమమున సమావేశమై తమ జీవనములలోని కష్ట నష్టములు విన్నవించుకొన్నారు. ఆ అరణ్య ప్రాంతమంతయు ఇక్ష్వాకుల ఏలుబడిలో నుండి, వారిచే ధర్మరక్షణము పొందుచుండుటయే అందుకు కారణమని వివరించారు. వనవాసులగు మునులు తమ తపస్సులో 6వ భాగము రాజులకిచ్చి వారితేజము వృద్ధిపొందించుటయు ఈ సమయమున గుర్తుచేసి, అయోధ్యయందున్నను అడవిలో ఉన్నను ఓ రాజా! నీవే మమ్ములను రక్షించి తీరవలయునని ప్రార్థించారు.

తేవయం భవతా రక్ష్యాః భవ ద్విషయ వాసినః।
నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః॥
అర. కాం. - 1స. 20 శ్లో

చిత్రకూట సభలో చేసిన నిర్ణయమును బట్టియు భరతుడయోధ్యలో ప్రజాహితముగా రాజ్యమేలుట, రాముడరణ్య వాససమయమున అరణ్యకులకు రాజై, వారికి రక్షకుడుగా నుండి ధర్మపరిపాలనము గావించుట చేయదగి యున్నది. (అర కాం. 107స 17 శ్లో)

అదివిన్న రాముడు పరిస్థితివంతయు గ్రహించి, అప్పట్టున తన కర్తవ్యమును నిర్ణయించుకొని. ధర్మాత్ములైన తాపసపుంగవులకు అపకారం చేసే

రాక్షసులను రణభూమిని చంపి తీరుతానని ప్రతిజ్ఞ చేశాడు. అట్టి దుష్టశిక్షణయే తన వనవాసానికి తగిన ప్రయోజనంగా సంకల్పించి తాను మునులకు అభయ మిచ్చాడు.

తదుపరి రాముదులు సుతీక్ష్ణమహామునిని సందర్శించి, అతని కడ సెలవు గైకొని బయలుదేరారు. మార్గమధ్యంలో సీత తనకు కలిగిన ధర్మసందేహమును వెలుబుచ్చుచు స్నేహపూరితము, హృదయంగమమునైన మాటల రామునితో ఇట్లు పలికింది.

లోకమున కామజములైన వ్యసనములు మూడు కలవు. అవి 1. అసత్య మాడుట 2. పరస్త్రీ గమనాభిలాష 3. కారణములేని క్రోధము

త్రీణ్యేవ వ్యసనా న్యత్ర కామజాని భవం త్యుత।
మిథ్యా వాక్యం పరమకం తస్మా ద్గురుతరా వుభౌ॥
పరదారాభిగమనం వినా వైరంచ రౌద్రతా॥ అర. కా. 9స. 3శ్లో

స్వదార నిరతుడవు, పితృసత్యవాక్య పరిపాలనా రతుడవు అయిన నీ యందు మొదటి రెండును ముందెన్నడూ లేవు. ఇంక నెప్పుడు కలుగబోవు. ఈ విధముగా నీవు ధర్మాత్ముడవు, సత్యసంధుడవు నగుచున్నావు. జితేంద్రియులకు మాత్రమే సాధ్యమైన పై రెండును నీవు సాధించావు. కానీ నీ విప్పుడు మునుల కిచ్చిన మాట ననుసరించి వైరము లేకయే పరప్రాణముల హింసించుటయను అధర్మదోషము నీ యందు దోచునేమోయను శంకచే నా మనసు వ్యాకుల పడుచున్నది. తపోవృత్తికి, క్షాత్రధర్మమునకు, వనవాస వ్రత మునకు, శస్త్రసంయోగమునకు, ఎన్నడూ పొంతన కుదురదు. శస్త్రసంయోగము అగ్ని సంయోగముతో సమానము కావున నీవు చేసిన బాసయందలి సూక్ష్మాంశమేమియో నా మనసునకు బోధపడుట లేదు. సర్వమెరిగిన నీకు ధర్మమును గూర్చి చెప్పగలుగు నంతటి ప్రగల్భను కాను, నాకు నీయందున్న స్నేహభావముతోను, నీవు నా యెడ చూపిన ఆదరముతోడను నీకీ సమయమున ధర్మ స్వరూపమును గుర్తు చేయుచున్నాను అంతియేకాని నే క్రొత్తగా నీకు బోధింప బూనుట లేదు.

"స్నేహాచ్చ బహుమానాచ్చ స్మారయే త్వాం నశిక్షయే"
అర. కాం. 9స. 24/2 శ్లో

సీత హితవాక్యములు విన్న రాముడు సమాధానంగా తన ప్రతిజ్ఞలో గల అంతర్యమును ఇట్లు వివరించాడు. "ఈ వనవాసులగు మునులు ఉపవాస వ్రతాదులతో ధర్మ సంగ్రహమునకై యత్నించుచు, ప్రశాంత జీవనము గడుపుచున్నారు. లోక కల్యాణము నర్థించి క్రతుకర్మములను ఆచరించే వీరిపై రాక్షసులు దౌరన్యము సలుపుచు, వివిధరీతుల హింసించుట జరుగుచున్నది. నరమాంస భక్షకులగు రాక్షసులను హతమార్చుటకై మునులు చిరకాలార్జితములైన తమ తపశ్శక్తి వినియోగించుట కిచ్ఛగింపరు. క్షాత్రధర్మము నవలంబించిన నాకు స్వయముగా విచారించి, అధర్మమును నివారించవలసిన బాధ్యత కలదు. అట్టిస్థితిలో సంశ్రితవ్రతులైన మునులు ఆర్తులై వచ్చి నన్ను శరణువేడిన కాపాడకుండుట ఎట్లు? కాదని కర్తవ్యము నుజ్జగించుట పాడియా? ఆర్తరక్షణము ధర్మసమ్మతమని నీవును అంగీకరింతువు కదా! బాధ్యత విస్మరించుట మహాపాతకము కాదా!

కింతు వక్ష్యా మ్యహందేవి! త్వయై వోక్త మిదం వచః।
క్షత్రియై ర్ధార్యతే చాపో నార్త శబ్దో భవే దితి॥
(అర. కాం. 10స. 3శ్లో)

రాక్షసు లిప్పటికి ప్రత్యక్షంగా నాకెట్టి అపకారము చేయకున్నను, ధర్మాత్ములగు మునులను హింసించుట ద్వారా ధర్మాభిమానినగు నాకు వారు పరంపరాగత విరోధులే యగుచున్నారు. కావున దుష్టరాక్షస సంహారము నాకు అవశ్య కర్తవ్యము. అట్టి ప్రతిజ్ఞా నిర్వహణమున కలిగిన కష్టమెట్టిదైనను ఎదుర్కొనుటకు సిద్ధమేనని రాముడు తనసిశ్చితాభిప్రాయమును ప్రకటించినాడు. రామునకు సహధర్మచారిణి అయిన సీత అయ్యర్థమునే సంభావించి అవగాహన మొనర్చుకొని, సమాధానపడినది.

లోకమున సమర్థుడైనవాడు అన్యాయమును సహించుట, అధర్మమును ఉపేక్షించుట తగదు. ఆ విధంగా ప్రవర్తించుట వలన సమాజమునకు, తనకు ప్రమాదం సంభవిస్తుంది. ఆ! ఆపద ఎక్కడో, ఎవరికో సంభవించింది. మన కేల? అనుకొనరాదు. ఇరుగు పొరుగు వారిండ్లలో దొంగలు పడినప్పుడు తెలిసి. అది మనది కాదని ఆదమరచి నిద్రపోయినచో ఆ దొంగలు మెల్లగా తమ ఇంటిలోనికి గూడ ప్రవేశింపకపోరు. అట్లే ఊరిలో ఒక ప్రక్క ప్రమాదవశమున నిప్పంటుకొనుట జరిగినచో తమ యింటికి కాదు కదా! అని ఊరుకొన్నచో, అది రానేవచ్చి

ఆ యింటితోబాటు ఆ వాడనే సమూలముగా దహించ వచ్చును. అట్టి ప్రమాదము జరుగకుండా ముందుగా జాగ్రత్త వహించుట, కలిగిన ఆపదను కలసి కట్టుగా నిలబడి ధైర్యముతో ఎదుర్కొని, నివారించుట చేయదగియున్నది. ఇది ఒక విధముగ ప్రతిఒక్కరు వహింపవలసిన సాంఘిక బాధ్యత. ప్రతిఫలాపేక్ష విడిచి శక్తిమంతులెల్లరు ఆ విషయమున పూనుకొనవలసి యున్నది (ఇతరులకు హాయపడని వారికి పరులేల ఉపకరింతురు?) ధర్మవ్రతుడగు రాముడట్టి బాధ్యత స్వీకరించి, సమాజంలోని ప్రతివ్యక్తియు ఆ సమాజ రక్షణ తమ తక్షణ కర్తవ్యంగా భావించి తీరాలని నిరూపించాడు.

ఇచట సీతారాముల సంభాషణా క్రమము ఔచిత్య సుందరమై, దంపతుల మధ్య సందేహములు ఏర్పడునప్పుడు అభిప్రాయ వినిమయం ద్వారా పరస్పరం అవగాహన చేసుకొనవలసిన పద్ధతిని బోధిస్తోంది. సామరస్యానికి, సమన్వయానికి ఇది ఒక చక్కని మార్గం.

తదుపరి రామాదులు పంచవటి యందు నివాసమేర్పరచు కొన్నారు. శూర్పణఖ ఆగమనంతో రామునకు రాక్షసులకు ప్రత్యక్ష వైరమేర్పడింది. ఖరదూషణాదులవధ, అందుకు ప్రతీకార చర్యగా రావణకృత సీతాపహరణం. తుదకు రావణ సంహారం జరిగాయి. ఆ విధంగా లోకకంటకులగు రాక్షసులకు వినాశనం రామునికి విజయం సిద్ధించాయి. అంతటితో రాముని ప్రతిజ్ఞ నెరవేరింది. ప్రతిజ్ఞాపాలనం ధర్మమని కదా! పెద్దల అభిభాషణం (ప్రతిజ్ఞా పాలనం ధర్మః)

ఇంతకు ముందు సీత చెప్పిన వ్యసనములు మూడూ సాధారణ మానవ బలహీనతలై నిత్య జీవిత వ్యవహారంలో జనుల నపమార్గం పట్టిస్తున్నాయి రామాయణంలో ఈ సమాజ రుగ్మతలు ప్రస్తావింపబడి వానికి పరిష్కార మార్గాలు ప్రవచింపబడ్డాయి. సమస్యనొక దానిని మన ముందుంచి, దాని వలన వచ్చే అనర్థం సూచించి, దానికి దూరంగా ఉండటం వలన ప్రయోజనం వివరిస్తే అది సర్వులకు అనుసరణీయమవుతుంది. అందు మొదటిది.

అసత్యమాడుట : తెల్లవారి నిద్రలేచింది మొదలు నిదురించే వరకు నిత్యము మానవుడు అనుకొని కానీ, అనుకోకుండగా గానీ, తెలిసికాని, తెలియక గానీ ఎన్నో అబద్ధాలాడటం సంభవిస్తుంది. అట్టి అసత్య వచనము వలన కలిగే నష్టమేమిటో తెలిసినవాడు అతడా పనికి పూనుకొనక పోవచ్చును.

విశ్వామిత్రుడు దశరథుని సభకేతెంచినవాడు. మహారాజు ఆ మునికి అతిథిపూజ గావించి, మీరేమడిగినా ఇస్తానని తన సంసిద్ధత వ్యక్తం చేశాడు. యాగ రక్షణమునకై ముని రాముని బంపుమని యడుగగా, పుత్రవాత్సల్యంతో దశరథుడు నిరాకరించాడు. మునికి కోపం వచ్చింది. అట్టి యెడ రాముని విశ్వామిత్రునితో బంపుమని వశిష్ఠుడు దశరథుని ప్రబోధించుచు ఆడి తప్పిన వానికి "అసత్యవాది" యన్న అపనిందతోబాటు తాను ముందెన్నడైనను గుళ్ళు గోపురములు కట్టించుట, పాఠశాలలు స్థాపించి విద్యాదాన మొనరించుట, అన్న సత్రములు పెట్టించుట, బావులు, చెరువులు త్రవ్వించుట మొదలగు ప్రజాహిత కార్యక్రమాలు చేసి, సంపాదించిన పుణ్యఫలమంతా నశిస్తుందని వివరించాడు ఎక్కువగా లోకంలో అబద్ధ మాడటానికి లోభగుణమే కారణం. కావున వివేకియైన వాడెన్నడూ అసత్యమాడరాదు.

సంశ్రు త్యేవం కరిష్యేతి ఉక్తం వాక్య మకుర్వతః।
ఇష్టాపూర్త వధో భూయాత్ తస్మా ద్రామం విసర్జయ॥
బా. కాం. 21 స. 8 శ్లో

2. పరస్త్రీ వ్యామోహము : రావణుడు పరస్త్రీ వ్యామోహము కలవాడు ఎందరో పతివ్రతల బలిమిని దెచ్చి బంధించినాడు. తనను పతిగా నంగీకరింపుమని నిర్బంధించినాడు. తుదకు రాముని భార్య సీతను కూడా మాయావేషమున అపహరించి లంకకు తీసుకొని పోయాడు. మొదటి నుండియు విభీషణుడు కాముకుడైన రావణుని దుశ్చర్యను తీవ్రంగా నిరసించుచు ఈ పరదారాభిలాష పాపహేతువనియు ఇందువలన ఆయురర్థములు నశించుటేగాక అపకీర్తి పాలగుట తథ్యమనియు చెప్పి అట్టి అకృత్యమును మానుమని అన్నకు విన్నవించాడు. మూర్ఖుడైన రావణుడది వినక తుదకు సమూలంగా వినాశనం పాలయ్యాడు. పాపకర్మంవల్ల అనుభవానికి వచ్చేచేదు అతడు చవిచూశాడు. అందువల్ల పరదారాభిలాష పనికిరాదు.

"అయశస్య మనాయుష్యం పరదారాభిమర్శనమ్।
అర్థక్షయకరం ఘోరం పాపస్యచ పునర్భవమ్॥ యు.కాం 9వ 15శ్లో

3 అకారణ క్రోధము : యుద్ధోన్మాదియగు రావణుడు అకారణ వైరము బూని, కార్తవీర్యునితో పోరాడి, అతని కారాగారమున బంధితుడైనాడు. రావణుని తాత పులస్త్యబ్రహ్మవచ్చి బ్రతిమిలాడ అతని మోమాటమునకై రాజాతనిని

విడిచి పెట్టాడు. వాలిని కపటంగా బంధింపబోయి అతని సందిటనే ఇరికికొని సముద్రము లన్నింటను మునిగి తేలినాడు. అసదృశమగు నాతని పరాక్రమమునకు డిమ్మరబోయి అతని అండదండలుకోరి, సిగ్గువిడచి స్నేహమును ప్రసాదింపుమని చేసాచి అర్థించాడు. తన క్రోధమే తన శత్రువగుట ఇందు నిరూపింపబడింది.

శ్వేత ద్వీపమున కేగి అచటి ఆడువారిచేతిలో కీలు బొమ్మవలె వారాడించినట్లెల్ల ఆడిఆడి వారి ముంగల నిస్తేజుడై అభిమానమును కోల్పోయి దిక్కుదోచని దీనస్థితికి చేరాడు. ఈ విషయాలన్నీ రామదూతయైన హనుమంతుడాతనికిట్లు గుర్తు చేశాడు. ఆ! ఎవరెన్ని చెప్పిన అతనికి ఎగ్గా? సిగ్గా?

వాలి సందిట నొక్కించిన వగరు దక్కె-
గా ర్తవీర్యుని కొట్టునం గందు వాతె
నమ్మ గతిమీకిం దెలి దీవి యన్ను లిద్ద
పుండుపై నేడు పొలేరు బొబ్బవాడమె
శ్రీరామకథామృతము సుం.కాం. 3ఆ. 229ప.

కావున వైరం లేకయే రౌద్రము బ్రకటించుట తగదు, అట్టిది దుర్జన లక్షణముగా భర్తృహరి వర్ణించాడు.

కారణము లేని కలహంబు, కరుణలేమి,
పరవధూ పరధనవాంఛ, బంధు, సాధు
జనములం దసహిష్ణుత్వ మనంగ జగతిం
బ్రకృతి సిద్ధంబు లివి దుష్ట నికరమునకు
(ఏనుగు లక్ష్మణకవి)

రామాయణమిట్లు సామాజిక రుగ్మతలను వివరించుచు వానికి పరిష్కారములు సూచించుచు సన్మార్గ నిర్దేశము గావించుచున్నది. అద్దమును చూచి మొగము దిద్దుకొనునట్లు రామాయణమును చూచి మనం బ్రతుకు దిద్దుకొనుట చేయదగి యున్నది.

జీవితం

ఆధునిక యుగంలో జనజీవన విధానాన్ని వివరించే వార్తాపత్రికలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. జ్యోతి స్వరూపమైన ఆ పత్రికారంగం నేడు అన్ని రకాలా అభివృద్ధిచెంది విజ్ఞాన ప్రభకు నిదర్శనంగా రూపుదిద్దుకొంటోంది. దేశ విదేశ వార్తలన్నీ ఉదయాన్నే తలుపు తట్టి వినిపించే మంచి రోజులు వచ్చాయి. అందువల్ల ఈనాడు ప్రపంచ మానవ చరిత్రనే ప్రత్యక్షంగా గమనింప గలుగుతున్నాం.

అయితే ఏ పత్రిక చూచినా ప్రముఖంగా కనిపించేవి హత్యలు, ఆత్మహత్యలు.

జీవితం ఒక ఆటబొమ్మలా భావించి ప్రాణాలతో చెలగాట మాడటం పరిపాటి ఐపోయింది. అంత చిన్న చూపు చూడబడుతున్న ఈ జీవితం నిజానికి చాలా విలువైంది.

హింసాత్మక చర్యలద్వారా ఒకరు మరొకరి ప్రాణం తీయగలరేమో కానీ, మృతుడైన వానికి ప్రాణం పోయటం సాధ్యపడదు. అదే చేతనైతే కుటుంబానికి, సమాజానికి, జాతికి, సంస్కృతికి దేశానికి, ప్రపంచానికి ముఖ్యులైన వారెందరినో మన ప్రాణాలిచ్చి అయినా కాపాడుకోవాలని కోరుకుంటాం. అందుకు సంతోషంతో పూనుకుంటాం. కానీ అవని చెయ్యలేమే? ఇంక అలాంటప్పుడు ఎదుటివారి ప్రాణం తియ్యటానికి అర్హత ఎక్కడిది? కాబట్టి ఏదో కారణంగా హత్యలు చేయటం అమానుషత్వమే అవుతుంది. సిద్ధాంతం పేరుతో ఆవేశ కావేషాలకు లోనై అమాయకులైన ప్రజలను హింసించటం కానిపనియే గాక వ్యక్తి స్వాతంత్ర్యానికి, దేశ సమైక్యతా సమగ్రతలకు తద్వారా ప్రపంచ శాంతికి భంగకరంగా పరిగణింపబడుతుంది. లోక పీడాకరమైన ఈ దుష్టకర్మను విచక్షణులెవ్వరూ చేయరు సరికదా! చేసేవారిని సమర్థింపరు. ఈ అకృత్యాన్ని "లోకపీడాకరం కర్మ న కర్తవ్యం విచక్షణైః" అని రామాయణం ఖండించింది. అట్టి దుష్టులను తీవ్రంగా గర్హించింది.

జీవితం ఒక విధంగా దైవం ప్రసాదించిన వరం. దాని పరిపూర్ణమైన ఆయుర్దాయ ఫలాన్ని అనుభవించటానికి ప్రయత్న పూర్వకంగానైనా ఈ దేహం

కాపాడబడాలి. అటువంటిది ఎవరో క్రూరకర్ముల అకృత్యాలకు బలియై పోవటం అనేది సభ్య సమాజానికి సిగ్గుచేటుగా పరిణమించింది. నాగరకతా ప్రపంచంలో ఈ దుస్థితి దురదృష్టకరంగా భావింపబడుతోంది. అది అటు ఉంచితే, కొందరు క్షణికోద్రేకంలో బలవంతముగా తమ బ్రతుకు తామే చేజేతులా అంతం చేసుకోవటం (ఆత్మహత్య) అవివేకమే అవుతుంది.

తాను నమ్మిన సత్యాన్ని పాటించటం కోసం, తనకు వచ్చిన సిద్ధాంతాన్ని ప్రచారం చేయటం కోసం, తాను మెచ్చిన ధర్మం ఆచరించటం కోసం, తాను బ్రతికి తీరాలి. అందుకే "శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్" అంటాడు కాళిదాసు. కాదని చస్తే తన ఆలోచనలు తనతోనే అంతమైపోతాయి. లోకంలో ఎవరయినా చచ్చిసాధించేది ఏమీ ఉండదు. తన ఆశ తీరాలి, తన ఆశయం నెరవేరాలి అంటే, బ్రతుకు లత కొనసాగాలి, మంచిపూలు పూయాలి, భావపరిమళాలు వెదజల్లాలి జీవన మాధుర్య ఫలాలుపండి, అనుభవసారంతో ఆస్వాద్యయోగ్యత పొందాలి.

ప్రపంచంలో ప్రాణులన్నింటికి ప్రియమైనదేది? అని ప్రశ్నించి, శ్రీ శంకరులు తమ ప్రశ్నోత్తరమాలికలో ప్రాణములే అని సమాధానం చెప్పారు.

ప్రియంచ కింప్రాణినామ్? అసవః, (12 శ్లో) అదే గ్రంథంలో మరియొక చోట, లోకంలో భయహేతువేది? అని అడిగి మరణమొక్కటే అని వివరించారు.

"కస్మాద్భయమిహ? మరణాత్"

వివిధ పరిశోధనల ద్వారా మానవుడు అనంతమైన భౌతిక విజ్ఞాన సంపద సంపాదించి ప్రకృతి శక్తులను వినియోగించుకొంటూ, విజయపరంపరలను సాధించుచున్నప్పటికి మృత్యువును మాత్రం జయింపలేక పోతున్నాడు. అతిభీకరములైన దానికోరల నుండి తప్పించు కొనటానికి ఎన్నో సాధనములను సిద్ధం చేసుకొని, మరి ఎన్నో ఆవరణములను చుట్టూ ఏర్పరచుకొని తాను మృత్యుంజయుడు కావాలని ఆరాటపడుతున్నాడు. పుట్టిననాటి నుండి అందుకే ప్రకృతితో పోరాటం సాగిస్తున్నాడు. ఈ సమస్త విభవమూ తాను బ్రతికి ఉండిన కదా, అనుభవింప గలిగేది. అందువల్ల మానవుడు ఎట్టి పరిస్థితులలోనూ జీవన రంగం నుండి భయపడి పారిపోకుండా, కర్తవ్యతా స్ఫురణతో, లక్ష్యం వైపు నిర్భయంగా పురోగమించాలి.

సర్వసంగపరిత్యాగులై అడవులలో ఉంటూ, ఆకు అలములు తింటూ, మోక్షాసక్తులై, తపోవృత్తితో కాలం గడుపుతున్న ఋషులు సహితం ఒకప్పుడు అవసరమైతే సామాన్య నియమాలను అతిక్రమించి అయినాసరే బొందిలో ప్రాణం విలువ కొన్నారని చెప్పబడింది. కరువుకాలంలో విశ్వామిత్ర మహర్షి ప్రాణరక్షణ కోసం ఒక చోట కుక్క మాంసం తిన్నాడని. ఆ ఆపద నుండి బ్రతికి బయటపడ్డ తర్వాత ఆదోషం పోవటం కోసం తపస్సుచేసి పునీతుడయ్యాడనీ భారతేతి హాసం వివరించింది (శాంతిపర్వము) "బ్రతికియుండిన సుఖములు బడయవచ్చు" అనేది ఈ విషయంగా లోకంలో ప్రసిద్ధమైన ఒక నానుడి "వినాశేబహవోదోషాః జీవన్‌భద్రాణి పశ్యతి" (47-13-5) అని ఈ సత్యాన్నే రామాయణం ఎలుగెత్తిచాటింది.

రావణునిచే అపహరింపబడి, లంకలో అశోకవన మధ్యంలో రాక్షస స్త్రీల నడుమ బందీగా ఉంచబడిన సీత, రామదూత హనుమంతుని ద్వారా అతని క్షేమ వార్తవిని, రాముడామెను కుశలమడిగినట్లు తెలిసికొని, అధికమైన ఆనందాన్ని అను భవించింది. ఇన్నాళ్ళ కష్టాలతో, కన్నీళ్ళతో బ్రతుకు సాగించినందుకు వినదగింది విన్నానని పొంగిపోయింది. "నూరేండ్లు బ్రతికి ఉండి మానవుడు ఆనందమును పొందుతున్నాడు" అన్నలోకోక్తి నాకీసమయంలో స్ఫురిస్తోంది. నాయనా!" అని హనుమంతునితో పలికింది.

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతిమా।
ఏతి జీవన్త మానందో నరం వర్షశతాదపి॥ (6-31-5)

సీత చెప్పిన ఈమాట కల్యాణగాథగా అభివర్ణింపబడింది అంటే అది సత్యమును ప్రతిపాదించు శుభచరితమని అర్థము. ఇట్టి సత్య శుభదాయకమైన చరిత్రయే సమాజమునకు ఆదర్శమై అనర్థములను నివారింపుటకు సమర్థమగునను యథార్థము.

లంకలో రావణుని ప్రలోభములకు, రాక్షస స్త్రీల వత్తిడులకు లొంగని సీత అతని ప్రగల్భములకు బెదరిపోయి తన కిక రక్షణ లేదని నిరాశా నిస్పృహలకు లోనై ప్రాణపరిత్యాగంచేసి ఉంటే రఘువంశము, (రామసుగ్రీవుల మైత్రి కారణంగా) వానరవంశము దుఃఖములపాలై నశించుటయేగాక కట్టె కొట్టె, తెచ్చె, అని చెప్పబడు చున్న సేతుబంధనం, రావణసంహారం, సీతాపరిగ్రహణం జరిగి ఉండేవి కావు అంతటితో రామచరిత్ర అంతమై, ప్రజకు రామరాజ్యమే లభించేది కాదు.

లోక కంటకుడైన రావణుని సంహారమే జరుగకపోతే, ఆనాడు ధర్మసం స్థాపనయే సాధ్యపడేదికాదు. సహనంతో కష్టముల కోర్చి సీత బ్రతికి ఉండటం వలన రామునితో గూడి తాను మహారాణిగా పట్టాభిషిక్తురాలగుటయేగాక జగత్ కల్యాణమునకు హేతుభూతురాలైనది. ఇదంతా పరిశీలించినప్పుడు సీత చెప్పింది అక్షరాలా కల్యాణగాథ అనేది నిజం ఆమెకు శోకాన్ని పోగొట్టి జీవితాశను కల్పిం చిన వాడు హనుమంతుడు. సీతాన్వేషణలో ఇతరులు తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ముకాకుండా చేయటం కోసమై అతడు కర్తవ్యనిష్ఠుడై తుదకు కృతకృత్యుడైనాడు. తొలుత లంకా పట్టణమంతా వెదికి, సీతజాడ తెలియక పోవటంతో ఈ దుర్వార్త మోసుకొనిపోయి తనవారందరికి దుఃఖం కలుగజేయటం ఇష్టం లేక నిష్ప్రయోజనంగా బ్రతకటం కష్టమని ఒక బలహీనమైన క్షణాన ఆత్మహత్య చేసుకొని అక్కడే మరణి ద్దామని సంకల్పించినా, హనుమంతుడు మతి మంతుడైన కారణంచేత తన వివేకం ద్వారా ఆ నిర్వేదాన్ని అధిగమించి తన ప్రయత్నాన్ని సఫలం చేసుకోగలిగాడు. ఉత్సాహపూరితమైన అతని కృషి లోకానికి ఆదర్శమైనిలిచింది. ప్రపంచానికి వెలు గును ప్రసాదించింది.

అనిర్వేదశ్శ్రియోమూల మనిర్వేదః పరం సుఖమ్।
అనిర్వేదో హి సతతం, సర్వార్థేషు ప్రవర్తకః॥
కరోతి సఫలం జంతోః, కర్మయచ్చ కరోతి సః।
తస్మాదనిర్వేద కరం, యత్నం చేష్టేఽహముత్తమమ్ (10,11-12-5)

లోకంలో కొందరు క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడటం జరుగు తోంది. వారు మరణించటం వలన సమస్యకు పరిష్కారం లభింపకపోగా తమపై ఆధారపడిన వారిని, తమను ఆశ్రయించుకొని బ్రతుకుతున్న వారిని అవాధలనుచేసి వీధుల పాలుచేయటమే అవుతుంది. అది వారి అసమర్థతకు నిదర్శనంగా ప్రదర్శింప బడుతుంది.

మనసు సాగరం వంటిది. అందులో ఉద్భవించే ఆలోచనా తరంగాలు అనేకం. తొందరపడి ప్రతి ఆలోచనా అమలు చేయాలని పూనుకోవటం అవివేకమే అవుతుంది నిబ్బరంగా, నిదానంగా ఆలోచించి పరిశీలించినప్పుడు ముందు తానెంత తప్పుగా తలపోసింది అర్థమై చివరకు సిగ్గుపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఆవేశాన్ని అదుపు చేసుకొని తన అభిప్రాయం మార్చుకోవటం వల్ల కానీ, ఆ సమయంలో

మరొక రెవరైనా వెన్నుతట్టి విజ్ఞానాన్ని విశ్వాసాన్ని కలిగించి, ఆపద నుండి తనను కాపాడటం వల్లకానీ, ఆ బలహీనమైన క్షణాలు గడచిపోగా ధైర్యం తెచ్చుకొని, జ్ఞానమణిని సంపాదించుకొని, అవ్యక్తే ఎన్నో మంచిపనులు సాధించి, సమాజంలో ఉన్నతుడవటమే కాకుండా, లోకానికెంతో మేలు చేయగల ఉత్తముడు కూడా కాగలుగుతాడు. ఆ తర్వాత అతనివల్లనే ప్రపంచానికి అనేక ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

హక్కులేని పని చేయటం ద్వారా శిక్ష ననుభవించి నట్లుగానే, ఆత్మ హత్యకు పూనుకోవటంవల్ల ఇహపరముల రెండింటను శిక్షార్హులే అవుతున్నారు.

ఈ విధంగా ఆత్మహత్యాదోషాన్ని పరిహరిస్తూ, ధైర్యాన్ని కలుగజేస్తూ అవరోధాల నన్నింటి నధిగమించి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగల ఆత్మవిశ్వాన్ని చేకూర్చటంలో సమర్థమై, రామాయణం సమాజజీవన దర్పణంగా నిలచి, కలకాలం వెలుగొందుతుం దవటం అతిశయోక్తి కాదు. ఎట్టి విపత్పరం పరలోనైనను నిరాశా నిస్పృహలను ఏ విధంగానూ దరిజేరనీయక ఆత్మ విశ్వాసాన్ని అభ్యుదయ సాధన సంపదను వృద్ధి పొందింప గల ఈ "రామాయణమే" నిజంగా కల్యాణ గాథ. ఇట్టి కల్యాణగాథ కీర్తించి లోకాని కందించిన ఆ మహర్షికి గల సామాజిక స్పృహ కిది నిదర్శన మనటంలో ఎట్టి విప్రతిపత్తి లేదు.

ఎడబాటు

కృష్ణమోహన్ బాగా చదువుకున్నవాడు. ఉన్నతమైన జాతీయ భావాలు కలిగి సంస్కృతి యెడ గౌరవమున్న వ్యక్తి అతడు. తన విద్యార్హతకు తగిన ఉద్యోగం చేస్తూ, కర్తవ్యనిర్వహణలో సమర్థుడని పించుకొని అందరి మన్ననలు పొందగలి గాడు. అతడొక రోజు సాయంత్ర ప్రశాంతం వాతావరణంలో ఒంటరిగా దేవాలయా నికి వెళ్దామని బయలు దేరాడు. అలా వెళ్తున్న అతని మనస్సులో తన చుట్టూ ఉన్న సమాజం గూర్చిన ఆలోచనలు ఒకటి వెంట ఒకటి గుర్తుకురావడం మొదలయినాయి.

మొన్న తన స్నేహితుడు వెంకటయ్యగారి భార్యకు జబ్బుచేసింది. బాధతో ఆమెకు నిద్రపట్టటంలేదు. ప్రక్క కుదరక మంచం మీద మూలుగుతూ తాను అటూ ఇటూ ఇబ్బందిగా మసలుతోంది. ఆయన సహాయ కార్యక్రమాలలో పగలంతా శ్రమించి బాగా అలసిపోయి ఉన్నాడేమో, గురకపెట్టి మరీ నిద్ర పోతున్నాడు. అంటే వారు ఎంత సన్నిహితులైనా ఒకరికి కలిగిన కష్టానికి మరియొకరు బాధపడ టమే తప్ప చేజేతులా దాన్ని తీసివేయ గలగటం కాని, ఒకరి దొకరు పంచుకొని అనుభవింప గలగటం కాని, సాధ్యం కాదని తెలుస్తోంది.

శర్మగారికి మధుమేహం (సుగర్ వ్యాధి) వచ్చింది. ఏ తీపి పదార్థం తింటా నికి వీలులేదు పైపెచ్చు, వరి అన్నం వద్దు గోధుమలే తినమని వైద్యులు గట్టిగా సలహా ఇచ్చారు. హాయిగా తిని తిరిగే అన్ని రకాల వసతులూ ఉన్నా, ఆయనకు కడుపు నిండా తినే భాగ్యం లేదు. ఆయన తినరని ఇంట్లో భార్యా బిడ్డలు, తక్కిన బంధు వులు మానుకో గలరా ? ఎవరు మాత్రం ఎంత కాలం తమ కోరికలు చంపుకుం టారు ఎవరి కోసం ఎవరు తమ అభిరుచులు మానుకుంటారు. "ఆయన అదృష్టం అంతే" అనుకున్నారు. ఆ మర్నాటి నుండి ఇంట్లో అన్ని వంటకాలు యథాప్రకారం వండు కొని తింటున్నారు.

అవతల వీధిలో ఉండే సుధాకర్ ఈ మధ్యనే చనిపోయాడు. సన్నిహితు లంతా ఏడ్చారు. అయినవారు నెత్తి నోరు బాదుకున్నారు. బంధువులు, మిత్రులు ఊళ్ళో తెలిసినవారు అంతా తమ సానుభూతిని తెలియజేసారు. సంతాపం వెలి

బుచ్చుతూ సంస్మరణ సభలు నిర్వహించారు. సరే ఆ తర్వాత అంతా మామూలే కాకపోతే పోయినవారితో పాటు మిగిలినవారు పోతారా? తినటం, త్రాగటం పాలించు కొంటారా? ఆ మధ్య సుబ్బయ్యగారు తన భార్య పోతే ఏడాది తిరగ కుండానే బిడ్డలకు తల్లి కావాలని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు ఈ సారి మరో ఇద్దరు పిల్లల్ని కన్నాడు.

రామయ్యగారికి మొదటిగా మగ బిడ్డ పుట్టాడు. చక్కగా పెరిగాడు. ఇంట్లో వాళ్ళకు, ఇరుగు పొరుగువారికి కూడా నిత్యం అతని ముచ్చటే. ఆ ముద్దు మురిపాలతో తల్లిదండ్రులు సర్వమూ మరచిపోయారు. అతడు పుట్టిననాటి నుండి తమకు అన్ని విధాలా కలిసివచ్చిందని కూడా సంతోషించారు. రోజులు సాఫీగా గడిచిపోతున్నాయి. ఇంతలో ఒకనాడు ఆ కుర్రవాడికి విపరీతమైన కడుపు నొప్పి వచ్చి భూమి మీద నూకలు చెల్లి పోవటంతో అతడు శాశ్వతంగా కన్ను మూశాడు. అతనికి ఐదేండ్లకే నూరేండ్లు నిండిపోయాయి.

అదెయ్యకు జన్మస్థలంలో (పల్లెటూళ్ళో) చక్కని ఇల్లు, వాకిలి ఉన్నాయి. అతడు వృత్తిరీత్యా ఈ పట్టణంలో ఉంటూ చిన్న అద్దె ఇంటిలో కాలం గడుపుతున్నాడు. అలాగే సూరికి అదేదో ఊర్లో నూరెకరాలదాకా పొలం ఉంది. దగ్గర ఉండి వ్యవసాయం చేసుకోలేక పోవటం వలన ఆ చుట్టు ప్రక్కల వాళ్ళు తలా కాస్తా ఆక్రమించుకొని, సాగుచేసి ఫలసాయం అనుభవిస్తున్నారు. తాను మాత్రం నెల నెలా బియ్యం కొనుక్కొని చాలీచాలనీ జీతంతో జీవనం గడుపుతున్నాడు. ఎప్పటి కెవరి కేది ఎంత ప్రాప్తమో చెప్పలేం. ఇదంతా చూస్తుంటే, ఆలోచిస్తుంటే చాలా విచిత్రమని పిస్తుంది.

కృష్ణమోహన్ ఈ విధంగా ఆలోచిస్తూ, ముందుకు వెళుతున్నాడు. అతని ఆలోచనలు తెగటంలేదు. సమాధానం దొరకటంలేదు. భౌతిక సంపద అన్నింటిలో ధనానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే కాబోలు "ధనం మూల మిదం జగత్" అంటారు. లోకంలో ఏ పని చేయాలన్నా డబ్బుకావాలి. "డబ్బు లేనివాడు డుబ్బుకు కొఱగాడు" ధనంలేని జీవనం జనానికి దుర్భరం. సంపద అందరికీ అవసరమే. అయితే అది అధికంగా సంపాదించాలని ఆరాట పడటమే అన్ని అనర్థాలకూ మూలం. నిత్యావసరమైన డబ్బెవరికీ చేదుకాదు కాని, అదే మానవునికి సర్వస్వం

అనుకోవడంతో ప్రమాదం ఏర్పడుతోంది. బ్రతకటానికి ధనమొక్కటే ముఖ్యం కాదు. అది ఒక సాధనం మాత్రమే అవుతుంది. ఈ సంపదవచ్చే రోజున కొబ్బరి కాయలోనికి నీళ్ళ వలె ఎవరికీ చెప్పకుండానే వస్తుంది. పోయే రోజున ఏనుగుతిన్న వెలక్కాయలా తెలియకుండానే హరింపబడుతుంది. (సుమతీశతకం)

జీవితంలో నానా కష్టాలుపడి, ఎంత ధనం కూడ బెట్టినా అది తన వెంట వస్తుందని కాని, తరతరాల వరకూ శాశ్వతంగా నిలుస్తుందనికాని చెప్పటానికి వీలు లేదు స్వభావంచేత ధనం చంచలమైంది. అది ఎన్నో చేతులు మారుతుంది. కాలగమనంలో ఉన్నవాడు లేనివా డవుతాడు, లేనివా డున్నవా డవుతాడు. "ఓడలు బండ్లవుతాయి, బండ్లోడ లవుతాయి" అన్నది నిండైన నిజం. ఒకప్పుడు వారి స్థితుగతులు తారుమారై పేదవాడు రాజవుతాడు. రాజు పేదవాడవుతాడు. ఇందుకు ప్రపంచ చరిత్రలో ఎన్నో కుటుంబాలు, సమాజాలు, రాజ్యాలు ఉదాహరణగా మనకళ్ళ ముందు నిలుస్తాయి. అయినా అన్నీ తెలిసిన మానవులే చేయరాని పనులెన్నో చేస్తున్నారు.

ప్రతిప్రాణి భౌతిక సంబంధంగా ఈ భూమి మీదపడుతుంది. ఇందుకు కారణాలనేకం. ప్రకృతి శక్తులను ప్రోదిచేసుకొని, అది క్రమంగా వృద్ధిపొందుతుంది వివరణ నశిస్తుంది. ఇది జీవలక్షణం. ఏ బంధమూ ఇక్కడ శాశ్వతం కాదు బాగా ఏపుగా పెరిగిన పైరు నిలువలేక నేలమీద చాపకట్టగా ఒరిగి పోతుంది. ఇదే విధంగా ప్రకృతిలో మనమెన్నింటినో చూడగలుగుతాం.

ఏ జీవితమైనా మరణంతోనే అంతమౌతుంది. ఈ ప్రకృతిలోనే లీనమవుతుంది. పుట్టి మనకు బుద్ధి తెలిసిన తర్వాత మనకంటే వృద్ధులేకాక, మన తోటి వారు మనకంటే చిన్నవారు, ఎందరో కన్నుమూయటం చూస్తూనే ఉంటాం. "సింద లేందే బొంది పోదని" అందుకు ఏదో ఒక నిమిత్తాన్ని వెతుక్కొని సరిపుచ్చుకుంటాం. ప్రకృతి వైపరీత్యమో రోడ్డు ప్రమాదమో, జబ్బు చేయటమో, జ్వరం రావటమో ఈ విధంగా మరణం ఏ రూపంలోనైనా సంభవించవచ్చునని, ఎవరికైనా ఆ మృత్యువు అనివార్యమని తెలిసి తమ కళ్ళ ముందు నిత్యం జరిగే అనేక సంఘటనలు చూసి తాము మాత్రం శాశ్వతంగా ఉంటామనే ఆలోచనలోనే మునిగిపోయి ఆ భ్రమలోనే పడి కొట్టుకు పోవటం జరుగుతుంది. ఇదే లోకంలోని గొప్ప వింత. (భారతం-యక్షప్రశ్నలు) జీవితం రైలు ప్రయాణం వంటిది. అవసరాన్నిబట్టి ఖాళీ

లేకపోయినా ఎక్కి పోతూనే ఉంటాము. ఎవరి స్టేషన్ వస్తే వారు దిగిపోతారు. ఎవరికోసం ఎవరూ ఆగరు, ముందుకు సాగిరారు.

సమాజ జీవితంలో బంధుమిత్రులు మొదలగు వారెందరితోనో మనం సంబంధం కలిగి ఉంటాం. స్థితిగతులను బట్టి క్రమంగా విడిపోతుంటాం. అందులో మనం కొందరి స్నేహాన్ని, సంబంధాన్ని కావాలని కోరుకుంటే, మరికొందరు పని గట్టుకొని మనతో స్నేహ సంబంధాలు పెంపొందించు కోవటానికి ప్రయత్నిస్తారు. సైకిల్ గొలుసులో లింకులు వంటిదీ ప్రకృతి సంబంధము

నదిలో ప్రవాహవేగాన్నిబట్టి గడ్డి పరకలు, కర్రపుల్లలు ఇంకా ఏవేవో కలసి కొంతదూరం పోయి తర్వాత ఏదో కారణంగా విడిపోవడం జరుగుతూ ఉంటుంది. (రామాయణం) నాలుగు బజార్లు కలిసే కూడలిని కేంద్రం అంటారు (center-చౌరస్తా) వేసవికాలంలో అక్కడ చలివేంద్రం ఏర్పాటు చేస్తారు. అక్కడికి అన్ని వైపుల నుండి జనంవచ్చి నీరుత్రాగి, కొంతసేపు సేదదీర్చుకొని మళ్ళీ ఎవరి త్రోవన వారు వెళ్ళిపోతూ ఉంటారు. (భాగవతం) ఇదీ అంతే.

ఈనాడు భౌతికంగా ఒకే కుటుంబంలోని వ్యక్తులుకూడా విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం మొదలగు జీవనోపాధులైన వివిధ వృత్తుల కారణంగా అనేక ప్రాంతాలలో ఉంటూ పెళ్ళి, పేరంటం, పండుగ, పర్వం మొదలగు సందర్భాలలో ఒకే చోటచేరి కలసిమెలసి కొంతకాలం ఉన్నా మళ్ళీ దూరంగా వెళ్ళి పోవటం జరుగుతోంది. ఒకే రక్తం పంచుకుపుట్టిన బిడ్డలైనా ఎవరి ఆలోచనవారిది, ఎవరి జీవనమార్గం వారిది. ఎవరి సుఖ దుఃఖాలు వారివి. అందులో హృదయం స్పందించిన వారు తోటివారిని గూర్చి సానుభూతి ప్రకటించగలరే కాని ఒకరి సుఖ దుఃఖము లొకరు అనుభవింపలేరు. తేనెతీపి, వేపచేదు తిన్నవారికే తెలుస్తుంది ప్రక్క నుండి చూస్తున్నవారికి, దూరాన ఉండి వింటున్నవారికీ తెలియదు కదా! ఇలా ఆలోచిస్తూ కృష్ణమోహన్ దేవాలయంలోకి ప్రవేశించాడు. అక్కడ (ముఖ) ముక్తి మండపంలో ఎవరో పెద్దలు పురాణం చెప్తున్నారు.

"రాగద్వేషములకులోను గాక ప్రజాపాలన చేయటం తెలిసిన రాజుగా రాముడు శ్రీమద్రామాయణంలో కీర్తింపబడ్డాడు. రావణ సంహారంచేసి సీతను పరిగ్రహించేంతవరకూ అతడు సీతారాముడు. అయోధ్యలో పట్టాభిషిక్తుడై రాజ్యమును పాలించటం మొదలిడిన నాటి నుండి ప్రజారాముడు. అంటే అతడు

వ్యక్తిగత బాధ్యతలతోడు సమాజ బాధ్యతలను గూడా అదనంగా స్వీకరించాడన్న మాట. ఒక్కొక్కప్పుడు సమాజ భద్రత కోసం వ్యక్తిగత సుఖం త్యాగం చేయవలసిన సందర్భం వస్తుంది. అట్లా చేయగలగటం ఉత్తమ నాయకత్వం అవుతుంది. ప్రజలకు రాజే ఆదర్శం (యథా రాజా తథా ప్రజా) కావడంచేత ప్రజాపవాదం సహించని రాముడు సీత నడవులకు పంపించాడు అబద్ధ మాడటమే ఇష్టపడనివారికి అపవాదు భరించటమంటే కష్టమే కదా। పరిస్థితి అర్థంచేసుకొని అర్ధాంగిగా తనకూ ఆ బాధ్యత ఉందని సీతయే స్వయంగా అంగీకరించి ఆ విషయంలో భర్తకు సహకరించింది." అపవాద సముత్థితమైన పలుకెదియు నీకు వచ్చెనా। యది నాకున్ సుపరిహరమ కదె? రాఘవనృపతీ! పరమగతివీవె నీ సతి కగుటవ్ (శ్రీరామ కథామృతము ఉ.కాం ఉ భా 2ఆ. 207 ప) అడవులకు పంపినంత మాత్రాన సీత మీద నిజంగా ప్రేమలేనివాడు కాదు రాముడు. ఆమె వాల్మీకి మహర్షి ఆశ్రమం చేరదగినట్లుగా గంగాతీరంలో విడువబడింది. ఆమె ఆ ముందు రోజే ఆ ప్రాంతంలోని మున్యాశ్రమములు చూడాలని రాముని కోరడం జరిగింది. ఆ తరువాత భర్తగా ఆమె సౌశీల్యాన్ని, సౌజన్యాన్ని తలచుకొని ఎంతగానో విలపించాడు. ఆ వియోగ దుఃఖాన్ని భరింపలేక విహరించాడు. అది అతని వ్యక్తిగతమైన సమస్య. ప్రజలను పరిపాలించటంలో ఒక విధమైన అబాధనాభావం ఉండాలి. ఆ ఉపాసనా విధానానికి తమవైన ఆత్మీయతానురాగ బంధాలు అడ్డుకాకూడదు. నైతిక విలువలు లోపించిన ఈనాటి రాజకీయ వాదులను కొలబద్దలుగా తీసుకొని రాముని ఆక్షేపించటం అవివేకమే అవుతుంది.

రాముని కింపు నింపు జనరంజన మొక్కఁడె యంత కెక్కుఁడౌ
రామములేని భూసుఖపరంపరలే ననుజన్మలేని స్నే
హామర తోక శౌచ కరుణాదికమేని మహీజయేనిఁగా
రామెయిఁ బ్రీతిసేయవటె? ప్రాణము లన్నెములెన్న నేటికిన్

శ్రీరామ కథామృతము ఉ.కాం. ఉం.భా. 1ఆ 221 ప.

రాముని ఆజ్ఞప్రకారం సీత నడవిలోదించి వచ్చిన లక్ష్మణుడు ఆ విషయం అన్నతో విన్నవించటానికి వచ్చినప్పుడు రాముడు బోరున ఏడుస్తుంటాడు. ఆ విధంగా బాధపడుతున్న రామునిచూసి అతడు ఓదారుస్తాడు. లోకం యొక్క స్వభావాన్ని వివరించి, మనసు నిగ్రహించుకోమని అతనికి కర్తవ్యాన్ని గుర్తుచేస్తాడు.

దుఃఖంలో ఉన్నప్పుడు ఎంత పెద్దవాడైనా దిక్కుతోచక విచార గ్రస్తుడవుతాడు. ఇక్కడ అవతార పురుషుడికీ ఇదే పరిస్థితి ఏర్పడింది.

అయితే వివేకి తొలుత కొంత దుఃఖం అనుభవించినా, అంతలో యథార్థాన్ని గుర్తించి నిగ్రహంతో తన్నుతాను అదుపుచేసుకొని ఒడ్డుకు చేరుకుంటాడు. మూర్ఖుడు ఆ దుఃఖ సముద్రంలోనే మునిగి నామరూపాలు కోలుపోతాడు. బంధ మోక్షములన్నింటికి మనసొక్కటే కారణం (మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః) ఆ మనసు నిలుపుదల చేసుకోలేనినాడు మనుగడయే సాధ్యం కాదు అందువల్ల ఏ విషయంలోనూ అతి ప్రసంగం (over atachment) పనికిరాదు. ఆ విషయమే అన్నకు లక్ష్మణుడిట్లా వివరించాడు.

సర్వే క్షయాన్తా నిచయాః, పతనాన్తా స్సముచ్ఛ్రయాః।
సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్॥
తస్మా త్పుత్రేషు దారేషు, మిత్రేషు చ ధనేషు చ।
నాతి ప్రసంగః కర్తవ్యో విప్రయోగో హి తై ర్ధ్రువమ్॥
వా.రా. ఉ.కాం. 53స. 11.12 శ్లో

"ఒకచోట చేరిన సిరిసంపదలు కరిగి తరిగి పోతాయి. ఉన్నతంగా పెరిగినవి విరిగి నేలపై పడిపోతాయి. కూడినవారు విడిపోతారు. పుట్టినవారు మరణిస్తారు. అందువల్ల ఏరకంగానూ వియోగం తప్పని దారాపుత్రాదుల యందు కాని, బంధుమిత్రుల యందు గాని, ఇండ్లు, వాకిళ్ళు, పొలాలు, స్థలాలు, ధనం, బంగారం, మొదలగు స్థిర చరములైన ఆస్తుల యందుగాని అధికమైన ఆసక్తి పెంచుకోకూడదు. ఏదో ఒకనాడు ఏ కారణంగానైనా వీటన్నింటితో వియోగం తప్పదన్నది పరమ సత్యం". ఇది ఇందులోని సారాంశం.

అదివిన్న రాముడు వివేకంతో దుఃఖాన్ని దిగమ్రింగుకొని,, ప్రజారంజకంగా పాలనచేస్తూ, ప్రజాక్షేమాన్నిగోరి అనేక క్రతువ్రతములైన ధర్మకర్మములు ఆచరించి తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాడు. రాముడు కేవలం రాజ్యకాంక్షతో, పదవీ వ్యామోహంతో సీత అడవులకు పంపించాడని భావించటంలో సమంజసంలేదు ధర్మంకోసం ఈ రాజ్యభోగాలన్నింటిని విడిచి అడవులకు నడచిన నాడు రాముడేమాత్రం బాధపడలేదన్నది విమర్శకులు గమనించాలి. ఈగతి, మహిత చరిత్రుడైన ఆ రాముడు మాన్యుడై జగమున మన్నలు పొందగలిగాడు"

అని పౌరాణికుడు రామకథ చెప్పి, ఇంకా ఈ విధంగా వివరించాడు అందువల్ల మొదటి నుండి ఏ విషయంలోనూ వ్యామోహం పెంచుకోకూడదు. ఏ సంబంధమైనా బాధ్యతగానే స్వీకరించి, నిర్వహించాలిగాని, బ్రతుకు దానితోనే ముడివేసుకొని అదిలేనినాడు తాను నిలువలేననే వ్యథ చెందరాదు. ఈ లోకంలో సంసారానికి సంబంధించిన అన్ని విషయాలలోనూ పాలు పంచుకుంటూ ఉంటూనే దేని యెడలా అధికంగా మమకారాన్ని పెంచుకోకుండా మెలగటం ఉత్తమ లక్షణం. ఈ విద్య ఒకే రోజున వచ్చేది కాదు. ప్రయత్న పూర్వకమైన నిరంతర - అభ్యాసం ద్వారా అలవర్చుకోవాల్సిందే అనాటి జనకాదులైన రాజర్షులు వాల్మీకి వ్యాసాదులైన మహర్షులు, ఇటీవలవారైన విద్యారణ్యస్వామి, సమర్థరామదాసు అన్నమయ్యవంటి సాధు పుంగవులు లౌకికంగా ఉంటూ అలౌకికాన్ని, అలౌకికంగా ఉంటూ లౌకికాన్ని సాధించారు ఆత్మోద్ధరణతోబాటు జగద్ధితాన్ని సమకూర్చారు.

తామరాకు మీద నీటిబొట్టు ఉంటుంది. అక్కడ ఉన్నంతసేపూ అది ముత్యంలా మెరిసిపోతుంది. ఏ క్షణంలోనైనా, ఏ కారణం చేతనైనా అది జారిపోవచ్చు. నీటి బొట్టు ఆకును విడిచి నీటిలో కలిసిపోవటమంటే ఈ పాంచభౌతికమైన శరీరం పంచభూతాలలో చేరిపోవటమన్నమాట. (గాలి గాలిలో, నీరు నీరులో నిప్పు నిప్పులో, మట్టి మట్టిలో, ఆకాశం ఆకాశంలో ఇమిడిపోతాయి)

ఈ ప్రకృతిలోని అన్ని బంధాలు ఋణాను బంధాలై ఉంటాయనేది సత్యం. ఆ ఋణం తీరిననాడు అన్నీ మనకు దూరమౌతాయి. అందుకు బాధపడవలసిన అవసరం లేదు.

ఋణాను బంధ రూపేణ పశుపత్ని సుతాలయః।
ఋణక్షయే క్షయంయాన్తి కాతత్ర పరివేదనా॥ (శ్రీ శంకరులు)

ఆ కారణంగా మానవులు "దీపముండగానే యిల్లు చక్కబెట్టు కొమ్మన్నట్లు" శరీరావయవములన్నీ స్వాధీనంలో ఉన్నప్పుడే మెలకువతో మెలగి, ధర్మకర్మల ద్వారా పుణ్యం సంపాదించి మోహబంధముల నుండి ముక్తిని పొందవలసి ఉంటుందని హెచ్చరించి "లోకా స్సమస్తా స్సుఖినో భవంతు" అని ప్రపంచానికంతటికి తన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పౌరాణికుడు అనాటి ప్రవచనానికి స్వస్తి పలికాడు. శ్రోతలు అయన వ్యాఖ్యానం చేసి తీరు బాగుందని అందులోని విశేషాలు పరస్పరం వివరించుకొంటూ దైవ దర్శనానికి వెళ్ళిపోయారు.

ఇంటికి తిరిగివెళ్తున్న కృష్ణమోహన్‌కు ఈ పురాణ శ్రవణం వలన ఇంతకు ముందు కలిగిన సందేహాలకు సమాధానాలు లభించాయి. మనస్సుకెంతో సంతృప్తిని సమకూర్చాయి.

ఈ తత్త్వ చింతనయే భారతీయ సంస్కృతికి మూల కందం. ఈ భావనయే లేనినాడు ప్రపంచంలో మానవులకు శాంతిలేదు. ధనాదులే శాశ్వతమైతే, వాటితోనే మానవుడు సంతృప్తి చెందగలిగితే, మన కంటే అన్ని విధాలా అధికమైన భౌతిక సంపదలుండి అనేక సౌకర్యాలు, సౌఖ్యాలు కలిగిఉన్న పాశ్చాత్యులు ఈనాడు ప్రశాంతి కోల్పోయి, నిరంతరం సంఘర్షణలతో సతమతమవటం జరుగదు. "దూరపు కొండలు నునుపు" అన్నట్లు ఆయాదేశాలపట్ల మనకున్న అలోచనలు వేరు, అనేక బాధలు, గాథలు (హత్యలు, ఆత్మహత్యలు) కలిగిన అచటి యథార్థంవేరుగా ఉంది. శాంతితోగూడిన సహజీవనాన్ని కోరుకొంటూ, అణుయుద్ధాన్ని నిలుపుదల చేయాలని ఆకాంక్షిస్తూ, వారంతా ఈ భారతీయ సంస్కృతియెడ అభిమానాన్ని పెంచుకొని ఇందుకు ఆధారాలైన ఆర్ష గ్రంథాలను ఆదరిస్తున్నారు. అందులో వివరింపబడ్డ శాశ్వత సత్యాలను వివిధ పరిశోధనలద్వారా నిరూపిస్తున్నారు. సుఖభోగాను భవానికి అవసరమైన శరీరంతోబాటు మానవునిలో ఉన్న మనస్సు, బుద్ధి, ఆత్మలయొక్క ఉనికిని కనిపెట్టి, వాని వికాసానికి కావలసిన విజ్ఞానాన్ని ప్రసాదించి, బహిరంతరంగ సౌఖ్యములకై దోహదపడటం ఆ గ్రంథముల ప్రత్యేకతగా గుర్తిస్తున్నారు.

కృష్ణమోహన్‌కు ఈ విధమైన సమన్వయం కుదరటంతో భారతీయ ఋషులయెడ భక్తి భావం ఇనుమడించింది. వారి వాక్కులయెడ ప్రామాణ్య బుద్ధి ఏర్పడింది. వారిని తలచుకొని మనస్సులోనే కృతజ్ఞతతో నమస్కరించాడు. భారతీయుడిగా పుట్టి వారి వారసత్వాన్ని పొందినందుకు తానెంతో సంతోషించాడు.

ఈ విధంగా "రామాయణం-సమాజదర్పణం"గా ఉండి ప్రశాంత జీవిత వాతావరణాన్ని కల్పించుకొనేందుకు స్ఫూర్తినిస్తూ "విశ్వశాంతి"కి మార్గదర్శనం చేస్తుందనటం సత్యదూరం కాదు.

> కలికి! తెక్కలురావి పిల్లలను సొకన్ గూటిలో నుంచి మే
> తలకై పోతొక చెంత(బెంటి యొక చెంతన్‌వాలు నీ లోన(బి
> ల్లల(బామే గ్ర సియించునో వలల పాలన్ జిక్కునోపుల్గు లీ
> ఱులకై (బ్రాణులకున్ వియోగమగుచో నెవ్వారి కెవ్వారలో

అవకాశవాదం

ప్రకృతిలోని జీవరాశులలో తఱచుగా రంగులమార్చే ప్రాణి "ఊసరవెల్లి" అని వింటాం. బాగాబలిసిన తొండనే జంతుశాస్త్ర విజ్ఞాన వేత్తలు ఊసరవెల్లి అంటారు. అది దాని నైజగుణం. అయితే మానవులలో కూడా కొందరు తమ కొక సిద్ధాంతమనేది లేకుండా అవసరాన్నిబట్టి వర్గాలు (పార్టీలు) మార్చటం రాజకీయ రంగంలో ఎక్కువగా చూడగల్గుతాం. అది వారి విచిత్ర ప్రకృతి. చూస్తున్నకొద్దీ అసలు ఈ ప్రపంచమే ఒక వింత వస్తు ప్రదర్శనశాలగా తోస్తుంది. అన్ని రసములు అందులో చోటు చేసుకుంటాయి. కొన్నింటిని చూస్తుంటే నవ్వు వస్తుంది. కొన్ని జాలి కొలుపుతాయి. మరికొన్ని ఆసక్తిపెంచి, ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఇంకా కొన్ని ఆనంద హేతువులవుతాయి.

నిత్య జీవితంలో ఏ మనిషి దగ్గఱ ఆ మనిషి మాటలు చెప్తూ ప్రతి పదం లోనూ ఇంద్రజాలాన్ని సృష్టించి, తమ మాయలను ప్రదర్శించే వారిని సమాజంలో తఱచు గమనిస్తూనే ఉంటాం. నిలకడలేని వీరు ఏ ఎండకాగొడుగు పట్టి తమ పబ్బం గడుపుకోవటానికి ప్రయత్నిస్తారు. దీన్నే పెద్దలు అవకాశవాదంగా పేర్కొనటం కద్దు. వీరు సాగినంతవరకు తమ ప్రభ బాగానే సాగించుకుంటారు. పట్టపగ్గాలు లేకుండా విశృంఖలంగా విహరిస్తారు. నిరంకుశంగా ప్రవర్తిస్తారు. ప్రపంచానికంతా మేమే నియంతలమని అహంకరిస్తారు. ఆ సమయంలో వారి కళ్ళకేదీ కనబడదు. చెవులకేదీ వినబడదు. అంటే కళ్ళుండీ గ్రుడ్డివారు చెవులుండీ చెవిటివారు అవుతారన్నమాట. అధికార మదంతో నోరుండీ మంచి మాట్లాడలేని మూగవారుగా కూడా అవుతారు.

ఈ దుర్జనులు బలవంతులై ఇతరులను హింసించటం ద్వారా ఆనందిస్తారు. ఎదురు లేనంతవరకు తమకు తిరుగు లేకుండానే వ్యవహారం జరుపుకుంటారు. తమ కంటే బలవంతులైనవారు ఎదురు తిరిగి నిలబడితే మాత్రం దుర్బలులై వారికి లొంగిపోతారు. లొంగిపోతారు, ఇదీ లోకం పోకడ "తాడిని తన్నేవాడుంటే వాడి తల దన్నేవాడు వేరొకడు ఉంటాడు" కదా!

ఇంక లోకంలో తమను తామే ఉన్నతులుగా సంభావించుకొనేవారు, (over confidens) తమ పతనానికి తామే గొయ్యి త్రవ్వుకున్న వారవుతారు. ఇట్టి విషమ బుద్ధి నెఱిగి సమాజంలో కొందఱు ఈ దుష్టునితో మనకెందుకని ఉదాసీన భావంతో ఒదిగి ఉంటే, మరికొందరు వారి దౌర్జన్యానికి భయపడి ప్రక్కకు జరుగుతారు. అనువుకాకపోతే వీరిని విడిచిపెట్టి దూరంగా వెళ్ళిపోతారు. ఇంకొందరు వీరిని ప్రతిఘటింపగల ధైర్యం, స్థైర్యం కలిగి కూడా వీరితో తలపడటం పనిదండుగగా భావించి తమ కృషిలో ముందుకు సాగిపోతూ ఉంటారు. ఒక్కొక్క సందర్భంతో వారి తాత తండ్రుల యందుండే గౌరవం చేత (వారు పూర్వం తమకో, తమ వారికో చేసిన మేలు తలచుకొని) కొందరు ఆ దుర్మార్గుల దౌష్ట్యాన్ని సహిస్తారు.

ఏది ఎట్లా జరిగినా అదిఅంతా తాము సాధించిన ఘన విజయంగానే ప్రకటించు కోవటమనేది ఆ దర్శనులకు సైజంగా అనిపిస్తుంది. ఆ స్థితిలో చూచేవారికి మాత్రం వారి జీవితం పరిహాసాస్పదంగా తోస్తుంది. ఎట్టి పరిస్థితులలోనూ దురభిమానంతో ప్రవర్తించటమే వారికి పరిపాటి. అంటే క్రింతపడ్డా తమదెయ్యే మీదుగా ఉందని వాదించటం వారి దుస్స్వభావానికి చిహ్నం. ఇట్టి వారి దుష్ప్రవర్తన నీతి నియమాలకు దూరమై లోకానికి బాధాకరంగా పరిణమించటం కద్దు. ఖలుని విద్యా ధనములు, శక్తి సంపదలు ప్రాణికోటికి ప్రమాదభరితములై వినాశ హేతువులవుతా యన్న ఆర్యోక్తి ప్రత్యక్షర సత్యం. సాధువుల ప్రవృత్తి అందుకు భిన్నంగా ఉంటూ అన్ని విధాలా అవి సమాజ అభ్యుదయానికి సహకరిస్తాయి.

రామాయణంలో సాధుస్వభావుడైన రాముని చరిత్రతోబాటు కష్టచరితుడైన రావణుని జననాది విశేషాలు కూడా (ఉత్తరకాండ) వివరింపబడ్డాయి. అందులో రాముడు నాయకుడు. రావణుడు ప్రతినాయకుడు. "ప్రతినాయకుని ఔద్ధత్యాన్ని వివరించి, అంతటి వానిని సంహరించిన నాయకుని ఔన్నత్యాన్ని వర్ణించడం, అతని ఉదాత్తతను నిరూపించటం, కథా కథన నైపుణ్యమని అది కావ్యశిల్పంలో ఒక భాగమని" సతత సాహిత్యాధ్యయన శీలురైన పెద్దలు (ధ్వన్యాలోకం) చెప్పారు.

విశ్రవోబ్రహ్మకు రాక్షసకాంతయైన కైకసి యందు రావణాదులు పుట్టారు. రావణుని జననకాలంలో దుశ్శకునము లనేకం చూపట్టాయి. ప్రకృతి కలత చెందింది. పది ముఖములు, ఇరువది చేతులు కలిగిన అతని ఆకృతియే వికృతంగా తోచింది. కావుననే అతనికి దశముఖుడని పేరు పెట్టారు. పెరిగి పెద్దవాడైన తర్వాత తన

దుశ్చర్యల ద్వారా లోకమును బొబ్బపెట్టించినవాడు కావుననే ("రావయ తీతి రావణః" అను వ్యుత్పత్తినిబట్టి) అతడు రావణుడని పిలువబడ్డాడు.

రావణుని తండ్రికి భరద్వాజ ముని కుమార్తెయైన 'దేవవర్ణిని' యందు కలిగినవాడు కుబేరుడు. సవతుల సంతానమైన కుబేర, రావణులిద్దరు దాయాదులు.

జ్ఞాతివైరమును వహించి రావణుడు గోకర్ణక్షేత్రంలో తపస్సుచేసి, అమోఘములైన బ్రహ్మవరములను సంపాదించాడు. బలహీనులైన నర,వానరులు తనముందు నిలువలేరు, ఇంక ఇతరులవల్ల తనకు చావులేదు. తన విద్యాబలములకు పరమేష్ఠి, వర ప్రభావంతోడుకాగా తనబంధు వర్గమును కూడగట్టుకొని దౌష్ట్యంతో లోకములను బాధింప మొదలు పెట్టాడు.

పితృదత్తమైన లంకా పట్టణాన్ని పరిపాలిస్తున్న, అన్నయగు కుబేరుని తన్ని, తరిమి రావణుడు ముందుగా లంక నాక్రమించుకొన్నాడు. అతని పుష్పక విమానాన్ని బలవంతంగా అపహరించాడు, ఇంక అతనికి తక్కిన లోకాలన్నీ జయించాలనే కోరిక కలిగింది. మొదటగా యజ్ఞం చేస్తున్న మరుత్తుని ఢీ కొంటే అతడు బ్రహ్మవరములను తలచి ఊరుకున్నాడు. అయోధ్యాధిపతి అనరణ్య మహారాజును వధించి, ఆ తర్వాత యమునితో ద్వంద్వ యుద్ధానికి తలపడ్డాడు. యముడు బ్రహ్మమాటకు భంగం కలుగకుండ అతని అభిప్రాయము ననుసరించి రావణునిపై కాలదండాన్ని ప్రయోగింపక తా నదృశ్యు డయ్యాడు. రావణుడు అంతటితో తన విజయాన్ని ప్రకటించుకొన్నాడు. రసాతలంపై దండెత్తి దాన్ని జయించాడు నివాతకవచులగు రాక్షసులతో యుద్ధంచేసి కడకు వారితో సంధి చేసుకొన్నాడు. ఇందు ఇరువర్గముల వారికీ బ్రహ్మవరము లిచ్చాడు. వారిరువురిలో ఎవరు చెడినా తన వరం చెడుతుంది కావున బ్రహ్మయే స్వయంగావచ్చి వారికి సంధికుదిర్చాడు. తర్వాత రావణుడు కాలకేయాది రాక్షసులతో యుద్ధంచేసి వారిలో అధికుడైన విద్యుజ్జిహ్వుని బావమరిది అనియైనా తలంపక చంపి, చెల్లెలు శూర్పణఖకు వైధవ్యాన్ని తెచ్చిపెట్టాడు. లోకంలో సామాన్యంగా ఏ అన్నా అయినా చెల్లెలికి పసుపు, కుంకుమ చీరె, సారె తెస్తాడు. యుద్ధోన్మాదియైన రావణునియెడ "బావమరిది బ్రతుకు కోరు తాడనే" మాట వ్యర్థమై పోయింది. వివేక రహితమైన అతని దుశ్చర్యకిది ఫలితం కాగా, శూర్పణఖ అనేక విధాల రావణుని నిందించింది నిష్ఠురోక్తు లాడింది.

వీరులు లేరె యెందు? ప్రతివీరులపై(జనరో? జయింపరో?
ఈరసమెత్తి నీవలె నికృష్టత(జెంది, మఱంది నొంపిరో?
భారతినీకు మాపగల బోటులులేవె? మహోగ్ర పాపముల్
దూఱునుసైచి, నా బ్రతుకు ద్రుంగగ(జేసితి వేమి సేయుదున్

"పరులొవరించు పాపముల(బాపి హితాశ్రిత బంధుకోటి(ద
త్పరమతి బ్రోవనొప్పు "దని బాంధవులందఱు నమ్మియున్నచో(
గరుణ దొలంగి, నీతియును గాంచక. వారల నీవ త్రుంప నె
వ్వరునిను "నౌను" "గా" దనెడు వారు, నిశాచర చంద్ర(యీ యెడన్
బలియురగు దొరలు తమగా - దిలి చెల్లెండ్రకు ధనంబు(దెత్తురు! నాకి
ట్టుల మఱ(దింబొరిగొనినీ - వలె వైధవ్యంబు(దెచ్చు వారలు గలరే?

కంకంటి. ఉ.రా. 4అ 101-103 ప॥

సరే, లోకంలో ఎవరిపిచ్చి వారి కానందం. తోటివారి ముద్దుముచ్చటలు చూడగల సహృదయం అందఱికీ యెక్కడిది?

అట్టి శూర్పణఖ నోదార్చి, ఖర దూషణాదులున్న జనస్థానమునకుబోయి స్వేచ్ఛగా నుండుమని పంపించి రావణుడా తర్వాత వరుణ లోకాన్ని జయింప బోయాడు. అతడాసమయానికి బ్రహ్మ సభకు వెళ్ళాడని తెలిసి అక్కడున్న వాళ్ళం దరినీ చెల్లా చెదరుచేసి, అటనుండి కదిలిపోయి అశ్మ నగరంలో ప్రవేశించాడు. బలి గృహంచేరి అతని వాకిట కావలియున్న దివ్య పురుషుని (శ్రీ మహావిష్ణువును) జూచి విస్మయం పొందాడు. బలి వలన అతని మహాత్మ్యమును విని కూడా, అతనితో యుద్ధానికి సిద్ధమయ్యాడు.

బ్రహ్మ రావణున కిచ్చిన వరములను దలచుకొని అప్పటి కా 'హరి' కను మరుగైనాడు. అచ్యుతుడు తనకు భయపడి పారిపోయాడని భావించి రావణుడు తాను జయించినట్లు ప్రకటించు కొన్నాడు.

సూర్యునిపై దండెత్తిపోయి, నాతో యుద్ధం చేస్తావా? ఓడిపోయానని ఒప్పు కొంటావా? అంటే సూర్యు డితనితో పోరుట వలన తనకర్తవ్య నిష్ఠకు భంగం ఏర్పడుతుందని ఎంచి పరగర్వితుడైన రావణుని తన విజయమును చాటు

కొమ్మని చెప్పి జగములకెల్ల వెలుగులను ప్రసాదింప ముందునకు సాగిపోయాడు. ఆ సంతోషంతో చంద్రునిలోని చల్లదనాన్ని కూడా లెక్క చేయక, అనుచరులు చెప్పి నను వినక అతనిపై బోవ నమకట్టిన రావణుని బ్రహ్మయే స్వయంగావచ్చి వారిం చాడు. చంద్రునిపై బాణ ప్రయోగం చేయటం చంద్రశేఖరుడైన శివునకే అపరాధం చేసినట్లవుతుందని వివరించి, దానికి అతడు ఉగ్రుడై సర్వమును దహించి వేయగల డని చెప్పి, శివాను గ్రహం పొందగల ఉపాసనాక్రమాన్ని ఉపదేశించి రావణుని ఆ ఉద్యమము నుండి విరమింప జేశాడు.

బల్లియుడైన రావణుడా తర్వాత మాంధాత తనకు తగిన ప్రతివీరు డనివిని, పుణ్య భోగములనుభవింప దివ్య విమానమెక్కి స్వర్గానికిపోయే అతనిని మార్గ మధ్యంలో ఆపి తనతో యుద్ధం చేయమని, లేకపోతే ఓడిపోయానని చెప్పమని బలవంతం చేశాడు. వారికప్పుడు పోరు జోరుగా సాగింది. అందులో ఇరువురు బ్రహ్మాస్త్రములను ప్రయోగించు కొన్నారు. దాంతో జగత్ప్రళయం సృష్టింపబడింది. (బ్రహ్మాస్త్ర మంటే అణుబాంబే అని రష్యన్, జర్మన్ దేశస్థులైన కొందరు శాస్త్రజ్ఞు లిప్పుడు తమ పరిశోధనల ద్వారా నిర్ణయించి చెప్తున్నారు. చూ. ఆంధ్రపత్రిక అనుబంధం 12-9-88) అట్టి స్థితిలో పులస్త్యగాలవులు వచ్చి వారిరువురికి సంధి చేసి ఆ అస్త్రముల నుపసంహరింప జేశారు. అంటే లోకములో మాట పట్టింపు వచ్చి, పట్టుదలలు పెరిగి ఏ ఇరువురి మధ్య ఏర్పడిన వ్యక్తిగత విరోధాలో కుటుం బానికి, సమాజానికి, దేశానికి, ప్రపంచానికి వినాశనం చేసేవిగా ఉండకూడదనేది ఇందులోని పరమార్థం. అందుకే ఈనాడు ఏ రకంగానూ మూడవ ప్రపంచయుద్ధం సంభవింప కూడదని అలీనోద్యమ కార్యకర్తలు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. అగ్ర రాజ్యాలు కూడా అందుకు సుముఖతను వ్యక్తం చేస్తున్నాయి. సుహృద్ భావాన్ని పెంపొందించు కొంటున్నాయి. మనం మంచినే ఆశిద్దాం. శాంతినే కోరుకొందాం.

తర్వాత కపిలముని ఆకృతిలోనున్న నారాయణుని విశ్వరూపం చూసి, భయపడి ఓటుపడి, నోరారా అతనిని కొనియాడి అక్కడ నుండి మెల్లగా రావణుడు తప్పు కొన్నాడు.

అటు తర్వాత వరబల మత్తుడైన ఆ రావణుడు లోకంలోని పతివ్రతల నెందరినో చెఱపట్టాడు. వారాక్రోశిస్తూ రావణుని దౌష్ట్యాన్ని నిందించారు. తుదకు స్త్రీయే నీ మరణానికి కారణం కాగలదని శపించారు.

రావణుడు స్వర్గంపై దండెత్తినప్పుడు దేవతలు తనను చుట్టుముట్టి పట్టుకో బోయే సమయంలో తన తనయుడైన మేఘనాధుని సహాయంతో ఆపద తప్పించుకొని బయటపడ్డాడు. ఇంద్రుని జయించి బంధించిన కారణంగా మేఘనాధుడు నాటి నుండి ఇంద్రజిత్తుగా పిలువబడ్డాడు. బ్రహ్మతగదని చెప్పగా రావణుడు ఇంద్రుని విడిపించాడు.

రావణుడొకప్పై కార్తవీర్యార్జునుని జయింపబోయి, పట్టుబడి అతని కారాగారంలో కొంతకాలం మ్రగ్గిపోయాడు. రావణుని తాతగారైన పులస్త్యునికి ఈ విషయం తెలిసి, అతడువచ్చి కార్తవీర్యుని కొనియాడి మనుమని విడువుమని వేడగా ఆ మహారాజు అతని మొహమాటమునకై విడిచి పెట్టాడు "హసతాక్రియతే కర్మ రుదతా పరిభుజ్యతే" నవ్వుతూ చేస్తాడు, ఏడుస్తూ అనుభవిస్తాడు అన్నట్లు ఎవరు చేసిన కర్మఫలం వారనుభవింపక తప్పదు గదా!

రావణుడు బలవంతుడైన ఆ రాజుతో కావాలనికోరి అగ్నిసాక్షికంగా స్నేహం చేసుకొన్నాడు అయినా రావణుని చేతుల తీట అంతటితో తీరిందికాదు. అతని ఆగడములు అప్పటికీ ఆగిందిలేదు.

ఇంక వానరవీరుడైన వాలితో ద్వంద్వయుద్ధం చేద్దామని కిష్కింధకు వెళ్ళాడు అప్పుడు అతడు ఇంటలేడు కొంచెంసేపు ఉంటే వస్తాడని, అంతవఱకు వేచి ఉండ మని చెప్తే, రావణుడు అసహనం ప్రకటించాడు. అతని వాలకం గ్రహించి వాలి మామయైన తారుడు "వాలి ఈ సమయానికి దక్షిణ సముద్రంలో స్నానంచేస్తూ ఉంటాడు. నీ విప్పుడక్కడికి వెళ్ళగలిగితే అతడు నీకోరిక తీరుస్తా"డని చెప్పాడు. రావణుడప్పుడే పుష్పకము నధిరోహించి దక్షిణ సముద్రానికిచేరి అచట స్నానమాచరించి, జపం చేసుకొంటున్న వాలిని దూరం నుండి చూచి, చప్పుడు కాకుండా మెల్ల మెల్లగా సమీపించి వెనుక నుండి అతనిని చేతులతో బంధించి లంకకు తీసుకు పోవాలని సంకల్పించాడు. ఆ విధంగా తనను వంచింప వచ్చిన రావణుని వాలి తన చంకలో ఇఱికించుకొని అతడెంత గింజుకొన్నా, ఏ మాత్రము ఎడమీయక తక్కిన సముద్రాలు మూడింటిలో మునిచితేల్చాడు. ఆకాశంలో అతి వేగంగా పోవునప్పుడా వింత చూచి, భూమి మీదఉన్న జనులాశ్చర్య పడ్డారు. రావణుని అన్న కుబేరుడు నర వాహనుడయితే ఈతడు వానర వాహను డయ్యాడు. దాయాదుల కావటి సామ్యం ఉండటం లోకంలో సహజమే కదా!

కరమింపు మి:ఃచుగా సోదరులకుఁ జెల్లవలె భాగదాయ కలనలా
నరవాహను ననుజుఁడు వావర వాహనుఁడయ్యె నపు డనంతా కాంతా!
బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి
శ్రీరామ కథామృతము ఉ.కాం.పూ.భా 7 ఆ 258 ప

వారు కిష్కింధా పట్టణాన్ని అనుకొని ఉన్న ఉద్యానవనం చేరేసరికి, వాలి తన చేతుల పట్టు సడలించాడు. రావణుడంతెత్తు నుండి నేలపైబడి దిమ్మర పోయాడు. ఆ హఠాత్పరిణామానికి రావణునకు ఏమీ తెలియని అయోమయ స్థితి ఏర్పడింది. అంతలో వాలి వెనుదిరిగి నీ వెవరు? ఇక్కడి కెందుకు వచ్చావు? అని ప్రశ్నించాడు. అది విన్న రావణునికి మతి భ్రమించి నట్లయ్యింది. తన వ్రేలితో ఎదుటివాడి కన్ను పొడిచి తానే ఆ కన్నీటికి కారణమేమిటని అడిగి నట్లైంది అప్పటి వాలి ప్రవర్తన. (అభిజ్ఞాన శాకుంతలమ్) ఇంక దురభిమానము వహించి లాభం లేదనుకొని రావణుడు పౌరుషం విడచి, తనగోడు వినిపించి తనకు కలిగిన పరాభవం వివరించి, క్షమాభిక్ష వేడుకొన్నాడు. అతని శక్తి సామర్థ్యాలు పొగిడి, ఇట్టి బలవంతుడవైన నీతో నాకు సఖ్యం కావాలని ప్రాధేయ పడ్డాడు. ఆ సఖ్యంలో దారలు, (భార్యలు) పుత్రులు, పురము, రాష్ట్రము, ఇంక అనుభవ యోగ్యములైన వస్త్రమాల్యాద్య లంకారములు, భోజన భాజనములు మన కిరువుర కొకటిగా ఉండ గలందులకు అనుగ్రహింపుమని విన్నవించాడు.

దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగోచ్ఛాదన భోజనమ్।
సర్వ మేవా విభక్తం నౌ భవిష్యతి హరీశ్వర॥
వా. రా. ఉ. కాం. 34 స. 41 శ్లో

అతని దైన్యమును జూచి, జాలిపడి వాలి రావణుని అభ్యర్థనము మన్నించి అందుకు అంగీకరించాడు అగ్ని సాక్షికంగా వారికి శాశ్వత స్నేహం ఏర్పడింది. వాలి విషయంలో ఈ స్నేహ భావన వీరోచితమై అతని నిష్కల్మష హృదయాన్ని ఉదార భావాన్ని వెల్లడిస్తోంది. రావణుడు కిష్కింధలో నెలరోజులు ఉంటే వాలి అతనిని ఆదరించి, సోదరునివలె గౌరవించాడు.

రావణుని విషయంలో మాత్రం ఈ స్నేహం కృతకమేగానీ సహజం కాదు. సమాన ప్రతిపత్తి కలిగింది అంతకంటే కాదు. కేవలమది స్వార్థపూరితం. లోకంలో వియ్యంగానీ కయ్యంగానీ సమానులతోనే జరిగినప్పుడది సమంజసంగా ఉంటుంది. ఒకడు బలవంతుడై ఉండి కొంతి, అహంస మొదలైన సిద్ధాంతాలు కారణంగాచూపి

సంధి వచనములు పల్లించుట తగునుకానీ, బలహీనుడు తన అసమర్థతను కప్పిపుచ్చు కొనేందుకు మరియొక బలవంతునితో సంధి చేసుకొనటానికి ఆరాటపడటం ఆత్మ రక్షణకేగానీ ఆత్మీయతతో కాదనునది జగమెరిగిన సత్యం. అదియొక రాజకీయపు ఎత్తు. అందువల్ల ప్రతి (దేశం) ఒక్కరు అప్రతిహతమైన ఆత్మశక్తిని పెంపొందించు కోవాలి. అప్పుడే అతడేమన్నా చెల్లుతుంది. అట్టివాని ఆగ్రహానుగ్రహములే సార్థకము లౌతాయి. తనకంటే అధికుడని తెలిసి వాలితో రావణుడు సంధి చేసుకొనటం అతని చేవ తనాన్నే సూచిస్తుంది. కాకుంటే, ముందెందుకు లేదా బుద్ధి?

నిజానికి లోకంలో వివాదాలు మూడు విధాలుగా సంభవిస్తాయి 1) స్త్రీ 2) అధికారము 3) ధనము. ఇట్టి యెడ వానినే భేదంలేని పక్షానికి మూలంగా గ్రహించటం వెర్రితనమే అవుతుంది. బలహీనుడెన్నడూ భయంతో బలవంతుని యెడగాని, తత్పతి వారము నెడగానీ కన్నెత్తి చూడజాలడన్నది యథార్థం. ఇప్పటున రావణుడు స్వప్రయోజనం ఆశించి తనవారితోబాటు సర్వస్వాన్ని అర్పించటానికి సిద్ధ పడ్డాడు. ఎదురు లేనంత కాలం తిరుగు లేకుండానే తన అధికారం సాగించు కున్నాడు. ప్రతాపం ప్రకటించు కొన్నాడు. తనకంటే అధికుడు ఎదురుపడే టప్ప టికి భయపడి కాళ్ళ బేరానికి వచ్చాడు. "అందితే జుట్టు అందకపోతే కాళ్ళు" అన్న సామెత లోకంలో ఇటువంటి వారిని గూర్చి వచ్చిందే. ఇది అతని చరిత్రలో ఒక చెరగని మచ్చ.

మూరెడు పోనేల? బారెడు క్రుంగ నేల? అన్నట్లు మొదటి నుండియు రావణుడు తనకొలది యెఱుంగక ప్రవర్తించి, పరాభవముల పాలయ్యాడు. ఒకప్పుడు కైలాసం మీదుగాపోతూ శివుని ఏకాంత సమయము భంగం కాకూడదని తనను నిరోధించిన, నందీశ్వరుని పరిహసించి, అతని శాపానికి గురి అయ్యాడు. గర్వంతో కైలాస పర్వతాన్ని ఎత్తబోయి కుపితుడగు పరమేశ్వరునిచే శిక్షింపబడి, తుదకు భక్తితో ఆతనిని స్తోత్రంచేసి శివానుగ్రహంవల్ల బ్రతికి బయట పడ్డాడు. తపమాచ రిస్తున్న వేదవతిని చెఱపట్టబోయి ఆమెచే శప్తుడయ్యాడు. శ్వేత ద్వీపమునకుపోయి అందున్న స్త్రీలతో పోరాడ ప్రయత్నింపగా వారా తనిని వింత పురుగుగా భావించి విదలించి సముద్రమున విసరిపారేశారు. రంభ, పుంజికస్థలాది అప్సరసలను బలాత్కరించి నలకూబర, బ్రహ్మ శాపములకు గురి అయ్యాడు. ఇంకా ఇట్టి దౌష్ట్యము లనేకం చేశాడు. వేజేతులా కష్టాలు కొనితెచ్చుకొన్నాడు.

వివేకంతో లోకహితంకోరి బుద్ధిగా ప్రవర్తించమని బ్రహ్మ వరములు ప్రసాదిస్తే ఈతడవి దుర్వినియోగ పరచాడు. "పట్టు చీర ఇచ్చి పీట పుచ్చుకొని వెంట తిరిగినట్లు" రావణునికి బ్రహ్మ వరములిచ్చి ఎక్కడ లోకోపద్రవం కలుగ జేస్తాడోనని హడలిపోతూ అడుగడుగునా ఈతనిని అనుసరించి జగములను కాపాడు కుంటూ వచ్చాడు. తుతకు ఇంకెన్నడూ ఇట్టి దుష్టులకు వరాలియ్యరాదని సంక ల్పించు కొన్నాడు. అనర్హులకు అధికారిలిస్తే ఇదే తంటా.

ఇంతకు ఇంతటి గందరగోళం సృష్టించిన రావణుడు చివరికి ఏమి సాధించి నట్లు? అతని లక్ష్యమేమిటి? అది ఎంతవఱకు నెఱవేరింది? అంటే అందుకు సమాధానం లభించటం లేదు. శాంతి అనేది లేకుండా నిరంతరం సంఘర్షణలతోనే జీవితం గడిచిపోయింది. చివరకు రామనారాయణుని చేతిలో మరణం సంభవిం చింది. ఇందుకేనేమో? ఇంత తపన పడ్డాడు.

"అసలే కోతి. మద్యం త్రాగింది. నిప్పులు త్రొక్కింది, చిందులు వేసింది" అన్నట్లు జన్మతః సిద్ధించిన రాక్షసత్వానికి తోడు వరబలములు తోడయ్యాయి. అతనిలో దుశ్శీలత (కాముకత) బోటు చేసుకొంది. దానికి తగ్గట్టు అతని చుట్టూ చేరినవారు అట్లాంటివారే అయినారు. దుర్బోధలే చేశారు. పాపపు పనులకే ప్రేరణ కల్పించారు. కార్చిచ్చు గాలిని తోడు చేసుకొని, అడవినంతా దహించినట్లు రావణుడు దుర్జన సాంగత్యంచేసి తనతోబాటు తనవారందఱిని నాశనం చేసు కొన్నాడు. సీతాపహరణానికై వచ్చిన రావణునితో మారీచుడీ జోస్యం అప్పుడే చెప్పాడు.

త్వద్విధః కామవృత్తో హి దుశ్శీలః పాపమంత్రితః।
ఆత్మానం స్వజనం రాష్ట్రం సరాజా హన్తి దుర్మతిః॥
వా.రా. అర. కాం. 37స. 7 శ్లో

మొదటి నుండి అతడు సమాజంలో నిర్మాణ కార్యక్రమాలు మానేసి నిర్మూలనా కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. బలవంతుడననే గర్వంతో పలువురితోనూ పంతాలాడి, పగపెంచు కొన్నాడు. అహంకారంతో ప్రపంచ విజేతను కావాలనుకొన్నాడు. గత చరిత్రలో నరహంతకులైన నియంత లెంతకాలం జీవించారు? ఏమి సాధించారు?

ఎవరైనా ముందు తమ మనసులోని కామక్రోధాదులైన విరోధులను జయించినట్లైతే సమభావం ఏర్పడుతుంది. (ఆత్మవత్సర్వభూతాని) వారికి లోకంలో వేరే విరోధులెవ్వరు ఉండరు. అట్టి సమదృష్టి సాధించలేనినాడు ఎవరెంత చేసినా ఏమీ ప్రయోజనం ఉండదు.

లోకములన్నియుం గడియలోన జయించినవాడ వింద్రియా
నీకము(జిత్తముంగెలువ నేరవు నిన్ను నిబద్ధుజేయుసీ
భీకరశత్రు లార్వుర ప్రభిన్నుల జేసిన ప్రాణికోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పున జూడుము దాన వేశ్వరా!

ఆంధ్రమహాభాగవతం 7 స్కం : 67 ప.

"అత్యుత్కటైః పుణ్య పాపైః ఇహైవ ఫల మశ్నుతే" అధికంగా చేసిన పుణ్య పాప కర్మఫలము లీలోకంలో తామనుభవించి తీరవలసిందే"నని పెద్దలన్నట్లు రావణుడు చేసిన పాపఫలం చివరకు అతడినేకట్టి కుడిపింది." ధర్మ ఏవహతో హన్తి" ధర్మాన్ని భంగపరిస్తే ఆ ధర్మమే అతనిని నాశనం చేస్తుందనటాని కిది ప్రత్యక్ష సాక్ష్యం.

ఇంక ధర్మ మార్గంలో పయనించే వారికి పశు పక్ష్యాదులు కూడా సాయం చేస్తాయి. అపమార్గంలో పయనించే వారిని రక్తంపంచుకొని పుట్టిన సోదరులైనా విడిచిపెట్టి వెళ్ళిపోతారు. రావణునకు అట్టి దుర్గతే పట్టింది. ఇదే రామాయణ సారాంశంగా అభిజ్ఞులు వివరించారు.

యాస్తి న్యాయ ప్రవృత్తస్య తిర్యఞ్చోఽపి సహాయతామ్।
అపంథానంతు గచ్ఛంతం సోదరోఽపి విముంచతి
(మురారి-అనర్ఘరాఘవమ్)

ఆకలి దప్పికలు

ప్రపంచంలో ప్రతి ప్రాణికి ఆకలి దప్పికలు ఉండటం సహజం. ఈ ప్రకృతి యందలి జీవులలో ఎన్నో రకాలున్నాయి. కొన్ని గాలితిని బ్రతుకుతాయి. మరికొన్ని నీరు త్రాగి బ్రతుకుతాయి. ఇంకొన్ని మట్టితిని బ్రతుకుతాయి ఏ రకమైన జీవులకు ఆ రకమైన ఆహారం ఉంటుంది. ఎక్కడపుట్టే జీవులకు అక్కడే ఆహారం లభిస్తుంది. ఉదాహరణకు విషక్రిమి ఉంది. అసిషంతిన్న ఇతర ప్రాణులు ఏవైనా సాధారణంగా మరణిస్తాయి కానీ అందులో పుట్టిన క్రిమి అదే తిని బ్రతుకుతుంది. ఇంక తక్కినవి అంతే. ఈ ప్రాణులలో కొన్ని ఇతరుల మీద ఆధారపడి జీవిస్తాయి. కొన్ని తమ వలకు సంపాదించుకొని సంతృప్తి పడతాయి. మరికొన్ని తామనుభవిస్తూ, తమతోబాటు మరి కొన్నింటికి కూడా ఆ అవకాశం కల్పిస్తాయి. ఇంకొన్ని పరోపకారం కొఱకు జీవిస్తాయి.

పరోపకారాయ ఫలంతి వృక్షాః
పరోపకారాయ దుహంతి గావః
పరోపకారాయ వహంతి నద్యాః
పరోపకారార్థ మిదం శరీరమ్॥

పరోపకారం కొఱకే వృక్షములు ఫలిస్తున్నాయి. గోవులు పాలిస్తున్నాయి నదులు ప్రవహిస్తున్నాయి. ఈ ప్రకృతి అంతా కలయజూచి పరోపకారంలో ఉన్న ప్రశస్తిని, పరమార్థాన్ని గమనించి, బుద్ధిమంతులైన మానవులు మన శరీరం కూడా పరోపకారం కొఱకే వినియోగ పడాలని సంకల్పించారు. ప్రపంచానికి ప్రబోధించారు.

ఆదిమ మానవుడు అడవులలో, కొండ గుహల్లో, నివసిస్తూ ఆకు అలములు తింటూ సెలయేటి నీరు త్రాగి ఎవరి జీవితం వారు జీవించినా, క్రమంగా భద్రత కోసం సంఘజీవులై రుచికరములైన ఫలములు, కందమూలములు సంపాదించుకొని అవసరమైనవి పండించుకొని, వచనం చేసికొని షడ్రసోపేతంగా తినటం, నేర్చుకొన్నారు. నదిలోనీరు శుద్ధి చేసుకొని చల్లగా ఉండేలా నిలువ చేసుకొని వివిధ

రకాలైన పానీయాలు తయారు చేసుకొని త్రాగడానికి అలవాటు పడ్డారు. తామనుభవించేది ఇతరులకు పెట్టటంలో సంతోషాన్ని పొందగలిగారు. సమభావంతో సమాజంలో సాటిమనిషికి తోడుపడటానికి ఆనందంతో ముందుకు వచ్చారు.

వరి, గోధుమ, జొన్న, సజ్జ మొదలైన ఆహారధాన్యాలు ఏ ప్రాంతంలో, ఏ రాష్ట్రంలో, ఏ దేశంలో ఏవి ఎక్కువ పండితే అక్కడ వారవే భుజిస్తారు. తక్కినవి వీలునుబట్టి ఇతర ప్రదేశాల నుండి దిగుమతి చేసుకొంటారు. మానవులు ఇంత గొప్పనాగరిక జీవితాన్ని చేరుకోటానికి పూర్వులెంతో శ్రమ ననుభవించారు. మరెంతో సాధన చేశారు. వివిధ పరిశోధనల ద్వారా పౌష్టికమైన ఆహారాన్ని సంపాదింపగలిగారు. వారందరి సమిష్టి కృషి ఫలితమే ఈనాడు మనం అనుభవిస్తున్న ఈ ఆహార సంపద.

లోకంలో ఎవరెంత ధనవంతులైనా కడుపుకు తినగలిగిన ఆహారమే తింటారు. "లక్షాధికారైన లవణ మన్నమె కాని మేలి బంగారంబు మ్రింగబోడు." ఒకప్పుడు డబ్బెంత ఉన్నా సమయానికి ఆహారం లభింపక పోవచ్చు. అప్పుడు ఆకలి వారిని వేధిస్తుంది. ఆహారం తింటేనే ఆ ఆకలి తీరుతుంది. కలియుగంలో అన్నీ అన్నగత ప్రాణులే కదా! ఒకడు ఎండలో తిరిగి వస్తాడు. దాహం వేస్తుంది. ఆ దాహం నీరు త్రాగితేనే తీరుతుంది. అప్పుడు మరే మిస్తామన్నా అతడు ఇష్టపడడు. అతడి దప్పికా తీరదు. 'నీరే ప్రాణాధారం' కదా! అందువల్ల జీవితంలో ముఖ్యావసరములైన ఈ ఆకలి దప్పికలకు అత్యంతావసరములైన అన్నోదకముల ప్రాధాన్యత గుర్తించి, అవి పంచి ఇవ్వటంలో ఉన్న ప్రాముఖ్యాన్ని ప్రశంసిస్తూ 'నాన్నోదకం సమం దానమ్' అని పెద్దలు వివరించారు.

'తన చిన్ని పొట్టకు శ్రీరామరక్ష' అని ఎంత కాలమైనా తన కడుపునింపుకోవటం, తన బాగోగులు చూసుకోవటం, ఎదుటివారిని దోచుకోవటం, ఆ నిమిత్తంగా ఒకరి నొకరు చంపుకోవటం స్వార్థమనిపించు కొంటుంది. అట్టి వారివల్ల ఇతరుల కేమాత్రం ప్రయోజనం ఉండదు. ఏ విధంగానూ ఎవరికి ఏ ఉపకారం చేయలేనప్పుడు ఎవరి జీవితానికైనా సార్థకత ఎక్కడిది? కాకి కూడా అక్కడక్కడా తన ముక్కుతో గింజలేరుకొని తింటూ చిరకాలం బ్రతుకదా! యథార్థానికి అట్లా కాకుండా ఎవరి జీవితం వలన ఇతరు లనేకులు జీవిస్తారో వారి జీవితమే నిజమైన జీవితం అనిపించు కుంటుంది.

యస్మిన్ జీవతి జీవన్తి బహవః సతు జీవతి।
కాకో౽పి కిం నకురుతే చంచ్వా స్వోదర పూరణమ్॥

సుభాషిత రత్నభాండారమ్

ప్రాణులందరికి ఈ ఆకలి దప్పికలు సమానమే అయినా అందరికి ఒకే ఆహారం కానీ, ఒకే విధానం కానీ ఉండదు. ప్రపంచంలో మానవజాతి అంతా ఒకటిగా ఉందా? లేదే? ఇందులో ఆర్థిక వసతి, మేథా సంపద, భౌతిక దారుఢ్యం, వాతావరణ ప్రభావం అందరికీ ఒకటి కాదు. అలాగే ఒకే సమాజంలో అందరు కష్టించి, శ్రమించి, చాతుర్యంతో సంపాదించుకో గలిగిన వారుండరు. అయోగ్యులు, అసమర్థులు, పిచ్చివారు, వికలాంగులు, పీడితులు, తాడితులు, ప్రకృతి వైపరీత్యాల వలన బాధితులు, సాధువు, సంతులు, విద్యార్థులు, పిన్నలు, పెద్దలు, బాలలు, వృద్ధులు ఇటువంటి వారే ఇంకా ఎందరో. వారంతా ఇతరులమీద ఆధార పడవలసిన వారే. వారిలో కూడా ఏ ఆధారం లేక, ఆదరణలేక, ఏ పని చేయలేని కొందరు సాంఘికంగా వెనుకబడి, తినటానికి త్రాగటానికి నోచుకోక, ఆరోగ్యం కోలుపోయి, అభిమానం విడిచిపెట్టి, చివరకు కొందరు యాచక వృత్తి నవలంబిస్తారు. అటువంటి వారికి చేతనైనంత సహాయంచేసి ఆదుకోవలసిన అవసరం ఉంది. (అయితే ఈ రోజులలో సోమరి పోతులు, మోసగాండ్రు ఈ వృత్తిలోచేరి పాపపు పనులకు పాల్పడుతున్నారు. వారివల్ల నిజంగా బాధితులైన వారికి అన్యాయం జరుగుతోంది. అసలేదో నకిలీ ఏదో తెలియటం లేదు. ఆ నిర్ణయంలో పొరపాటు జరిగే అవకాశం ఉంది) అన్ని వసతులు ఉండి, తాముతిని, ఇతరులకు పెట్టగలవారు ఉదారంగా ప్రవర్తించాలి. అతిథులను అభ్యాగతులను ఆదరించాలి. తమ కున్నంతలో తోటి వారికి సాయపడాలి. నిజంగా అది మంచి పని. మానవత్వ లక్షణం కూడా. అప్పుడే వారి సంపదకు సార్థకత సిద్ధిస్తుంది. స్వార్థం పెరిగి తన చుట్టూ తానొక గిరి గీసుకొని, తనకున్నది తరిగి పోతుందనే భయంతో, లోభగుణంతో ప్రవర్తించటం కూడదు. అటువంటి వారు సంపద ఉండి లేని వారుగా పరిగణింపబడతారు.

అన్నమైనఁ దోయమైన ద్రవ్యంబైన
శాకమైనఁ దనకుఁ జరుగు కొలది
నతిథి జనుల కడ్డమాడక యిడరేని
లేమ! వారు కలిగి లేనివారు

అం-మ. భాగ-8 స్కం-464 ప

ఎప్పుడైనా 'మనం తిన్నది గోతిపాలు. ఎదుటివారికి పెట్టిందే మన పాలు' అనేది లోకంలో ఒకనానుడి.

మును తాఁదిన్నది గోతిపాలగుట, నామోదంబునన్ దానమి
చ్చిన సొమ్మే తనదౌట నిక్కమనుచున్ శ్రీమంతు లేవేళత
ద్ధన ధాన్య ప్రకరంబులన్ ప్రియముతో దానంబు గావింత్రు, వే
సిన కర్మంబె ఫలించు జీవుల కిలన్ శ్రీ భావనారాయణా! (రచయిత)

పూర్వం ఎప్పుడో ఎవరికో ఆదరంగా పట్టెడన్నం పెట్టిందానికి ఈనాడు మనకు తింటానికి ఏలోటూ లేకుండా లభించడమే తార్కాణంగా చెప్తారు. 'పెట్టిం దానికి పుట్టుటేసాక్షి' అనేది లోకంలోని సామెత.

ఉన్ననాడు దానం చెయ్యనందు వల్ల దోషం వస్తుంది. దానికి ఫలం దారిద్ర్యమే. ఆ దారిద్ర్యం వల్ల పాపపు పనులు (దొంగతనం, అబద్ధ మాడటం మొ॥) చెయ్యటం జరుగుతుంది. ఆ పాపానికి ఫలితంగా నరకం ప్రాప్తిస్తుంది. ఆ దుఃఖం అనుభవించిన తరువాత తిరిగి భూమి మీద దరిద్రుడై పుడతాడు. ఈ చక్రం ఇలా తిరుగుతూనే ఉంటుంది.

శ్లో॥ అదాన దోషేణ భవే ద్దరిద్రః, దరిద్రదోషేణ కరోతి పాపమ్
పాపా దవశ్యం నరకం ప్రయాతి, పునర్దరిద్రో పునరేవ పాపీ॥

అందువల్ల సమాజంలో ప్రతివ్యక్తి 'సొంత లాభం కొంతమానుకొని' తన విభవమునకు తగినట్లు సాటి మానవులకు తోడు పడాల్సిన అవసరం ఉంది. వ్యాపారం పెరిగిన కొలది కట్టవలసిన అమ్మకం పన్ను (ఆదాయంపన్ను) పరిమితి కూడా పెరుగుతుంది కదా! ఇందుకు పెద్దలొక కథ చెప్తారు.

ఒకడు బీదవాడై ఉండి కూడా, తనకు చేతనైనంతలో ఇంటి పెరటిలో తోటకూర పెంచి, నలుగురికి పంచి పెడితే ఆ పుణ్య ఫలంగా మరు జన్మలో మంచి ధనవంతుడై పుట్టాడు. పూర్వ జన్మ వాసన కొంత ఉండి, ఇంకా ఎక్కువ సంపన్నుడను కావాలనే కోరికతో ఈ సారి తన పొలంలో కొన్ని ఎకరముల మేర తోటకూర పెంచి అందరికీ ఎక్కు వెక్కువగా పంచి పెట్టాడు. ఆ సమయంలో ఆ దారిన పోయే ఒకజ్ఞాని 'ఏమీలేనప్పుడు నీవు తోట కూర ఇస్తే ఇంత సంపద

వచ్చింది. ఇప్పుడూ నీవు ఆ తోటకూరే పంచి పెడితే నీకా పూర్వపు దైన్యస్థితే సంభవిస్తుంది. కనుక నీ స్థాయికి తగిన తీరుగా నీవు దానం చెయ్యి. తగిన ప్రతి ఫలం పొందుతావు' అని హెచ్చరించాడు. అది విన్న యజమాని తన తప్పు తెలుసు కొని తగిన రీతిగా ప్రవర్తించాడు. అందుకే లోకంలో 'దశదానాలకి తోటకూర కట్టేనా? అని అధిక్షేపిస్తారు.

ఇంక, దానం చేసేటప్పుడు ఎక్కడ ఏ తప్పు జరుగుతుందో అనే భయంతో, చేయదగినంతగా చేయలేక పోతున్నాననే సిగ్గుతో, నిర్లక్ష్యమనేది లేకుండ, శ్రద్ధగా ప్రవర్తించాలని శ్రుతి ఆదేశిస్తోంది. 'శ్రద్ధయాదేయం, అశ్రద్ధయాదేయం, భియా దేయం, హ్రియా దేయం, శ్రియా దేయం' (కఠోపనిషత్, శిక్షావల్లి)

సంపద ఉన్నప్పుడు ఏమి చేయాలి? అని ప్రశ్నించి ఔదార్యం ప్రకటించటమే దానికి సరియైన వినియోగమని శంకర ప్రశ్నోత్తర మాలిక వివరిస్తోంది.

"సతివిభవే కిమ్? ఔదార్యమ్"

ఇక్కడ అన్నం తినటానికి అర్హత ఏమిటి? అంటే 'ఆకలి' ఒక్కటేయని చెప్పి, ఏదైనా ధర్మమార్గం ఉపదేశించమని అడిగితే 'నీకున్నది తృప్తిగా తిని పది మందికి ఆదరంగా పెట్టుకో' అంత కంటే వేరే ధర్మం లేదని వివరించి, అది చక్కగా నిర్వహించటమే కర్తవ్యంగా బోధించింది, మాతృశ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ.

నిత్యం ఇంటి ముందు నిలబడి (ధర్మం చెయ్యమ్మా) 'అన్నం పెట్టమ్మా' అని యాచించే బిచ్చగాడి మాటల్లో అభ్యర్థన ఒక్కటేగాక సందేశం కూడా ఉన్న దంటాడు ఒక మహాకవి. 'అదాన దోషానికి పాల్పడి నాలా దరిద్రుడవు కాకుండా, నీకున్న దాంట్లో ఎంతో కొంత ఇతరులకు పెట్టి నీవు నీవుగా ఉండు' మనే అర్థం కూడా దాంట్లో ఉందట.

ద్వారం ద్వారమటన్ భిక్షుః, శిక్షత్యేవం నయాచతే!
అదత్వా మాదృశో మాభూత్, దత్వా త్వం త్వాదృశోభవ॥

భారతీయ సంస్కృతి అంతా ఈ దాతృత్వాన్ని ప్రబోధించేది. మానవత్వానికి సంపూర్ణతను సిద్ధింపచేసేది అనటం అతిశయోక్తి కాదు. ఈనాడు అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన లైన్స్, రోటరీ మొదలైన సంస్థలీ కార్యక్రమాన్ని చేపట్టి

శక్తివంచన లేకుండా మానవులకు సేవ చేస్తున్నాయి. జాతీయ స్థాయిలోను ఎన్నో సేవా సంస్థలు స్వచ్ఛందంగా ఈ కృషి చేస్తున్నాయి. వ్యక్తిగతంగానూ ఎందరో సమాజానికి తమ సహాయ సంపదలందిస్తున్నారు.

శ్రీ మద్రామయణంలో ఈ విషయం యొక్క ఆవశ్యకత చక్కగా వివరింపబడింది. అయోధ్యలో పట్టాభిషిక్తుడై రాజ్యం చేస్తున్న రోజులలో రాముడొకనాడు అగస్త్యాశ్రమానికి వెళ్ళాడు. ఆ ముని రామునకు ఆతిథ్యమిచ్చి, ఒక దివ్య మణిని కూడా కానుకగా ఇచ్చాడు. ఈ మణి నీకెలా వచ్చిందని రాముడడిగితే ముని ఆ కథ ఈ విధంగా చెప్పాడు

'పూర్వం నేనొకప్పుడు తపస్సు చేసుకొంటానికి అనువైన ప్రదేశం కోసం వెదుకుతూ అన్ని దిక్కులు చూచి, చివరకు ఇక్కడకు వచ్చాను. ఈ ప్రాంతంలో నిర్మలోదకములతో కూడి విశాలమై పద్మములతో నిండి ఉన్న ఈ సరస్సు, దీని ఒడ్డున తపస్వి జనులుండదగిన ఈ ఆశ్రమ ప్రదేశం చూశాను. ఆ రాత్రి ఇక్కడే ఉండి, మరునాడుదయం ఈ చుట్టు ప్రక్కల వాతావరణం పరిశీలిద్దామని తిరుగుతున్న సమయంలో ఈ సరోవర సమీపాన ఒకపురుషాకృతిలో ఉన్న శవం నాకంట పడింది. అది ఏమై ఉంటుందా? అని ఆశ్చర్యంతో చూస్తున్నంతలో ఒక దివ్య పురుషుడు హంసలు పూన్చిన దివ్య విమానంలో అప్సరః కాంతలు వివిధోపచారములతో అతనిని సేవిస్తూ ఉండగా అక్కడకు వచ్చాడు. అతడా విమానం దిగి ఆ శవమున్న చోటికిచేరి, ఆ శరీర మాంసం ముక్కలు ముక్కలుగాకోసి తినటం ప్రారంభించాడు ఇది మరీ వింతగా ఉందే, ఏమిటో? విషయం తెలుసుకొందామని అక్కడకి వెళ్ళబోయేటప్పటికి అతడు నీటికై సరోవరానికి వెళ్ళాడు. ఆ నీరు త్రాగివచ్చి, విమానం ఎక్కబోయే సమయానికి నేనతనికి ఎదురుగా వెళ్ళి 'నీ వెవరో? దివ్య పురుషునివలె ఉన్నావు. రాక్షస కృత్యమైన ఈ శవ మాంస భక్షణ ఎలా చేస్తున్నావు? కారణ మేమి'టని ప్రశ్నించాను. అందుల కాతడు తన చరిత్ర ఈ విధంగా వివరించాడు.

'నేను విదర్భరాజైన సుదేవుని కుమారుడను, నన్ను శ్వేతు డంటారు. నా తమ్ముడు సురథుడు. మా తండ్రి తర్వాత నేను కొంత కాలం రాజ్యం చేశాను. ఇంక నాకు తపస్సు చేసుకోవాలనే కాంక్ష కలిగింది. నా తమ్మునకు ఆ రాజ్య భార మప్పగించి పూర్వం నేనీ అడవిలో ఒంటరిగా గొప్ప తపస్సు చేశాను. దానికి

ఫలితంగా నాకు సత్యలోకం సిద్ధించింది. అయితే అక్కడున్న వారెవ్వరికీ లేని ఆకలి దప్పులు నన్ను విపరీతంగా బాధింప జొచ్చాయి. ఆ లోకాని కధిపతియైన బ్రహ్మ దగ్గరకు జేరి, నా గోడు వినిపించాను. నాగతి ఏమని అడిగాను. నా కాహార మేమిటని అర్థించాను.

"భగవన్! బ్రహ్మలోకోఽయం క్షుత్పిపాసా వివర్జితః
కస్యాయం కర్మణః పాకః క్షుత్పిపా సాను గోహ్యహమ్।
ఆహారః కశ్చమేదేవ! తన్మే బ్రూహి పితామహ॥
వా. రా. ఉ. కా. 78స 12, 13/1 శ్లో

అందుకా బ్రహ్మ "నాయనా! నీకీ దుస్థితి అదానదోషం వల్ల వచ్చిందని వివరించాడు. నీవు రాజ్యం చేసేటప్పుడు కానీ తపస్సు చేసే రోజులలో కానీ నీవు తింటూ ఇతరులకు ఎవరికీ ఇంత ఆహారం కానీ, కనీసం పశు, పక్ష్యాదుల కింత మేత గానీ పెట్టిన వాడవు గావు. ఎప్పుడైనా ధర్మ బీజం నాటితే కదా! అది వృద్ధి పొంది మహా వృక్షమై దాని ఫలం నీ కనుభవానికి వచ్చేందుకు? అందువల్ల ఇక్కడ కూడా నీకీ ఆకలి దప్పుల బాధ తప్ప లేదు. నీవు శ్రద్ధగా పెంచి పోషించు కొన్న నీ శరీరం ఒక్కటే నీకు మిగిలింది. అదే నీకు ఆహారం అవుతుంది. నిత్యం నీవదే భక్షించి రావలసింది"అని ఆదేశించాడు. అతని అనుగ్రహంవల్ల ఈ శవం చెడిపోకుండా, నిత్య పరిపూర్ణమై నాకు తృప్తినిస్తోంది.

'స్వశరీరం త్వయా పుష్టం కుర్వతా తప ఉత్తమం।
అను ప్తం రోహతే శ్వేత! నకదాచి న్మహామతే
దత్తం నతేఽస్తి సూక్ష్మోపి తప ఏవ నిషేవసే।
తేన స్వర్గ గతో వత్స! బాధ్యసే క్షుత్పిపాసయా॥
స త్వం సుపుష్ట మాహారైః స్వశరీర మను త్తమమ్।
భక్షయిత్వా మృతరసం తేన వృత్తి ర్భవిష్యతి॥
ఉ. కాం. 78 స - 15 - 17 శ్లో

ఆ మాట ప్రకారం నాటినుండి నేనిలావచ్చి నాశరీర మాంసంతిని, ఇక్కడి సరోవరంలో నీరు త్రాగి వెళ్తున్నాను. ఒకప్పటికి ఆ ప్రదేశానికి అగస్త్య మహర్షి వస్తాడు. దుర్ధర్షుడైన అతడు నీ ఆర్తి పోగొడతాడని కూడా బ్రహ్మ అనాడు సెలవిచ్చాడు. (18)

అప్పటి నుండి ఆ మహర్షికై ఎదురు చూస్తున్నాను. అసమానమైన రూపము, తేజము కలిగి వెలుగొందు నీవే అగస్త్యుండవను కొంటున్నాను. అట్లయిన మహాత్మా! ఈ మణిని గ్రహించి నన్ననుగ్రహింపుమని అతడు ఈ దివ్య మణిని నాచేతి కిచ్చాడు. అది యేమి చిత్రమో? మేము చూస్తూ ఉండగానే ఆ శవం మాయమై పోయింది. అందు కాతడు నాకు కృతజ్ఞతలు మటించాడు తర్వాత దుఃఖ రహితమైన శాశ్వత బ్రహ్మలోకానుభవాన్ని పొందాడు. నాటి నుండి ఈ మణి నాచే రక్షింపబడింది. ప్రభువగు నీ కడ నుండుటది యోగ్యము. ప్రబల సంపదలిచ్చి నీ ప్రజలకిది మేలు చేకూర్చు తుందని" ముని రామునకు వివరించాడు. రాముడారాత్రి ఆ ఆశ్రమంలో ఉండి మరునాడా మునికడ సెలవు తీసుకొని అయోధ్యకు తిరిగి వెళ్ళిపోయాడు. క్షేమేంద్రుడీ కథా సారాన్ని వివరిస్తూ తన "చారు చర్య"లో ఇలా పేర్కొన్నాడు. అర్థులకు పెట్టి తాను తినాలి. లేకపోతే పాపం వస్తుంది. శ్వేతుడు అర్థి రహితుడై భుజించి, చివరకు నిజమాంసమే ఆహారంగా కలవాడయ్యాడు.

శ్లో॥ అర్థి భుక్తావశిష్టం యత్, తదశ్నీయా న్మహాశయః!
శ్వేతో౽ర్థి రహితం భుక్త్వా నిజమాంసాశనో౽భవత్॥ (చారుచర్య,7శ్లో)

కావున తోటివారి క్షుత్పిపాసలు తీర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో ఆధ్యాత్మిక దృష్టితోబాటు సేవా భావానికి ప్రేరణనిచ్చే అంశం ఇమిడి ఉండటం విశేషం. ఇంకను ఇచట ఆత్మోద్ధరణతోబాటు ప్రతి ఒక్కరు సమాజాభ్యుదయానికి పాటుపడవలసిన వ్యక్తిగత బాధ్యత గుర్తు చేయబడింది. ఆ ధర్మం పాటింపకపోతే వచ్చే అనర్థం తెలియ జేయబడింది.

లోకంలో ధన, కనక, వస్తు, వాహనాదులైన సమస్త సంభారములు ఇచ్చి కూడా మానవు లెవరిని తృప్తి పరచలేము. కానీ ఎవరికైనా చాలనిపించేది అన్నోదకములే. ప్రాణాధారమైంది కావటం చేతనే 'అన్ని దానములకన్న అన్నదానము గొప్ప' అని ప్రసిద్ధి వచ్చింది. దప్పి గొన్న వానికి నీరివ్వటంలోనూ అదే విశేషం కనబడుతుంది.

ఇటువంటి ధర్మ సూక్ష్మముల నెన్నింటినో వివరించి సామాజిక స్పృహ, సేవాభావము పెంపొందింప రామాయణం - సమాజదర్పణం అంటంలో సందేహం లేదు.

అమృతత్వము

ప్రకృతి యందలి అనంతకోటి జీవరాశులలో పుట్టిన ప్రతిజీవి మరణింపక తప్పదు. (జాతస్యహి ధృవోమృత్యుః. గీత 2/27 శ్లో) అయితే అందులో కొందఱు తాము చేసిన పుణ్య కార్యముల ద్వారా కీర్తికాయాన్ని ధరించి అమరులై ఈ భూమి మీద శాశ్వతంగా నిలిచిపోయి నిత్యం అందరిచేతా స్మరింపబడటం చూస్తున్నాం.

ప్రతి ప్రాణికి మరణం తప్పదనే పరమ సత్యాన్ని తెలిసికొని ప్రాజ్ఞులైన వారు ఒక ఉన్నతాదర్శం కోరి తమ జీవితాన్ని, ధనాన్ని ఇతరుల కొఱకు వెచ్చించటానికి ఇష్ట పడ్తారు. ఆ అమృతత్వాన్ని పొందగలుగుతారు.

ధనాని జీవితంచైవ పరార్థే ప్రాజ్ఞ ఉత్సృజేత్।
సన్నిమిత్తే వరం త్యాగో వినాశే నియతేసతి॥

తినటం, కనటం వఱకే పరిమితమైన తక్కినవారు కొందఱు జనాభా లెక్కలలో మాత్రమే పరిగణింప బడుతూ జీవచ్ఛవాలలాగా కాలం గడుపుతారు. ఒక విధంగా చెప్పాలంటే జీవులు రెండు రకాలు. భౌతికంగా మరణించినా అందరి హృదయాలలో చిరకాలం బ్రతికి ఉండేవారు కొందరు. జీవించియుండి మృతప్రాయులైన వారు మఱికొందరు. ప్రత్యక్ష ప్రమాణమైన ఈ సంగతి, లోకంలో మనకందరకు అనుభవ సిద్ధమే. అందుకే గుణధర్మములు ఎవరియందు ఉంటాయో వారు కల కాలం జీవించి ఉంటారు. అవి లేనివారి జీవితం కేవలం నిష్ఫలమే అవుతుంది అన్నారు పెద్దలు.

స జీవతి గుణాయస్య ధర్మో యస్య స జీవతి।
గుణ ధర్మ విహీనో యో నిష్ఫలం తస్య జీవితమ్॥
(సుభాషిత రత్న భాండాగారమ్)

ఎవరెంతకాలం జీవించారు? భూమిమీద వారేమేమి పనులు సాధించారు? వారి కెంతమంది సంతానం? వారెంత ధనం సంపాదించారు అనేది ఇక్కడ నిజమైన లెక్క కాదు. అమృతత్వానికది సరియైన మార్గం కానేకాదు. జీవులకు అట్టి ఉత్కృష్ట

స్థితి ఒక్క త్యాగం వల్లనే సిద్ధిస్తుంది. కావుననే వేద శిఖలైన ఉపనిషత్తులు 'న కర్మణా న ప్రజాయా, ధనేనవ, త్యాగేనైకే నామృతత్వ మానశుః' అని ప్రబోధించాయి.

త్యాగమంటే "విడుచుట" అని అర్థం. తానుతిని తిరుగుతూ జీవితంలో హాయిగా అనుభవించటానికి వీలున్న సుఖాన్ని మరియొకరి కోసం వినియోగ పరచట మన్న మాట. ప్రకృతిలోని అనేక ప్రాణులు సంఘజీవితాన్ని గడుపుతున్నాయి. ప్రయోజనాన్ని పొందుతున్నాయి. మానవుడు కూడా సంఘ జీవితానికే అలవాటు పడ్డాడు అందుకు అవసరమైన వసరులు పెక్కు ఏర్పాటు చేసుకొన్నాడు. వ్యక్తి, సమాజము పరస్పరాశ్రయములై పరస్పర పోషకములవుతున్నాయి. మానవుని యొక్క సాంఘిక జీవితంలో ప్రథమ దశ కుటుంబం. ఆ కుటుంబంలో స్త్రీ పురుష లిరువురు స్వార్థరహితులై ఒకరికొకొకరు తమ అవసరాలను సర్దుబాటు చేసుకొని అభిరుచులను మార్చుకొని, అభిమానాన్ని ఇచ్చిపుచ్చుకొనే రీతిలో ఒకరు మరొకరి కోసం తమసుఖం త్యాగం చేసుకొనటంతో అభావం ప్రారంభమౌతుంది. తల్లిదండ్రులు బిడ్డల కోసం, బిడ్డలు తల్లిదండ్రులకోసం సుఖాన్ని పంచి పెట్టడంతో పెరిగి, ఇరుగు పొరుగు వారితో కలిసి మెలసి బ్రతికే పద్ధతిలో పెద్దదై, సమాజం, దేశం, ప్రపంచం అన్న క్రమంలో ఆ ఆలోచన వృద్ధిపొంది, సమైక్యత సమగ్రతలతోబాటు సమభావం పలంగా అది విశ్వరూపం దాల్చి విరాజిల్లుతుంది. "నేను" "మనము" కావటానికి, "జనం" "జాతిగా" బ్రతకటానికి, ఈ త్యాగ భావన ఎంతో అవసరం. దానికి ప్రతి ఫలాపేక్ష అనేది లేదు. ఇట్టి త్యాగం వలన లభించేది శాంతి. (త్యాగాత్ శాంతి రనంతరం. గీత.)

ఈ శతాబ్దంలో జరిగిన మనదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహానుభావులు తమ మన. ధన ప్రాణములను సమర్పించి. దేశ సౌభాగ్యానికి దోహదం చేసి అమర వీరులయ్యారు. చిరస్మరణీయులైన ఆ మహాత్ములకు వినయంతో శిరసు వంచి కృతజ్ఞతలు ఘటించటం మన కర్తవ్యం. అట్టి వారిలో భగత్‌సింగ్, చంద్రశేఖర అజాద్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, అల్లూరి సీతారామరాజు, నేతాజీ, సుభాస్‌చంద్రబోస్ వీరసావర్కార్ మొదలైన వారెందరో ఉన్నారు. ఆ కృషిలో వారు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించి, జాతికి దేశానికి విశేషంగా సేవచేసి మన్ననలు అందుకొన్నారు ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రావతరణకై సంకల్పించి అసువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు అమరజీవియై ఆంధ్రజాతి బ్రతికి ఉన్నంత కాలం

గుర్తుంచుకోదగిన శాశ్వత కీర్తి గడించుకొన్నాడు. ఇంకెందరో అజ్ఞాత వీరులు వారందరికి వందన సహస్రములు. అనైక్యతతో పోగొట్టుకొన్న స్వాతంత్ర్యాన్ని సంఘటనా భావంతో సంపాదించుకొగలిగాము. ఇంక ఐకమత్యంతోనే దాన్ని నిలబెట్టు కోవాలి త్యాగం, సమభావం దానికి సరియైన మార్గం. వృక్షం తన శిరస్సుతో ఎండను భరిస్తూ తనచుట్టూ ఉన్న తక్కిన జీవులకు నీడను ప్రసాదిస్తున్నట్లే సుజనులైన వారు తాము స్వయంగా కష్టాలను అనుభవిస్తూ ఇతరులకు సుఖాలను ఘటింప గలుగుతారు. ఇది వారి స్వభావం. ఇట్టి వారెందరో శ్రమించి సాధించి మనకు మిగిల్చిందే ఈ చరిత్ర, సంస్కృతి. అందులో మంచి గ్రహించటమే విజ్ఞత అనిపించు కుంటుంది.

శిరసా తపనం ధృత్వా ఛాయాం యచ్ఛతి పాదపః।
అనుభూయ స్వయం కష్టం సుజనోఽన్య సుఖప్రదః॥

ఇట్టి సంప్రదాయం మన పురాణ పురుషులతో ప్రారంభమైంది. అందు కర్ణుడు చర్మాన్ని, శిబి మాంసాన్ని, దధీచి వెన్నెముకను, జీమూత వాహనుడు జీవితాన్ని పరుల సుఖం కొఱకు ఇచ్చారు. మహాత్ములకు ఇవ్వలేనిదంటూ ఉండదు కదా!

త్వచం కర్ణః శిబి ర్మాంసం జీవం జీమూత వాహనః।
దదౌ దధీచి రస్థీని నాస్త్యదేయం మహాత్మనామ్॥

సంభృతార్థములు త్యాగమునకే వినియోగించిన వాడు రఘువంశ మహారాజులు (కాళిదాసు రఘువంశం) వారిలో దశరథ రాముడు విశిష్టుడు. ఆ రాముని చరిత్ర రామాయణంగా రచించాడు వాల్మీకి. అందు ధర్మ స్వరూపుడైన రాముడు అర్థకామముల యెడ వ్యామోహం విడిచిపెట్టి, త్యాగభావంతో రక్తపాతం లేకుండా కుటుంబ సమస్యలను పరిష్కరించాడు. తద్వారా సమాజ శాంతికి శ్రేయస్సునకు భంగం వాటిల్లకుండా చేశాడు. సహనంతో రాష్ట్ర ప్రజానీకాన్ని రక్షించాడు. పరిపాలనా దక్షుడనిపించుకొన్నాడు.

సుమిత్రా తనయుడు, ఆ రామునకు ప్రియమైన తమ్ముడు అయిన లక్ష్మణుడు అన్నకు బహిఃప్రాణము. లక్ష్మీ సంపన్నుడైన అతడు అన్నివిధాలా రాము ననుసరించి, అన్నకు తగిన తమ్ముడనిపించుకొన్నాడు. అతనిని తొలుతగా పరిచయం చేస్తూ వాల్మీకి ఇలా చెప్పాడు.

బాల్యా త్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మి వర్ధనః।
రామస్య లోక రామస్య భ్రాతు ర్జ్యేష్ఠస్య నిత్యశః॥
సర్వప్రియకర స్తస్య రామస్యాపి శరీరతః।
లక్ష్మణో లక్ష్మీసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః॥
బా. కాం. 18స. 29,30 శ్లో

తండ్రిమాట పాటించి రాము డడవులకు పోవునప్పుడా లక్ష్మణుడు సహితం స్నేహంతో, వినయ సంపదతో అన్నవెంట అడవులకు వెళ్ళి తన సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శించు కొన్నాడు.

తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామహ।
స్నేహా ద్వినయ సంపన్నః సుమిత్రానందవర్ధనః॥
భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్ర మనుదర్శయన్।
బా. కాం. 1స. 25,26/1శ్లో

ఏ సుఖం లేకుండా పదునాలుగేండ్లు అన్నతోబాటు అరణ్యాలలో ఉండి కష్టాలనుభవించి, రావణ సంహారానంతరం రాముడయోధ్యలో పట్టాభిషిక్తుడై రాజ్య మేలే రోజుల్లో అన్నకు బాసటయై ఉండి రాజ్యతంత్రములలో సాయపడుతూ వచ్చాడు.

దుష్ట శిక్షణతోబాటు రాజ్యపరిపాలనా వ్యవస్థను సుస్థిరం చేసిన రాముని "అవతారం చాలించి తిరిగి వైకుంఠానికి రావలసిందిగా" బ్రహ్మ యముని ద్వారా కబురు పెట్టాడు. ఆ యముడు ముని వేషంలోవచ్చి రామునితో తనకు ప్రత్యేక సమావేశం కావాలని కోరాడు. ఆ దేవ రహస్యం వినిపించే సమయంలో వారిరువురి సంభాషణ మరెవ్వరు వినకూడదని కాబోలు "లోనికి ఎవ్వరూ ప్రవేశింపరాదని అట్టి నియమోల్లంఘన చేసిన వారికి శిరచ్ఛేదమే శిక్ష" అని ఆ ముని ఆంక్ష విధించాడు. రాముడందుకు అంగీకరించి, మందిర ద్వార పాలకునిగా ఉన్న దౌవారికుని పంపించి, లక్ష్మణుని ఆ స్థానంలో ఉండమని నియమించాడు. తనను చూడటానికై ఎవరైనా వస్తే, ఇప్పుడు వీలుకాదని చెప్పమన్నాడు. ప్రసంగం ప్రారంభమైంది. యముడు తాను తెచ్చిన బ్రహ్మ సందేశాన్ని వినిపించాడు. అది విన్న రాముడు అందుకు నేను సిద్ధంగానే ఉన్నానని తన అభిప్రాయం వివరించాడు.

ఈ మధ్యలోనే అక్కడికి దుర్వాసుడు ఎక్కడినుండో హఠాత్తుగా ఊడి పడ్డాడు. తనకు ఆ క్షణంలో రామ సందర్శనం కావాలని, ఆలస్యమైతే తన ప్రయోజనం వ్యర్థమై పోతుందని పట్టుపట్టాడు.

రామం దర్శయ మే శీఘ్రం, పురా మేఽర్థోఽతివర్తతే।
ఉ॥ కాం॥ 105 స. 2/2/శ్లో

లక్ష్మణుడు వినయంతో ఆ మునికి నమస్కరించి రాముడిప్పుడు కార్యాంతర వ్యగ్రుడై ఉన్నాడు రావటానికి సమయం పడుతుంది. ఒక్క ముహూర్తం వేచి ఉండవలసిందని కోరుతూ, ఈ లోగా మీకేమి కావాలో చెప్పండి నేను సిద్ధం చేస్తానని విన్నవించాడు.

కిం కార్యం బ్రూహి భగవన్ కోహ్యర్థః కిం కరోమ్యహమ్।
వ్యగ్రో హి రాఘవో బ్రహ్మన్ ముహూర్తం పరిపాల్యతామ్॥ 105 స. 4శ్లో

ఋషి శార్దూలుడైన ఆ దూర్వాసు డది విని, అన్యునివలె నన్ను నిరోధిస్తావా? అని క్రోధకలుషిత హృదయుడై, కన్నుల నిప్పులురాల, లక్ష్మణా! "ఈ క్షణంలో నారాక రామునికి నివేదించు అట్లా కాని పక్షంలో నిన్ను, నీ రాజును, భరతాదులను, మీ సంతానాన్ని, ఈ పురాన్ని, రాష్ట్రాన్ని కూడా శపిస్తా"నని అపుకో లేని కోపంతో పలికాడు.

విషయం త్వాం పురం చైవ శపిష్యే రాఘవం తథా।
భరతం చైవ సౌమిత్రే! యుష్మాకం యాచ సంతతిః॥
నహి శక్ష్యా మ్యహం భూయో మన్యుం ధారయితుం హృది॥
105 స. 7 శ్లో

దారుణములైన ఆ మహాత్ముని వాక్కులు విన్న లక్ష్మణునికి అప్పుడేమి చేయాలో పాలు పోలేదు. ఒకప్పుడీముని కుపితుడై ఇంద్రుని సంపదలన్నీ సముద్రంపాలు చేశాడు. తపోమహిమ గలిగిన ఈతని మాటలకు లోకంలో తిరుగు లేదు. ఇప్పుడీ మునిని రాముని సందర్శనానికి లోనికి పంపితే, ముందుగా చేయ బడిన నియమం ప్రకారం శిక్ష అమలు జరిగి, బ్రహ్మహత్యా దోషం తనకు సంభవిస్తుంది. తానేవెళ్ళి విషయం వినదిద్దామనుకొంటే, తనకూ ఆ శిక్ష తప్పదు.

అలస్యంచేస్తే ముని మండి పడుతున్నాడు. లక్ష్మణునకిది పెద్ద పరీక్షా సమయం "ముందు నుయ్యి, వెనుక గొయ్యి."

ఏదైనా ఒక క్లిష్ట సమస్య ఎదురై ఆపదలు ముట్టుముట్టినప్పుడు ధైర్యంగా నిలబడి సరియైన నిర్ణయం చేయటం వివేకవంతుని లక్షణం. దృఢమైన చిత్తంతో లక్ష్మణుడా సమయంలో బాగా ఆలోచించి ఆత్మత్యాగానికే సిద్ధపడ్డాడు. రాజు రాష్ట్రము, ప్రజలు నశించి, తాను బ్రతికి ఉంటే మాత్రం ఏమిటి ప్రయోజనం? ఆ తర్వాత మిగిలేదేముంది? బూడిదతప్ప. అట్లాకాకుండా ఇప్పుడు తానొక్కడూ పోయినా, తన వారందరికి సుఖం లభించేటట్టుగా ప్రవర్తించుటే యుక్తమని, అప్పటి కదే తన కర్తవ్యమని భావించి, ఆ వెంటనే లక్ష్మణుడు రాఘవునకా వార్త నివేదించాడు.

ఏకస్య మరణం మేఽస్తు మాభూ త్సర్వ వినాశనమ్।
ఇతి బుద్ధ్యా వినిశ్చిత్య రాఘవాయ న్యవేదయత్॥ 105 స. 9 శ్లో

ఇది లక్ష్మణుని అపారమగు రాజభక్తికి, రాష్ట్ర భక్తికి తార్కాణం. విషయం విన్న రాముడంత యముని సాగనంపి మునిని సందర్శించి "నేను చేయదగిన పనియేమో సెలవి"మ్మని అడిగాడు. అప్పుడాతడు సంతోషించి "నేను చాలా కాలం నుండి ఉపవాసవ్రతము పాటించి. తపశ్చర్య గావించి, ఈనాడు స్వయంగా నీయాతిథ్యం స్వీకరింపవచ్చానని నా ఆకలి తీర్చమని వివరించాడు. రాముడాతనికి ఇష్టమృష్టాన్న భోజనంపెట్టి సంతుష్టుని చేశాడు. ముందుగా రాముని సందర్శనమే ఆ యోగికి విందై పరమానందం కలుగజేసింది "శుభమని" మహర్షి దుర్వాసుడంత రాముని ఆశీర్వదించి, తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు

ఇతరులకొక ధర్మం తనవారికొక ధర్మం, అంటూ ఆచరణలో భేదం పాటించని రాజుగా రాముడు సభచేసి అష్టమంత్రులతో చర్చించి, ధర్మశాస్త్ర కోవిదులు నిర్ణయించిన ప్రకారం ఆ లక్ష్మణునకు మరణశిక్షతో సమానమైన దేశ బహిష్కార శిక్ష విధించాడు. కాని నాడు రాముడు "ఒకేమాట" (రామోద్విర్నాభిభాషతే) కల వాడని కీర్తింపబడేవాడు కాడు ఆ విధంగా రామునిచే పరిత్యజింపబడి లక్ష్మణుడంత, అయోధ్య వీడి, సరయూ నదిలో ప్రవేశించి, శరీరం విడిచిపెట్టి, దివికి వేగాడు. ఇట్టి త్యాగమయ జీవితం లక్ష్మణునికి అమృతత్వాన్ని కలిగించింది.

ప్రపంచాని కాదర్శంగా నిలిచింది. ఎందరో దేశభక్తులకు ఆ పుణ్యాత్ముని కథ, స్ఫూర్తినిచ్చి, చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృషించింది.

అన్నగా రాముడు, తమ్ముడు లక్ష్మణుని విడిచి పెట్టవలసి వచ్చినందుకు ఎంతగానో చింతించాడు. అతని ఉపకార బుద్ధిని ప్రశంసించాడు. అతనిని విడిచి నేనెలా ఉండగలనని విలపించాడు.

కటకట యేల యిచ్చటికిఁగాలుడు వచ్చె? మహా ప్రతిజ్ఞ యే
మిటికి నొనర్చితిన్ సుజన మిత్రుని నా సహజున్మఁబాసినే
నెటువలె నిల్తు? నెట్లు వచియింపుదు నివ్వెడమాట? యెవ్వరున్
గటికి మనంబు తోడ నవకార్యము లిట్టివి యాచరింతురే?
ప్రక్కఁద నాంగనా సౌఖ్యముల్ వర్జించి. నా తోడఁ దొల్లి కానలకు వచ్చె!
నెడపక పదునాలుగేండ్లు నిద్రాహారములుమాని నాకు సేవలు ఘటించె;
సీతఁబాసిన వంత జెందనీయక ధైర్యమొదువ మాటాడి నన్ను పచరించె
రణరంగమున మదర్థమ్ముగా నతికాయ శక్రజిత్ప్రముఖుల సంహరించె.
హృదయ మెఱిగి ప్రవర్తించె విన్నినాళ్ళు, నిట్టిహితు నిట్టివిశ్వాసి, నిట్టియాప్తు
విట్టి తమ్ముని బ్రతినకై యెట్లనొంతు. నేమిసేయుదు? దుర్దైవ మెంత సేసె"
కంకంటి, ఉ రా., 8 ఆ 214 215 ప

ఇక ఈనాటి సమాజంలో తన పదవి కొఱకు, తనవారి సుఖం కొఱకు తన వైభవ ప్రాభవముల కొఱకు దేశాన్ని సంస్కృతీ సంపదల్ని పణంగాపెట్టి ఉన్నతిని పొందాలని చూచే స్వార్థజీవులే ఎక్కువగా దర్శనమిస్తారు. ఇట్టి స్థితిలో మనకు ఆత్మార్పణము ద్వారా దేశభక్తిని మనస్సులందు వెలయింప చేసిన లక్ష్మణుని చరిత్ర అతి పవిత్రం. అనుసరణీయం అవుతుంది.

ఈ భూమి మీద తాను శాశ్వతం కాదు. తన అధికార సంపదలు అంతకంటే శాశ్వతం కాదు. కాని అవి శాశ్వతములయినట్లే భ్రమింపజేస్తాయి. అశాశ్వతములైన వానికోసం, పుణ్యకర్మల ద్వారా సాధింప దగిన శాశ్వత సత్య ధర్మములను, త్యాగ నిరతివలన కలిగే సత్కీర్తిని విడిచి పెట్టరాదు. అశాశ్వతములైన కేవల అధికార సంపదలకే ప్రాకులాడినప్పుడు శాశ్వతములైన సత్యధర్మములు దూరమైపోతాయి. "ఉన్నది పోయింది, ఆశలు పెంచుకున్నది పోయింది" అన్నట్లు ఉభయ భ్రష్టత సిద్ధిస్తుంది. గట్టి కొమ్మని విడిచిపెట్టి, విగురు కొమ్మనుపట్టుకొంటే, అది కాస్తా విరిగి క్రిందపడి ప్రమాదం పాలవుతాడు.

యో ధృవాణి పరిత్యజ్య అధ్రువం పరిషేవతే।
ధృవాణి తస్య నశ్యంతి అధృవం నష్టమేవహి"

కావునే లోకంలో ఎందరో మహాత్ములు ఈ పరమ సత్యాన్ని గుర్తించారు. త్రికరణ శుద్ధితో ధర్మం ఆచరించారు.

ఒకరు భక్తితో గుళ్ళు గోపురాలు కట్టించి, స్థలాలు పొలాలు దానమిస్తే మరియొకరు ప్రేమతో అన్నసత్రాలు పెట్టించి, విద్యాలయాలు వైద్యశాలలు, కట్టించారు. వేరొకరు రోడ్లు పోయించి చెట్లు నాటిస్తే, ఇంకొకరు చెఱువులు బావులు త్రవ్వించి, అవసరమైనచోట చలివేంద్రాలు స్థాపించారు. కన్న సంతానంతోబాటు సప్తసంతానములుగా కీర్తిగన్న ప్రజోపయోగములైన కార్యక్రమాలెన్నో చేపట్టి శాశ్వతత్వాన్ని సాధించారు. అమృతత్వాన్ని పొందగలిగారు. "సప్త సంతానములలో ప్రశస్తిగాంచి, ఖిలము గాకుండునది ధాత్రికృతియగా"(మను చ.) తెలిసికొని కొందరు కావ్యాలు వ్రాశారు. వ్రాయించారు. ఇంకొందరు ఎవరో వ్రాసిన వానిని ప్రకటింపజేశారు. ఆ అందరి పుణ్య సంపదవలన మనమీనాడు ప్రాచీనమైన కళాక్షేత్రాలను, గ్రంథాలయాలను, మరి ఇంకెన్నింటినో విశేషములను చూడగలుగుతున్నాం. శాస్త్ర విజ్ఞానం తెలుసుకో గలుగుతున్నాం. దేశ సంస్కృతీ సంపదల కవి బీజప్రాయములై నేడు ప్రపంచ మంతటా విస్తరిల్లుతున్నాయి.

ఈనాడు కూడా కొందరు వ్యక్తిగతంగాను, సేవా సంస్థల ద్వారాను, ప్రజాహితాన్ని కోరి ఎన్నో త్యాగాలు చేయటం అభినందనీయమైన విషయం. ప్రత్యేకించి దేశరక్షణకు కంకణం కట్టుకొని, సరిహద్దు ప్రాంతాలలో కాపలాకాస్తూ, శత్రువులు దండెత్తి వచ్చినపుడు ప్రాణాలు సహితం తృణప్రాయంగా భావించి, వీరోచితంగా పోరాడి, కర్తవ్యపాలనలో అప్రమత్తులై ప్రవర్తిస్తున్న మన త్రివిధ దళ సైనికులు ప్రశంసా పాత్రులవు తున్నారు. అవక్రమైనవారి పరాక్రమ సంపదయే దేశ సౌభాగ్యానికి పెట్టని కోట. స్త్రీ పురుషులెందరో దేశ సంరక్షణ కొరకు తమ మాన ప్రాణములు సమర్పించి ధన్యజీవులైనారన్న చరిత్ర సత్యం మరువరానిది.

ఉపకర్తుం, ప్రియంవక్తుం కర్తుం స్నేహ మకృత్రిమమ్ ।
సజ్జనానాం స్వభావోయం కేనేందుః శీతలీకృతః ॥
సుభాషిత రత్నభాండాగారమ్ ॥

ఏ దేశ స్వాతంత్ర్య, సంపదలు తమకు జీవితానందములను ప్రసాదిస్తున్నాయో ఆదేశం కోసం అందరి ప్రజలందరు అట్టి త్యాగం చేయటానికై సంసిద్ధులు కావాలి. లక్ష్మణుని వంటి దేశభక్తులంతటా ఉంటే ఏనాడైనా ప్రభుత్వానికి, దేశానికి భద్రత లభిస్తుందనటం నిర్వివాదాంశం.

లక్ష్మీ సంపన్నుండౌ లక్ష్మణు చారిత్రము సకల శుభం కరమై,
సూక్ష్మాంశంబుల దెలిపెడు నీక్ష్మాప్రజ కతని త్యాగ మెన్నగవశమే (రచయిత)

రామాయణంలో ఇట్టి త్యాగనిరతి మానవులందేగాక పశుపక్ష్యాదులలోకూడా దర్శన మివ్వటం విశేషం సీతాపహరణ సందర్భంలో జటాయువు (పక్షి) తన కళ్ళముందు జరిగే అన్యాయాన్ని చూచి సహింపలేక, రావణుని అకృత్యమును నిరసించి. అతని దౌర్జన్యమును నిందించి, ధైర్యంతో అతని నెదిరించాడు. తనశక్తి మేరకు రావణునితో పోరాడి అతని మార్గాన్ని నిరోధించటానికి ఎన్నో విధాల ప్రయత్నించాడు. తుదకు రావణుని ఖడ్గప్రహారానికి గురియై ఱెక్కలు విఱిగి, నేలపై కుప్పకూలి పోయాడు. సీతజాడ రామునికి తెలియజేయాలని వారు వచ్చేంతవఱకు ప్రాణాలు. ఉగ్గబట్టుకొని ఉండి, తన కర్తవ్యం నిర్వర్తించి. తుది శ్వాస విడిచాడు. ఒకప్రక్క మరణ యాతన ననుభవిస్తూ. ప్రాణం విడిచి పోయేటప్పుడు కూడా తనజీవితం ఇతరులకు ఉపయోగపడాలని కోరుకొన్నాడు. ఆ విధంగా తన పౌరుష, బలములు సార్థకం చేసుకొన్నాడు.

తమ క్షేమంకోరి ప్రాణాలర్పించిన ఆ జటాయువు త్యాగాన్ని గూర్చి రాముడే ప్రశంసించాడు. "లోకంలో ఇప్పుడు తిర్యక్కులందు కూడ ధర్మానువర్తులు శూరులు శరణ్యులు అయిన వారుండటం చూస్తున్నాం. ఈ జటాయువు మరణం సీతాపహరణం కంటే, నాకు మిక్కిలి దుఃఖకరంగా ఉంది. తండ్రియు, మహాయశోధనుడునైన దశరథ మహారాజువలె ఈ తడు నాకు పూజనీయుడు. మాన్యుడు అగుచున్నాడని అతనిని గౌరవంతో సంభావించాడు.

సర్వత్ర ఖలు దృశ్యంతే సాధవో ధర్మచారిణః
శూరా శ్శరణ్యా స్సౌమిత్రే తిర్యగ్యోని గతేష్వపి॥
సీతాపహరణజం దుఃఖం న మే సౌమ్య! తథా గతం।
యథా వినాశే గృధ్రస్య మత్కృతేచ పరంతప॥

రాజా దశరథ శ్రీ మాన్ యథా మమ మహాయశాః ।
పూజనీయశ్చ మాన్యశ్చ తథాయం పతగేశ్వరః ॥
వా. రా. అర. కాం. 68 స. 24-26 శ్లో.

అంతట రాముడాతనికి స్వయంగా దహన సంస్కారాదికములు నిర్వర్తింప నిశ్చయించాడు. యజ్ఞశీలులు, ఆహితాగ్నులు, యుద్ధమున వెనుతిరిగి వెన్ను చూపని వీరులు, భూదాన మొసగించినవారు, పొంద దగిన ఉత్తమ లోకములను జేరగలందుల కై అభిలషించాడు.

యా గతి ర్యజ్ఞ శీలానా మాహితాగ్నేశ్చ యా గతిః ।
అపరావర్తినాం యాచ యాచ, భూమి ప్రదాయినామ్ ॥
మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకా ననుత్తమాన్ ।
గృధ్రరాజ! మహాసత్వ సంస్కృతశ్చ మయా వ్రజ ॥
68 స 29-30 శ్లో.

పరత్రాణ పరాయణులు, కృపావంతులు అయినవారు ఇట్టి త్యాగానికి పూనుకొనటం జరుగుతుంది. [అసలు రామాయణమే "క్రౌంచ పక్షిబాధగన్న వాల్మీకిలో పొంగి పొరలిన కరుణరసం"గా వెలుగొందటం విదితమే కదా.] త్యాగం ద్వారా అమృతత్వాన్ని పొందిన ఆ మహాత్ముల చరిత్ర మనకు స్ఫూర్తిని, విత్త సంస్కారాన్ని కలుగజేస్తుంది. ఈ విధంగా "రామాయణం - సమాజదర్పణం" గా విలిచి ప్రపంచ ప్రఖ్యాతి పొందగలిగిం దనటంలో సందేహం లేదు.

ఎవరు జీవింప జీవింతు రితరు లతని, జీవితమే జీవితము ధన్య జీవియతడు
కోరి తనపొట్టయే నింపుకొనెడువారి, జీవితములెల్ల నగువ్యర్థ జీవితములు
(రచయిత)

ప్రియము - హితము

లోకంలో మనకు ప్రియమైనవి చాలా ఉంటాయి. అందులో హితమైనవి కొన్ని మాత్రమే "ప్రియము" అంటే ఇష్టమని అర్థం. "హితము" అంటే మేలు అని అర్థం. హిత మొకప్పుడు ప్రియంకాక పోవచ్చు. ఒకొక్కప్పుడు ప్రియమైనవి కొన్ని హితమైనవి కూడా కావచ్చు. ఏది, ఏమిటనేది నిదానం మీద కానీ తేటపడదు. అందుకు చరిత్ర ప్రమాణంగా స్వీకరింపబడుతుంది. మహా పురుషుల నడవడి ఆదర్శంగా నిలుస్తుంది.

పెద్దలు పిల్లలను ఉదయాన్నే నిద్రలేపి, కాలకృత్యాలు తీర్చుకొని, శ్రద్ధగా బడికిపోయి, బాగా చదివి, "సమానానా ముత్తమ శ్లోకోభవ" నీసాటి వారిలో నీవు ఉత్తమ కీర్తి సంపాదించుకొమ్మని చెప్తారు. అందుకు కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేస్తారు. పిల్లల కప్పటి కది కష్టంగాను, నిర్బంధంగాను అనిపిస్తుంది. కానీ ఆ క్రమశిక్షణ తర్వాత జీవితంలో వారికి ఉన్నత స్థితిని కల్గిస్తుంది. చిన్నతనంలో పిల్లలకు సహజంగా ఉండే చపలత, అలసత్వం, ఆటలమీద ఆసక్తి, సుఖాభిలాష, వ్యసన సంసక్తి ఆ పెద్దల మాటలను లక్ష్యపెట్టనీయవు. అట్లా అని పెద్దలు ఊరుకొంటారా? వారి ప్రయత్నంవారు చేస్తారు. అపై ఎవరియోగ్యత వారిది. కృషినిబట్టి గదా! ఫలితం లభించేది.

ఆ పిల్లలు పెరిగి పెద్ద వారైన తర్వాత ఆ విద్య యొక్క విలువ తెలిసి, "ఆనాడు పెద్ద వాళ్ళు చెప్పారు. విని, ఆచరింపలేక పోయాం. ఆ విషయంలో మనం తోటివారిలో వెనక పడ్డాం" అని అప్పుడు పశ్చాత్తాపపడతారు. అప్పటికి గాని నిజంగా జీవితంలో వారేమి పోగొట్టుకొన్నారో వారికి తెలియదు. అందువల్ల ఇష్టంలేక పోయినా, ఆచరించటాని కప్పటి కది కష్టమే అయినా హితవచనాన్ని పాటింపవలసి ఉంటుంది. అది వారికి మేలు చేస్తుంది. ముందు ముందు చాలా ఉపకరిస్తుంది. ప్రపంచంలో అన్ని రంగాలలోను ఇదే తంతు.

కారణం ఏదైనప్పటికి ఒకప్పుడు ఆరోగ్యం బాగా దెబ్బతింటుంది. ఔషధసేవ చెయ్యాలి. అది చేదుగా ఉంటుంది. మానుకొంటామా? లేదే? అలా ఊరు

కుంటే రోగం ముదురుతుందని భయం. వైద్యులు వ్యాధివయమయ్యేందుకు పథ్యం చెయ్యాలంటారు. "పథ్య" మంటే (హితం) శరీరానికి మేలు చేసే పరిమితమైన ఆహార, విహారాలు. రోగికా పథ్యం రుచించదు. అది చెయ్యటం కష్టమనిపిస్తుంది అతని మనస్సు ఇష్టమైన పదార్థాల మీదకే పోతుంది. అవి రోగికి అపకారం చేస్తాయి. వైద్యులా జిహ్వా చాపల్యాన్ని మనస్చాంచల్యాన్ని అరికట్టి పథ్యంతో ఆరోగ్యాన్ని చేకూర్చటానికే ప్రయత్నిస్తారు. కాదని ఎవరైనా పథ్యం పాటించకపోతే రోగం తిరగబెడుతుంది. ప్రాణానికే ప్రమాదం సంభవిస్తుంది. ఆ భయంతోనయినా నియమాలకు కట్టుబడి ఉండాల్సిందే. లేనివాడు ముప్పు తప్పదు. పరిస్థితి చేజారి పోయిన తర్వాత ఏమనుకొని ఏం ప్రయోజనం? అందుకే "చేతులు కాలిన మీదట ఆకులు పట్టుకుంటే ఏమిటి లాభం?" అంటారు పెద్దలు. అట్లా కాకుండా ముందు గానే జాగ్రత్త పడాలి.

సాహిత్యం విషయంలో కూడా అంతే. "సరసమైన హితవచనాలనే సాహిత్యం" అంటారు. అది సంస్కారాన్నిచ్చి, సమాజానికి మేలు చేస్తుంది. వ్యక్తిత్వ నిర్మాణంతోపాటు, విజ్ఞాన వికాసములకు దోహదం చేసేది ఉత్తమ సాహిత్యం అవుతుంది. మానవ జాతికి సత్య, ధర్మముల స్వరూపం నిరూపించి, శాంతి-అహింసలను ప్రబోధించి, ప్రాణికోటియెడ కరుణామయమైన హృదయాన్ని పెంపొందించి, ఆనందానుభవ స్ఫూర్తితో, కర్తవ్య నిష్ఠను చేయటం దాని పరమ ప్రయోజనం. జాతి కది దివ్యౌషధం. ప్రజా జాగృతికది ఉత్తమ మార్గం. చైతన్య సౌధానికది పరమ సోపానం.

"క్రాంతదర్శి"యైన రచయిత సమాజానికి యథార్థమైన ప్రకృతి ధర్మాన్ని తెలియజేయాలి. పరిణామ శీలమైన ఈ సమాజం పెడదారి పట్టకుండా సత్య మార్గ దర్శి కావాలి. అట్టివాడు నిజమైన కవి. ఆ పరమార్థాన్ని ప్రసాదించేది నిజమైన కావ్యం. అదే అసలైన సాహిత్యం. చెడును ఖండించి, మంచిని రక్షించటం దాని ముఖ్య లక్షణం.

వాల్మీకి వ్రాసిన శ్రీమద్రామాయణంలో అట్టి కావ్య లక్షణం పరిపూర్ణంగా గోచరిస్తుంది.

శూర్పణఖ చెప్పిన మాటలువిని జనస్థానంలోని ఖరదూషణాది రాక్షసులు 14 వేల మంది రామునెదిరించి మరణించారు. రాముని యుద్ధ సంరంభం చూచి

భయపడి, పారిపోయి అకంపనుడు (గూఢచారి) లంకకుజేరి రావణునకీ వార్త విని పించాడు. సీతా సౌందర్య వైభవాన్ని అతని ముందు అభివర్ణించి ఆమె నపహరింప ప్రేరేపించాడు. అది విన్న రావణుడు మారీచుని ఆశ్రమానికివచ్చి తన దురాలోచన అతనికి వినిపించాడు. రాక్షసులకది స్వధర్మమట. అదే రాక్షసత్వ మన్నమాట. [పరస్త్రీల నపహరించటం, బలాత్కరించటం రాక్షసులకు స్వభావమని రావణుడే స్వయంగా సీతతో చెప్పాడు.

"స్వధర్మో రక్షసాం భీరు సర్వదైవ న సంశయః, గమనంవా పరస్త్రీణాం హరణం సంప్రమథ్యవా॥ సుం కాం. 20స. 5శ్లో]

"పాతివ్రత్యతేజంగల సీత, రాముని కంటే వేరు కాబోదు. ఆమె నపహరింప బూనటం నీకు తగిన పనికాదు. ఆమెను నిర్బంధించటం విప్పోడిని కట్టు కొన్నట్లే అవుతుంది సుమా!" అని చెప్పి మారీచుడు "రామునితో వైరం రాక్షస జాతి వినాశనానికే కారణ మవుతుంది. ఇంక కొంతకాలం మా అందరితో కలిసి నీవు సుఖంగా జీవించదలచుకొంటే, ఈ ధోరణి మానుకొని స్వదారనిరతుడవు కమ్ము. పొమ్మ"ని అప్పటికా ప్రయత్నం నుండి విరమింపజేసి రావణుని తిరిగి లంకకు పంపించాడు.

అంతలోనే బోరునఏడుస్తూ శూర్పణఖ అక్కడకు వచ్చింది. తనను కాపాడ లేని రావణుని అసమర్థ పరిపాలనను నిందించింది. యథార్థంగా అక్కడ జరిగిన విషయం మరుగుపరచి సందర్భానికి సరిగ్గా అతికేలాగా అబద్ధమాడింది. "రాముని భార్య సీత. చాలా అందగత్తె. ఆ సీతను నీ కోసం తీసుకొద్దామని ప్రయత్నం చేశాను. ఆ కారణంగానే శత్రువులచే నేనిలా పరాభవింపబడ్డా"నని లక్ష్మణుడు కోసిన తన ముక్కు చెవులు చూపించింది. అంతటితో ఆగక 'ఇప్పటికైనా ఆ జగ దేక సుందరి సీత నీకు కావాలనుకొంటే వెంటనే కదలి పొమ్మని తొందరపెట్టి రావ ణుని బయలుదేర తీసింది. ఔరా! రావణుడెంతటి చపలుడు? ఇంద్రియ లోలుడైన వాడెంత విద్యావంతుడైనా, అనుచితంగాను, అవాలోచితంగాను, ప్రవర్తిస్తాడనటాని కిదే ఉదాహరణం! ["బలవాన్ ఇంద్రియ గ్రామో విద్వాంసమపి కర్షతి"] సందర్భం మార్చి అన్నను తప్పు త్రోవ పట్టించిన శూర్పణఖ ఎంతటి మాయలాడి?

రావణుడు మరల మారీచాశ్రమానికివచ్చి సీతాపహరణోద్యమంలో తనకు సహకరింపుమని అతనిని కోరాడు. అందుకు మారీచుడా రావణునితో "ఓరాజా!

ముఖ ప్రీతికై ఇచ్చకాలాడేవారెందరైనా ఉంటారు. వారెక్కడైనా దొరుకుతారు. అప్పటికి ప్రియంకాక పోయినా, పథ్యమైన (హితాన్ని కూర్చే) పలుకు పలికే వారు బాలా అరుదు. ఒక వేళ మొహమాటం లేకుండా ఎవరైనా తమకు హితమైన మాటచెప్తే అది వినేవారూ లేరు. ఇదే లోక ప్రవృత్తి" అని వివరించాడు

సులభా పురుషా రాజన్! సతతం ప్రియ వాదినః।
అప్రియస్యచ పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః॥ అర. కాం. 37స. 2శ్లో

చపలులై, వారధర్మం బాగా నిర్వహింపలేని, స్వార్థపరులైన నీవారు నీకు ఇష్టమైన మాటలే చెప్పారు కానీ, మహావీర్య గుణోన్నతుడైన రామునిగూర్చి, అతని పరాక్రమమును గూర్చి చెప్పినట్లులేదు అందువల్లనే నీవు అతని విషయం తెలిసికొనలేక పోవుచున్నావు. (37/3శ్లో) రాముడు సామాన్యుడుకాడు. బలవద్విరోధము నీకు యుక్తముకాదు. 'లంకకుబోయి, విభీషణుని ముందట ధర్మాత్ములైన మంత్రులతోగూడి ఇందలి గుణదోషములు చర్చించి. హితాహితములు, బలాబలములు నిర్ణయించుకొమ్మని చెప్పి. ఇప్పటున క్షమయే నీకు కర్తవ్య"మని రావణునికి మారీచుడు హితము బోధించాడు (అర. కాం. 37స 22-24 శ్లో॥లు)

లోకంలో హితము, మనోహరము అయిన వాక్కులు లభించటం అరుదు. (హితం మనోహారిచ దుర్లభం వచః! భారవి 1/4 శ్లో) కావున పతనోన్ముఖుడైన రావణునకు హితవచనములు నచ్చలేదు.

అకంపనుడు, శూర్పణఖ వరుసగా చేసిన దుర్బోధలే అతని హృదయంలో బాగా నాటుకొని రావణుని అపమార్గం పట్టించి, సీతాపహరణానికే ప్రోత్సహించాయి. సర్వవినాశనానికి హేతువులైనాయి చారచక్షువైన ప్రభువునకు కార్యనియుక్తమైన అతని పరివారమెన్నడు అయథార్థం చెప్పి వంచింపబూనుట తగదు. 'సీత గురించి చెప్పి. ఆమె నెత్తుకురమ్మని నిన్ను ప్రేరేపించినవారు నిజంగా నీకు మిత్ర రూపమున గోచరించు శత్రువులే యని చెప్పి. ఆ విధంగా వారు రాక్షసజాతికే అపకారం తలపెట్టారని వివరించి మారీచుడు ముందుగానే రావణుని హెచ్చరించాడు.

ఆఖ్యాతా కేన సీతా సా మిత్రరూపేణ శత్రుణా।
త్వయా రాక్షసశార్దూల! కో ననందతి నిందితః
సీతా మిహానయస్వేతి కో బ్రవీతి బ్రవీహి మే॥

రక్షోలోకస్య సర్వస్య కశ్శృంగం ఛేత్తు మిచ్ఛతి।
ప్రోత్సాహయతి కశ్చి త్త్వాం స హి శత్రు రసంశయః॥
వా. రా. అర. కాం. 3!స. 41, 42 శ్లో

మూర్ఖుడైన రావణుడు మంచి గ్రహించటం మానేసి తా ననుకొన్నంత పని చేశాడు. లంకలో నిర్బంధింపబడ్డా, సీత ఎంతో ధైర్యంతో తన పాతివ్రత్యాన్ని తాను కాపాడుకోగలిగింది. రావణుని అధికార సంపదలు ఆమెను ప్రలోభ పెట్టలేక పోయాయి.

తీరా రాముడు వానర సైన్యంతోగూడి లంకపై దండెత్తిరాగా, కర్తవ్యాన్ని నిర్ణయించటానికి రావణుడు అత్యవసరంగా, మంత్రి మండలి సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. అందులో ఎవరికివారు సపరివారంగా రాముని సంహరించటానికి నేనంటే నేనని ముందుకువచ్చారు. ఈ సమయంలో మా బల పౌరుషములు విశిష్టంగా ప్రదర్శిస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారు, 'ధర్మమూర్తి' యని కీర్తిగన్నవాడు, (విభీషణస్తు ధర్మాత్మా, నతు రాక్షస చేష్టితః అర. కాం 17స. 24/2 శ్లో) రావణుని చిన్నతమ్ముడు అయిన విభీషణుడు మాత్రం. రామునితో వైరంవలదనీ సీతను అతనికి ఇచ్చివేయుమని హితము తథ్యము (సత్యము) నైనమాట చెప్పాడు.

ప్రసాదయే త్వాం బంధుత్వా త్కురుష్వ వచనం మమ।
హితం తథ్య(పథ్య) మహం బ్రూమి దీయతా మస్య మైథిలీ॥
వా. రా. యు. కాం 9స. 21 శ్లో

ఇంకను, నీ 'కోపమే నీ శత్రువు. అది నీ సుఖధర్మములను హరిస్తుంది. నీ ధర్మమే నీకు రక్ష. అది నీకు ప్రీతిని, కీర్తిని ప్రసాదిస్తుంది. అందువల్ల రామునకు సీతనిచ్చి నీపుత్ర కళత్రబాంధవులతోగూడి చిరకాలం జీవింపుమని విన్నవించాడు. (యు. కాం. 9స. 23 శ్లో)

ఇందులో రావణుడెవరి మాటా పాటింపలేదు. తన దుశ్చేష్టలద్వారా సమూలమైన ఆత్మ వినాశనాన్నే కొనితెచ్చుకొన్నాడు. ఎవరు తీసుకొన్న గోతిలో వారే పడతారన్నది సత్యమే కదా!

సమాజంలోని మంచి, చెడు అనే రెండు విరుద్ధ ప్రకృతులను ప్రదర్శించి, ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో, ఏది సత్యమో, ఏది వ్యామోహజనకమో, ఏది

యుక్తమో, ఏది అయుక్తమో, ఏది ధర్మమో, ఏది అధర్మమో నిరూపించింది రామాయణం అన్ని కాలకాలోను. అన్ని దేశాలలోను, ప్రాణులందరిలోను ఈ మంచి చెడుల మధ్య సంఘర్షణ తప్పదు, తాత్కాలికంగా అధర్మానిదే పైచేయిగా కనబడి లోకాన్ని భ్రమింపజేసినా తుదకు ధర్మమే జయిస్తుంది. ఇది పరమ సత్యం. ఇదే రామచరితలోని పరమార్థం. ఆ రహస్య కథనమే ఆ కావ్యానికి అజరామరమైన ఖ్యాతి సంపాదించి పెట్టింది. సార్వజనీనతను సిద్ధింపజేసింది. తరాలు మారినా, మానవుల అంతరాలు మారవని, బలహీనతలను అధిగమించటమే మానవతఅని, మానవత్వమే మహనీయతను సంతరించి పెడుతుందని, దాని పరిపూర్ణతకు ప్రయత్నించటమే పరమ లక్ష్యమని నిరూపించింది. ప్రపంచానికే ఆదర్శాన్ని ప్రదర్శించింది.

పథ్యమైన ఆహారం ఆరోగ్యకరమై ప్రాణులకు మేలు చేస్తుంది. రామాయణం ప్రపంచానికే పథ్యమై మానవతను ప్రసాదించటానికి సమర్థమవుతుంది. అట్టి పథ్యమైన వాక్కు లోకహిత నిష్ఠుడైన వాల్మీకి నోట వెలువడింది. మానసిక రుగ్మతలకు, (వ్యసనములకు) లోనై చపల బుద్ధులైన వారికి ఆ ఋషివాణి ఆరోగ్యవంతమైన ఆలోచనాధోరణిని, సక్రమమైన ఆచరణ విధానాన్ని కలుగజేస్తుంది.

ఆధునిక యుగంలో కొందరికి రామాయణాన్ని పాత చింతకాయ పచ్చడి అంటం, అది మన కిప్పుడెందుకని వాదించటం, పరిపాటి అయిపోయింది. అదే వారికి ఒక ప్రత్యేక అర్హతగా కూడా పరిగణింపబడుతోంది. సామాన్యంగా రోగికి పథ్యం పెట్టేటప్పుడు చింతకాయ పచ్చడి వాడటం జరుగుతుంది. అదీ ఎంతపాతదైతే అంత మంచిదంటారు. అది అనారోగ్యాన్నిపోగొట్టి శరీర ఆరోగ్యానికి దోహదం చేస్తుంది రామాయణం ఆలోచనా కాలుష్యాన్ని నివారిస్తుంది. మానసిక వికారాలను దూరంచేసి స్వస్థత చేకూరుస్తుంది. సమాజంలో శాంతి, భద్రతలు నెలకొనేందుకు కారణమవుతుంది.

ప్రపంచంలో మంచి చెడు ఉన్నట్లే కావ్య ప్రపంచంలో రెండూ చోటు చేసుకొన్నాయి. కొందరు సమాజంలోని వ్యక్తులను తమ కనుగుణంగా మార్చుకొని, తమ ప్రయోజనాలను సాధించుకొనేందుకు చెడు నేర్పటం జరుగుతుంది. అది వారి భవిష్యత్తును శూన్యంచేసి, ప్రమాదాలకు గురి చేస్తుంది. పగను, ద్వేషాన్ని రగిలించి, ఉద్రేకం కలిగించి, సమాజాన్ని పెడత్రోవ పట్టించేది ఏదోరీతిలో ఏకపక్ష సిద్ధాంత

ప్రచారమేకాని సరియైన సాహిత్యం అనిపించుకోదు. దానివల్ల మానవత్వానికి సమగ్రత సిద్ధించదు. తద్వారా జాతి సమైక్యత సాధింపబడదు. దానికి సార్వజనీనత లేదు. అది సార్వకాలిక సత్యమూకాదు.

అనేక శతాబ్దాల నుండి విజాతీయుల దాడులకు గురియై, పరదాస్య శృంఖలాలకు కట్టుబడి, విభజించి పాలించే విదేశ రాజకీయ కుట్రలకులోనై మనం మన సంస్కృతికి దూరమయ్యాం. సభ్యతను, సమాజ సహజీవన విధానాన్ని మరచిపోయాం. పైపై మెఱుగులకు భ్రమసి అలజడులకు, ఆతంకలహాలకు నిలయంగా మారిపోయాం.

ఇట్టి అస్తవ్యస్త పరిస్థితులలో జాతికి హితంచెప్పి ప్రజలలో క్రియాశీలాన్ని నిర్మాణం చేయగల సాహితీ స్రష్టలు అవసరం కానీ పిచ్చిపిచ్చి కేకలతో, వెఱ్ఱిమొఱ్ఱి ఆలోచనలు కలిగించి ప్రశాంతమైన సమాజ వాతావరణాన్ని కలుషితంచేసే వారివలన ప్రయోజనంలేదు. అసభ్యతను ప్రోత్సహించి, అసత్యాన్ని ప్రచారంచేసి, మానవత్వాన్ని మరుగుపరచే రాక్షస కృత్యాలను ప్రేరేపించటంవంటి అధార్మిక భావాలు కొందరికి ప్రియమే అయినా సమాజానికవి హితం చేకూర్చేవి మాత్రం కాదు. జనం ఇట్టి జాతి విద్రోహక చర్యలకు పాల్పడేలా రచనలుచేసే కవులు నిజానికి సమాజానికి శత్రువులు. అన్నింటిలోనూ చెడును విడిచిపెట్టి, మంచిని గ్రహించటం విజ్ఞుల లక్షణం.

మహోదార పురుషుడైన రాముడు తన ఉత్తమ గుణములద్వారా కావ్యమున వర్ణనీయుడైనాడు. మహోన్నతమైన అతని చరిత్ర రామాయణ మహా కావ్యమైంది. అది రచించిన వాల్మీకి మహా కవియైనాడు. ఆ తర్వాత కవులెందరో ఆ కవితాబ్ధిలోని అమృతాన్ని విశేషంగా సంపాదించి ప్రపంచానికి అప్యాయంగా పంచిపెట్టారు. (ఎవరి ఆలోచననుబట్టి వారికది అంతగా లభిస్తుంది) 'సీతాకృత భూప్రవేశ సందర్భమున బ్రహ్మ స్వయంగా ఈ విషయమే అభివర్ణించి, రాముని ప్రశంసించాడు.

శ్రీ కల్యాణ గుణాంచిత! నీకే తగుఁ గావ్యవర్ణనీయత్వము, వా
ల్మీకికి తగుఁ గవిపద మీ, ప్రాకటకావ్యాఖ్య తగుభవత్కృతికి విభూ!
రామకథాఽమృతమనఁగా, నీ మహిత చరిత్రమెన్న విపులము పుణ్య
మ్మాము కొన భువిజనించెద, దీముని కవితాబ్ధి నమృతమెత్తి డయుఁగవుల్
బ్రవే తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి
శ్రీరామ కథాఽమృతము. ఉ కాం. ఉ.భా. 9అ. 121,122 ప.

రాగద్వేషములకు అతీతంగా ఉండి లోకవృత్తమును యథాతథంగా అభివర్ణించి సత్య మార్గమును దర్శింపజేసిన వాల్మీకి జగద్గురుడు. ఆతని రామాయణం పరిపూర్ణ మానవత్వాన్ని, మాన్యతను గడించటంలో ఉపకరిస్తుంది. మానవ జాతికి ఇది పథ్యం. ఇది తథ్యం.

యశస్సు, ధనము, వ్యవహార జ్ఞానము, అశుభనివారణ ఆనందము కాంతా సమ్మితత్వము మొదలగునవి కావ్యమునకు ప్రయోజనములుగా ప్రాచీను లంగీకరించారు.

కావ్యం యశసేఽర్థ కృతే వ్యవహారవిదే శివేతర క్షతయే।
సద్యః పరనిర్వృతయే కాంతా సమ్మిత తయోపదేశయుజే॥
(మమ్మటుడు - కావ్యప్రకాశ)

శ్రీ మద్రామాయణ మట్టిప్రయోజనము లన్నింటిని సంపూర్ణముగా సంతరించుకొన్న మహాకావ్యము. పైన పేర్కొనిన కావ్యప్రయోజనములన్నియు కవయితకే గాక పఠితకు, శ్రోతకు లభింపుట అనుభవ సిద్ధము.

'విశ్వశ్రేయః కావ్యమ్' అన్న చింతామణికర్త అభిప్రాయం లోక విదితమే కదా। అందుకు లక్ష్యభూతమైనది రామాయణం. అది విశ్వవిజ్ఞానమునకు నిలయమై, లోకవ్యవహారమును విశదపరచుచున్నది ,సమాజమునయున్న సమస్య లన్నింటిని ఎత్తించి సమాధానము సూచించుట యిందు జరిగినది. ఈ అనంత ప్రకృతిలోని వివిధ ప్రాణుల చిత్తవృత్తులిందు నిరూపింపబడి, వైవిధ్యముతోగూడిన సమాజ స్వరూపము ప్రకటింపబడినది. రసానందానుభవముతోబాటు సాహిత్యము ద్వారా సంస్కారము కలిగించుట జాతికిశ్రేయస్సు నందించుట జరిగినది. ఇట్లన్ని విధములా లోకహితము సంఘటించు రామాయణము - సమాజదర్పణమనుట నిస్సంశయము.

సజ్జనా ఏవ సాధూనాం ప్రథయన్తి గుణోత్కరమ్।
పుష్పాణాం సౌరభం ప్రాయ స్తనుతే దిక్షు మారుతః॥
సుభాషిత రత్న భాండాగారమ్।

కారుణ్యము

బజారునపోతూ ఉంటాం. ఎవరో ప్రమాదవశాన కాలుజారి పడతారు. బట్టలన్నీ మట్టి కొట్టుకొని పోతాయి. అది చూచి నవ్వుతారు కొందరు. బాగా పడ్డాడని ఎగతాళి చేస్తారు కొందరు. మరికొందరు అరెరే పడ్డాడని జాలిపడతారు. సానుభూతి చూపిస్తారు ఇంకొందరు. దగ్గర వాళ్ళు కొందరు చేయిపట్టుకొని లేవదీసి, చేతనైనంత సాయం చేస్తారు. అదే విరోధులైతే తగినశాస్తి జరిగిందని సంబర పడతారు పనిలోపని ఏ కాలో చెయ్యో విరిగి ఉంటే ఇంకా బాగుండేదని శాప నార్థాలు పెడతారు. ఇటువంటి కష్ట సమయాలలో ఎప్పుడూ మంచివారు బాధ పడతారు. అల్ప బుద్ధులే గేలి చేస్తారు. ప్రకృతిలో ఇందు కొక ఉదాహరణం.

సూర్యుడ స్తమించాడు. సంధ్యాకాలంలో చక్రవాక పక్షి ప్రియా విరహంతో బాధపడటం చూచి పద్మిని (పద్మము) తాను అట్టి స్థితిలో ఉన్నది. ఆ కష్టం తెలిసింది అవటంచేత దాని విషయంలో జాలి పడింది. చంద్రుడుదయించాడు అప్పుడే వికసించిన కలువ ఆ చక్రవాకిని చూసి గర్వంతో నవ్వింది. ఇదే లోక ప్రవృత్తి.

ప్రియునెడబాసి కోకి తన పెంపు సెడం బొగులంగనట్టి తా
వయి, మగడొక్కచో నొదుగ హాయని పద్మిని గుందె,గల్వతీ
నియ స్మయ మొప్పనవ్వె. భువి విప్రతి పన్నుల గాంచి, మంచివే
డియ లటులంగ లార్తురు గడింతురు ముక్కిడులెక్క సక్కెముల్
(కీ॥ శే॥ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి)
శ్రీ. రా. క; బా. కాం; 8 అ 32 ప.

ఎవరెట్లా అనుకొన్నా ఎదుటివారి కష్టం చూచినప్పుడు మంచి వారికి మాత్రం హృదయంలో దయ కలుగుతుంది. తన ఆశ్రమానికి విచ్చేసిన నారదుని సాగనంపి వాల్మీకి తమసానదికి స్నానానికని వెళ్ళాడు. అక్కడ కిరాతుడొకడు హాయిగా విహరిస్తున్న పక్షి జంటలో ఒకదాన్ని బాణంవేసి పడగొట్టినప్పుడు అది నేలపైబడి రక్తసిక్తమైన శరీరంతో బాధతో గిలగిలా కొట్టు కొనడం చూశాడు. ధర్మాత్ముడైన ఆ వాల్మీకి ఋషికి కరుణ కలిగింది.

శ్లో॥ తథావిధం ద్విజం దృష్ట్వా నిషాదేన నిపాతితమ్।
ఋషే ర్ధర్మాత్మన స్తస్య కారుణ్యం సమపద్యత॥
వా.రా; బా.కాం; 2స; 13 శ్లో

ఈ సంఘటన జరుగబోయే ముందుగా ఆ నదిలోని నీరు నిర్మలమై, రమణీయమై మంచి మనిషి మనసువలె ప్రసన్నంగా ఉందని వర్ణింపబడింది. అది అప్పటి వాల్మీకి మహర్షి హృదయాన్ని సూచిస్తోంది. ఆ ప్రశాంతతను భంగపరిచింది ఈ నిషాదుని క్రూరకృత్యం.

శ్లో॥ అకర్దమ మిదం తీర్థం భరద్వాజ! నిశామయ!
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనో యథా॥
వా.రా; బా.కాం; 2 స. 5 శ్లో

అప్పుడా ఋషి క్రీడాపరవశమైన ఆ పక్షి జంటను విడదీసిన పాపాత్ముడైన ఆ కిరాతుని నిందించాడు. అప్రయత్నంగా వాల్మీకి నోట వెలువడిన ఆ మాటలే రామాయణ రచనకు నాందిగా రూపొందాయి. ఆ మహర్షి రచించిన శ్రీమద్రామాయణంలో రావణ సంహారానంతరం హనుమంతుడు సీతను సందర్శించి, విభుని విజయవార్త వినిపించి, ఆమెను రాముని సన్నిధికి తీసుకువెళ్ళే ముందు సీతతో "అమ్మా! ఈ అశోకవనంలో నిర్బంధించి నిన్నింతకాలం బాధించిన ఈ రాక్షస కాంతలను నీకు సంతోషం కలిగేలా నీ కళ్ళ ముందే నరికి ప్రోగులు పెడతాను. అందుకు నన్ను అనుమతింపుము" అని కోరాడు. అది విన్న సీత "నాయనా! ఇందులో వారి దోషమేముంది వారు తమ ప్రభువు ఆజ్ఞ పాటించారు."

ఇంతకాలం అతని ఉప్పు పులుసు తిన్నందుకు తమ కర్తవ్యాన్ని వారు నిర్వర్తించారు. వారి యెడ మనకు కోప మెందుకు? వారెటువంటి వారైనా వారి యెడ కారుణ్యం చూపట మనేది ఉత్తమప్రాణి లక్షణమనిచెప్పి, విచారిస్తే మఱి లోకంలో తప్పు చేయనివారు ఎవరుంటారు. మంచివారికి వారిని మన్నించటమే కర్తవ్యమని బోధించింది.

శ్లో॥ పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ!
కార్యం కరుణ మార్యేణ నకశ్చి న్నాపరాధ్యతి॥
వా.రా; యు.కాం; - 116 స. 44 శ్లో

ఇందుకు ఉదాహరణంగా సీత అప్పుడొక పురాణగాథ వివరించింది. "ఒకప్పుడు కిరాతుడొకడు అరణ్యంలో వేటకై తిరుగుతున్న సమయంలో ఒక పులి అతని వెంటబడింది. అతడు ప్రాణభయంతో పరుగెత్తి పరుగెత్తి ఆత్మరక్షణ కోసం ఒక చెట్టెక్కాడు. ఆ చెట్టు మీద ఒక ఎలుగుబంటి నివాసముంటోంది. దాన్ని చూసి అతడు మరీ వణికి పోయాడు. పులి అప్పుడా ఎలుగుబంటితో వీడు మన మృగ జాతికే విరోధి. అందువల్ల అతన్ని క్రిందకు త్రోసెయ్యమని అడిగింది. ప్రాణ భీతితో నా నివాసానికి వచ్చినవాణ్ణి కాపాడకుండా నీ చేతికిచ్చి చంపుతానా? అది ధర్మహానికాదా! అని ఆ పని చేయకుండా విశ్వాసంతో ఆ రాత్రి చెట్టు మీదే నిశ్చింతగా నిద్రపోయింది. అప్పుడా పులి ఎలుగుబంటిని క్రిందకు త్రోస్తేనిన్ను విడిచి పెడతానని కిరాతుని ప్రలోభ పెట్టింది. నీతిమాలి అతడందుకు పూనుకొన్నాడు. అయితే అభ్యాస వశాన అది క్రింద పడకుండా వేరొక కొమ్మ పట్టుకొని తిరిగి చెట్టు పైకి చేరింది. ఈసారి ఆ కృతఘ్నుని క్రిందకు త్రోయమని పులి ఎలుగుబంటిని ప్రేరేపించింది. అయినా ధర్మ బుద్ధితో ఎలుగుబంటి ఆ కిరాతుని క్రిందకి నెట్టలేదు. పాపాత్ములైన వారి పాప బుద్ధి కారణంగా వారిని హింసించకుండా మన్నించి, సమయానికి రక్షించటమే మంచివారి గొప్పతనం. అట్టి నడవడియే వారికి అలంకారము. అందువల్ల వారిని శిక్షింపక విడిచి పెట్టుమని సీత మిక్కిలి కారుణ్యంతో పలికింది. అది ఆమె హృదయ సౌందర్యానికి తార్కాణం. అట్టి దయా గుణమే ఆమె దివ్యత్వానికి కారణమైంది. (To err is human, To for give is divine)

శ్లో॥ అయం వ్యాఘ్ర సమీపేతు పురాణో ధర్మ సంస్థితః।
ఋక్షేణ గీత శ్లోకో మే తన్నిబోధ ప్లవంగమ॥
న పరః పాప మాదత్తే పరేషాం పాప కర్మణాం।
సమయో రక్షితవ్యస్తు సంత శ్చారిత్ర భూషణాః॥
యు. కాం. 116స. 41, 42 శ్లో

హనుమంతు డామె హృదయం తెలిసికొని సీతతో "అమ్మా నీవు రామ నకు తగిన ధర్మపత్ని" అని అభినందించాడు.

"యుక్తా రామస్య భవతీ ధర్మపత్నీ యశస్వినీ" - (116స. 47/1 శ్లో)

కావుననే వాల్మీకి రామాయణమును సీతామహచ్చరిత్రగా కీర్తించాడు. ఇంతటి మహాచార్యమే ఆ పరమ పావనికి మహాత్వాన్ని సంతరించి పెట్టింది

ఇంక రాముని యందిట్టి కారుణ్యము పుష్కలముగా గోచరించుట కద్దు. విశేషించి విభీషణ శరణాగతి అందుకు నిదర్శనంగా చెప్పబడుతుంది. పరదారాభిగమనం పాపహేతువని రావణునకు హితము బోధించి గర్వితుడైన అతనిచే తిరస్కరింపబడి, విభీషణుడు సంపదలతో బాటు దారా పుత్రాదులను సహితము విడచి ఆర్తితో రాముని శరణువేడ వచ్చాడు. అచటి వానరుల యుద్ధ సంరంభమును చూచి ఆకసముననే అల్లంత దూరాన నిలచి వారితో అతడిట్లా విన్నవించాడు.

శ్లో॥ సోఽహం పరుషిత స్తేన దాసవ చ్చావ మానితః।
త్యక్త్వా పుత్త్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః॥
సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే।
నివేదయత మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్॥
యు. కా, 17స. 14,15 శ్లో

ఆ విషయం వివరింపవచ్చిన సుగ్రీవుడు రామునితో "రాక్షసులు కామరూపులు, హింసా పరాయణులు. శత్రువర్గము నుండి వచ్చిన ఈ విభీషణుడు నమ్మదగినవాడు కాదు. ఇతడిప్పుడు మనలోచేరి భేదం పుట్టిస్తాడని నేను శంకిస్తున్నాను. కావున ఈతనిని వేరదీయ వల్లని" పలికాడు. ఇంకా అక్కడున్న వారిలో అంగదుడు అతని మంచి చెడులు పరీక్షించిగాని పరిగ్రహించటానికి వీలులేదన్నాడు. అందుకు సమర్థుడైన చారుని నియమింపమన్నాడు జాంబవంతుడు. ఇంకా తక్కినవారు పరి పరి విధాల ఇలాగే తమకు తోచిన మాటలు చెప్పారు.

హనుమంతుడు మాత్రం "నీవు అధర్మాత్ముడైన వాలిని చంపి, అతని తమ్ముడు సుగ్రీవునకు రాజ్యమిచ్చిన వాడవని తెలిసి రావణుని వధించి తనను లంకయందు నిలిపిస్తావని చేయగలవనే ప్రయోజనాన్ని ఆశించి ధర్మబుద్ధిగల నిన్నీతడు శరణుకోరి యుండవచ్చు" నని చెప్పి, రావణుని పరుషత్వము, నీ పరాక్రమము అందుకు కారణములగు చున్నవి. ఈ విధముగా చూచినచో విభీషణుని రాకలో నాకెట్టి విప్రతిపత్తియు తోచుటలేదు. అతని మాటలలో నెట్టి దోషము కానవచ్చుట లేదు. ఇతరుల మనస్సులోని భావం కనుగొనగల్గడం కష్టమే అయినప్పటికి ఎవరెంత

బలవంతంగా దాచుకొన్నా అది దాగదు. ఏదో విధంగా బయటపడి తీరుతుంది. (Face is the index of the mind) అందువల్ల ఈతడు విశ్వసనీయుడే అని నా కనిపిస్తోంది.

ఆకారా చ్ఛాద్య మానోఽపి నశక్యో వినిగూహితుమ్
బలాద్ధి వివృణోత్యేవ భావ మంతర్గతం నృణామ్॥
యు. కాం. 17 స. 62 శ్లో

నాకు తెలిసినంతలో ఇంతవరకు చెప్పగలిగాను అంతే. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవైన నీదే ఇంక తుది నిర్ణయం" అని విరమించాడు.

అది అంతా విన్న రాముడు నా శ్రేయస్సుకోరిచెప్పే మీ ఆలోచనలన్నీ తెలుసుకొన్నాను. విభీషణుని గూర్చి నాకొక అభిప్రాయం ఉంది. "ఒకవేళ అతనిలో దోషం ఉన్నా మిత్ర భావంతో వచ్చిన వానిని పరిత్యజించరాదని బుధులు చెప్తారు. పెద్దలు మెచ్చే విధంగా ఈ విభీషణునికి ఆశ్రయం కల్పించటం తప్పు కాదేమో? అని ధర్మ స్వరూపం వివరించాడు.

శ్లో॥ మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన।
దోషో యద్యపి తస్య స్యా త్సతా మేత దగర్హితమ్॥
యు కా; 18 స. 3 శ్లో

అది విన్న సుగ్రీవుడు రామునితో "ఈతడిట్టి క్లిష్ట సమయమున అన్నను విడిచి వచ్చిన వాడవుట వలన అన్యులను విడువడని ఏమిటి నమ్మకం? కృతఘ్నుడైన ఈతని చరిత్ర శంకనీయమే" అని తన అభిప్రాయం రూఢిగా ప్రకటించాడు. రాముడందులకు "వినీతుడైన ఈ సుగ్రీవుని వాక్యములు, లోకులకవశ్యము ఆదరణీయములే అవుతున్నాయి. విద్యావంతులకు గాక సామాన్యులకిట్టి ఆలోచన కలుగుట కష్టం. ఇట్టి దీర్ఘదర్శియైన ప్రభువు శ్రేయము లందుట తథ్యం. అయినను ఆత్మ రక్షణకోరి మనల నిప్పుడాశ్రయించిన ఈ విభీషణుని ఆదరించటం తప్పు కాదు. అతడు మన యెడ నెట్టి అపకారము తలపెట్టడు. ఒకవేళ అతడట్టి దుర్బుద్ధితో ప్రవర్తించినను మనల జయింప జాలడనిచెప్పి శరణాగత రక్షణము నందలి

విశేషమును రాముడు ప్రశంసించాడు. ఆ ధర్మం వివరించేందుకు లోకంలో విని పించే ఒక గాథ చెప్పాడు.

శ్లో॥ శ్రూయతే హి కపోతేన శత్రుః శరణ మాగతః।
అర్చితశ్చ యథాన్యాయం స్వైశ్చ మాంసై ర్నిమంత్రితః॥
యు. కా. 18 స 24 శ్లో

ఒకానొక అడవిలో కిరాతుడొకడు వేట సాధనములైన వలలు, పిక్కములు ధరించి వేటాడబోయి పక్షులను పెక్కింటిని పట్టి రెక్కలు విఱిచి, పిక్కమున వైచి కొనుచు సాయంత్రందాకా అక్కడక్కడ తిరిగి వేటాడాడు. ఇంతలో పెద్ద వర్షము సంభవించింది. దిక్కులన్నీ అంధకార బంధురములైనాయి. కుండపోతగా కురిసిన వానకు అడవియంతా జలమయమైంది. ప్రళయ కాలమును తలపించు ఆ రాత్రి లోకమునకు కాళరాత్రివలె తోచింది. అప్పుడా వేటగాడొక ఎత్తైన ప్రదేశమునగల పెద్ద వృక్ష మూలము నాశ్రయించాడు. ఆ చెట్టుపై కాపురమున్న పావురముల జంటలో మగ పావురము తన భార్య (పెంటి) అంతదనుక గూటికి రాక పోవుటకు చింతించుచు. ఆమె గుణ గణములను తలపోయుచు దుఃఖ పడుచుండెను. ఆ బోయవాని వలలో చిక్కి పిక్కములో బంధింపబడిన ఆడపావురము పరోక్షమున భర్తృ ప్రశంసలంద గలిగిన తన ధన్యతకు సంతసించుచు ఆతనికి తన ఉనికిని తెలియజేసి, చలికి గజగజ వణుకుచు తాము న్న వృక్ష మూలమునకువచ్చి బాధ పడుచున్న బోయవానికి తగిన సహాయం చేయమని కోరింది. అప్పుడా మగ పక్షి ఎక్కడో దూరంగాఉన్న ఒకయూరికిపోయి నిప్పు తీసుకొనివచ్చి, ఎండుకట్టెలతో నెట్టెల్లో మంటచేసి ఆతనికి చలి పోగొట్టి, చివరకు ఆ మంటలో దూకి తన స్వీయ మాంసము ఆహారముగా నిచ్చి వానిని అతిథిగా అర్చించింది. భార్యాపహర్తయైన ఆ కిరాతుని పక్షియే అటు లాదరింప ఓ వానరశ్రేష్ఠా! (సుగ్రీవా!) ఇంక నావంటి మనుజునకు శరణాగత రక్షణము కర్తవ్యమనుట వేరుగా చెప్పవలయునా?

శ్లో॥ సహి తం ప్రతిజగ్రాహ భార్యా హర్తార మాగతం।
కపోతో వానరశ్రేష్ఠ! కిం పున ర్మద్విధో జనః॥ 18స 25శ్లో

"ప్రపన్నులగు వారిని రక్షింప సమర్థులై యుండియు కామ, లోభ, మోహ ములలో ఏదేనియొక కారణముగా ఎవరు రక్షింపరో వారు తమ పూర్వ పుణ్యమును

సహితం బోగొట్టు కొనుచున్నారని కణ్వపుత్రుడైన కండు మహర్షిచే చెప్పబడింది. ఆ యర్థమే వేదోక్తమగు నీపరమ ధర్మమును వివరిస్తోంది. (18 స 28-30 శ్లో) వారెవ్వరైనను "ఒక్కసారి శరణువేడి నేను నీవాడను, నన్ను కాపాడుమని కోరిన యెడల వారి కభయమిచ్చుట యనునది నావ్రతము. కావున ఓ సుగ్రీవ! ఇప్పుడు మనల శరణువేడి వచ్చినవాడు విభీషణుడైనను లేక స్వయముగా రావణుడైనను సరే. వానికి నేనభయమిచ్చితిని అతని మన నివాసమునకు తీసుకొని రమ్మ"ని ఆదేశించాడు.

శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే।
అభయం సర్వ భూతేభ్యో దదా మ్యేతద్వ్రతం మమ॥
ఆనయైనం హరిశ్రేష్ఠ! దత్త మస్యాభయం మయా!
విభీషణోవా సుగ్రీవ! యదివా రావణ స్స్వయమ్॥
యు. కాం. 18స. 33,34 శ్లో

ఆ రాముని మాటలువిన్న సుగ్రీవుడు "ధర్మజ్ఞుడవై లోకహితము సంఘ టింపజేయు నీవంటి పురుషోత్తముడిట్లు చేయుటలో చిత్రమేముంది? సమర్థుడవు, సన్మార్గ ప్రవర్తకుడవు అయిన నీకిది తగియున్నదని అభినందించాడు.

శ్లో॥ కిమత్ర చిత్రం ధర్మజ్ఞ లోకనాథ! సుఖావహ!
యత్త్వ మార్యం ప్రభాషేథా స్సత్త్వవా స్సత్పథే స్థితః॥ (18 స. 36 శ్లో)

[రామాయణమున ఈ విభీషణ శరణాగతికి ఒక ప్రత్యేకత కలదు. విభీషణుడు తన సర్వస్వమును విడిచిపెట్టి, ధర్మస్వరూపుడైన రామునిచేరి శరణు వేడుట జీవుడు తాపత్రయముతోగూడిన సంసార బంధమును విడచి పరమేశ్వరుని ఆశ్రయించుటేయని సంప్రదాయజ్ఞు లభివర్ణింతురు. రామాయణమునకు దీర్ఘ శరణాగతి శాస్త్రమనియు మరియొక పేరు]

ఈ విధముగా మానవ ధర్మం ప్రవచించి, సజ్జనుని ధర్మనిష్ఠ ఏ రకంగా ఉంటుందో నిరూపించి, ప్రాణులయెడ జాలి పడటం, కరుణ చూపటం, భూతహితం కోరటంవంటి ఉత్తమ లక్షణాలు కలిగిఉన్నవారు సీతారాములు. వారి సమగ్ర చరిత్రయే రామాయణం. ధర్మానుసరణంలో అది సమాజానికి దర్పణం.

అడవిలో ఉంటూ, కంద మూలాలు తింటూ, నార చీరలు కట్టుకొని, అడవి మృగములతో (వానరులు) మెలగినా రామునికి గల సుగుణ సంపదనుబట్టి అతనిని శ్రీరాముడన్నది లోకం. త్రైలోక్యాధిపత్యం ఉండి, తరగని సంపదలుండి, ఉత్తమ అభిజాత్యం ఉండి, అధికమైన బల పౌరుషములుండి రావణుడు తన దుర్ప్రవర్తన ద్వారా దుష్టుడయ్యాడు

కావున మానవులుగా ప్రవర్తిస్తూ, ఉత్తములుగా పరిగణింపబడటానికి ప్రతి ఒక్కరు కారుణ్యం సంతరించుకోవాల్సిన అవసరం ఉంది. మానవత్వం కోలుపోయి, లోకాని కపకారం చేసే వారికి (రావణాదులకు) హృదయం బండబారి పోతుంది. స్పందించే గుణం నశిస్తుంది. అట్టి కఠినాత్ములు, పరహింసా పరాయణులు (శాడిస్టులు) కడకు శిక్షార్హులే అవుతారు.

లోకంలో ఆర్తులు, అనాథలు, అభాగ్యులు, ఆశ్రయంకోరి వచ్చినవారు ఎందరో ఉంటారు. వారిని చూచి జాలి పడటం, చేతనైన సాయం చెయ్యటం మానవ కర్తవ్యమని చెప్తోంది రామాయణం.

సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న దానధర్మాల సార్థకత సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న పదవుల నేలిన ఫలము సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న బహుళ సత్కార్య లాభంబు సున్న

ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలువ
గుణము లివి నాలుగు పునాది గోడ లయ్యె
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!"

— భగవాన్ బాబా

పతిత పావనత్వము

అది మిథిలానగరం. జనకుని యజ్ఞవాటిక. అందొక్క ప్రక్కన వేద మూర్తులైన కొందరిచే ఋక్, యజు, స్సామ, అధర్వణ వేదములు నాలుగు సస్వరముగా పఠింపబడుచున్నవి. మరియొక ప్రక్కన బుధులచే వివిధ శాస్త్ర ప్రసంగములు, చర్చలు కొనసాగుచున్నవి. ఆయా మంత్రములచే పిలువబడిన వేల్పులు ఒక్కొక్కరే యచటికి చేరుకొనుచున్నారు. మునులకది ప్రమోద స్థానమై విలసిల్లుచున్నది. సకల దేశాగతులైన యాచకుల కోర్కెలుదీరు వసంతముగా నది ప్రశంసింపబడుచున్నది. బంధువు లందరు ఆ వేడుకచూడ నచ్చటికి చేరిరి. ఇట్లిన్ని విధముల నందరకు ఆనంద సంధాయకమై, సకల కళాస్థాన సామ్రాజ్య యోగ్యమై, సర్వ శుభంకరమై చూపఱుల పరవశింపజేయుచున్నది. జనకుని కర్మజ్ఞతకది నిదర్శనము.

అట్టి జనకుని యజ్ఞవాటికకు రామలక్ష్మణులను వెంట నిడుకొని విశ్వామిత్రుడేతెంచినాడు. జనకునకావర్త మానము నివేదింపబడినది. జనకుని ఆనందమునకు అవధులులేవు. వారిరాక కలరుమ, తనవారు వచ్చిరనియు, తనయింట శుభము ప్రవేశించినదనియు, ఈ విధముగా విధి తన్ను మెచ్చినదనియు సంభావించినాడు. అహా! జ్ఞాన యోగ సిద్ధుడగు జనకుడెంతటి అదృష్టవంతుడో కదా!

వచ్చిరనుచుంత, దనపాలి వారలనియెఁ
జొచ్చిరనుచుంత, మేలిల్లు సొచ్చెననియె
మెచ్చిరనుచుంత, విధి తన్ను మెచ్చెననియెఁ
దనదు ప్రతిభయొ, గురుబోధ తత్త్వకలయొ

కీ॥ శే॥ తాడేపల్లి వెంకటప్పయ్యశాస్త్రి శ్రీ.రా.క., బా.కాం; 7అ 155ప.

పురోహితుడగు శతానందుని ముందిడుకొని జనకుడమ్మునికెదురేగి, అర్ఘ్య పాద్యములిచ్చి అతిథి సపర్యలుచేసి, ఉచితాసనముల కూర్చొండబెట్టినాడు. ఆతడు చూపునట్టి ఆదరమునకు వారు మిక్కిలి సంతృప్తి చెందిరి. కుశల ప్రశ్నాదికములు ముగిసినవి. ప్రశంసా వర్షము కురిసినది. వినయముతో జనకుడిట్లు విన్నవించినాడు.

"మహాత్మా! నీ రాకచే నా క్రతువు మహితమైనది. దేవతలు తృప్తి నొందిరి. నీ దయవలన యజ్ఞ పురుషుని యనుగ్రహము సహితము లభింపగలదని ఆశంసించుచున్నా"నని జనకుడు మునిని ప్రశంసించినాడు. తన సంతోషమును ప్రకటించినాడు. (7 ఆ. 173 ప) [తత్త్వ దృష్టితో చూచినప్పుడు ఆ మునితో వచ్చినవాడు యజ్ఞ స్వరూపుడైన విష్ణు వేయగుట (యజ్ఞోవైవిష్ణుః) సన్నివేశ సందర్భములు సముచితములై సాహితీ సౌరభము వెలయించుచు సహృదయుల నలరించుచున్నవి. సత్యమును ప్రతిపాదించుచున్నవి.]

అంతనా జనకమహారాజు ఆ మునితో వచ్చిన ధనుర్ధరులు, అధికరూపతేజః పరాక్రమములునై విరాజిల్లుచు లీలా మూర్తులవలె దోచు నీ బాలకులెవ్వరో యని యాశ్చర్యపడి, వారిని గూర్చి విశ్వామిత్రునితో ఇట్లు ప్రస్తావించినాడు.

తాల్తురు మేటి కోదండ ముల్లండము, ల్తమ కూర్చునవెయౌట దద్దనెగడ
ఘన పరాక్రమ లీలఁగను పట్టుదురు పట్టుదురు మిత్తికుత్తుక దొడర నొత్తి
యాశ్వినేయ వికారమ ధరింతురు ధరింతురు రూప సారముల్లోరముఁగఁ
జంద్ర సూర్యుల దశల్పవరింతురు వరింతు, రుచిత నిత్య ప్రకాశోన్నతులను
బోలుదురుగాక యెండొరు ల్పోల్పనొడ్డు, గారు వీరల కెవ్వారుఁ గాకపక్ష
ధారులైయుండి జగదేక వీరులనఁగ, వీరుగను పట్టుచున్నారు వివిధగతుల
శ్రీ. రా. క., బా. కాం., 7ఆ. 177 ప.

"ఒకవేళ వీరు దేవతలా? అట్లయినచో వారికి నేలపై నడచునట్టి యవసరమేల కల్గినది. కాదు, మానవులే అన్నచో ఈ రూపతేజః ప్రభావ విశేషములెట్లు సిద్ధించును?" ఇట్లు తనకు కలిగిన సందేహమునే ఆ ముని ముందట వెలిబుచ్చినాడు. (7ఆ. 178ప.)

అదియునుగాక, "పూర్వమీ కంటితో నెన్ని రూపములను చూడలేదు? ఇట్లు పరవశింప జేసినది యొన్నెద్దియునులేదు. మరెన్ని మనమున ఊహింపలేదు? అందేదియు హృదయమునింతగా వశపరచుకొన్న దాఖాలాలేదు. తొల్లి తా నెన్నింటిని గూర్చి ముచ్చటింపలేదు? ఈ విషయమునవేమో మాటలే చాలుటలేదు" అనుచు జనకుడు పరమానంద భరితుడై వారిగూర్చి తనకు తెలుపుమని అర్థించినాడు.

చూడమెన్ని కనులఁ జొక్కించెనెది, యెన్ని
దలఁప మెద్ది యెడఁద దక్కఁగొనియెఁ
బలుకమెద్ది పలుకు బాటఁదాఁటె నిటేది
యయ్య! తెలుపు మిట్టి వ్యక్తి యుగము 7 ఆ. 182 ప.

ఇట్లాతడడుగుటలో గల వినయము, ఆదరము, మాటల పొందిక, భావగాంభీర్యము, తెలివితేటలు గమనించి ముని మనమున మెచ్చి, అర్థయుక్తి భాసిల తానిట్లు పలికినాడు.

మహారాజా! లోకమున నన్నియు నక్షరములే, అన్నియు పదములే. అన్నియు వాక్యములే. వ్యవహారమున నన్నియు భాషలే. అయినను అందొక్కొక్క చోట మాత్రమే రసప్రవాహము సమున్నతమగుట చూచుచున్నాము. అట్లే పురుషులలో పుణ్య పురుషుల సంగతియు ప్రత్యేకముగ నెన్నదగియున్నదని వివరించినాడు.

అన్నియు నక్కరములె, కన
నన్నియుఁ బదములె, ధరిత్రినటు వాక్యములే
యన్నియు, నన్నియు బాసలె,
సన్నుత మొకచో రసప్రవాహము సుమ్మా! 7ప. 185ప.

"ప్రకటయశులు, పుణ్యమూర్తులు పొడమిన ఇన వంశము లోకమున ప్రసిద్ధమే కదా! వారిలో ఇంద్ర సఖుడైన దశరథుని గూర్చి నీవు వినలేదా? అతని తనయులగు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులలో వీరిరువురు రామలక్ష్మణులు. అందు పెద్దవాడైన రాముడు గుణోద్ధాముడై పెద్దలకెల్ల పెద్దయైనాడు. మఱియు నీ రాముడే అన్నింటను అభిరాముడై వెలగొందుచున్నాడు.

పెద్ద సహోదరావళిని బెద్ద గొనంబుల బెద్దవిద్దెలన్
బెద్ద విలాస వైఖరులఁ బెద్ద ధనుష్మదుదూడ విక్రమం
బెద్ద త్రిలోక మోహన నవీన నిలాంచిత రూపరేఖలం
బెద్దల కెల్లఁ బెద్ద, పృథివీవర! రాముఁడు రాముఁడన్నిటన్
శ్రీ రా.క., బా.కాం. 7ఆ. 200ప.

ఈ మోహనాంగులను నేనే ఆ మహీపతినివేడి, తోడి తెచ్చినానని నుడివి, ఇంకను ఆ రాముని పరాక్రమ ప్రభావముల నభివర్ణించుచు ముని ఇట్లు పలికినాడు.

"యముని వాహనమైన దున్నపోతునే చంపి దువి చూడగోరే కష్ట చరిత్రురాలు తాటక. ఆమెను రాముడొక్క బాణంతోనే నేల కూల్చినాడు. మృత్యువు కోరల్నే పట్టుకొని పరిహాసమాడ గలవాడు సుబాహువు. అతనిని బూడిదచేసి గాలిలో కలిపివేసినాడు. మునుల పాలిటి మహమ్మారివలె విజృంభించు మాయల మంద మారీచుడు అతని సముద్రమునవిసరి పాలవైచినాడు. వినయ వివేకాది సద్గుణ సంపదచే సిద్ధాశ్రమమునందున్న తపోధనులెల్లరు మేలు. మేలనునట్లు సంచరించి వారి మెప్పు పొందినాడు. నేను కోరినట్లే నా యాగ సంరక్షణము సేసి నాపూన్కి నెఱవేర్చినాడు. త్రోవలో నీ పతిశైక పావనుడైన రాముడు తనయంఘ్రి రజముచే నహల్యకు పవిత్రత కల్పించి ఆమెను పతి సన్నిధికిఁ జేర్చినాడు."

జముదుంతనే ద్రుచ్చి చవిమాను నసుజంతఁ, గూళదాటక నొక్కకోలఁగూల్చె
మిత్రకోటులు హత్తిమేల మాడు సుబాహు, బూది గాలికిఁబోల్లువో నొనర్చె
మాసినా జడదార్ల మడఁచు మాయలమంద, మారీచు మున్నీట మాటిపైచె
సిద్ధాశ్రమము పొంతఁ జెలఁగు తపోధను, ల్మేలు మేలన మేలి మెప్పువడసెఁ
గోసటులె నాదు కోర్కులెల్ల ఫలింప, సవన రక్షణంబుఁ జరిపెఁ ద్రోవ
నంఘ్రి రజముచే నహల్య నీ పతిశైక పావనుండు మగనిపజ్జకనిచె

శ్రీ. రా. క., బా. కా., 7ఆ. 202ప.

"వీరిగని మొదమొంది నేనును ముందుగా సకల శస్త్రాస్త్ర సంపదలిచ్చితిని. ఇప్పుడు నీ యజ్ఞ సందర్భమున శివుని విల్లును, సీతను గనుగొన నా వెంట నిడుకొని యిచ్చటికి తోడ్తెచ్చితిని" అని విశ్వామిత్రుడు తమరాకలోని అంతర్యమును జనకునకు వివరించినాడు. అదివిని జనకానందన కందళిత హృదయారవిందుడై గౌరవముతో వారికి తగిన వసతులు కల్పించి, ఆదరించినాడు. శతానందుడు తన తల్లి దండ్రుల నొకచోటచేర్చి, మేలు కూర్చిన విశ్వామిత్ర మునిని సమధికోత్సాహమున కొనియాడినాడు.

సమాజదర్పణమైన రామాయణమునందీ అహల్యావృత్తాంతమున నొక విశేషము గమనింప దగియున్నది. దేవరాజైన ఇంద్రుడును మునిశాపము ననుసరించి తన దుర్వృత్తికి తగిన తీరున విఫలుడై శిక్ష ననుభవించినాడు. ఆక్రోశమున

అహల్య గౌతముని ఆనాటి ఆజ్ఞ ప్రకారము భస్మశాయినియై నిరాహారమున వాయు భక్షయై తపించుచు, రామాగమనమునకై ప్రతీక్షించుచుండెను. (బా. కా. 48 స. 29, 30 శ్లో॥ చూడుడు) త్రికరణ శుద్ధితో నిట్లు తపించిన ఆమె తపస్సు ఫలించి రామచంద్రుడా తపోభూమికిం జని అదృశ్యముగా నున్న ఆమెను ప్రకాశ మొనరించినాడు. తపస్తేజముచే దుర్నిరీక్షురాలైన ఆమె పవిత్రతను చాటుటకో యన్నట్లు తాను ముందుగా నమస్కరించి లోకమునకామె పూజార్హురాలగుట ప్రకటించినాడు.

> సా హి గౌతమ వాక్యేన దుర్నిరీక్షా బభూవహ।
> త్రయాణా మపి లోకానాం యావ ద్రామస్య దర్శనమ్॥
> శాపస్యాంత ముపాగమ్య తేషాం దర్శనమాగతా।
> రాఘవౌతు తత స్తస్యాః పాదౌ జగృహతు స్తదా॥
>
> వా.రా; బా.కాం. 49 స. 15,16 శ్లో

సమాజమున కొందఱు తెలిసి, తెలియక [భ్రమ, ప్రమాదములకులోనై] తప్పు చేసినను వారు తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడి నప్పుడా వ్యక్తులు సంఘమున ఆదరింపబడవలెను. కానిచో పశ్చాత్తాపమను పదమునకు ప్రయోజనమే శూన్యమగును. ఎప్పుడో, ఏ కారణముచేతనో సమాజమున కొన్ని అడ్డుగోడలేర్పరుపబడుటచే తమలో కొందఱను దూరము చేసుకొనుట జరిగినది. అట్టి వారిని అన్ని విధములగు పరిధులు అధిగమించి నాగరికతా ప్రపంచము తప్పక గ్రహించి తీరవలయును. వారితో స్నేహమును, సౌహార్దమును పెంపొందించుకొని వారికి సన్నిహితముగా జీవింపవలయును. లేకున్న వారు శాశ్వతముగా మఱింత దూరమునకు జరిగిపోవు ప్రమాదము లేకపోలేదు. అట్టిది సమాజమునకు, జాతికి, దేశమునకు ముప్పు సంఘటింపజేయును. కావున మానవులందఱు సమానముగా మన్నింప బడవలసినదే. అట్టి సమైక్యభావన పెంపొందించుకొనుట జాతిభద్రతకు, దేశాభ్యుదయమునకు ఎంతో అవసరము. అట్టిది సంఘ సేవా పరాయణులైన పెద్దలకు హర్షమును కలిగించును. విశాల దృక్పథముగల మహాత్ములందులకు నిజముగా ఆనందింతురు. అట్టి మానవ సేవయే-మాధవ సేవగా పరిగణింపబడును.

వాల్మీకి రామాయణమున అహల్య వృత్తాంతమీ సత్యమునే నిరూపించుచున్నది. పతిశైక పావనుడైన రాముని చే మన్నింపబడిన అహల్యను భర్త గౌతముడు పరిగ్రహించినాడు. దివిజులధికముగ పుష్పవృష్టి కురియించిరి. దేవ

దుంధుభులు మ్రోగినవి. గంధర్వాప్సరో భామిను లామోదంబున పాటలు పాడిరి. ఆనందంబున ఆటలాడిరి. దేవతలు సాధువాదములు పలికిరి. వారెల్లరు తపోబల విశుద్ధాంగియైన ఆ అహల్యను పూజించిరి.

శ్లో॥ పుష్ప వృష్టిర్మహ త్యాసీ ద్దేవదుందుభి నిస్వనై:।
గంధర్వాప్సరసాం చాపి మహానాసీ త్సమాగమ:॥
సాధు సాధ్వితి దేవా స్తా మహల్యాం సమపూజయన్
తపోబల విశుద్ధాంగీం గౌతమస్య వశానుగామ్॥
వా.రా; బా.కాం; 49స. 19,20 శ్లో॥

ఈ ఘట్టమున అహల్య చైతన్యము పొందినరీతి విశ్వనాథ వారు వర్ణించిన తీరు మనోహరము.

ప్రభుమేని పైగాలి పైవచ్చినంతనే పాషాణ మొకటికి స్పర్శ వచ్చె
ప్రభుకాలి సవ్వడి ప్రాంతమైనంతనే, శిలకొక్కదానికిఁ జెవులు కలిగె
ప్రభుమేని నెత్తావి పరిమళించినతోవ, యశ్మంబు ఘ్రాణేంద్రియంబుఁ జెందె
ప్రభునీల రత్నతోరణ మంజులాంగంబుఁ గనవచ్చినంత ఱాతికిఁ గనులు గలిగె
అప్రభుండువచ్చి యాతిథ్యమును స్వీకరించినంత నుపల హృదయ వీథి
నుపనిషద్వితాన మొలికె శ్రీరామ భద్రాభిరామ మూర్తి యగుచు దోచె
రామాయణ కల్పవృక్షము, బాల. కాం; అహల్యాఖండము; 557 ప

"రఘుపతి రాఘవ రాజారాం, పతితపావన సీతారాం"

పుట్టి పుట్టిన పాడోట పుట్ట తేనె
లుట్టి పడునట్టి జిగిమాట లొలుపుమీఱ
రామచరితంబు వర్ణించి రహిఁజెలంగు
మొదటి కవిరాజునెంతు సమ్మోద మలర!
కృష్ణరాయవిజయము, కుమార ధూర్జటి

ధర్మ వృక్షము

ప్రకృతిలో వృక్ష సంతతికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అవి బొగ్గు పులుసు వాయువును (కార్బన్‌డయాక్సైడ్) పీల్చుకొని ప్రాణశక్తి (ఆక్సిజన్) నిచ్చి పరిసరాల్ని బాగుచేసి వాతావరణాన్ని ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంచుతూ, జీవరాశికెంతో ఉపకారం చేస్తున్నాయి. మేఘాలు వర్షించడానికి కారణమై భూమిని సస్యశ్యామలంగా చేసి పంటలభివృద్ధి చెందటానికి తద్వారా దేశాభ్యున్నతికి ఎంతగానో దోహదం చేస్తున్నాయి. అందుకే "వృక్షాలను కాపాడండి, అవి మనల్ని కాపాడతాయి" అని ప్రభుత్వం ఈనాడు ప్రచారం చేస్తోంది.

వృక్షములు తాము ఎండను భరిస్తూ జీవకోటికి నీడను ప్రసాదిస్తాయి. ఆకులను పూవులను కాయలను పండ్లను అందించి సత్పురుషులవలె లోకానికి మరెన్నో ప్రయోజనాలను సమకూరుస్తాయి.

ఛాయామన్యస్య కుర్వంతి. తిష్ఠంతి స్వయ మాతపే।
ఫలాన్యపి పరార్థాయ వృక్షా స్సత్పురుషా ఇవ॥ (హితోపదేశమ్)

పరోపకార పరాయణతకల ఈ వృక్ష సమూహాన్ని చూచి మానవ సమాజం ఎంతైనా స్ఫూర్తిని పొందవలసి ఉంది. ఆ విషయమే ప్రస్తావించి కరుణశ్రీ ఒక చోట "తరువులే గురువులు" అని ప్రబోధించారు. వెట్లనుండి చిగురులను కొందరు, కొమ్మలను కొందరు, ఆకులను కొందరు, పూవులను కొందరు, పూవులలోని మకరందాన్ని (తేనె) కొందరు, కాయలను కొందరు, పండ్లను కొందరు, కాండాన్ని కొందరు, వేళ్ళను కొందరు, అవసరాన్నిబట్టి వినియోగించుకొంటారు. వృక్షాన్ని సమూలంగా నరికి ఎండబెట్టి, కాల్చి బొగ్గులు చేసుకొని అమ్ముకొని లాభం పొందుదామని ఆలోచన చేస్తారు ఇంకొందరు. అయితే అది చెట్టుగా ఉన్నప్పుడు ఉండే ప్రయోజనం కట్టెగా ఉన్నప్పుడు లభింపదు.

ప్రకృతి సహజమైన ఎండకు వానకు చలికి చెదరక, బెదరక ఏలిని సుఖ దుఃఖముల వంటి వసంత శిశిరములనెన్నింటినో దాటి బీజ రక్షణకు, వ్యాప్తికి.

పాటుపడుతూ ఉత్పత్తిస్థితి నాశములతో గూడిన కాలచక్ర పరిభ్రమణానికి సాక్షిగా ఉండేవి వృక్షాలు - వృక్షముయొక్క ఏకొన్ని ఫలబీజములో మరికొన్ని వృక్షములు వృద్ధి పొందటానికి కారణమవుతాయి. ప్రపంచంలో ఒకొక్క దేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క వృక్షానికి ప్రాముఖ్యం ఉంది.

ఒక జాతి సంస్కృతీ సంప్రదాయ సంపదలను భద్రపరచి, భావితరాలకు అందించేది సాహిత్యం. ఆనాటి వ్యక్తులు భౌతికంగా లేకపోయినా వారి చరిత్ర అక్షర రూపమై సాహిత్య దర్పణంలో ప్రతిబింబించి, ఈనాడు మనకు దర్శనమిస్తూ మార్గదర్శనం చేయగలుగుతోంది.

ఆదిరాజ యశోబింబం అదర్శం ప్రాప్య వాఙ్మయం।
తేషా మసన్నిధానేఒపి నవ్యయం పశ్య నశ్యతి॥

అట్టి సాహితీ సంపదను ఒక చైతన్య నందనంగా వర్ణించడం కద్దు. అందులో వాల్మీకి రామాయణం ఒక కల్పవృక్షం వంటిది. అది తనను ఆశ్రయించి కోరిన వారికి ఫలాలను ఇస్తుంది. దూరాన ఉండి శాస్త్రుర్వినా వారాశించిన ఫలితం (డబ్బు) అందిస్తూనేవుంది. ఏ పరిస్థితులలోనూ ఫలించటమే దాని స్వభావం. సర్వశుభ ఫలదమై జగదాధారమైన ధర్మం అందులో కీర్తింపబడ్డది.

ధర్మా దర్థః ప్రభవతి ధర్మా త్ప్రభవతే సుఖమ్।
ధర్మేణ లభతే సర్వం ధర్మసార మిదం జగత్॥ అర.కాం; 9స. 30శ్లో

అందులో అభివర్ణింపబడిన ధర్మమే ఒక మహావృక్షంగా పేర్కొనబడింది. ధర్మాత్ముడైన రాముడే దానికి మూలం ఇంక తక్కినవారు కొమ్మలు, అకులు, పూలు, కాయలు, ఫలముల వంటివారు. వీటన్నింటికీ ఆ మూలమే అధారం, అదే అన్నింటికి శక్తి. రామాయణ పాత్రలలో, ఎవరెవరి యందు యేయే సద్గుణములు కీర్తింప బడ్డాయో అవి అన్నీ రామునిలో ఉండటం గమనింప దగ్గ విషయం. ఒక్కొక్కరిలో ఒక్కొక్క గుణం (స్నేహం, సేవాభావం, త్యాగం, సౌశీల్యము, సౌజన్యము, నిస్స్వార్థము, సత్యము, అహింస, శరణాగత రక్షణ, కారుణ్యము, పరాక్రమము మొదలైనవి) ప్రకటితంకాగా అవి అన్నియు రామునిలో మనకు దర్శనమిస్తాయి. వారందరికి అట్టి శక్తిని సామర్థ్యమును కలిగించునది రామతత్వము.

క్షేత్రము బీజము మంచిదై మూలమెంత ధృఢంగా ఉంటే అంతమంచి ఫలితం లభిస్తుంది. పెద్ద పెద్ద పూలు పూస్తాయి, తియ్య తియ్యని కాయలు కాస్తాయి. తెగులు వచ్చి అశక్తమై మూలం బలహీనమైపోతే పిచ్చి (గుడ్డి) పూలు పూస్తాయి కుక్కమూతి పిందెలు పుట్టుకొస్తాయి. చివరకు ప్రకృతిలో నిలద్రొక్కుకొని తలఎత్తి నిటారుగా నిలబడలేక, నేలకూలి, నామరూపాలు లేకుండా నశించి పోతుంది. అందువల్ల ఏ తెగులు రాకుండా, ఏ పురుగు తొలచకుండా ఆ వృక్షాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంది. (రావణుడు అధర్మవర్తనుడు కావటంచేత చెట్టుతోబాటు దానిపై కట్టుకొన్న పక్షిగూళ్ళవలె, అతనిని ఆశ్రయించుకొనిన వారు నశించారు. అతని బలహీనతయే అతని పతనానికి కారణమైంది.)

పితృ సత్యవాక్యరిపాలనకై అడవికి పోవుచున్న రాముని చూచి అయోధ్య వాసులాతని ఉత్తమ పురుష లక్షణాలను అభినందించారు. అతనిని ధర్మ పారంగల వృక్షమూలంగాను, తక్కిన వారిని పుష్పపత్రములుగాను అభివర్ణించారు. అధికమై దుర్నిరీక్ష్యమైన అతని ధర్మ తేజాన్ని ప్రస్తుతించారు.

అనృశంస మనుక్రోశః శ్రుతం శీలం దమ శ్శమః
రాఘవం శోభయం త్యేతే షడ్గుణాః పురుషోత్తమమ్॥
మూలం హ్యేష మనుష్యాణాం ధర్మసారో మహాద్యుతిః।
పుష్పం ఫలంచ పత్రంచ శాఖా శ్చాస్యేతరే జనాః॥
వా॥ రా॥ అయో॥ కాం॥ 33స, 12, 15 శ్లో॥

ఇందు అనృశంసనమనగా అహింసా స్వభావము. అనుక్రోశమనగా దయ, శ్రుతమనగా ఆచరణతో పరిపూర్ణమైన శాస్త్రవిజ్ఞానము, శీలమనగా సత్ స్వభావము. దమ మనగా ఇంద్రియ నిగ్రహము. శమ మనగా చిత్తప్రశాంతి ఇవి అరును లోకమున రాముని కళ్యాణగుణాభి రామునిగా కీర్తింప జేశాయి. ఇట్టివా డడవులకు పోవుచున్నపుడు ప్రకృతియే కలతచెందింది. ప్రజలంతా అతని వియోగానికి విలపించారు. లక్ష్మణునివలె తాము రాముని అనుసరించిపోవ సంకల్పించారు. సను సుఖ దుఃఖాను భవముగల అతని ధార్మికతను వేనోళ్ళ ప్రశంసించారు. రాముడున్న చోటే అయోధ్యగా భావించి అతనితోనే ఉండటానికి సిద్ధపడ్డారు.

తే లక్ష్మణ ఇవ క్షిప్రం సపత్న్య స్సహ బాంధవాః।
గచ్ఛంత మనుగచ్ఛామో యేన గచ్ఛతి రాఘవః॥

ఉద్యానాని పరిత్యజ్య క్షేత్రాణి చ గృహాణిచ।
ఏక దుఃఖ సుఖా రామ మనుగచ్ఛామ ధార్మికమ్॥

వా॥ రా॥ అయో॥ కాం॥ 33 స॥ 16, 17 శ్లో॥

సమాజం ఎడల మనం ఏ విధంగా ప్రవర్తిస్తామో సమాజం కూడా మన యెడల ఆవిధంగానే ప్రవర్తిస్తుంది. రాముడు ప్రజల యెడ ఆత్మీయత-అనురాగములు కలిగి, బహుజనహితము, బహుజన సుఖము కోరిన వాడగుటచే ప్రజలాతని వియోగ దుఃఖమును భరింపలేక పోయారు.

ప్రజలా రాముని రాజు వేయమని దశరథునికోరే సందర్భంలోను అతనిలో గల ఈ ఉత్తమ నాయకత్వ లక్షణాలు అనేక విధాల ప్రస్తుతింపబడ్డాయి. అందు రాముడు ప్రజల సుఖదుఃఖములలో సమంగా పాలుపంచుకుంటూ, హితుడుగా, సన్నిహితుడుగా మెలగినట్లు వివరింపబడింది.

వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి॥

అయో॥ కాం॥ 2 స॥ 40 శ్లో॥

ఈ విధమైన ధార్మిక వర్తనముగల రాముని ప్రజ అనుసరింప బూనివారు. లోకమున మహోన్నతుడగు ఒక మహాత్ముని అనుసరించుట కాతనిలోగల ధార్మిక గుణములే కారణములగుట చరిత్రలో గమనించుచునే ఉన్నాము. సత్యాహింసలు వ్రతముగా పాటించి అనుష్ఠించిన స్వాతంత్రోద్యమ రథ సారథి గాంధీగారి పిలుపు విని దేశ విదేశములలోని భారతీయులు అతనిని అనుసరించుచు ఉద్యమంలో పాల్గొనేందుకు ఎన్నో ఉన్నత పదవులు, వివిధ వృత్తులు విడిచి ముందుకువచ్చిన విషయం అందరెరిగిన సత్యమే కదా!

యాగ సంరక్షణకై సిద్ధాశ్రమమునకు పోవు సందర్భమున రామునకు విశ్వామిత్రుడు వివిధ శస్త్రాస్త్రములతో పాటు బలాతి బల విద్యలను ప్రసాదించుచు ధార్మికుడైన రాముడందుకు అర్హుడని సంభావించాడు.

"ప్రదాతుం తవ కాకుత్స్థ! సదృశ స్త్వం హి ధార్మిక!

బాల॥ కాం॥ 22 స॥ 18 శ్లో॥

తండ్రికి అసత్య దోషం కలుగకుండా ఉండేందుకు అడవులకుపోవ నిశ్చయించుకొని తన అనుమతి వేడవచ్చిన రామునితో కౌసల్య తనయుడిగా నీకు తల్లినైన నా మాటకూడా వినవలసిన అవసరం ఉంది, కనుక, నాయనా "నేను చెప్తున్నాను నీవు వనవాసానికి వెళ్ళవద్దు ఇక్కడే ఉండు" అన్నది. అందుకు సమాధానంగా రాముడు తల్లితో "అమ్మా! భార్యగా నీవు, తనయునిగా నేను, అట్లే ఇంకా తక్కినవారు మన మందరము తండ్రి మాట పాటింప వలసిన వారమే అందువల్ల నన్ను వనవాసానికి అనుమతింపు" మని కోరాడు. ఇదే సనాతన ధర్మమని వివరించాడు.

త్వయా మయాచ వైదేహ్యా లక్ష్మణేన సుమిత్రయా।
పితు ర్నియోగే స్థాతవ్య మేషధర్మ స్సనాతనః॥

అయో॥ కాం॥ 21 సం. 49 శ్లో॥

ధర్మభృతాం వరుడైన రాముడు ఇంకను తల్లితో నాకు వలె నీకును అతని వచన మనుసరణీయమని చెప్పినాడు.

మయా చైవ భవత్యా చ కర్తవ్యం వచనం పితుః।
రాజా భర్తా గురు శ్శ్రేష్ఠః సర్వేషా మీశ్వరః ప్రభుః

అయో॥ కాం॥ 24 స॥ 16 శ్లో॥

నీకు వనవాసమే తప్పనిసరి అయితే నీవెంట నన్నూ అడవులకు తీసుకొని వెళ్ళమని కోరింది అతని తల్లి కౌసల్య "తండ్రి దశరథుడు బ్రతికి ఉండగా తల్లీ! నీవాతని సేవించి యుండుటే యుక్తమని, అదే సనాతన ధర్మమని వివరించి, వేదమునను లోకమునను, శ్రుతి, స్మృతులందును భార్య భర్తను అనుసరించుటయే సమంజసమని చెప్పబడినట్లు వర్ణించి రాముడు తల్లిని అందులకు అంగీకరింపజేశాడు.

యావ జ్జీవతి కాకుత్స్థః పితా మే జగతీపతిః।
శుశ్రూషా క్రియతాం తావత్ స హి ధర్మ స్సనాతనః॥
శుశ్రూషామేవకుర్వీత భర్తుః ప్రియహితేరతా।
ఏషధర్మః పురాదృష్టో లోకేవేదే శ్రుతః స్మృతః॥

వా॥రా॥ అయో॥ కాం॥ 24 స॥ 13, 27 శ్లో॥లు.

ఆ వీరమాత కౌసల్య తనయుని ధార్మిక నిష్ఠను మెచ్చుకొని, అతని వనవాసమున కనుమతించి పంపుచు, "నీధర్మమే నిన్ను రక్షింపగలదని ఆశీర్వదించింది.

యం పాలయసి ధర్మం త్వం ధృత్యా చ నియమేనచ
సవై రాఘవ శార్దూల! ధర్మ స్త్వా మభిరక్షతు॥

అయో॥ కాం॥ 25 స॥ 23 శ్లో॥

సీతతో తన వనవాసము యొక్క అవశ్యకతను చెప్పుచు, రాముడు పితాజ్ఞా పరిపాలనమే తనకు ధర్మమని నిర్వచించాడు.

సీతా లక్ష్మణులతో గూడి వనవాసమునకు బోవుచు తనకు నమస్కరింప వచ్చిన రామునితో దశరథుడు "నాయనా! నీకు పునరాగమనము, ఐహికాముష్మిక ఫలములను లభించుగాక. నీ మార్గము సుగమమై, భయరహితమగుగాక. పోయి రమ్మ శుభము" అని దీవించి "సత్య నిష్ఠ ధార్మిక బుద్ధియుగల నిన్ను వనవాస వ్రతము నుండి నివారింపజేయ జాలకున్నా"నని పలికి అతని ప్రయాణమున కను మతించాడు.

శ్రేయసే వృద్ధయే తాత పునరాగమనాయచ।
గచ్ఛ స్వారిష్ట మవ్యగ్రః పంథాన మకుతో భయమ్॥
న హి సత్యాత్మన స్తాత! ధర్మాభిమనస స్తవ।
విని వర్తయితుం బుద్ధి శ్శక్యతే రఘునందన!॥

అయో॥ కాం॥ 34 స॥ 31, 32 శ్లో॥

ఇంక తక్కిన వారందరివద్ద సెలవు తీసుకొని సీతా లక్ష్మణ సహితుడై రాముడు సుమంత్రుని రథ మధిరోహించాడు. రాజవీథి వెంట రథం కదిలిపోతోంది. రామ వియోగ దుఃఖమున ప్రజలు హాహాకారములు చేస్తున్నారు. కౌసల్య దీనంగా హా రామా! హా లక్ష్మణా! హా సీతా! యని విలపిస్తూ ఆ రథము ననుసరించి వస్తోంది. దశరథుడు పదములు తొట్రుపడ అంతఃపురము వీడి వచ్చి "సుమంత్రా! నిలువుమని ఆక్రోశించాడు. రాముడు పోనిమ్మని ఆదేశించాడు. అప్పుడా సుమంత్రునకు బండి యొక్క రెండుచక్రముల మధ్యపడిన వానివలె సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది. "తిరిగి వచ్చిన తరువాత "నా మాట పాటింప లేదేమని అడిగితే, రాజు దశరథునితో విన లేదని చెప్పమన్నాడు. తామచట ఎక్కువకాలము నిల్చుట వారికి దుఃఖహేతు వగుటచే సాగిపోవుటయే ధర్మ" మనినాడు.

తిష్ఠేతి రాజా చుక్రోశ యాహి యాహీతి రాఘవః
సుమంత్రస్య బభూవాత్మా చక్రయో రివ చాంతరా॥
నాశ్రౌష మితి రాజాన ముపాలబ్ధోఽపి వక్ష్యసి
చిరం దుఃఖస్య పాపిష్ఠ మితి రామ స్త మబ్రవీత్॥

అయో॥ కాం॥ 40 స॥ 46, 47 శ్లో॥

తండ్రి మాటకై అడవులకుపోవు రాముడు తానిప్పుడు ఎందుకు తండ్రి మాట కాదన్నాడు? అందుకు పరివారమును గూడ ప్రోత్సహించి నాడెందుకు? ఇదేమి ధర్మబుద్ధి? యను ప్రశ్న కలుగక మానదు.

"ధర్మస్యగహనాగతిః" "ధర్మస్య సూక్ష్మగతిః" అనుటను బట్టి ఒకొక్కప్పుడు ధర్మమతి సూక్ష్మమై సామాన్య దృష్టికి గోచరముకాదు. అందలి యథార్థము బోధపడదు. లోకమున కొన్ని విషయములు గడ్డిచే కప్పబడిన పాడుబడ్డ నూతులవలె [తృణచ్ఛన్న కూపములవలె] స్థూల దృష్టికి ధర్మమువలె దోచినను, సూక్ష్మముగా యోచించి నప్పుడది అధర్మమముగా పరిణమించుట కద్దు. అట్టిది మిక్కిలి ప్రమాదభరితము. మరికొన్ని అధర్మముగా కన్పట్టినను తుదకు ధర్మముగా రాణించుట అనుభవసిద్ధమే. రామాయణమున తండ్రికి అసత్య దోషము కల్గకుండుటకై వనమునకు వెడలు రాముని, దశరథుడు ముందుగా పోయిరమ్మ"ని ఆశీర్వదించి, తదుపరి కేవల పుత్ర వ్యామోహమున నిలుపు మనుట ధర్మము కాదు. మోహము ఉన్మాద లక్షణము. ("మోహో హ్యున్మాద లక్షణమ్!" సుం॥ కాం॥ 34 స॥ 24 శ్లో॥) కావున అట్టిది పాటింపక పోవుట నేరము కాబోదు. రాముడా సమయమున రథము నిలిపి వారికై ప్రతీక్షించినచో తల్లి, దండ్రులు, మిత్రులు, బంధువులు, పౌర జానపదులైన ప్రజలు, తనచుట్టును చేరి ఏదో విధముగా అరణ్యవాసమునకు బోవలదని నిర్బంధిస్తారు. అట్లు చేయుట తండ్రికి, అడవులకు పోవుదునని ప్రతిజ్ఞ కావించిన తనకును అసత్య దోషమునకు కారణమౌతుంది. అట్లా కాకుండా ఉండాలంటే తానెప్పటికైనను అడవులకు వెళ్ళి తీరవలసిందే. తానక్కడ ఉన్నంతసేపు వారికి దుఃఖోద్వేగము కల్గునేకాని ఉపశమనం మాత్రం జరగబోదు. ధర్మహానితో పాటు, ఆత్మీయులకు దుఃఖకారణమైన తన ఉనికి ఏ రకంగానూ సమంజసంకాదు. అందువల్ల ఆవశ్యం చేయదగిన ధర్మం చేయటమే యుక్తమని తలచి రాముడు సుమంత్రుని త్వరపెట్టి అడవికి సాగిపోయాడు. ఆ తరువాత వారే

క్రమంగా దుఃఖ దూరులవుతారని భావించాడు. ఇందులో తామునకు కలిగే లాభము ఏమీలేదు. కేవలం ఇతరుల మేలుకోరియే అతడయోధ్య విడిచి ధర్మబుద్ధితో అడవులకు వెళ్ళాడు. ఆ విషయమే కైకతో ముందుగా వివరించాడు. తన కంతకంటే వేరే ధర్మంలేదని తానుభావించినట్లు చెప్పాడు.

నాఽహ మర్థపరో దేవి! లోక మావస్తు ముత్సహే।
విద్ధిమాం ఋషిభి స్తుల్యం విమలం ధర్మ మాస్థితమ్॥
నహ్యతో ధర్మాచరణం కించి ద స్తి మహ త్తరమ్।
యథాపితరి శుశ్రూషా తస్యవావచన క్రియా॥

అయో॥ కాం॥ 19 స॥ 20, 22 శ్లో॥

మరి ఇప్పుడిట్లా చేయటం రాముని ధర్మాచరణ తత్పరతకు, సూక్ష్మ దృష్టికి నిదర్శనమే కాని, తండ్రిమాట అతిక్రమించటం, అసత్యమాడటం అనటానికి ఇందులో తావేలేదు. కొందరు విమర్శకులు ఈ విషయాన్ని ఆక్షేపించటం వారి అల్పజ్ఞతనే సూచిస్తుంది. తెలియని దాన్ని తెలుసుకోవాలి. తప్పుగా విమర్శింపరాదు. త్రాడు తక్కువైందని బావి పూడ్చుకుంటామా ?

చిత్రకూటంలో ఉన్న రాముని వద్దకు వచ్చి భరతుడు అయోధ్యకు తిరిగి రమ్మని తనను వేడినప్పుడు రాముడు, కైక కోరిన వరాలలో తన అరణ్యవాసం భరతుని పట్టాభిషేకం రెండును సమప్రాధాన్యం కలిగినవే అనీ, అందులో ఏ ఒక్కటి జరుగకపోయినా తండ్రి మాట పూర్తిగా నెఱవేరినట్లు కాదని చెప్పి, భరతుని అయోధ్యకేగి ప్రజాపాలన మొనరింపుమని రాముడు ధర్మసూక్ష్మన్ని వివరించాడు. ఆ సందర్భంలో గురువులైన వశిష్ఠాదులు ఇంక తక్కిన పెద్దలు, ప్రముఖులు కొందరు రాముని వనవాస వ్రతాన్ని మానుకొని అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడవై ప్రజలబాలింపుమని అభ్యర్థించారు. అప్పటికది ధర్మం కాదు. కావున రాముడందుకు సమ్మతింపలేదు

భారతీయ సంస్కృతిలో శ్రుతులను మిక్కిలి ప్రమాణముగా గ్రహింపట అందరకు తెలిసిందే. తక్కిన శాస్త్ర, పురాణ ఇతిహాస, కథా-ఆఖ్యాయికలన్నియు ఆయర్థమునే విశేషించి వివరించుచున్నవి. రామాయణమున శాశ్వతమగు ఆశ్రుత్యర్థమునే ప్రతిపాదించుట గమనింపగలము. "వేదోపబృ హణార్థాయ తావ గ్రాహయత ప్రభుః" (బాల కాం॥ 4 స॥ 6 శ్లో॥) ఇత్యాదులు ఉదాహరణములు.

ఉపనిషత్తులు శ్రుతులే అందురు. అట్టి శ్రుతి "మాతృదేవోభవ. పితృదేవోభవ. ఆచార్య దేవోభవ. అనునది మొదలుగా శాసించుచు "యాన్యన వద్యాని కర్మాణి తానిసేవి తవ్యాని నో ఇతరాణి, యాన్యస్మాకగ్ం సుచరితాని, తాని సేవితవ్యాని, నో ఇతరాణి" అని గురుముఖమున ప్రవచించింది. తల్లి, దండ్రి, గురువు, మొదలగు వారిని దైవములుగా భావించి, గౌరవించుటతో బాటు లోకమున ధర్మబద్ధములు. నింద్యములుకాని కర్మములనే ఆచరింపుమని వివరించి. ఆ పెద్దలు చెప్పి, ఆచరించిన, మంచి పనులనే అనుసరింప వలెననీ, తక్కినవి అనగా వారాచరించుచున్న చెడ్డపనులు, ప్రత్యేక ప్రయోజ నాపేక్షతో చేయుచున్న దుర్బోధలు, పాటింపనవసరం లేదని అందులో స్పష్టంగా ప్రబోధింపబడింది. కావున ధర్మబద్ధములైనప్పుడే పెద్దల మాటలు మన్నించాలి. అట్లుకానిచో విడిచిపుచ్చుట యుక్తము, కర్తవ్యమని తెలియుచున్నది. అమ్మా! ఈ మాట లోటకూరనాడే చెప్పలేదేందుకు అన్నది అందుకు తార్కాణం.

రాముడు తల్లిదండ్రులు చెప్పిన దానిలోగాని గురువు లుపదేశించిన దానిలో గాని, సత్యధర్మములను ప్రతిపాదించునవి మాత్రమే గ్రహించి ఆచరించాడు. తక్కినవి పరిత్యజించాడు. రాముడిట్లు తన ధర్మమును తాను పాటించుచు, తనవారిచే ధర్మమును పాటింపజేసినాడు. "రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్యచ రక్షితా" (బా॥ కాం॥ 1 స॥ 14 శ్లో॥)

ఇంక భరతుని ఆశ్వాసించుచు రాముని వనవాస వ్రతము విరమింపజేసి తమతో నయోధ్యకు తోడ్కొనిపోవ సంకల్పించి జాబాలికొన్ని అనుచితములు పలికినాడు. అప్పుడతని అధర్మ వచనములు ధర్మాత్ముడైన రాముడు తీవ్రంగా ఖండించి, ధర్మమును ప్రకటించాడు. పరలోకము యొక్క ఉనికిని కర్మ సిద్ధాంతము తపః ప్రభావమును అభివర్ణించాడు. అగ్ని, వాయు, చంద్రార్క, ఇంద్రులను అందుకు దృష్టాంతంగా చూపించాడు. (అయో॥ కాం॥ 109 స॥) జాబాలి పలుకులు ధర్మ విరుద్ధములని వాల్మీకియే స్వయముగా సూచించాడు.

ఆశ్వాసయంతం భరతం జాబాలి ర్బ్రాహ్మణోత్తమః।
ఉవాచ రామం ధర్మజ్ఞం ధర్మాపేత మిదం వచః॥

అయో॥ కాం॥ 108 స॥ 1 శ్లో॥

అంత వశిష్ఠుడు "జాబాలియు ఇహలోక పరలోక వృత్తముల నెఱింగిన వాడే అనీ, నిన్ను అయోధ్యకు గొంపోవు నుద్దేశముతో మాత్రమే ఇట్లు పలికినాడనీ చెప్పి జాబాలి యొక్క అభిప్రాయాన్ని వివరించాడు.

క్రుద్ధ మాజ్ఞాయ రామంతు వశిష్ఠః ప్రత్యువాచహ।
"జాబాలి రపి జానీ తే లోకస్యాస్య గతాగతిమ్।
నివర్తయితు కామస్తు త్వా మేత ద్వాక్య ముక్తవాన్॥

అయో॥ కాం॥ 110-1, 2 శ్లో॥

ఇక్కడ జాబాలి నాస్తిక మతాన్ని చెప్పాడని ప్రచారం చేసేవారు ఆ ఘట్టం లోని కొన్ని మాటలు గ్రహించి కొన్ని విడిచి పెట్టడం జరుగుతోంది. అది విమర్శకుల పాక్షిక దృష్టికి నిదర్శన . తమ అభిప్రాయ ప్రకటనకు మాత్రమే అది ఉపకరిస్తుంది తప్పితే, సత్యప్రకాశమునకు ఏ విధంగాను దోహదం చేయదు అట్టిది సమగ్ర పరిశీలన మనిపించుకోదు. అసలు జాబాలియే స్వయంగా, "నేను నాస్తిక మతం చెప్పటం లేదు. నేను నాస్తికుడను కాను. నాస్తికత్వ మనేది లేనేలేదు." అని కంఠోక్తిగా చెప్పాడు.

న నాస్తికానాం వచనం బ్రవీ మ్యహంన, నాస్తికోఽహం న చ నాస్తి
కించన 109 స॥ 38 శ్లో॥
నివర్తనార్థం తవ రామ కారణాత్ ప్రసాదనార్థంత
మయైత దీరితమ్ 109 స॥ 39 శ్లో॥

ఒకప్పుడిది ప్రక్షిప్తమని వాదిస్తారు కొందరు. అటువంటి పక్షంలో వారన్నదే ప్రక్షిప్తం ఎందుకు కాకూడదు ? ఇది తేలేదెన్నడు ? తేల్చే దెవ్వరు ? అదేదో ఒకటి వారే బయటపెడితే అదే అనుసరిద్దాం. కష్టపడి ఆ పని వారెందుకు చేస్తారు. ఉన్న వ్యవస్థనుపాడు చేయాలని చూస్తారు తప్ప. అది సాధ్యమా ? కాలమే దానికి సమాధానం చెప్పాలి. అందువల్ల పాఠకులు, విమర్శకులు పక్షపాత వైఖరి మాని పరమార్థం గ్రహించాలి. అందుకు ఆమూలాగ్రం ఆ గ్రంథం చదవాలి ఆకళింపు చేసుకోవాలి అంతేకానీ మూఢులై పరుల మాటలు నమ్మి, ప్రచారం చేయరాదు. ఏది ఏమైనా జాబాలి చెప్పింది స్వార్థంతో మూడిపడిఉన్న కారణంగా రాముడు తన వనవాస నియమాన్ని మానుకోటానికి ఇష్టపడలేదు. అందుకే ఈ ఘట్టంలో వాల్మీకి రాముని "ధర్మజ్ఞుడు" (108 స॥ 1 శ్లో॥) అని పేర్కొన్నాడు. అంటే అతడు చెప్పింది, చేసింది ధర్మమన్న మాట.

అవతార మూర్తియగు ఒక మహాపురుషుని చరిత్ర చెప్పుచు, వేదవిహితములగు క్రతు వ్రతముల ఫలమును నిరూపించి, పునర్జన్మ సిద్ధాంతమును ప్రతిపాదించి, మహర్షుల దేవ పితృగణముల మహత్వమును వివరించు నీ రామాయణమున నాస్తిక సిద్ధాంతము ప్రస్తావింపబడుట దాని నిరసించుటకేగాని, స్థాపించుటకు కాదని తెలియుట లేదా ! ఆ కాలముననే అక్కడక్కడ ముచ్చటింపబడుచు, ప్రజల మనసులను కలతపరచు నీ వితండవాదము ప్రమాణ పురుషుడగు రాముని ముందుంచి అతనిచే ఖండింపబడుచు, పరాస్త మొనరింపబడి ధర్మ సమ్మతమై జగము లనుసరించుటకు యోగ్యమగునని ఋషి సంకల్పించినట్లు తోచును. కాకున్న దాని ప్రయోజనమేలేదు.

దండకారణ్యములోని మునులు క్రూరకర్ములైన రాక్షసుల బారినుండి తమ్ములను రక్షించమని రాముని అర్థించారు. రాక్షస సంహారం చేస్తానని ధర్మజ్ఞుడైన రాముడు ప్రతిజ్ఞ చేసాడు. సీత ఏమిటీ అకారణవైరం ? అని అడిగితే, సంశ్రిత వ్రతులైన మునుల ధర్మకర్మములను పాడుచేయు నరమాంస భక్షకులగు రాక్షసులను సంహరించటం ఆ ప్రాంతానికి రాజుగా తనకు ధర్మమని వివరించాడు.

తర్వాత సత్యసంధుడైన రాముడా మాట నెరవేర్చాడు. ఆ వనమునందు రాక్షసులే లేకుండా చేశాడు. ఇంతకు పూర్వం కూడా ప్రజారక్షణ కారణంగా అధర్మ స్వరూపిణియైన తాటకను స్త్రీ అనియైనా చూడకుండా వధించి ఒకానొక ధర్మ సూక్ష్మమును వివరించాడు.

రాజ్యభార నియుక్తానా మేష ధర్మ స్సనాతనః
అధర్మ్యాం జహి కాకుత్స్థ ధర్మో హ్యస్యాన విద్యతే॥

బా॥ కాం॥ 25 సం॥ 18 శ్లో॥

ఇంక ఒక వ్యక్తియొక్క సంపూర్ణ చరిత్ర తెలుసుకోవాలంటే లోకాని కాతడు అవరణం ద్వారా చెప్పిందేమిటి ? అనేది మొదటిది. దానితో పాటు అతని నడవడిని బట్టి లోకం (సమకాలీనమైన సమాజం) అతని వ్యక్తిత్వాన్ని ఏ విధంగా గుర్తించింది అనేది రెండవది.

ఈ రెండూ కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడే ఆ విషయానికి సమగ్రత సిద్ధిస్తుంది.

శరభంగ మహర్షి గొప్ప తపస్సు చేశాడు. ఫలితంగా బ్రహ్మలోకంలో నివసించే అర్హత లభించింది. అతనిని దివ్య విమానం మీద ముందుగా స్వర్గానికి తీసుకొని వెళ్ళటానికి ఇంద్రుడే స్వయంగా వచ్చాడు. అయినా, ఆ మహర్షి రాముని దర్శించిగాని తాను రానని ఇంద్రుని పంపించేశాడు. రాముడు తన ఆశ్రమానికి వచ్చినప్పుడు అతిథి సపర్యలు చేసి, అది తనకు లభించిన మహద్భాగ్యంగా ఎంచి, ఆ తర్వాతనే ఉత్తమ లోకాలను చేరాడు. అంటే స్వర్గంకంటే రాముని సందర్శనమే మిన్నగా భావించాడా ఋషి. అదే పురుషోత్తముడైన రామునిలో ఉన్న విశేషం.

శ్లో॥ అహం జ్ఞాత్వా నరవ్యాఘ్ర వర్తమాన మదూరతః
బ్రహ్మలోకం నగచ్ఛామి త్వా మదృష్ట్వా ప్రియాతిథిమ్॥
త్వయాహం పురుషవ్యాఘ్ర ధార్మికేణ మహాత్మనా।
సమాగమ్య గమిష్యామి త్రిదివం దేవసేవితమ్॥

అ॥ రః కాం॥ 5 స॥ 29, 30 శ్లో॥

శబరి తన గురువుల వెంట అక్షయ లోకములకు పోవలసి యుండియు, రాముని రాకకై వేచి ఉండి, అతని చూచి, పూజించి, తన జన్మము, తపము, సఫలములైనట్లు సంభావించింది.

అద్య ప్రాప్తా తపస్సిద్ధి స్తవ సందర్శనా న్మయా।
అద్యమే సఫలం తప్తం గురువశ్చ సుపూజితాః॥
అద్యమే సఫలం జన్మ స్వర్గ శ్చైవ భవిష్యతి।
త్వయి దేవవరే రామ! పూజితే పురుషర్షభ॥

అర॥ కాం॥ 74 స॥ 11, 12 శ్లో॥

అనుయాయులు, ఆత్మీయులే, రాముని పొగుడుటకాదు, శత్రువులు సహితం అతనిని కీర్తించటం విశేషం అట్టిది రాముని ధార్మిక నిష్ఠకు, సత్యపరాక్రమమునకు ప్రబలమైన ఉదాహరణ. సీతాపహరణం కోసం తన ఆశ్రమానికి వచ్చిన రావణునితో రాముని గూర్చి మారీచుడు ఇట్లా అన్నాడు.

రామో విగ్రహవాన్ ధర్మ స్సాధుః సత్యపరాక్రమః
రాజా సర్వస్య లోకస్య దేవానా మివ వాసవః॥

అర॥ కాం॥ 57 స॥ 13వ శ్లో॥

రాముడా మారీచునకు ప్రతి వృక్షమునను దోచుచున్నట్లు, తుదకు అరణ్యమే అతని దృష్టిలో రామమయమైనట్లు వర్ణింపబడినది. రాముని ధర్మతేజమునకిది నిదర్శనము.

వృక్షే వృక్షేహి పశ్యామి చీర కృష్ణా జినాంబరమ్।
గృహీత ధనుషం రామం పాశహ స్త మివాంతకమ్॥
రామభూత మిదం సర్వ మరణ్యం ప్రతిభాతిమే (15-40-3)

ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు మైత్రికి అర్హుడు అయిన సుగ్రీవునితో రాముడు స్నేహ మొనరించి, కృతకిల్బిషుడు చారిత్ర దూషకుడు ఐన వాలిని వధింతునని ప్రతిజ్ఞ చేశాడు. తొలుతగా వాలి సుగ్రీవులు తలపడినప్పుడు ఎవ్వరెవ్వరో గుర్తు తెలియక రాముడు చూస్తూ ఊరుకున్నాడు. సుగ్రీవుడప్పుడు వాలి చేతిలో బాగా దెబ్బలు తిన్నాడు. తర్వాత అభిజ్ఞానము (గుర్తు) ధరించి సుగ్రీవుడు వాలిని వెంటనే మరి యొకసారి యుద్ధమునకు రమ్మని పిలిచాడు. అది విని అంతఃపురంలో ఉన్న తార వాలితో సుగ్రీవునకు రాముని అండదండలున్నాయని చెప్పి, మహాత్ముడైన అతనితో నీకు వైరము తగదని, తాను చారులువలన రాముని గూర్చి వినిన సమాచారము వివరించింది.

స తే భ్రాతుర్హి విఖ్యాతః సహాయో రణ కర్మణి।
రామః పరబలా మర్దీ యుగాంతాగ్ని రివోత్థితః॥
నివాసవృక్షః స్సాధూనా మా పన్నానాం పరాగతిః।
ఆర్తానాం సంశ్ర యశ్చైవ యశస శ్చైక భాజనమ్॥

కి॥ కాం॥ 15 స॥ 18, 19 శ్లో॥

రాముడు సాధువులకు నివాస వృక్షము. వృక్షము ఆశ్రితులకు విలువ నీడనిచ్చి, తాపమును పోగొట్టి, పుష్పఫలాదుల నొసగి, సర్వేంద్రియ తర్పణము గావించునట్లే, ఈతడును సాధువుల కన్ని విధముల ఆశ్రయభూతుడు. ఆపన్నుల యోగక్షేమము లతడే వహించును. ఆర్తులకు సకల శుభములు గూర్చి సుఖసంపదలు ప్రసాదించు దయా సముద్రుడతడు లౌకికా లౌకికశాస్త్ర సంబంధమైన, జ్ఞాన విజ్ఞానముల కాతడు నిధి వంటివాడు. సకల గుణాకరుడైన రాముడు ధర్మాచరణ తత్పరుడు. కావున ఆరాముని ప్రాపు గాంచిన సుగ్రీవునితో వైరముమాని అతని మన్నించి,

రామునితో స్నేహ మొనరింపుమని, తార వాలికి హితము బోధించింది. అతనికది రుచింపలేదు. వినాశకాల మాసన్నమైనప్పుడు విపరీత బుద్ధులు కలుగుననుట సత్యమే కదా! (15స॥ 31 శ్లో॥) వెన్వెంటనే వాలి తన దుస్సాహమునకు తగిన ఫలము ననుభవించాడు.

ఇంక వాలి వధ ధర్మమా ? అధర్మమా ? అంటే అందుకు రాముడు వాలికి చెప్పిన సమాధానమే సరియైన సమాధానము. అందులో అన్ని విధాల అత విని శిక్షించుట ధర్మసమ్మతమే అని రాముడు నిరూపించాడు. "సర్వధా ధర్మ ఇత్యేవ ద్రష్టవ్య స్తవ నిగ్రహః (18 స॥ 29 శ్లో॥) బాణోపహత చేతస్కుడై వాలి రాముని మొదట నిందించినా, అతని ధర్మ నిర్ణయాన్ని విని తన తప్పు ఒప్పుకొని "తొందర రోషంతో నేను పలికిన పలుకులు అనుచితం కావటంచేత క్షమించమని" కోరి, "ధర్మజ్ఞుడవైన నీవు చేసిన ఈ పని నిజంగా ధర్మమేనని అంగీకరించాడు, ధర్మబుద్ధితో మమ్ము కాపాడుమని ప్రార్థించాడు.

ఏవ ముక్తస్తు రామేణ వాలీ ప్రవ్యథితో భృశమ్।
న దోషం రాఘవే దధ్యౌ ధర్మేఽధిగత నిశ్చయః॥
కి॥ కాం॥ 18 స॥ 45 శ్లో॥

త్వం హి దృష్టార్థ తత్త్వజ్ఞః ప్రజానాం చ హితేరతః।
కార్య కారణ సిద్ధే తే ప్రసన్నా బుద్ధి రవ్యయా॥
మమాప్యగత ధర్మాణం వ్యతిక్రాంత పురస్కృతమ్॥
ధర్మ సంహితయా వాచా ధర్మజ్ఞ పరిపాలయ॥
కి॥ కాం॥ 18 స॥ 49, 50 శ్లో॥

తర్వాత, తనను శరణు కోరివచ్చిన విభీషణునికి ఆశ్రయం ఇవ్వటం, అది రించటం రాముని ధర్మజ్ఞతకు పరమ ప్రమాణం. అటు కిష్కింధ కాని, ఇటు లంక కాని తాను జయించినవే కనుక, తానే అధికారంలో కొనసాగితే కాదనే వాడులేడు. కానీ రాముడు అందుకు వారసులైన సుగ్రీవ, విభీషణులకే రాజ్యమిచ్చి, పట్టంకట్టిన విధానం అతని ధర్మనిష్ఠకు తార్కాణం అవుతుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణే దానికి ఫలం.

ఇంక రామునిలోగల విశిష్ట గుణములే ఇతరు లతనికి దాస్యం చేసేంతటి ఉత్కృష్టతను సంపాదించి పెట్టాయి. ఋశ్యమూక పర్వతప్రాంతంలో తమను గూర్చి

పరిచయం చేస్తూ లక్ష్మణుడు హనుమంతునితో "అతడు రాముడని, అతని తమ్ముడనైన నేను అతని గుణములకు వశీకృత హృదయుడనై అతని వెంట అడవులకు వచ్చి సేవించుచున్నానని చెప్పాడు.

అహ మస్యావరో భ్రాతా గుణై ర్దాస్య ముపాగతః
కృతజ్ఞస్య బహుజ్ఞస్య లక్ష్మణో నామ నామతః॥
కిం॥ కాం॥ 4 స॥ 12 శ్లో॥

సీతాన్వేషణ తత్పరుడై హనుమంతుడు లంకలో అశోకవన మధ్యంలో, కింశుపావృక్షం క్రింద, సీతను సందర్శించి రామముద్రిక నిచ్చి, ఆమె శోకాన్ని పోకార్చి, రావణునకు సుగ్రీవ సందేశాన్ని వినిపించే నిమిత్తమై, రాజదర్శనంకోరి అతనికి ప్రాణప్రదమైన అశోకవనం భగ్నం చేస్తూ, తన పైకి యుద్ధానికి వచ్చిన రాక్షసులను సంహరిస్తూ రామ ప్రభువుయొక్క జయఘోష వినిపించాడు. అతని పరాక్రమ ప్రభావమును ప్రకటించాడు. అదే అతనికి విజయోత్సాహమును ప్రసాదించింది.

జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభి పాలితః॥
దాసోఽహం కోసలేంద్రస్య రామస్యా క్లిష్టకర్మణః।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః॥
న రావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్।
శిలాభి స్తు ప్రహరతః పాదపై శ్చ సహస్రశః॥
అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీం।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్॥
వా॥ రా॥ సుం॥ కాం॥ 42 స॥ 33-36 శ్లో॥

(ఈ నాలుగు శ్లోకాలు వ్యవహార జయంకోరే వారికి నిత్య పారాయణార్హమ్ములని, ఇవియే మొత్తం సుందరకాండ పారాయణ ఫలాన్ని ప్రసాదిస్తాయని సంప్రదాయజ్ఞులైన పెద్దలు చెప్తారు)

ఇందులో రాముడు "అక్లిష్ట కర్ముడు" అగుటచే తానాతనికి దాసుడనైతినని హనుమంతుడు వివరించాడు. "అక్లిష్ట మనగా దైన్యములేనిది, నాశనము లేనిది,

శుభమైనది, విశిష్టమైనది అని అర్థము. అట్టి కర్మ మనగా ధర్మఫల హేతుకమైన కార్యమని తాత్పర్యము. దుష్ట రావణ సహస్రము నెదిరించి, జయించగల హనుమంతుడు ధర్మాచరణం ద్వారా జగద్ధితుడగు రాముని గుణోన్నతికి దాసుడై స్వామి కార్యము మిక్కిలి శ్రద్ధా భక్తులతో నెరవేర్చాడు.

ఈనాడు కూడా లోకం, మహాత్ములగు మహోన్నత పురుషులను, లోక హిత చింతనతో కూడిన వారి విశిష్ట సేవలను గుర్తించి, జాతి నేతలుగా, సమాజ నిర్మాతలుగా, గౌరవించి అనుసరించడం, చూస్తూనే ఉన్నాం. వారి ధర్మాచరణమే వారిని జగదా రాధ్యులను చేసింది.

రాముడు తనకు చంపదగిన శత్రువు రావణుడు చేత చిక్కినప్పుడు కూడా వీరధర్మమును పాటించి యుద్ధరంగమున విరథుడై, నిరాయుధుడైన అతనిని అక్రమంగా సంహరింపక అప్పటికి దయతలచి, విడిచిపుచ్చి ధర్మవీరుడై ప్రకాశించాడు.

ప్రయాహి జానామి రణార్దిత స్త్వం ప్రవిశ్య రాత్రించరరాజ లంకామ్।
ఆశ్వాస్య నిర్యాహి రథీచ ధన్వీ తదా బలం ప్రేక్ష్యసి మే రథస్థః॥
యు॥ కాం॥ 59 స॥ 144 శ్లో॥

"రావణా! నేడు యుద్ధమున బాగా అలసిపోయిన నీవు లంకకు చేరి, కొంతసేపు అలసట దీర్చుకొని, తిరిగి రథము నధిరోహించి, ధనుర్బాణములు ధరించి, యుద్ధభూమికి రమ్ము. అపుడు నా బలపరాక్రమములు చూడగలవని" ధీరుడై రాముడు నుడివినాడు. మరునాడట్లు సన్నద్ధుడై వచ్చిన రావణుని హతమార్చి ప్రతిజ్ఞ సాధించాడు. తుదకు ధర్మాత్ముడైన రాముని సత్యపరాక్రమము తలచినంత మాత్రముననే లక్ష్మణునకు ఇంద్రజిత్తును సంహరించు సామర్థ్యము సిద్ధించింది. అంతకు ముందు అస్త్రములు అనేకం నిరర్థకములు కాగా లక్ష్మణుడీ ప్రయోగమిట్లు చేసి కృతకృత్యుడైనాడు,

ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది।
పౌరుషే చాప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్॥
యు॥ కాం॥ 90 స॥ 70 శ్లో॥

అట్టి రాముని శౌర్య ప్రతాపములను తెలియక పాపబుద్ధిగల రావణుడు గర్వముతో సుగ్రీవుడు, జాంబవంతుడు, నలుడు, అంగదుడు, హనుమంతుడు మొదలైన వానరవీరులు, శాఖోపశాఖలు కాగా సీతా పుష్పఫల ప్రదమగు ఈరామ వృక్షమును రణమున నే సంహరింతునని ప్రగల్భములు పలికాడు.

రామ వృక్షం రణే హన్మి సీతా పుష్ప ఫలప్రదమ్॥
ప్రశాఖా యస్య సుగ్రీవో జాంబవాన్ కుముదో నలః॥
మైందశ్చ ద్వివిద శ్చైవ హ్యంగదో గంధమాదనః।
హనుమాంశ్చ సుషేణశ్చ సర్వేచ హరియూథపాః॥
యు॥ కాం॥ 100 స. 4, 5 శ్లో॥

ఇట్లు కృతఘ్నుడు, లోకకంటకుడునైన రావణుని సంహరించి రాముడు అయోధ్యచేరి పట్టాభిషిక్తుడై లక్ష్మణుని సహాయంతో ప్రజల కన్నతండ్రివలె పాలించాడు,

లక్ష్మణేన సహ రామః పృథివీ మన్వ పాలయత్।
రాఘవశ్చాపి ధర్మాత్మా ప్రాప్యరాజ్య మనుత్తమమ్॥
యు॥ కాం॥ 131 స॥ 98, 99 శ్లో॥

ధర్మాత్ముడైన రాముని పరిపాలనలో ప్రజలు సంతృప్త హృదయులై స్వధర్మ నిరతులై అతని జాతి సహజ వైరములను మరచి, పరస్పరము హింసా ప్రవృత్తి విడచి, సౌహార్ద సంపదలతో జీవించారు. "యథా రాజా తథా ప్రజాః" రాజు ఎటువంటి వాడవుతాడో ప్రజలు అట్టివారే అగుదురనుట యథార్థము కదా!

సర్వం ముదిత మేవాసీత్, సర్వో ధర్మ పరో ఽభవత్।
రామ మేవాను పశ్యంతో నాభ్యహింసన్ పరస్పరమ్॥
"ధరణాద్ధర్మ మిత్యాహుః" 131 స॥ 102 శ్లో॥

"ధర్మోధారయతి ప్రజాః" అన్నట్లు ప్రజలను ఒకే త్రాటిమీద నడిపేది ధర్మం. అనాడందరి ఆశయం ఒకటే, ఆదర్శం ఒకటే. అదే రామ తత్వం. లోకంలో ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు రాముని చరిత్రయే ఉదాహరింపబడేది. భార్యాభర్తల బంధం-తండ్రి కొడుకుల సంబంధం-అన్నదమ్ముల అనుబంధం-గురు

శిష్యుల ధర్మం, శత్రుమిత్రముల మాన, మర్యాదలు-స్వామి సేవకుల సౌజన్యం-స్త్రీ, పురుషుల సౌశీల్యం-ఒడిదుడుకులతో కూడిన జీవితంలోని కష్టసుఖముల యెడ సమభావం. సత్యధర్మముల శాశ్వతత్వం. ఇటువంటివే ఇంకెన్నో విషయాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు "ధర్మమూర్తి" అయిన రాముడే వారి కనుల ముందు కన బడ్డాడు. హృదయంలో స్థిరంగా నిలిచి పోయాడు. మాటలు వేయేల ? జగమంతా రామమయమే అయ్యింది.

రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః।
రామ భూతం జగదభూత్ రామే రాజ్యం ప్రశాసతి॥

యు॥ కాం॥ 131 స॥ 101 శ్లో॥

వాల్మీకి ఇట్టి రాముని రామాయణ ధర్మ వృక్షానికి మూలంగా అభివర్ణించటం కావ్యకళా హృదయులకు సుధా చర్వణమే అవుతుంది.

అచ్చమైన యమృత మమరులు ద్రావినా
రోయి! దానికే ననూయపడను.
పరమ మౌనియైన వాల్మీకి కృతరామ
సత్కథా సుధారసంబుద్రావి. (శ్రీ విశ్వనాథ)

ధృ ధాతువునకు కృదంత ప్రత్యయం చేస్తే "ధర్మమ్" అనురూపం ఏర్పడుతుంది. స్థితి శీలం కలదని దాని అర్థం-అంటే స్థిరముగా నుండునది. "శాశ్వతమైనది" అని తాత్పర్యము వృక్ష ధర్మాన్ని అనుసరించి శీతాతప వర్షములకు తట్టుకొని ప్రకృతిలో వృక్షం నిలబడ్డట్టుగానే కష్ట సుఖములలో స్థిరంగా ఉండి, వికార హేతువుల నన్నింటిని అధిగమించి, సంస్కార యుక్తమైన జీవితాన్ని గడపగలగడం ధర్మవృక్షం యొక్క మూలతత్త్వంగా సంభావింపబడింది. అదే రాముని ప్రత్యేకతగా రామాయణంలో ప్రకటిత మవుతుంది. రాముని ఆశ్రయించిన సకల జనావళికి ఆనాడు సర్వ శుభములు లభించటంతో బాటు జనసం పార్థకమై, ఉత్తమ లోక ప్రాప్తి సంభవించింది. విశ్వాసంతో ఆశ్రయించిన వారికి ఈనాటికీ అదే అనుభవం. అనుసరింపగలిగితే ఇంక ఏనాటికైనా ఆ ధర్మం ప్రపంచానికి కాంతి, సౌఖ్యములు నిచ్చి కాపాడుగలుగుతుంది. సమాజంలోని ఆలోచనా కాలుష్యాన్ని నివారించి, కుటుంబ

వాతావరణాన్ని చక్కజేసి, నైతిక విలువలను పెంపొందించి, ఆత్మశక్తిని, అనురాగ సంపదను ప్రసాదిస్తుంది. మానవత్వాన్ని పరిరక్షిస్తుంది. మానసిక వైకల్యాన్ని నివారించి, సమతా, మమతల్ని పాదుకొల్పుతుంది. జాతికి పెను నిద్దుర పోగొడుతుంది, పరిపూర్ణత కల్పిస్తుంది. చైతన్యపు వెల్లువలను ప్రవహింపజేసి, కర్తవ్యోన్ముఖులను కావిస్తుంది.

సుసంపన్నమైన భారతదేశం ఇప్పటికి అనేక పర్యాయములు విదేశీయుల దాడులకు గురియయ్యింది. ఆ విధంగానే భారతీయ సంస్కృతి సహితం విజాతీయుల, విధర్మీయుల పలురకములైన విధ్వంసక చర్యలకు గురియయ్యింది. క్రమంగా పీడ పీడలవంటి వాని నన్నింటినిఅతి క్రమించి ధర్మవృక్షమైన రామాయణం ప్రపంచంలో శాశ్వతత్వాన్ని సంపాదించుకొంది. సంస్కృతి యొక్క ధర్మబీజాలను పరిరక్షించుకొంటూ, ప్రపంచం నలుమూలలా వ్యాప్తిచెంది, మానవతను ప్రబోధిస్తూ, తర తరముల వారికి ఆదర్శజీవన మాధుర్య ఫల సంపదను అందించింది. పూవులను మాలికగా కూర్చేదారం వలె భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేస్తూ స్థిరత్వాన్ని సాధించుకొంది. ఇంకా దేశ విదేశీయుల ప్రశంసలతో గూడిన వివరణలతోబాటు విచక్షణా రహితమైన విమర్శలను కూడా నిర్భయంగా ఎదుర్కొని నిశ్చలంగా నిలబడింది.

ఎవరి కెట్టి సందేహం కలిగినా, ఎవ్వరు ఏ రకమైన ప్రశ్న వేసినా అన్నింటికి వాల్మీకి రామాయణంలోనే సరియైన సమాధానం లభిస్తుంది. వస్తువు పడ్డచోటనే వెతకాలిగాని అందుబాటులో ఉందని బయట వేరొకచోట చూస్తే దొరకదు కదా ! అది చూచి, తెలుసుకొనే ఓర్పు, నేర్పు మనం అలవర్చుకోవాలి

కవికుల గురువు కాళిదాసు వంటివాడు 'రఘువంశం' వ్రాస్తూ అందుకు తన శక్తి చాలదేమో అని సందేహపడ్డాడు. (అతనికంటే మనమేమీ మేధావులం కాము కదా !) అది అతని వినయాన్ని సూచిస్తుంది. పండితుల కది ఆభరణం కూడా ! " అన్నీ ఉన్న విస్తరి అణిగి మణిగి ఉంటుందం" టారు ఇందుకేనేమో ! ప్రకృతిలో ఫలభార నమ్రమైన వృక్షాన్ని అందుకు ఉదాహరణంగా చూడగల్గుతాం.

అందులో ఓనమాలు రానివాడు, మూలం చదివి తెలుసుకోలేక ఏదో అనువాదాలు కువిమర్శలు, అపవ్యాఖ్యలు పట్టుకొని అవే నిజమని భ్రమించి ఆ ఉద్గ్రం

థాన్ని ఆక్షేపించటం హాస్యాస్పదమే అవుతుంది. ఈనాడు కొందరు మిడి మిడి జ్ఞానంతో దాన్ని గురించి తప్పుగా మాట్లాడటం అవివేకమే అవుతుంది. అందుకు తమకు ఏపాటి విద్వార్హత ఉందో తమను తాము ముందుగా ప్రశ్నించుకొని, ఆత్మ విమర్శ చేసుకొని, తగిన యోగ్యత సంపాదించుకొని ఆ పైన మాట్లాడితే బాగుంటుంది. అది సుజనుల లక్షణం.

సత్యాన్వేషణ చెయ్యాల్సిందే. అందుకు గట్టి కృషి జరగాలి. అందులో వాద వివాదాలు తప్పవు. దేనికైనా సభ్యత మీఱి ప్రవర్తించటం, అనవసరంగా నోరు పారేసుకోవటం చేస్తే "పొగరుబోతు" "వదరుబోతు" అనిపించుకొంటారు. అట్టి వారికి యథార్థాన్ని దర్శించటం చేతకాదని నిరూపింపబడుతుంది. ఒక విధంగా తమ అజ్ఞానాన్ని తామే బయటపెట్టుకొంటం జరుగుతుంది. వారు వివేక ద్వేషులుగా పరిగణింపబడతారు లోకంలో ఇంక వారి మాటలకు విలువేమిటి ?

తుమ్మెద అన్వేషణలోనే ఝుంకారం చేస్తుంది, పలు దారుల తిరుగుతుంది. మకరందం లభించినప్పుడు మౌనంగా ఆస్వాదిస్తుంది, ఆనందిస్తుంది. అలాగే మనకు కూడా గుణగ్రహణ పారీణత కావాలి. ప్రపంచంలో ఎక్కడున్నా మంచిని స్వీకరించే సహృదయత ఉండాలి సత్యాన్ని గూర్చి తెలుసుకొనేందుకు ప్రయత్నంచేస్తూ (నేతి నేతి (న+ఇతి) సిద్ధాంతాన్ని అనుసరించి) పరమార్థం గ్రహించాలి. ఆ సత్యం తెలుసుకొన్న తర్వాత అనుభవము, ఆనందమే తప్ప అక్కడ అనవసరమైన మాటలుండవు. అది వివేకవంతుల స్వభావం

లోకంలో ఎవరో కొందరు ఎందుకో ఏదో అన్నారని బుద్ధిమంతులు ధర్మం ఎడల ప్రీతిని విడవరాదని, ధర్మాచరణం మానరాదని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ఆ "లోకులు కాకులు" కదా !

ధార్మికులు సలుపు నుత్తమ
కర్మముఁ జెడనాడు నాస్తికజనము విను మా
దుర్మతుల తెఱఁగుఁ గైకొని
ధర్మము నెడఁబ్రీతి వదలఁదగదు బుధునకున్

ఆం॥ మ॥ భార॥ అర॥ ప॥ 5 ఆ॥ 40 ప॥

ధర్మవిగ్రహుఁడు. ధీరోదాత్తుడు అయిన ఆ రాముని పవిత్ర చరిత్ర ఏ మట్టంలోనైనా, సత్యప్రతిపాదకమైనా లోకాని కనుసరణీయమే అవుతుంది. అందువల్ల నేను ఉత్తరరామాయణాన్ని రచింపబూనుకున్నానని అన్నాడు తిక్కన మహాకవి. "అమృత కలశంలో ప్రతి బిందువు మధురమే" అని వేరే చెప్పాలా ?

ఎత్తతి నైనను ధీరో
దాత్తనృపోత్తముఁడు రామ ధరణీపతి స
ద్వృత్తము సంభావ్య మగుట
నుత్తర రామాయణోక్తి యుక్తుఁడనైతిన్

తిక్కన నిర్వచనోత్తర రామాయణము 1 ఆ॥ప॥

ఇంక "రాఘవేశ్వరు చారిత్రము నెందరెన్ని గతులన్ వర్ణించినన్ గ్రాలదే" అంటాడు కంకటి పాపరాజు. (ఉ॥రా॥ పీఠిక 14 ప) అందులో నిజంగా పునరుక్తి అన్నదే లేదని అతని సంభావన. సుందరమైన రూపం (చిత్రం లేక శిల్పం) చూసిందే మళ్ళీ చూస్తాం. శ్రావ్యమైన సంగీతం విన్నదే తిరిగి వింటాం. సత్పురుషుల చరిత్ర విషయం కూడా అంతే. పునరుక్తి ప్రసక్తిరాదు.

దృష్ట్వాపి దృశ్యతే దృశ్యం, శ్రుత్వాపి శ్రూయతే పునః।
సత్యం న సాధు వృత్తస్య దృశ్యతే పునరుక్తతా॥

సుభాషిత రత్నభాండాగారమ్.

మఱి. ఆయుర్వేద శాస్త్రాన్ని బట్టి లోకంలో ఔషధాలు కాని వృక్షాలు లేవు. (నాస్తిమూల మనౌషధమ్) అందువల్ల వాటి సంగతి తెలిసికొని సక్రమంగా సేవించిన వారికి అవి అనామయాన్ని పోగొట్టి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని కలుగజేస్తాయి. ఇంక అజరామరమైన ఆ ధర్మవృక్షాన్ని ఆశ్రయిస్తే అది అమృత ఫలాలను అందిస్తుంది. "సత్యధర్మాభి రక్తానాం నాస్తి మృత్యుకృతం భయం" (వా॥ రా॥ యు॥ కాం॥ 46 స॥ 31 శ్లో॥)

అంటే రామాయణం పఠించిన వారికి మృత్యువే సంప్రాప్తించదని, అట్టి వారీ భూమిమీద శాశ్వతంగా జీవిస్తారని. తాత్పర్యం కాదు. మృత్యువు వలన కలిగే భయం ఉండదు. "అమ్మో మనం ఏమైపోతామో అనే బాధ కలుగదు, సృష్టి, స్థితి, లయములు

SR2/27/25

ప్రకృతి ధర్మములు కనుక ఎంతటి వారికీ అవి తప్పవనే సంగతి తెలుసుకొని సత్యవంతులై శాశ్వతమైన ధర్మాచరణం ఎడల అసక్తి కలిగి కర్తవ్యోన్ముఖులై ప్రవర్తించటం వలన వారికి మానసిక ధైర్యం నశించి. నిర్భయంగా సంచరింప గలుగుతారు. సత్కీర్తిని సాధింప గలుగుతారు. "పుణ్యాకరమైన రాము కథ హైన్యము మాన్పదె యెట్టి వారికిన్." (కంకంటి ఉ॥ రా॥ పీఠిక, 16 ప॥)

ధర్మో రక్షతిరక్షితః వృక్షో రక్షతి రక్షితః

"ధర్మ వృక్షో రక్షతి రక్షితః"

వాసుదేవ వృక్షం ఒకటి ఉంది. మిక్కిలి చలి, మిక్కిలి వేడి అనేవి అక్కడ ఉండవు. అందు నరకమనే నిప్పు పుట్టదు. దట్టమైన విశాలమైన ఆ చెట్టు నీడ నాశ్రయించి సేద దీర్చుకోండని పెద్ద లుపదేశించారు,

వాసు దేవ తరుచ్ఛాయా నాతిశీతా న ఘర్మదా।
నరకాంగార శమనీ సా కిమర్థం న సేవ్యతే॥

(గోవిందరాజీయ వ్యాఖ్యానమ్)

మాన్యమైన నడవడి ద్వారా ప్రజాభిమానాన్ని చూఱగొన గలిగిన వాడే నిజమైన ప్రభువు రాముని జావి అయోధ్యలో ప్రజలాతని ధార్మికమైన శుభవర్తనము లిట్లు కీర్తించినట్లు వర్ణింపబడింది.

సీ॥ సుదతి! యాతఁడ మమ్మె శుద్ధాత్మ కోసలు కన్నెగర్భ పయోధి కల్పకంబు
వెలతి! యాతఁడ మమ్మె పురుషోత్తముడు దశరథుజన్మమున మనోరథముపంట
పడతి! యాతఁడ మమ్మె భద్రాత్ముఁడు తపస్వి పడపిన మేతితపః ఫలంబు
మకటి! యాతఁడ మమ్మె మహిజాత కదనునఁ బున్నెంబడిన రత్నభూషణంబు
తాఁబు నీటదేర్ప, జాతి నాతి నొనర్ప, గ్రోతిగముల నేలికొలుతఁ దీర్ప
నఖిల రాక్షసాగ్నులార్ప, వేల్పులఁగూర్ప, నేర్పుగనిన జాణ నెలఁత! యితఁడె.

కం॥ పరనారీ సోదరుఁడే పరమ కృపాభరణ కీర్తిభరుఁడే, రక్షాపరుఁడే. పరిపంధి జనోత్కర శిక్షాకరుఁడె, భూమి కన్యావరుఁడే.

శ్రీ॥ రా॥క॥, యు॥కాం॥, ఉ॥భా॥, 2 ఆ॥ 434, 435 ప॥

అభినందన హరిచందనం

శ్రీమద్రామాయణంలో రాముని నడవడి ద్వారా మానవత్వం నిరూపింపబడింది. సమాజానికి ఆదర్శమైన ఆ రామాయణానికి ఈదేశ ప్రజలకు అవినాభావ సంబంధం ఉంది. విడదీయలేని ఆ బంధమే భారతీయులకు సాంస్కృతికంగా ఉన్నతిని చేకూర్చటంలో దోహదం చేసింది.

శాస్త్రిగారు రామాయణంలోని వివిధ సన్నివేశాలను చదివి అవగాహన చేసుకొని, స్పందించిన హృదయంతో సమకాలీన సామాజిక వ్యవస్థకు అనుగుణంగా ఈ 'రామాయణం-సమాజదర్పణం' వ్రాశారు. ఇందులో వీరు భాషా పరంగాను, భావపరంగాను సరళత పాటించారు.

ఈ గ్రంథం మనిషిలో ఉన్నతస్థాయి ఆలోచనల్ని కలగజేస్తుంది. వాల్మీకి రామాయణం మీద ఉన్న అభిమానాన్ని పెంపొందిస్తుంది. సప్రమాణంగా సాగిన ఈ వివరణాత్మక వ్యాసావళి సహృదయుల్ని తప్పక అలరిస్తుందని ఆశిస్తున్నాను. శాస్త్రిగారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఉత్పల వరదరాజా
సినీ రచయిత
పొన్నూరు